# కుసుమ ధర్మన్న సాహితీ సమాలోచన

(సాహితీ వ్యాసాలు)



సంపాదకులు
**డా॥ తరపట్ల సత్యనారాయణ**
సహాయాచార్యులు, తెలుగుశాఖ
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం,
రాజమహేంద్రవరం.

ప్రచురణ
**డా॥ రాధా కుసుమ**
అధ్యక్షులు
కుసుమ ధర్మన్న కళాపీఠం, హైదరాబాద్

-

# కుసుమ ధర్మన్న సాహితీ సమాలోచన

సాహిత్య వ్యాసాలు

**KUSUMA DHARMANNA SAHITI SAMALOCHALA**

కుసుమ ధర్మన్న ప్రచురణలు

ముద్రణ : 2024

ప్రతులు : 300

© రచయితవి

మూల్యం : రూ॥ 350/-

ISBN : 978-93-340-2436-4

**ప్రతులకు**

**డా॥ తరపట్ల సత్యనారాయణ**

సహాయాచార్యులు, తెలుగుశాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా. ఆంధ్రప్రదేశ్.

**సంచారవాణి : 92906 30752**

E-mail : tsn.tel@aknu.edu.in

**డా॥ రాధా కుసుమ**

అధ్యక్షులు, కుసుమధర్మన్న కళాపీఠం,

డోర్ నెం. 1-10-1/204/162, కుసుమ కుటీర్, మారుతీనగర్,

చక్రిపురం, కుషాయిగూడ, హైదరాబాద్ - 500052, తెలంగాణ.

**సాంకేతిక సహకారం :**

తరపట్ల ప్రవీణ్‌మూర్తి

తరపట్ల ప్రమోద్ కుమార్, MCA., (Ph.D)

తరపట్ల ప్రదీప్ శాస్త్రి, M.Sc., B.Ed., M.Phil., (Ph.D)

**అక్షరాల కూర్పు :** ఆనంద్ డిటిపి, రాజమహేంద్రవరం.

**ముద్రణ :**

యూనివర్శల్ ప్రింటర్స్, రాయ్‌పేట, చెన్నై - 14.



**ఆచార్య కె. పద్మరాజు**
ఉపకులపతి
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
రాజమహేంద్రవరం.
ఆంధ్రప్రదేశ్ - 533296.

# అభినందనలు

భారతాంధ్రీకరణకు శ్రీకారంచుట్టిన నన్నయ పేరుతో "ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం" ఆవిర్భవించింది. దినదిన ప్రవర్ధమానం చెందుతూ అభివృద్ధి పథంలో పయనిస్తుంది. ఈ తరుణంలో తెలుగుశాఖ మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంతోత్సవ వేడుకలు జరుపుకోవడం అభినందనీయం. శతాబ్దాల చరిత్రగల సాంస్కృతిక రాజధానిలో సంఘ సంస్కరణ దీప్తిగా కుసుమ ధర్మన్న రచనలు దశ దిశలా వ్యాపించాయి. తొలి తెలుగు దళిత కవిగా నిలిచి ఆనాటి సమాజంలోని ఎన్నో లోపాలపై కలంతో పోరాటం చేసి, హరిజనోద్ధరణకై రచనలు చేసారు. మద్యపాన నిషేధంపై ధ్వజమెత్తడమే కాకుండా సమతా భావనకు, సంఘ సంస్కరణకు నడుం బిగించి అలుపెరగని పోరాటం చేసి ఆదర్శ శిఖరంగా నిలిచారు. అటువంటి మహనీయుని జయంతోత్సవాలను తెలుగుశాఖ నిర్వహించడం సంతోషదాయకం.

ఇటువంటి మంచి కార్యక్రమానికి కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలైన డా॥ రాధ కుసుమ గారు ఆర్థికంగాను, హార్థికంగాను సహకారాన్నందించడం అభిలాషనీయం. "కుసుమ ధర్మన్న సాహితీ సమాలోచన" అనే పేరుతో జాతీయ సదస్సును, కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్న డా॥ తరపట్ల సత్యనారాయణ గారు తెలుగుశాఖలో ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించి తెలుగుశాఖకు విశిష్ట వైభవాన్ని తెచ్చారు. అలాగే తెలుగుశాఖ ఇంకా ఎన్నో సదస్సులు నిర్వహించి మరెందరో కవులయొక్క రచనలను నేటి తరానికి తెలియజేయాల్సిందిగా కోరుతూ అభినందనలు తెలియజేస్తున్నాను.

ఆచార్య కె. పద్మరాజు



**ఆచార్య జి. సుధాకర్**
రిజిస్ట్రార్
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
రాజమహేంద్రవరం.
ఆంధ్రప్రదేశ్ - 533296.

## సంఘ సంస్కరణకు ప్రతీక ధర్మన్న సదస్సు

నేటి విద్యార్థులకు స్వాతంత్రోద్యమ చరిత్ర, ఉద్యమకారుల విరోచిత గాథలు, ప్రాణాలర్పించిన యువ కిషోరాల వీర గాధలు, సరిగా తెలిసినట్టు లేదు. వాటిపై దృష్టి పెట్టడంలేదు. ఈ ఆధునిక యుగంలో నేటి తరం దేశభక్తిని, అమరుల త్యాగాలను, సంఘసంస్కరణ ఫలాలను, వాటి మూలాలను, అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సందర్భంగా మన గోదావరి నదీ తీరాన చారిత్రక పవిత్ర నగరమైన రాజమహేంద్రిలో జన్మించిన మహాకవి కుసుమ ధర్మన్న జయంతోత్సవం విశ్వవిద్యాలయంలో నిర్వహించడం, ఈ సందర్భంగా "కుసుమ ధర్మన్న సాహితీ సమాలోచన" అనే పేరుతో జాతీయ సదస్సును, కవి సమ్మేళనాన్ని నిర్వహించడం గొప్పగా భావించాలి. ఆనాటి వ్యవస్థలో ఉన్న అసమానతలపై తిరుగుబాటు చేసి దళితుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి, సమానత్వం కోసం శ్రమించి, మాకొద్దీ నల్లదొరతనమంటూ ఎలుగెత్తిన ధర్మన్న మద్యపాన నిషేధంపై ఉద్యమాన్ని నడిపి, హరిజనుల ఆర్థిక స్వావలంబనంకోసం స్వాతంత్ర్యానికి ముందే హరిజన బ్యాంకును స్థాపించడం, కుసుమ ధర్మన్న దార్శనికతకు నిదర్శనం. అటువంటి మహనీయుని చరిత్రను, సాహిత్యాన్ని, సామాజిక సేవను, దేశభక్తిని నేటి విద్యార్థి లోకానికి తెలియజేసే విధంగా ఈ జాతీయ సదస్సు & కవి సమ్మేళనం ఒక ప్రయోజనాన్ని చేకూరుస్తుందని భావిస్తున్నాను.

ఈ సదస్సునకు ఆర్థికంగా, హార్థికంగా సహకరించిన కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలైన డా॥ రాధ కుసుమ గారికి ప్రత్యేకమైన అభినందనలు, అలాగే నన్నయ విశ్వవిద్యాలయంలో అనేక సదస్సులు నిర్వహించిన డా॥ తరపట్ల సత్యనారాయణ గారు ఈ సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించడం అభినందనీయం. రాబోయే కాలంలో మరెన్నో సదస్సులు నిర్వహించి ఎంతోమంది కవుల రచనలను, వారి సేవలను నేటి తరానికి తెలియజేయవలసిన అవసరం ఉందని భావిస్తూ శుభాభినందనలు.

ఆచార్య జి. సుధాకర్




**ఆచార్య డి. జ్యోతిర్మయి**
ప్రిన్సిపాల్
ఆర్ట్స్ & కామర్స్ కళాశాల
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
రాజమహేంద్రవరం.


# సాహిత్యం సామాజిక చైతన్యాన్ని కల్గించాలి

సాహిత్యం సమాజానికి హితాన్ని ప్రబోధించాలి. అప్పుడే ఆ సమాజం అన్ని రంగాల్లోను అభివృద్ధిని సాధించడమే కాకుండా సామరస్య సంఘీభావాలతో పురోభివృద్ధిని సాధించి ఆదర్శ సమాజంగా నిలుస్తుంది. ఎందరో కవులు, రచయితలు భరతమాతను దాస్య శృంఖలాలనుండి విముక్తి కలిగించడానికి ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆ సమయంలో జాతీయత, సమైక్యత, సమభావనలతో కవులు, ఎన్నో రచనలు చేసారు. ఎన్నో సమస్యలపై దురాచారాలపై, కలాలను పదునైన ఆయుధాలుగా మలచి ఉద్యమ స్ఫూర్తితో రచనలుచేసి సమాజాన్ని చైతన్యవంతంచేసారు. అందులో భాగంగా మహాకవి కుసుమ ధర్మన్న గారు దళిత జాతుల విముక్తి కోసం, హరిజనోద్ధరణ కోసం, విముక్తి తరంగిణి, హరిజన శతకం వంటి రచనలతో పాటు ఆనాటి దేశ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని "మాకొద్దీ నల్లదొరతనమంటూ" ఎలుగెత్తి ఉద్యమ గీతాన్ని ఆలపించి మద్యపాన నిషేధంకోసం ఉద్యమాన్ని కూడా నడిపారు. అంతే కాకుండా కుసుమ ధర్మన్న గారు మంచి వైద్యునిగా ఎంతోమందికి సేవలనందిచారు.

మహాకవి కుసుమ ధర్మన్న గారు జయంతి సందర్భంగా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ "కుసుమ ధర్మన్న సాహితీ సమాలోచన" అన్న పేరుతో జాతీయ సదస్సును, కవి సమ్మేళనాన్ని నిర్వహించి వారి సాహితీ ప్రస్థానాన్ని, ఉద్యమ స్థానాన్ని, సామాజిక సేవా రంగాన్ని, సంఘసంస్కరణ కృషిని, దేశభక్తిని, సమతాభావాన్ని నేటి విద్యార్థి లోకానికి తెలియజేసే మంచి సదస్సుగా భావిస్తున్నాను. ఈ సదస్సునకు అన్ని విధాలా సహకరించి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడానికి ముందుకు వచ్చిన కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలైన డా॥ కుసుమ రాధ గారికి, అలాగే సదస్సునకు కన్వీనర్‌గా బాధ్యత వహించిన సహాయాచార్యులు డా॥ తరపట్ల సత్యనారాయణ గారికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ రాబోయే విద్యా సంవత్సరంలో ఇటువంటి సదస్సులు మరెన్నో నిర్వహించాలని హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను.

ఆచార్య డి. జ్యోతిర్మయి



**డా॥ తరపట్ల సత్యనారాయణ**
సహాయాచార్యులు
తెలుగుశాఖ
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
రాజమహేంద్రవరం.

# అందరికీ కృతజ్ఞతాభినందన వందనాలు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎక్కువ జాతీయ, అంతర్జాతీయ సదస్సులు తెలుగు శాఖ నిర్వహించడం జరిగింది. అందులో నేను కన్వీనర్‌గా 26 జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించిన కారణాలు తెలుగుశాఖను విశ్వవిద్యాలయాల్లో అగ్రస్థానంలో నిలిచింది. చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, కళలు, వివిధ అంశాలపై సదస్సులను, సాంస్కృతిక ఉత్సవాలను అవధానాలను నిర్వహించడంతో నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు విశ్వవిద్యాలయం అని ఒక పేరు ఏర్పడింది. అంతేకాకుండా విదేశీయులను ఆహ్వానించడం విశిష్ట ఉపన్యాసాలను ఏర్పాటుచేయడం విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖకు ఒక ప్రత్యేకత ఏర్పడింది.

ఇప్పుడు తెలుగు తొలి దళితకవితా వైతాళికునిగా పేరు పొందిన మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంతోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకంగా ఉంది. నేటి విద్యార్థి లోకానికి 125 యేళ్ళ సమాజం ఆనాటి సాంఘిక పరిస్థితులు, వ్యవస్థలో ఉన్న లోపాలు, అసమానతలు, దేశభక్తి, లోలోన దాగిన కుయుక్తి, స్వాతంత్ర్య స్ఫూర్తి, సంఘసంస్కరణ దీప్తి వంటి అంశాలపై విశ్లేషించడం తులనాత్మకంగా అధ్యయనం చేయడంలో భాగంగా కుసుమ ధర్మన్న రచనలపై ఈ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 45 మంది అధ్యాపకులు సమర్పించిన వ్యాసపత్రాలు, కుసుమ ధర్మన్నను వివిధ కోణాలలో ఆవిష్కరించిన తీరు ఆశ్చర్యంగా కనిపిస్తుంది. జీవిత ప్రస్థానం నుండి ఉద్యమ నినాదం, తుది శ్వాస వరకు జరిపిన ఉద్యమ స్ఫూర్తి, సేవ ఇటువంటి ఎన్నో అంశాలపై ఈ సదస్సులో చర్చనీయాంశాలయ్యాయి.

ఇందులో భాగంగా మరొకభాగం కవి సమ్మేళనం 54 మంది కవులు వివిధ అంశాలపై స్పందించిన తీరు, సంధించిన కవితాస్త్రాల వాస్తవికతను సమైఖ్య భావ నినాదాలను, అసమానతలపై ధిక్కార స్వరాన్ని లోపించిన లౌకిక వాద భావాన్ని మితిమీరిన మతమౌఢ్య వాదాల్ని కవులు కవిత్వంలో చేర్చారు. ఇంత చైతన్యాన్ని నింపిన కవులందరిని పేరు పేరున అభినందిస్తూ ఈ సదస్సు నిర్వహించడానికి అనుమతినిచ్చిన విశ్వవిద్యాలయ ఉపకులపతి గారికి, రిజిస్ట్రార్ గారికి కృతజ్ఞతలు. అలాగే ఈ సదస్సునకు ఆర్థిక, హార్థిక సహకారాన్నందిన కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డా॥ కుసుమ రాధ గారికి పాల్గొన్న పత్ర సమర్పకులకు, కవులకు, అధ్యాపక మిత్రులకు, తప్పొప్పులను సవరించిన కాత్యాయని గారికి, శ్రమించిన విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

డా॥ తరపట్ల సత్యనారాయణ



# సాభిలాషులకు వందనం

కుసుమ ధర్మన్న సాహిత్య సమాలోచన పేరుతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ సదస్సు ఆద్యంతం హర్షణీయ. అభినందనీయం. ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహిచేందుకు అవకాశం కలుగజేసిన వైస్ చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు గారికి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ గారికి, కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అసిస్టెంటు ప్రొఫెసరు డా.తరపట్ల సత్యనారాయణగారికి, కుసుమధర్మన్న కళాపీఠం తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నాము. కుసుమధర్మన్న కళాపీఠం ద్వారా ఎన్నో సామాజిక సాహిత్య సేవా కార్యక్రమాలు చేపడుతున్నాము. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం తీసుకువచ్చేందుకు  విశ్వవిద్యాలయం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములుగా మా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేసుకుంటూ నిర్వహకులకు అభినందనలు తెలియజేస్తున్నాము.

**డా. రాధా కుసుమ**
అధ్యక్షులు
కుసుమ ధర్మన్న కళాపీఠం

-




**డా. ర్యాలి శ్రీనివాసు**
ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్‌డి.,
తెలుగు అసిస్టెంటు ప్రొఫెసర్
వియస్ఎం అటానమస్ కళాశాల
రామచంద్రపురం.


# సదా అనుసరణీయం

ఎందరో మహానుభావుల జీవితాల్ని స్ఫూర్తిగా ఎంచుకుని భవిష్యత్తుని రూపొందించుకునే వర్ధమాన సాహితీ మూర్తులకు కుసుమధర్మన్న సాహితీ సమాలోచన సదస్సు ఎంతగానో దోహదపడతుంది. నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గారికి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ గారికి, కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అసిస్టెంటు ప్రొఫెసరు డా. తరపట్ల సత్యనారాయణగారికి, సంయుక్త నిర్వహణలో భాగస్వాములైన కుసుమధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి డా. రాధాకుసుమ గారికి సాహితీ గోదావరి సంస్థ తరుపునే కాకుండా నా వ్యక్తిగతంగానూ ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నాము. రచయితలు పరిశోధనాత్మక వ్యాసాలను పంపి సదస్సు నిర్వహణలో భాగస్వాములు కావడం అభినందనీయం. ఎంతో శ్రమకోర్చి పత్ర సమర్పణ చేసినవారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. సదస్సుల వల్ల ప్రయోజనాన్ని పొంది భావి తరాలు మనుగడను సార్థకం చేసుకుంటాయని ఆశిస్తున్నాను. ఇలాంటి సదస్సులను అనుసరించి సంస్థలు సామాజిక వికాసానికి తోడ్పాటునివ్వగలవని భావిస్తున్నాను.

డా॥ ర్యాలి శ్రీనివాసు

# వ్యాసాల వరుస


01. దళిత ఆత్మగౌరవ దార్శనికుడు కుసుమ ధర్మన్న – ఆచార్య విస్తాలి శంకరరావు

02. క్రియాశీల స్ఫూర్తి కుసుమ ధర్మన్న – డా॥ చిలుకోటి కూర్మయ్య

03. తొలి దళిత శంఖారావం – కుసుమ ధర్మన్న – డా॥ ఎల్లే విజయానందరాజు,

04. కుసుమ ధర్మన్న సాహిత్యం – ప్రముఖుల సద్విమర్శ – డాక్టర్. జి. వెంకట లాల్

05. అంబరాన్ని తాకిన దళితోద్యమ కెరటం – ధర్మన్న పోరాటం – డా॥ తరపట్ల సత్యనారాయణ

06. తొలి తెలుగు దళిత వాగ్గేయ కారుడు ధర్మన్న – ఆచార్య డి. జ్యోతిర్మయి & డా॥ దొంతరాజు లక్ష్మీనరసమ్మ

07. ధర్మ పథమెరింగిన దళిత సూరీడు– –డా. ర్యాలి శ్రీనివాసు

08. దళితోద్యమ వైతాళికుడు – డా.తలారి వాసు,

09. కుసుమ ధర్మన్న హరిజన శతకము – ఒక విశ్లేషణ – డా॥ చాట్ల కిశోర్

10. కుసుమ ధర్మన్న జీవితం – సంఘసంస్కరణ దృక్పథం – డా॥ నూనె అంకమ్మరావు

11. అంటరానితనం పై సమరశంఖం పూరించిన ధర్మన్నకవి "దండాలుపాట"– డా.గూటం స్వామి

12. దళిత ఉద్యమ తొలిపొద్దు –కుసుమ ధర్మన్న– డా॥ గంజికుంట్ల రామారావు

13. జయభేరి – రణభేరి – మాకినీడి సూర్య భాస్కర్,

14. సమాజ హితం ధర్మన్న అభిమతం – డా॥ శివకుమార్ నందనవనం

15. మాకొద్దీ నల్ల దొరతనం – దళిత జీవన చిత్రణ – డా. పసుపులేటి నాగమల్లిక

16. తొలి దళిత కవి కుసుమ ధర్మన్న రచనలలో సంఘ సంస్కరణ – డా॥ బిహెచ్.వి.రమాదేవి,

17. ఆత్మగౌరవ ప్రతీక – కుసుమ ధర్మన్న కవిత్వం – డా. మార్జియానా. జడ్

18. కుసుమ ధర్మన్న కవిత్వం – ఆర్థిక దృక్పథం – భమిడిపాటి గౌరీ శంకర్

19. కుసుమ ధర్మన్న ఆశయసాధన – డా. దేవులపల్లి పద్మజ

20. నిన్నటి ఊహ.. నేటి సత్యం.. 'నాకొద్దీ నల్లదొరతనం' – ఎం. లక్ష్మి

21. చైతన్య దీప్తి – కుసుమ ధర్మన్న – కె.ఎం. సౌందర్యవతి

22. హరిజనోద్ధారకుడు–కుసుమ ధర్మన్న – డా॥ డి. సత్యలత

23. సంస్కరణ పథంలో వాడని కుసుమ పరిమళం (కుసుమ ధర్మన్నకవి) – డా॥ దండెబోయిన పార్వతీదేవి

24. కుసుమ ధర్మన్న కవితా వైభవం – డా॥ శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతీ పేరమాంబ

25. సమతా రాజ్య సాధనోద్యమ తొలి దిక్సూచి డాక్టర్ కుసుమ ధర్మన్న కవి – పండిట్ ఎలగొండ రాములు

26. "హరిజన శతకం – కుసుమ నిరసన గళం" – డా॥ కె.నాగసత్యనారాయణ

27. కుసుమ ధర్మన్న కుసుమాంజలి – సామాజిక చైతన్యం – రాచర్ల గౌతమి

28. కుసుమ ధర్మన్న మద్యపాన నిషేధం – సామాజిక చైతన్యం – వై.బుజ్జి

29. అసమానతలపై కుసుమ ధర్మన్న 'జయభేరి' – యడవల్లి శ్రీనివాసరావు,

30. KUSUMA DHARMANNA VIEWS ON INDIAN SOCIETY - Dr. N. RAJASEKHAR

31. తొలి దళిత సాహిత్య పునాది–డాక్టర్ కుసుమ ధర్మన్న – దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు

32. కుసుమ ధర్మన్న – దార్శనిక దృక్పథం – డా॥ బి.వి.వి. బాలకృష్ణ

33. దళిత గుండెల్లో జయభేరి మ్రోగించిన ధర్మన్న – పువ్వల ఆనంద్

34. కుసుమధర్మన్న – సమకాలీన చారిత్రక సంఘటనలు వాటి ప్రభావం – డా॥ అద్దంకి ప్రజాపతి

35. ధర్మన్న సాహిత్యంలో కుసుమించిన గతి తార్కిక భౌతికవాద తత్త్వం – డా॥ మోగంటి సుధామయి

36. బహుముఖ ప్రతిభా శాలి – కుసుమ ధర్మన్న – డా. ఆర్.జానకిరావు

37. బహుముఖ ప్రజ్ఞాశాలి – కుసుమ ధర్మన్న – డా॥ కొంకె గౌరీశ్వరరావు

38. కుసుమ ధర్మన్న – సంఘ సంస్కరణ – రచనలు – డా॥ కట్టెపోగు సురేష్ కుమార్

39. కుసుమ ధర్మన్న జీవితం–సాహిత్యం–సేవా రంగం – డా॥ బేతాశారదా దేవి

40. వర్ణ వ్యవస్థపై ధ్వజమెత్తిన ధర్మన్న – జి.ఎన్.ఎల్.జి. కాత్యాయని

41. కుసుమ ధర్మన్న కవిత్వం – సంస్కరణోద్యమ దృక్పథం – డా॥ జి. ఎలీషాబాబు

42. నిమ్నజాతి తరంగిణి – కుసుమ ధర్మన్న భావనలు – ఆగంటి దేవి శైలజ

43. కుసుమ ధర్మన్న సంఘసంస్కరణ కవితోద్యమం – పి. సుధ

44. దళిత మహర్షి ధర్మన్న – డా॥ పివిబి సంజీవరావు

45. కుసుమ ధర్మన్న కవి – దళిత సామాజిక స్పృహ – మరపట్ల రాజు

 ISBN : 978-93-340-2436-4

# 1 దళిత ఆత్మగౌరవ దార్శనికుడు కుసుమ ధర్మన్న

**ఆచార్య విస్తాలి శంకరరావు**
తెలుగుశాఖాధ్యక్షులు
మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

**పరిచయం :**

రాజమహేంద్రవరం అన్న వెంటనే నాకు అల్లసాని వారి ఒక పలుకు గుర్తుకు వస్తుంది.

**'అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ' – మనుచరిత్ర – అల్లసాని** ఇది ప్రవరుని నగరాన్ని పరిచయం చేసే సందర్భంలో అంటారు'

మరి అది ఏమో నాకు తెలియదు గాని. ఈ మాట ఈ రాజమహేంద్రవరానికి మాత్రం స్పష్టంగా సరిపోతుందని నా అభిప్రాయం. ఎలా అంటే ఈ నేల, ఈ గాలి ప్రభావమేమోగాని ఎన్నో విలక్షణమైన లక్షణాలు ఈ నగరానికి, ఈ నేలలో జన్మించిన వారికి అబ్బుతాయో ఏమోననే భావన నాకు ఉంది.

అది చారిత్రకంగా, సామాజికంగా, సాహిత్యపరంగా, అందమైన ప్రకృతిపరంగా, అద్భుతమైన శిల్పసంపదతో కూడిన దేవాలయాల పరంగా, ఇలా ఎన్నో పవిత్రమైన స్థలాలకు నిలయం ఈ ప్రాంతం. ఈ మాట ఏదో గొప్పతనం కోసం చెప్పడం కాదు. అది మన కళ్ళముంది కనిపిస్తున్న వాస్తవం... ఎవరైనా అంగీకరించాల్సిందే....

**కుసుమ ధర్మన్న :**

అటువంటి ఈనేలలో పుట్టి జాతి జాతంతా గౌరవించదగిన వ్యక్తిగా ఎదిగినవాడు, సమసమాజ స్థాపనకు, సామాజిక న్యాయానికి, సామాజిక రుగ్మతలను అంతమొందిం చేందుకు పుట్టిన మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగి, దళిత ఆత్మగౌరవ పతాకగా నిలిచిన ఆదర్శజీవి, దార్శనికులు కుసుమ ధర్మన్న గారు.

ఎక్కడైనా కుసుమ ధర్మన్న పేరు ప్రస్తావనకు వచ్చిందంటే అక్కడ ఒక సామాజిక చైతన్యానికి శ్రీకారం చుడుతున్నట్లే భావించాలి. సాధారణ వ్యవసాయ కూలీలు అయిన పుణ్య దంపతులు కుసుమ వీరాస్వామి, నాగమ్మలకు జన్మించి "జాతి జనులకు ఆశాగీతంగా" నిలువడం అంటే చాలా అరుదుగా జరిగే సంఘటనలు. అలాంటి స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని అందించిన చైతన్య స్ఫూర్తి కుసుమధర్మన్న.

ఒక వ్యక్తికి 125వ జయంతోత్సవాలు జరుపుకుంటున్నారంటే ఆ వ్యక్తి అందించిన

సందేశం ఏమిటి? వారు లేవనెత్తిన అంశాలు ఏమిటి? వాటి నుండి ఇప్పుడు మనం ఏం నేర్చుకోవాలి? అనే అంశాలు ఎంతో కీలకం. ఈ చర్చలకు అవకాశం లేకపోతే అలాంటి వారిని ఇప్పుడు మననం చేసుకోవాల్సిన అవసరం లేదు. కాని కుసుమ ధర్మన్న అలాంటి వ్యక్తి కాదు. మరి అలాంటి వారు లేవనెత్తిన సమస్య ఏమిటి. అది పరిష్కారం అయ్యిందా? వారు చూపిన మార్గం ఏమిటో పరిశీలిద్దాం.

**కులం గురించి :**

ఈ మధ్యనే వెలువడిన 'వికారి' అనే కవితా సంపుటిలో ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు ఇలా అంటారు

"కులం కన్నా – మలం గొప్ప
మలాన్ని విసర్జించగలుగుతున్నాం" – వికారి

మలమే భరించరానిది అనుకుంటే కులం అంతకన్నా దారుణమైంది అని అంటారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా వీస్తున్న ఈ కాలంలో. నాగరికతగా ఎంతో అభివృద్ధి చెందామని విర్రవీగుతున్న ఈనాటి సమాజంలో ఒక కవి భావన ఇది.

మరి ఇలాంటి సమయంలోనే ఇలా ఉంటే 19శ॥ ప్రారంభం నాటికి ఈ కులం ఎలా జడలు విప్పుకుని వీరంగం సృష్టించిందో ఒక్కసారి ఆలోచించాలి. ఇంకా అంతకన్నా ముందు కాలంలో ఈ నాటి సమాజంలో ఈ అంటరానితనం ఎలా ఉందో ఊహకే అందడంలేదు.

19శ॥ ప్రారంభం నుండి జాతీయ స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుంది. ఉద్యమకారులు పోరాటాలు చేస్తూ జైలుపాలు అవుతున్నారు. ఇక దేశంలోని కవులు, రచయితలు తమ అక్షరాలకు స్వాతంత్ర్యకాంక్షను జోడించి తెల్లదొరల గుండెలకు గురిపెడుతున్నారు. కళాకారులు స్వాతంత్ర్య సాధనకోసం తమ కళా ప్రదర్శనలు చేస్తున్నారు. ఇలా వలస పాలకులకు వ్యతిరేకంగా మాట పలికినా, పాట పాడినా అది సంచలనంగా మారుతున్న కాలం ఇది.

ఇక ఈ దేశ సంస్కృతి ఎంత గొప్పదో పరిశీలిస్తే పశుపక్షాదులతో పాటు, రాళ్ళురప్పలను, చెట్టు చేమలను పూజించే ఈ దేశం అనే నాణేనికి రెండవ పార్శ్వం ఉంది. అదే కుల వ్యవస్థ. భూత దయకు పర్యాయపదంగా చెప్పుకునే ఈ దేశ సంస్కృతిలో సాటి మనిషిని పశువులు, పక్షులు, రాళ్ళు రప్పలు కంటే హీనంగా చూసే ఈ దేశ సంస్కృతిని ఏమని ప్రశ్నించాలి.

ఈ అస్పృశ్యత, అంటరానితనం, మనిషిని మనిషిగా చూడని ఈ సమాజానికి వలస పాలకుల పెత్తనాన్ని ప్రశ్నించే హక్కు ఎక్కడ ఉంది అంటూ దేశవ్యాప్తంగా అక్కడ కూడా ఉద్యమాలు ఊపెత్తుకున్నాయి.

అలాంటి వివక్షతను అనుభవిస్తూ జీవితాల దుర్భరంగా గడుపుతున్న వర్గాలకు ప్రతినిధిగా ఆంధ్రదేశంలో ఆత్మగౌరవ పోరాటానికి చిరునామాగా నిలిచిన వారు కుసుమధర్మన్న. ఈ అస్పృశ్యతకు, అంటరానితనానికి, అణిచివేతలను నిరసిస్తూ తన జీవితాన్ని త్యాగం చేసిన మహావ్యక్తి కుసుమధర్మన్న.

ఇలా అంటరానితనం, అస్పృశ్యత పేరుతో ఈ వ్యవస్థ చేస్తున్న అణిచివేతలను తిప్పికొట్టి సామాజిక ఉద్యమానికి శ్రీకారం చుట్టి ఆ లక్ష్యసాధన కోసం ముందుకు సాగిన పోరాట యోధుడు కుసుమధర్మన్న.

ఆ లక్ష్య సాధనలో భాగంగా కులం పేరుతో జరుగుతున్న మారణకాండకు చమరగీతం పాడాలంటే తాను ఎన్నిమార్గాలు అనుసరించాలో అన్ని మార్గాలు ఆచరించి చూపారు. కనుకనే ఈ రోజు వారిని మన దృష్టితో చూస్తే

ఒక కవిగా, వక్తగా, వ్యాసకర్తగా, పండితునిగా, కళాకారునిగా, గాయకునిగా, పత్రికా సంపాదకునిగా, చిత్రలేఖకునిగా, సామాజిక కార్యకర్తగా, ఆయుర్వేద వైద్యునిగా, ఉద్యమ కారునిగా అనేక వ్యవస్థల స్థాపకునిగా, ఇంకా వ్యక్తిగా, సముహంగా, సమాజంగా ఒక మహాలక్ష్యం నిర్దేశ కేతనంగా దర్శనమిస్తారు. అన్నిటికంటే మించి మహోన్నతమైన వ్యక్తిత్వంలో దళితుల ఆత్మగౌరవ పతాకగా రెపరెపలాడుతూ జాతి జనులను తట్టిలేపి, నేడు మహాశిఖరంలా మన ముందు సాక్ష్యాత్కరిస్తున్నారు. చైతన్య జ్వాలాలు రేకెత్తిస్తున్నారు.

ఈ నేపథ్యంలో నుంచే వారి రచనలు అన్నీ వెలువడ్డాయి. లక్ష్యం కోసం రచనలు కాని, రచనలు కోసం లక్ష్యం కాదు. కనుక ప్రతి రచన సామాజిక ప్రయోజనమే. వారి రచనల్లో లభించినవి. ఉదా॥ కొన్ని

1. మాకొద్దీ నల్లదొరతనం – గేయం
2. నిమ్నజాతి తరంగిణి (1921) – ప్రసంగం
3. నిమ్నజాతులు ఉత్పత్తి (1924 అముద్రితం) – వ్యాసం
4. మద్యపాన నిషేధం (1930) – వ్యాసం
5. హరిజన శతకం (1933)
6. మాలకాకి (నవల)
7. అసుర పురాణం (పద్య కావ్యం)
8. అంటరానివారా? – కథల సంపుటి

ఒకవైపు స్వాతంత్రోద్యమం కొనసాగుతుంటే తోటి జనులను అవమానకరంగా చూస్తున్న ఈ నల్లదొరల దుశ్చర్యల పట్ల నిరసనలు, ఉద్యమాలు నిర్వహణలో, ఆయుర్వేద వైద్యునిగా ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండడమేకాక వారు అనుభవిస్తున్న అంటరాని సమస్యలు చవిచూశారు.

 ISBN: 978-93-340-2436-4

సమాజంలో కొందరు సంస్కర్తలు కొన్ని సంస్కరణ భావాలను కలిగించి చైతన్యపరిచినప్పటికి ఇంకా ఎన్నో సామాజిక దురాచారాలు ఇంకా అలానే కొనసాగుతూనే ఉన్నాయి.

కుసుమధర్మన్న గారిపై వీరేశలింగంగారి ప్రభావం మెండుగానే ఉందని చెప్పాలి. కందుకూరి లాంటి సంఘసంస్కర్తలకు కార్యక్షేత్రమైన రాజమహేంద్రవరంలో ఆయన చనిపోయాక ఒక దశాబ్దం తరువాత ఆ స్ఫూర్తితో హరిజనోద్ధరణకు సమరశంఖం పూరించారు ధర్మన్నగారు.

ఆనాటి సమాజంలో గాంధీ గారి ప్రభావం నుండి తప్పించుకున్న వారు దాదాపు ఎవరూ లేరు. గాంధీ చేపట్టిన హరిజనోద్యమంకు ధర్మన్న గారు కూడా ప్రభావితులయ్యారు. గాంధీ పట్ల గల గౌరవంతో తన రెండవ బిడ్డకు మోహన్‌దాస్ అని పేరు కూడా పెట్టుకున్నారు.

1946లో గాంధీ రాజమండ్రిలో హరిజన నాయకులతో సమావేశమైనప్పుడు ధర్మన్న గారికి కబురు పెట్టగా గాంధీనే తన పేటకు రావాలని, రప్పించిన వ్యక్తి ధర్మన్న. గాంధీ గారు వచ్చి క్షమాపణ చెప్పాలని, అది కాగితం మీద కూడా రాసి ఇచ్చినట్లుగా ప్రముఖ రచనల వలన తెలస్తుంది.

ధర్మన్న గారికి సంస్కృతం, ఆంధ్రం, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషలలో అపారమైన జ్ఞానం ఉంది. ఏ అంశాన్ని అయిన గుడ్డిగా నమ్మేవారు కాదు, ప్రతి అంశంలోనూ ఆలోచించి నిర్ణయం తీసుకునేవారు.

దీనికి తోడు నిబద్దత, నిజాయితీ, నిర్మొహమాటం గలిగిన విలక్షణమైన వ్యక్తిత్వం. ఇలా తన జీవన ప్రయాణంలో మార్క్సిజాన్ని, గాంధీయిజాన్ని, దాటుకుని అసలైన అంబేద్కర్ యిజం వైపు దృష్టి సారించారు. దళితులు పుట్టుక నుండి అనేక కమ్యూనిస్టు లేదా ఇతర సామాజిక ఉద్యమాలలో ఎక్కువగా పాల్గొంటారు. కాల పరిమాణంలో అంబేద్కర్ పేరు ఎదురైనప్పుడు వారి అసలు జీవిత లక్ష్యం తెలుస్తుంది. ఇక్కడ పింగళి లక్ష్మీకాంతం గారి పద్యం గుర్తుకు వస్తుంది.

**"పారిజాతము తన కంటబడెడు వరకె**
**ద్రువ ముద్రుమమున తిరుగు మధువ్రతమ్ము**
**భారత కవిత్వరుచి పట్టు పడెడు వరకె**
**ఇతర కావ్యాలు తడవు సాహిత్యవటువు"** – పింగళి లక్ష్మీకాంతం

పారిజాతపుష్పం కంటికి కనిపించే వరకే తుమ్మెదలు ఇతర పుష్పాల వెంట మకరందం కోసం తిరిగేవి. అలాగే భారతంలోని కవిత్వం పట్టుపడే వారికే సాహిత్య ప్రియుడు ఇతర కావ్యాల వెంటపడేది.

 ISBN: 978-93-340-2436-4

ఈ సంగతి ఏమోగాని ఏ దళితుడైన అంబేద్కర్ గురించి తెలియనంతవరకు ఇతర సిద్ధాంతాలను అనుసరించేది. ఒక్కసారి గాని అంబేద్కర్ వైపు చూస్తే ఇక మరో వైపు చూసే అవసరం, అవకాశం మాత్రం ఉండదు అనేది స్పష్టం.

అలా కుసుమ ధర్మన్న మార్క్సిజాన్ని, గాంధీయిజాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి అర్థం చేసుకున్నా తర్వాతనే చివరిగా అంబేద్కర్ భావాలలోకి ప్రవేశించి బుద్ధిజాన్ని ఆచరించారు. ఈ నేపథ్యంలో కుసుమ ధర్మన్న సాగించిన సాహిత్య, సామాజిక ఆత్మగౌరవ పోరాటాలను సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

భారతజాతీయోద్యమం పోరాటంలో గరిమెళ్ళ వారిది ఒక ప్రముఖమైన స్థానం. వలస పాలకులకు వ్యతిరేకంగా "మా కొద్దీ తెల్లదొరతనము" అనే పాటను రాసి స్వయంగా ఆలపించి వాడవాడల ప్రచారం చేసి జాతీయస్ఫూర్తిని నింపాడు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. గరిమెళ్ళకు ఒక సాంస్కృతిక పరిధి ఉంది. దాన్ని తప్పుపట్టవలసిన అవసరం లేదు. గరిమెళ్ళ గాంధేయవాది.

కుసుమ ధర్మన్న అంబేద్కర్ వాది. అందులోను రాజమండ్రి నివాసి. కాబట్టి స్థానికంగానే కాక రాష్ట్ర వ్యాప్తంగా గొప్ప సామాజిక సంస్కరణలకు నడుంబిగించిన కందుకూరి ప్రభావంలో గాంధీజీ ప్రభావం నుండి ముందుకు కదిలి 'మాకొద్ది నల్ల దొరతనము' అంటూ ముందుకు సాగారు.

స్వాతంత్ర్యం కోసం పోరాడమని కుసుమధర్మన్న గారు కూడా చెప్పారు. గాంధీజీ ఆశయాలను గౌరవించారు. అయితే అవి ఆచరణలోని లోపాలను ధర్మన్న సహించలేకపోవడం దళితజాతి ఆత్మాభిమానాన్ని ప్రకటించుకుని ఆత్మగౌరవాన్ని కాపాడుకోమన్నారు. వర్ణ ధర్మం ముసుగులో భారతీయ సమాజంలో పాతుకుపోయిన సామాజిక అసమానతల్ని దుయ్యబట్టారు. ఈ ఆత్మగౌరవ పోరాటం నుండి 'మా కొద్దీ నల్ల దొరతనం' అని ప్రకటించారు.

ఆంగ్లేయులు మన దేశ పౌరుల హక్కులను కాలరాస్తున్నారని, భారతీయులను అణచివేస్తున్నారని ఉద్యమం చేయడం సమంజసమే, మరి మీ ప్రక్కనే ఉన్న మా సంగతి ఏమిటి కులం పేరుతో, జాతి పేరుతో పశువుల కన్నా హీనంగా మమ్మల్ని చూస్తున్నారే మీరు తెల్లదొరలను నిరసించినట్లే మేము ఈ నల్ల దొరల దౌష్ట్యాన్ని నిరిస్తున్నాం అంటూ దళితుల ఆవేదనలను ఈ పాటలో వివరించారు.

**మా కొద్ది నల్ల దొరతనము – దేవ మా కొద్ది నల్ల దొరతనము**
**మాకు పదిమందితో పాటు – పరువుగలుగకయున్న ॥మాకొద్ది॥**

ఈ వాక్యాలలోనే కుసుమ ధర్మన్న గారి దృక్పథం అంతా స్పష్టమవుతుంది. స్వాతంత్ర్యం

కావాలని అడిగే ఈ పెత్తందారి వ్యవస్థ, కులం పేరుతో అస్పృశ్యతను పాటిస్తూ సాటి భారతీయులైన మమ్మల్ని హీనంగా చూస్తున్నారే ఆ హక్కు మీకు ఎక్కడిది అంటూ సూటిగా ప్రశ్నించాడు. ధర్మన్న గారు వేసిన ఈ ప్రశ్న ఆనాడు సమాజంలో పెద్ద ప్రకంపనలే సృష్టించింది. ఎందరికో శత్రువులా కనిపించాడు.

ఈ ప్రశ్నను సరిగ్గా అర్థంచేసుకోలేని దురహంకారం నెత్తికెక్కిన కులదురహంకారులు ధర్మన్నకు ఈ దేశానికి స్వాతంత్ర్యం రావడం ఇష్టంలేని భావించారు కూడా, ఒక్కసారి మనసుపెట్టి ఆలోచిస్తే దానిలో దాగి ఉన్న వేదన అర్థం అవుతుంది.

**స్వతంత్ర పాలనా జేసెదమంటారా**
**చెంతకు మమ్ము చేరనీరు**
**శర్మ గారిని శరణన్న లేదు**
**కాపు కరణాలకు కరుణలేదు దేవ**
**వర్ణాలకు మేము దుర్మార్గుల మంట ॥మాకొద్దీ॥**

ఈ పాదాలలో చతుర్వర్ణ వ్యవస్థలో ఆయా వర్గాలవారు దళితులపట్ల ఎంత నిర్దయగా ప్రవర్తిస్తారో అర్థం అవుతుంది. అంతే కాదు జాతీయోద్యమంలో అతివాదులు, మితవాదులుగా విడిపోయిన వారు కూడా మా సమస్యకు పరిష్కారమార్గం చూపించలేకపోయారనే భావన వ్యక్తం చేశారు.

**అతివాదులంటారు – మితవాదులంటారు**
**వాద ప్రతివాదమాడేరు**
**మా బాధ కళ్ళారా జూచేరు**
**మీ మాట మరువలేదంటారు దేవ**
**మోటారు బండెక్కి పోతారు**
**మత్రులందరూ పరతంత్రులై పోతారు ॥దేవ॥**

ఇలా ఈ గీతం 56 చరణాలతో దళితజీవుల ఆక్రందనలు, ఆవేదనలు, ఆక్రోశాలలో తేటతెల్లం చేస్తారు. దళితులకు విద్య, ఆరోగ్యం, మంచినీరు కనీసవసరులు లేకుండా అన్నింటికి దూరం చేసి దళితుల శ్రమను దోచుకుంటున్న తీరును వ్యక్తం చేశారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. స్వాతంత్ర్యం వచ్చాక 'మా కొద్దీతెల్లదొరతనము' ప్రయోజనం పూర్తి అయింది. ఇప్పుడు సందర్భోచితంగా ఆ పాట గొప్పతనాన్ని, కవి గొప్పతనాన్ని అవసరమయితే చెప్పుకుంటాం కానీ సందర్భం లేకపోతే లేదు. కాని నిప్పులకుంపటిలా రగులుతూనే ఉంది. ఆ పాటలో జీవం ఉంది. జీవించాల్సి ఉంది. కుసుమ ధర్మన్న ఆశించిన సమాజం వచ్చేంతవరకు ఈ గేయం కులదురహంకారులకు గాయం చేస్తూనే ఉంటుంది. అణగారిన వర్గాలలో చైతన్యం రగిలిస్తూనే ఉంటుంది.

ఉద్యమకారులు, సంఘసంస్కర్త అయిన ధర్మన్న అంబేద్కర్ సాంఘిక విప్లవ పోరాటాన్ని ఆకళింపుకు చేసుకుని స్వార్థాన్ని త్యజించి, సోదర ప్రేమను పంచమని అంటరానితనాన్ని మంటగలిపి, అందరం ఒకటిగా బ్రతుకుదామని సందేశాన్ని అందించారు. అలాగే హరిజన శతకంలోని హెచ్చరికలో ఇలా అంటారు

**ప్రియ హరిజన సోదరా – నీవు హీనజాతివాడివా?**
**బానిసవా? పరులకు దాస్యము చేయుటకు భగవంతుడే నిన్నట్లు విధించినాడా?**
**ఆహా ఏమి ఈ నిరంకుశత్వము**
**దయామయుడగు సర్వేశ్వరుడెన్నడైన నిట్టి**
**దుర్మార్గమునకు పక్షపాతమునకు పాల్పడునా?**
**జాతి మత భేదములు తాను పాటించునా?**
**స్వార్థపరుడైన నరుడే నీకీ విషము ఉగ్గుపాలతో బోసి**
**మోసపుచ్చి, నిన్ను తన దాసాను దాసునిగా జేసికొని**
**బంధించి ఉన్నాడని నేటికైనను గ్రహించితివా? అయినచో**
**మేలు కొనుమయ్య తరుణము మించకుండ**
**జన్మ హక్కులకై పోరు సల్పుమిపుడె**
**హక్కుకై ప్రాణమిడుట ద్రోహంబుకాదు**
**స్వర్గపథమని నమ్ముము స్వాతంమందు"**... అని దళితులు ఆత్మ చైతన్యాన్ని కలిగించారు. యుద్ధరంగంలో మరణిస్తే 'స్వర్గం' వస్తుంది అంటారు, కాని జన్మ హక్కులపై పోరాడడం 'స్వర్గ పదవిగా' భావించామంటారు. 'ఆలకింపుమయ్య హరిజనుండ' అనే మకుటంతో 108 పద్యాలు హరిజన శతకాన్ని రాశారు.

**జయభేరి పత్రిక :** 1935లో జయభేరి అనే పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు. దానికి సహాయ సంపాదకులుగా ప్రముఖ దళిత కవి పద్మశ్రీ బోయి భీమన్న, దిడ్ల పుల్లయ్య గారు వ్యవహరించడం విశేషం. రాజమండ్రి కేంద్రంగా ఈ పత్రిక ద్వారా అంబేద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను వ్యక్తం చేస్తూ రాజమండ్రి చుట్టు ప్రక్కల ప్రాంతంలోని ప్రతి గ్రామాలలోను హరిజనోద్యమ భీజాన్ని నాటాడు. ఈ పత్రిక దళితజనోద్ధరణ, పీడిత శ్రామిక వర్గాల కష్టాలను జనబహుళ్యంలోకి తీసుకురావడానికి ఎంతో కృషిచేసింది. ఇది హరిజన ఉద్యమానికి ఎంతగానో దోహదం చేసింది. ఈ పత్రిక ముఖ శీర్షికలో 'మాలవాడా మేలుకో – కూలివాడా మేలుకో' అనే నినాదం ఉంది.

**హరిజనబ్యాంకు :** దళితుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారి ప్రయోజనాలకోసం 1945లో హరిజన బ్యాంకును స్థాపించారు. దీనిలో కుసుమ వీరాస్వామి, వెంకట రామయ్య, కరుపోతు సోమన్న, దిడ్ల పుల్లయ, జాలా రంగస్వామి మొదలయిన వారు దీని నిర్వహణలో భాగం పంచుకున్నారు. హరిజనులు కూలిపనులు దొరకని కాలాల్లో

ఈ బ్యాంకు నుండి ఋణాలు తీసుకుని తిరిగి చెల్లించే విధంగా అప్పటి ఈ బ్యాంకుకు కొంత మూల ధనాన్ని ఏర్పాటు చేశారు.

ధర్మన్న హరిజనుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేశారు. ఎలా అంటే అది ఆంధ్రమహాసభలో కొన్ని తీర్మానాలు చేసి అమలులోకి తీసుకువచ్చారు.

1. కల్లు సారాయి మానండి.
2. శుభ్రత పాటించండి (అపరిశుభ్రముగా ఉండబట్టే హీనంగా చూస్తున్నారు).
3. చచ్చిన గొడ్డ మాంసం తినకండి.
4. 12 రోజులు పెళ్లిల్లు కాకుండా 5 రోజులు పెళ్లిల్లు చేసుకోండి.
5. ప్రతి పేటలోను మన మల్లయోధులు మాల మాష్టీడీలు దగ్గర మల్లయుద్ధ విద్యలు నేర్చుకోండి.
6. మతం మారాలకున్న దళితులు ఇస్లాం, క్రైస్తవ మతంలోకి స్వేచ్ఛగా వెళ్లండి.

ఇలా ధర్మన్న గారు వనభోజనాలు ప్రోత్సహించారు. మాల మాదిగలు ఒకే చోట కలుసుకోవడం జాతి సమైక్యత చిహ్నంగా భావించారు.

ఈ తీర్మానాలు అన్ని జయభేరి పత్రికలో ప్రచురించి ప్రజలో బాగా వ్యాప్తి జరిగేలా కృషిచేశారు.

దళిత ఉద్యమకారుడైన ధర్మన్న అస్పృశ్యత, అంటరానివారు, హరిజనులు అని కాకుండా తమకు గౌరవాన్ని తెలిపే పేర్లు ఉండాలని భావించి తమను ఆది ఆంధ్రులుగా గుర్తించాలని కుసుమ ధర్మన్న, ఉంద్రు సుబ్బారావు, బి.ఎస్.మూర్తి మొదలైనవారు మద్రాసు ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రం సమర్పించగా ప్రభుత్వ చట్ట సభల్లో తీర్మానం చేసి మాల మాదిగలను ఆది ఆంధ్రులుగా గుర్తించేలా కృషిచేశారు. ఇప్పటికే మద్రాసులో వీరిని ఆది ఆంధ్రులుగానే పిలుస్తారు.

నేడు బహుజనవాదం అనే ఒక నినాదం ఎక్కువగా వినిపిస్తుంది. ఈ పదం 1984 నుండ బాగా వ్యాప్తిలోకి వచ్చింది. కాని ఈ తాత్త్విక అవగాహనలు అణగారిన వర్గాలు అన్నీ ఐక్యం కావాలి అని కుసుమ ధర్మన్న ఎప్పుడో ఆశించారు.

దళిత, బహుజనులు కలిసి పోరాటం చేసినప్పుడు వర్ణ నిర్మూలన, కుల నిర్మూలన జరుగుతుందని కాన్షీరాం, అంబేద్కర్ చెప్పారు. కుసుమ ధర్మన్న 1933 నాటికే ఈయన రచనలు చేసినప్పటికి వాళ్ల ప్రభావం ఆయన పైన పడలేదని చెప్పడానికి లేదు. మరి,

**"కటిక వారితోను కలిసి కూర్చుంటారు**
**ఎరుకలి యానాదుల నెగ్గుపట్టక**
**వార్ని కలుపుకోని తిరుగుతారు**

**చెంచు లంబాడీల నంటుతారు**
**చాకలంటే సహించుకుంటారు**
**మంగలంటే మన్నించుకుంటారు**
**మాలమాదిగలంటే మండిపోతారు"**... అనడంలో బహుజన కులాలపట్ల ధర్మన్న భావన తెలుస్తుంది.

**ధర్మన్న జీవితంలో ఆఖరి దశ :** దర్మన్న జీవితంలో 1946కు ఎన్నో విశేషాలు, వింతలు ఉన్నాయి. ఎలా అంటే అదే సంవత్సరం గాంధీని హరిజన పేటకు రప్పించి ఆతిద్యమివ్వడం, అలాగే డా.బి.ఆర్. అంబేడ్కర్ పిలుపు మేరకు ఎన్నో అవరోధాలు అధిగమించి పూనా ఒడంబడిక సమయంలో పాల్గొని రావడం, అదే సంవత్సరం భిన్న మార్గాలకు చెందిన నాయకులను ఒక చోట చేర్చి వారిలో ఐక్యతను పెంపొందింపజేయడం. ఇలా వారు ఒక ఉద్యమ రూపంలో నిర్వహించారు.

అదే సంవత్సరం దళితులు దేవాలయ ప్రవేశంలో భాగంగా రాజమండ్రిలోని కోటిలింగాలపేటలోని హిందూ దేవాలయంలోకి దళిత సోదరులతో ప్రవేశించారు. అక్కడే ఫలహారం స్వీకరించిన ధర్మన్న మధ్యాహ్నం 3 గంటలకు స్పృహ తప్పి కూలిపోయాడు. మరో ఆయుర్వేద వైద్యుడు ధర్మన్న ను పరీక్షించి మరణించినట్లుగా నిర్ధారించాడు.

మద్దుకూరు సత్యనారాయణ సేకరించిన వివరాలను బట్టి ఆ దేవాలయంలో సేకరించిన ఫలహారంలో విషం కలిసిందని, దాని వల్లే కుసుమ ధర్మన్న మరణించారని సందేహం వ్యక్తం అవుతుంది. ఏది ఏమైనా వారిది సహజ మరణం కాదు అనేది మాత్రం స్పష్టం.

ఎలా అణగారిన వర్గాలలో ధర్మన్న రగిలించిన చైతన్యం అంత ఇంత కాదు. అపారమైన ప్రతిభలో దళితులను మేల్కొల్పిన తీరు దళిత వ్యతిరేకులకు జీర్ణించుకోలేని స్థాయికి చేరింది. ఇక ధర్మన్న ఉంటే వారి మూలాలకు ముప్పు తప్పదని భావించి వారిని ఎలాగైనా తప్పించాలని ప్రయత్నించి ఉంటారు.

ఎలా అంటే ధర్మన్న గారు మరణించిన తర్వాత వారి భార్య లక్ష్మీనారాయణమ్మను నిద్ర చేయించడానికి సోదర సమానులు అయిన ఈలి వాడపల్లి గారు ఆహ్వానించగా ఇంట్లో ఎవరు లేని సమయంలో ధర్మన్న నివసించే ఆ ఇంటిని కూల్చివేసి, ధర్మన్న జ్ఞాపకాలతో పాటు, హరిజనోద్యమ చైతన్యాన్ని, అన్నిటికీ మించి ధర్మన్న రాసుకున్న అపురూప సాహిత్య సంపద అంత దగ్ధమై పోయింది.

ఒక వ్యక్తి పట్ల వ్యవస్థ అనుసరించిన తీరు ఎంత దుర్మార్గం. ఒక ఉద్యమ చైతన్యాన్ని అణిచివేయాలన్న కుట్ర ఎంత హేయం, ఒక ఆత్మగౌరవ పోరాటాన్ని తొక్కిపెట్టాలన్నా తీరు దారుణం. కాని వారికి తెలియదు.

కుసుమ ధర్మన్న పుట్టినప్పుడు ఒక వ్యక్తి కావచ్చు. వారు మరణించే నాటికి మహాశక్తిగా ఎదిగి ఒక తిరుగుబాటుగా నిలిచాడు. వారు రగిలించిన చైతన్య జ్వాలలు ఇంకా రగులుకుంటూనే ఉన్నాయి. ఇంకా ఈ కులవ్యవస్థను పాటించే ఈ సమాజపు కోరలు పీకి సమసమాజ స్థాపన జరిగేంత వరకు... కుసుమ ధర్మన్న నిత్య చైతన్య జీవిగా, రగులుతున్న జ్వాలలా హృదయాలను తట్టి లేపుతూనే ఉంటారు.

ఆధార గ్రంథాలు :

1) తొలి దళిత ఆత్మ గౌరవ స్వరం కుసుమ ధర్మన్న కవి – కొలకలూరి మధుజ్యోతి

2) సుదర్శిని – కొండపల్లి సుదర్శనరాజు

3) దళిత కిరణాలు – విద్వాన్ జ్యోతి చంద్రమౌళి

4) కుసుమ ధర్మన్న జీవిత ప్రస్థానం – పుట్ల హేమలత

5) తొలి దళిత స్ఫూర్తి కుసుమ ధర్మన్న – కె. ఉషారాణి (సంకలనం)

 ISBN : 978-93-340-2436-4

# 2 క్రియాశీల స్ఫూర్తి కుసుమ ధర్మన్న

డా॥ చిలుకోటి కూర్మయ్య
ఎమ్.ఎ, పిహెచ్.డి.

ప్రజల నాల్కల మీద తన పాటను నర్తింప చేసిన సహజ కవి కుసుమ ధర్మన్న. కుసుమ ధర్మన్న జన్మించి నూట పాతిక సంవత్సరాలు నిండుతున్నాయి. ఆయన భౌతికంగా మనల్ని విడిచి 75 సంవత్సరాలు దాటుతున్నాయి. ఈరోజ ప్రసిద్ధమైన నన్నయ విశ్వవిద్యాలయంలో కుసుమ ధర్మన్న తిరుగాడిన రాజమహేంద్రవరం నేల మీద వారి సాహితీ సామాజిక జీవితాన్ని విశ్లేషించుకుంటున్నాం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజాస్వామిక ప్రతిపక్ష కవిత్వాన్ని నెలకొల్పిన ధీరుడు కుసుమ ధర్మన్న. గరిమెళ్ళ సత్యనారాయణ మాకొద్దీ నల్ల దొరతనము అని గేయాన్ని రాసి మొత్తం స్వాతంత్ర్యోద్యమ కార్యకర్తలకు ఒక మంత్ర గీతంగా ఆ గేయం మారిన సందర్భంలో

ఇరవై రెండేళ్ల వయసున్న కుసుమ ధర్మన్న దానికి ప్రతిగా "మాకొద్దీ నల్ల దొరతనము" అనే పాటను రాసి ఆనాటి ఆది ఆంధ్రుల ఆత్మగౌరవ గీతంగా మలిచారు.ఆ పాట మాల మాదిగ పేటల్లో వేకువ జామున ఆలపించే గీతమయింది.

మనం ఒక్కసారి గరిమెళ్ళ గీతాన్ని కుసుమ ధర్మన్న గీతాన్ని పరిశీలిద్దాం.

**"మా కొద్దీ తెల్ల దొరతనము దేవ**
**మా కొద్దీ తెల్లదొర తనమూ**
**మా ప్రాణాలపై పొంచి మానాల హరియించే**
**మాకొద్దీ తెల్ల దొరతనము"**

**"పన్నెండు దేశాలు పండుచున్నా గాని**
**పట్టెడన్నము లోపమండీ**
**ఉప్పు ముట్టుకుంటే దోషమండీ**
**నోట మట్టి కొట్టి పోతామండీ**
**కుక్కలతో పోరాడి కూడు తింటామండీ మాకొద్దీ తెల్లదొర తనం దేవ!**

ధర్మన్న గేయం.

**"పన్నెండు మాసాలు పాలేరు తనమున్న పస్తుబడుచు బ్రతకాలండీ**

**ఆలీ కూలీ చేసి తీరాలండీ**
**పిలగాడికి పశువుల గాయాలండీ**
**మేమంతా కష్టపడ్డానండి దేవా కనికరము లేక కడుపు మార్చారండీ**
**దేవా మాకొద్దీ నల్ల దొరతనమూ**
**పదిమందిలో పరువు కలుగకయున్న మాకొద్దీ నల్ల దొరతనమూ"**

అంటూ తెలుగులో తొలిసారిగా ఒక స్వాతంత్రోద్యమ స్ఫూర్తి గేయాన్ని వాస్తవిక చిత్రణతో సవాలు చేస్తూ, నీకు తెల్ల దొరతనం వద్దు, నాకు నల్లదొరతనము వద్దు. ఇద్దరము దొరతనాలు లేని "బాతృ భావము చూపువరకూ, జాతి భేదమడుగంటు వరకూ, అంటు మంటయి మాడిపోయే వరకు "పని చేద్దామని" మా ధర్మన్న బోధ ఆలకించుడీ" అని ఆనాటికి ఒక ఊహాతీతమైన చైతన్యాన్ని సంఘర్షణలేని ప్రజాస్వామిక జీవితాన్ని ఒక 22 ఏళ్ల యువకుడు ప్రచారం చేశాడు.

కుసుమ ధర్మన్న 17 మార్చి సంవత్సరంలో పుట్టారు. అయితే దానికి రాతకోతల ఆధారాలు అంటూ ఏమీ లేవు. కుసుమ ధర్మన్న రెండవ కుమారుడు గాంధీ గారి చేతే తన పేరు పెట్టించుకున్న మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. అతని రెండవ కుమారుడైన శేఖర్ బాబు పుట్టినరోజు కూడా మార్చి 17. ఇంట్లో వాళ్ళందరూ తాత ధర్మన్న పుట్టినరోజునే శేఖర్ బాబు పుట్టాడని ధర్మన్న పుట్టినరోజుని మార్చి 17గా నిర్వహించటం జరుగుతుంది.

రాజమండ్రి, కొర్లం పేటలోని ధర్మన్న నివాసం. సుమారుగా 11 వందల గజాల స్థలంలో ఒక ఇంటిని నిర్మించుకుని వివిధ రకాల చెట్లతో నిరంతరం వచ్చిపోయే వాళ్ళతో ఒక చైతన్య స్ఫూర్తిగా ధర్మన్న జీవితాన్ని కొనసాగించారు. ఐదవ తరగతి వరకు రాజమండ్రి లో తరువాత థర్డ్ ఫామ్ పూర్తి చేశారు. దాని ద్వారా వైద్యవిద్వాన్ పట్టా పొంది ప్రధానంగా వైద్యుడుగా జీవితాన్ని కొనసాగించారు.

1917లో తొలిసారిగా విజయవాడలో ఆది ఆంధ్ర మహాసభ జరిగింది. అంటరాని కులాలలో అద్భుతమైన స్ఫూర్తిని ప్రేరేపించింది .ఆ ఉద్యమ ప్రభావం ధర్మన్న పై విశేషంగా ఉంది. 1917 లో ఆంధ్ర మహాసభ ప్రారంభమైంది. 1936 విజయనగరంలో జరిగిన ఆదిఆంధ్ర మహాసభకు ప్రత్యేక ఉపన్యాసకుడిగా ధర్మన్న ఆహ్వానించబడ్డాడు. 20 ఏళ్ల ఆదిఆంధ్ర మహాసభలప్రభావంతో ధర్మన్న మహోద్యమ పెరుగుదల అది.

ధర్మన్న పై కాంగ్రెస్ ప్రభావం. సోషలిజం ప్రభావం. అంబేద్కర్ భావధార ప్రభావం ఉన్నాయి. ఆయన రచనల్లో అవన్నీ కనిపిస్తాయి. కాంగ్రెస్ ప్రభావంతో ధర్మన్న గుడివాడ సేవాశ్రమ స్థాపకుడు గూడూరు రామచంద్ర రావు పంతులు ఆశ్రమంలో కొంతకాలం

 ISBN : 978-93-340-2436-4

ఉన్నారు. అక్కడే "నిమ్న జాతుల ఉత్పత్తి వ్యాసం రాశారు. అలాగే సీతానగరం ఆశ్రమంలోనూ, చాగల్లు ఆనందాశ్రమంలోనూ స్ఫూర్తిని నిప్పుకున్నారు.

ఆది ఆంధ్ర ఉద్యమ ప్రభావం, అంబేద్కర్ అంటరాని వారి హక్కుల కోసం పోరాట ప్రభావం. ఆనాటి రాజకీయ సామాజిక పరిస్థితులతో ధర్మన్న పూర్తిగా నిబద్ధమైన కవిగా, రచయితగా మారారు.

ధర్మన్న సామాజిక కార్యకర్త నిరంతర క్రియాశీలి. ఒకవైపు జీవిక కోసం వైద్య వృత్తిని చేస్తూనే అంటరాని వారిలో చైతన్యాన్ని నింపడం కోసం ఉపన్యాసకుడిగా వివిధ ప్రాంతాల్లో సంచరించేవారు. ధర్మన్న గారి ఇల్లు ఒక సామాజిక కేంద్రంగా ఉండేది. జాలా రంగస్వామి, నక్క చిన్న వెంకయ్య అంటరాని వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పడటం కోసం బ్యాంకుల నిర్మాణం చేపట్టారు. వీరికి కుసుమ ధర్మన్న తోడ్పాటు కూడా ఉండేది. కుసుమ ధర్మన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాజమండ్రి మున్సిపాలిటీలోనూ, గోదావరి జిల్లా పరిషత్తులోనూ సభ్యులు. కానీ ఆ పార్టీకి వ్యతిరేకంగా కుసుమ ధర్మన్న ఓటు వేసిన సంధర్భాలున్నాయి.

దేవాలయ ప్రవేశంలో విశేషమైన పాత్ర నిర్వహించారు. రాజమండ్రిలోని కోటిలింగాల ఆలయ ప్రవేశానికి కేసు వేసి గెలిచి ఆ దేవాలయంలో ప్రవేశించిన కొన్ని గంటలకే ఆయన మరణించడం దురదృష్టకరం. ఒక నెల తరువాత కుటుంబ సభ్యులు ఈలి వాడపల్లి గారి ఇంటి కి వారి ఆహ్వానం మీద వెళ్ళి వచ్చేటప్పుడికి ఇల్లు కాలి పోయింది. ఇతరుల వద్ద ఉన్న రచనలు మినహా ధర్మన్న రచనలన్నీ అగ్ని కీలలో కలిసి పోయాయి.

కుసుమ ధర్మన్న రచనల్లో ప్రధానమైనది మద్యపాన నిషేధం. ఈ వ్యాసానికి కుసుమ ధర్మన్న వ్యాసం నిర్మాణ పథకాన్ని రూపొందించారు .ఆ రోజుల్లోనే కుసుమ ధర్మన్న వ్యాసాన్ని రాయడానికి చూపించిన నియమబద్ధ ప్రణాళిక ఆశ్చర్యాన్ని కలగజేస్తుంది. ముందుగా మద్యపానం అంటే ఏమిటో నిర్వహిస్తారు .మానవుడి శరీర స్వభావానికి మద్య స్వభావానికీ ఉండే తేడాని చెప్తారు. మద్యం యొక్క అవలక్షణాన్ని, అది ఆహారం కాదు మన ఆయుర్దాయాన్ని తగ్గిస్తుంది.అది ఔషధము కాదు. మద్యం తయారు చేసే విధానాన్ని చెప్పి దానిమీద వెగటుకలగ చేస్తారు.

మద్యపానంతో వచ్చే రోగాలు, నష్టపోతున్న జీవితాన్ని ఈ వ్యాసంలో వివరిస్తారు. కచ్చితంగా ఆయన మిగిలిన వ్యాసాలు కూడా దొరికి ఉంటే ఈ రకమైన నిర్మాణం తో చాలా మంచి వ్యాసాలు మనకు దొరికిన ఉండేవి. ధర్మన్న రాసిన నిమ్న జాతి తరంగిణి, నిమ్న జాతి ఉత్పత్తి దొరకలేదు.

 ISBN: 978-93-340-2436-4

అసుర పురాణం అనే హరిజన చరిత్ర సంగ్రహం ఇవన్నీ కూడా రాశారు. అది దొరకలేదు. "మాల కాకి" అనే నవల కూడా అలభ్యం. ఆది హిందువుల కథలు అనే పేరుతో ధర్మన్న ఆరు కథలు రాశారు.

వీటిలో సాంఘిక జీవనంలో సవర్ణులకీ అంటరాని వారికి ఉండే భేద సాదృశ్యాలను వివరించారు వారు. "మండోదరి దండోరా" "మాధవ శాస్త్రి మాదిగ సుబ్బయ్య" "పల్లమ్మ పడవ ప్రయాణం" "మాల పోలయ్య మడుగులో బాపనయ్య" "ముతమ్మ ముడుపు" పండిత గోష్ఠి వీరభద్ర పాకయాజి" వంటి పేర్లతో ప్రచురించినట్టుగా తెలుస్తోంది తప్ప అవి మనకి లభ్యం కావడం లేదు. వీటి సంక్షిప్తం సమాచారం జయభేరి పత్రిక లోనూ ముద్రించిన పుస్తకాల అట్ట వెనుక వివరాలను బట్టి తెలుస్తున్నాయి. అవి దొరికితే ధర్మన్న కు సంబంధించిన మరిన్ని ఆలోచనలు లభ్యమై ఉండేవి. పత్రికల అవసరాన్ని కుసుమ ధర్మన్న. గుర్తించారు. జయభేరి పత్రికను స్థాపిస్తూ ఆయన అన్న మాటల్ని గమనిస్తే ఈనాటికి వెనకబడ్డ కులాల వారికి పత్రికల అవసరము అంటే వారికోసం వెలువడే పత్రికలు అవసరము తెలుస్తుంది.

"ప్రచారము కావలసినను,ప్రభోదము కావలిసినను, హరి జన జాతికే పత్రికల అవసరం. ప్రజలను కూడగట్టుటకు సంఘముగా నేర్పరచుటకు, సంఘీభావము కూర్చుటకు, స్వాతంత్ర్య యుద్ధమునకు, జాతి దాస్య విముక్తికి, పోరాట వీరులను తయారు చేయుటకు, హరిజనులకు ప్రత్యేకముగా పత్రికల అవసరం" అని చప్పడమే కాదు మూడేళ్ల పాటు జయభేరి పత్రికను స్వయంగా 1939 నుండి నడిపారు.

సామ్యవాదాన్ని సహించని హిందూయిజం అనే ఉపన్యాసం వ్యాసం చాలా ముఖ్యమైనది. ఈ వ్యాసంలో సామ్యవాదాన్ని గురించి హిందూ మతానికి సామ్యవాదం ఏ రకంగా గిట్టదో ఆనాటి సంప్రదాయ బ్రాహ్మణుల కంటే రాజకీయ బ్రాహ్మణులు ఏరకంగా నమ్మకూడనివారో, గుండెలదిరిపోయే ఘోరాలు దళితుల మీద జరుగుతుంటే కనీసం స్పందించటం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరసించారు. గాంధీజీ కి అంబేద్కర్‌కి ఉన్న అభిప్రాయ భేదాల్ని, అంబేడ్కర్ అంటరాని వారందరూ మతం మారండి అన్న పిలుపు. దాని పర్యవసానాలు. వాటిపై విపులంగా చర్చించిన వ్యాసం.

ఈ ఒక్క ఉపన్యాస వ్యాసంలో ఉండే పదాల మనం గమనిస్తే కుసుమ ధర్మన్న ఎంత గొప్ప వక్తో,ఎంత చక్కగా జనాన్ని ఆకట్టుకోగలడు మనకు తెలియడమే కాకుండా, వివిధ అంశాల మీద తనదైన ఒక అవగాహన పెంచుకున్న వ్యక్తిని కూడా ఆయనలో మనం చూడవచ్చు. ఆ ఉపన్యాసంలో "సామ్యవాదం హిందువులకి, కాపు కమ్మాది భూస్వాములకి సహించదు. రుచించదు. సంపన్నులకు నలుపు. స్వార్థపరులకు పులుపు.

 ISBN : 978-93-340-2436-4

దయారహితులైన రైతులకు బల్లెం. ఆత్మశుద్ధి లేని అసహ్యావాదులకు కళ్ళెం. కరిచే కుక్కకు కండ అడ్డు మేయాలి. మత్తుమందుచల్లాలి.

కలవకుండా కలతలు పెట్టాలి. కుయుక్తులు పన్నాలి .తిరగబడితే ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు త్రాగించాలి. తల్లికి పిల్లకి అతకుండా చేయాలి .అంటే సామధాన భేద దండుపాయాలతో కదలకుండా బంధించాలి, బాధించాలి మట్టం చేసి విడిచిపెట్టాలి. ఇది హరిజనుల సామ్యవాదానికి వచ్చే ప్రతిఫలం" అంటారు.

ఈ పై మాటలు ధర్మన్న శక్తి సామర్థ్యాన్ని తెలియజేస్తాయి.

కసుమ ధర్మన్న బాబా సాహెబ్ అంబేద్కర్ అభిప్రాయాలకు ప్రభావితుడయ్యాడు. అందుకే 1944 లో రాజమండ్రి వచ్చినప్పుడు స్వాగతం ఏర్పాటు చేశారు. 1946 పూణే లో జరిగిన అఖిలభారత షెడ్యూల్ క్యాస్ట్ ఫెడరేషన్ సమావేశానికి అంబేద్కర్ ఆహ్వానం మీద హాజరయ్యారు.

తెలుగు సాహిత్యంలో ప్రజాస్వామిక రచనా ప్రతిఘటనను మొట్టమొదటిసారిగా విని పించారు. నిరంతరం సామాజిక చైతన్య కార్యక్రమాలలో ఉంటూ సహజమైన కవిత్వాన్ని, పాటని ఉపయోగిస్తూ ప్రజల నాల్కల మీద తన పాటనీ పద్యాన్ని నిలిపారు.

ఈ నాటికీ ప్రజాస్వామిక విలువలకు చైతన్యానికి పట్టుగొమ్మగా కుసుమ ధర్మన్న కవిత్వం చైతన్యం నిలిచే ఉన్నాయి.

* * *

 ISBN: 978-93-340-2436-4

# 3 తొలి దళిత శంఖారావం - కుసుమ ధర్మన్న

**డా॥ ఎల్లే విజయానందరాజు,**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరువూరు.
సెల్ : 94410 88634.

కవిగా, వక్తగా, వ్యాసకర్తగా, పండితుడిగా, కళాకారుడిగా, గాయకుడిగా, పత్రికా సంపాదకుడిగా, చిత్రలేఖకుడిగా, సామాజిక కార్యకర్తగా, ఆయుర్వేద వైద్యుడిగా, ఉద్యమ కారుడిగా అనేక రంగాలలో తనదైన ముద్ర వేసుకున్న తొలి దళిత వైతాళికుడు **'కుసుమ ధర్మన్న'.**

దళిత జాతి నుంచి అతికష్టం మీద చదువుకుని పైకొచ్చి, తిరిగి ఆ చదువును తన జాతి మేలుకోసం వెచ్చించిన అతికొద్ది మంది దళిత విద్యావంతుల్లో ప్రథముడిగా చెప్పవచ్చు. వీరు జన్మించిన స్థలం, పుట్టిన తేదీ, జీవించిన కాలం మొదలగు విషయాలలో పరిశోధకులకు భిన్న అభిప్రాయాలున్నాయి. నాగమ్మ, వీరాస్వామి వీరి తల్లిదండ్రులు. ఇద్దరూ వ్యవసాయ కూలీలే. ధర్మన్న గారు తన మేనకోడలు మరియు ఏలూరు నివాసి అయిన వెంకట లక్ష్మీ నారాయణమ్మని వివాహం చేసుకున్నారు. ఆమెకు కలిగిన పదిహేను కాన్పులలో పుట్టగానే చనిపోయిన వారే అధికులు. బ్రతికిన వారు ఎనిమిది మంది మాత్రమే. వారిలో ఐదుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. మూడవ ఫారం చదివిన ధర్మన్న గారు ఆ తరువాత ఆయుర్వేద వైద్య విద్వాన్ పరీక్ష పాసయ్యారు. అందువలన వృత్తి రీత్యా వీరు ఆయుర్వేద వైద్యుడు, ప్రవృత్తి రీత్యా ఉద్యమకారుడు. వీరికి తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, ఉర్దూ మొదలగు పలు భాషలలో ప్రావీణ్యత ఉన్నట్లు తెలుస్తుంది.

రాజమండ్రి తాలూకా బోర్డుకు కాంగ్రెస్ పార్టీ తరఫున సభ్యునిగా ఎన్నికై కూడా బోర్డు ప్రెసిడెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థికి ఓటు వేయని సర్వ స్వతంత్రుడు ధర్మన్న. తొలి రోజులలో గాంధీ ఆశయాలను నమ్మి గౌరవించినా, ఆచరణలో లోపాలున్నాయని గుర్తించి, ఆ తరువాత అంబేద్కర్ ఆలోచనలకు ప్రభావితుడై అంబేద్కర్ గురించి ఆంధ్ర రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేశారు. జాలా రంగస్వామితో కలసి **"అంటు దోషము మానరేలా?"** (1921) అంటూ ఉద్యమించారు. పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ ఆది ఆంధ్ర మహాసభ అధ్యక్షుడిగా (1925) దళిత వివేచనకు కృషి చేశారు.

మహాత్మాగాంధీ రాజమండ్రి వచ్చినప్పుడు మీకు హరిజనులంటే నిజంగా ప్రేమ ఉంటే మా పేటకు వచ్చి సమావేశం నిర్వహించాలని గాంధీగారికి కబురు పంపి, వారిని తన పేటకు రప్పించుకుని దళితుల ఆత్మగౌరవాన్ని పెంపొందించిన ధీమంతుడు కుసుమ ధర్మన్న. హరిజనాభ్యుదయం, సమ సమాజస్థాపన, అంబేద్కర్ సిద్ధాంతాల ప్రచారం మొదలగు

అనేక లక్ష్యాలలో '1937'లో **'జయభేరి'** పత్రికను స్థాపించారు. అలాగే దళితుల కోసం, వారి ఆర్థిక పరిస్థితులు మెరుగు పరచడం కోసం జాలా రంగస్వామి, వారి భార్య జాలా మంగమ్మ మరికొందరి సహకారంతో 1945లో హరిజన బ్యాంకును స్థాపించారు. హరిజనులు రోజు కూలీలో కొంతైనా హరిజన బ్యాంకులో పొదుపు చేసుకోవాలని ఆయన ఉద్దేశం.

కుసుమ ధర్మన్న గారి సాహితీ ప్రస్థానాన్ని గమనిస్తే వారి రచనలకు **"కుసుమాలు"**గా ప్రకటించారు. వాటిని స్థూలంగా పరిచయం చేయుటమే ఈ వ్యాస ప్రధానోద్దేశం.

**మాకొద్దీ నల్ల దొరతనం** (1921) : అప్పట్లో బహుళ ప్రచారం పొందిన **"మాకొద్దీ నల్ల దొరతనం"** అనే గేయం సుదీర్ఘమైనది. ఇది గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన **"మాకొద్దీ తెల్ల దొరతనం"** అను గేయానికి పోటీగా, దళితుల విముక్తి కోసం రాయబడింది. ఆ కాలంలో ఈ రెండు గేయాలు స్వాతంత్ర్యోద్యమ, హరిజనోద్యమ వేదికలపై మారుమ్రోగేవి. రాజకీయ స్వాతంత్ర్యం కోసం గరిమెళ్ళ గేయం రాయగా, సాంఘిక సమానత్వం కోసం ధర్మన్న గారు గీతం రాశారు. మనకు స్వాతంత్ర్యం వస్తే తెల్ల దొరల స్థానంలో నల్ల దొరలు వస్తారని, హరిజనుల కష్టాలు అధికమవుతాయని, అంటరానితనం అలాగే కొనసాగుతుందని ధర్మన్న గారు ఈ గేయం ద్వారా తన ఆవేదనను వ్యక్త పరిచారు. ఆ రోజుల్లో గరిమెళ్ళను పొగిడిన మేధావులు, హిందూ వర్ణవ్యవస్థను, మనుధర్మ శాస్త్రాన్ని చీల్చి చెండాడిన ధర్మన్నను మాత్రం అంతగా పట్టించుకోలేదు. ఈ గేయం హరిజనుల ఆత్మగౌరవాన్ని చాటి చెప్పే రచన. ఈ గేయంలో కవి గారు

**"మాకొద్దీ నల్ల దొరతనం దేవా!**
**...................................**
**కుక్క నక్కల కంటె తక్కువగా జూచి**
**నిక్కి, తక్కి నిగుడుతారు**
**సాని ప్రక్క జేర సాగుతారు**
**కుష్ఠురోగి సరస కూర్చుంటారు**
**కుక్క కోతిని కోరి పెంచేరు**
**పిల్లి పిట్టల ప్రేమించుతారు**
**పంది గున్నల బాధింపరాదు**
**కాకి నీటిని తాకనిస్తారు**
**మమ్ము దరికి చేరనీరు**
**దడదడ తిట్టేరు"**

 ISBN: 978-93-340-2436-4

అంటూ సానుల సరసన, కుష్ఠు రోగుల ప్రక్కన కూర్చునే భారతీయ అగ్రజాతులు మాల, మాదిగలను కుక్కలు, నక్కల కంటే నీచంగా చూస్తున్నారనీ, వారు మా పురోభివృద్ధిని కాంక్షించక, మమ్ములను దోచుకుంటున్నారనీ, వారి పాలనలో మాకు సుఖ, సంతోషాలు ఉండవని ఆవేదన చెందారు. ఇందులో హరిజనుల అణచవేతకు మూలమైన 'నల్ల దొరతనం' వస్తే హరిజనులకు కష్టాలు అధికమవుతాయని, పీడించే నల్ల దొరతనం కన్నా పాలించే తెల్లదొరతనమే మిన్న అని భావించారు. అట్లని ధర్మన్న గారికి దేశభక్తి లేదని చెప్పలేము. దొరతనమే లేని సమసమాజం కావాలని, రావాలని ఆశించారు. అందుకే "మాకొద్దీ నల్లదొరతనం దేవా, మాకొద్దీ నల్ల దొరతనం" అంటూ భారతీయుల స్వయం పరిపాలనను వ్యతిరేకించారు. ఈ గేయం అగ్రకులస్థులపై తిరుగుబాటుగా కనిపించినా, గేయంలో దాగి ఉన్న కోపం, ఆవేదన విన్నవారిని ఆలోచింపచేయక మానదు.

"వందేమాతరం – మనదే రాజ్యం" అంటూ గావు కేకలు వేస్తున్న రోజుల్లో గరిమెళ్ళ రాసిన "మాకొద్దీ తెల్లదొరతనం" గీతం ఆంధ్ర దేశాన్ని ఊపివేస్తున్న ఆ రోజుల్లో కుసుమ ధర్మన్న "మాకొద్దీ నల్లదొరతనం" గీతం రాయడం ఆషామాషీ విషయం మాత్రం కాదు. ఈ గేయం రాయటానికీ, అసాధారణమైన ధైర్యసాహసాలు కావాలి. అగ్నిలాంటి అంతఃశుద్ధి కావాలి. తరతరాలుగా పురుగులకన్నా హీనంగా బతుకుతున్న హరిజనుల జీవితాన్ని అత్యంత శక్తివంతంగా చిత్రించగల అనన్య సామాన్యమైన కవితా శిల్పం కావాలి. ఈ విశిష్ట లక్షణాలు ధర్మన్నలో పుష్కలంగా ఉన్నాయి" అన్న సి.వి. వాక్యాలు అక్షర సత్యాలు.

**హరిజన శతకము (1933) :** దళిత సమస్యపై దళిత కవి రాసిన తొలి తెలుగు శతకము ఇది. దళితుల దీనస్థితిని తెలియజేస్తూ ఆ దీన స్థితి నుంచి విముక్తి పొందమని దళితులకు పిలుపునిస్తూ మార్గనిర్దేశం చేశారు ధర్మన్న కవి. "ఈ శతకము 1933లోనే 500 ప్రతులు ప్రచురణ అయ్యాయంటే అప్పటికే అముద్రితంగా మంచి పేరు వచ్చిన రచనగా మనం భావించవచ్చు" అని డా॥ పిల్లి శాంసన్ మాటల బట్టి ఆనాడు ఈ శతకం యొక్క ప్రాచుర్యం తెలుస్తుంది.

ధర్మన్న గారు ఈ శతక పరిచయంలోనే నాలుగు మకుటాలు ఇచ్చి, వాటిలో ఏది వాడుకలో ఉంటే దాన్ని ఆయా ప్రాంతాలను బట్టి వాడమని సూచించడం ఈ శతకం ప్రత్యేకత.

1. ఆలకింపుమయ్య 'హరిజనుండ'
2. ఆలకింపుమయ్య 'ఆది ఆంధ్ర'
3. ఆలకింపుమయ్య 'ఆది హిందు'
4. ఆలకింపుమయ్య 'మాలవర్య'

 ISBN: 978-93-340-2436-4

ఈ శతకం 108 ఆట వెలదులతో రచించబడింది. శతకంలో కావ్య సంప్రదాయాన్ని పాటించి అవతారిక, దైవస్తుతి మొదట చేశారు. దైవ స్తుతిలో "నేను రాజ్యమును గోరుట లేదు. సర్వమునభిలషించుటలేదు. జన్మరాహిత్యమును వహించుటలేదు. సర్వదా దుఃఖితులను దీనులును అగు ప్రాణుల యొక్క ఆర్తిని మాన్పగోరుచున్నాను" అని శ్లోకంలో తెలియజేశారు. శ్రీకారంతో ప్రారంభించి శ్రీహరిని వేడుకున్నారు. దీనిని తన ప్రజలకు అంకితం ఇచ్చారు. శతకము పూర్తి అయిన తరువాత దీనిని చదివినను, విన్నను మాలమాదిగలను హీనముగా చూసే మూకలకు నీతి మార్గము దొరుకుతుందని ఒక కంద పద్యంలో చెప్పారు. ఈ పుస్తకంలో 45 పుటలున్నాయి. వెల రెండు అణాలు.

ఈ శతకము రాయటానికి కారణము తెలుపుతూ "స్వకులము కాపాదించిన హైన్యత హృదయమునకు నాటి, వేధించుటచే దానిని నిరాకరించుటయే జీవితోద్దేశముగా నెంచి ఈ శతకము నా శక్తి కొలది వ్రాసితినే గాని, నాకు పాండిత్యము గలదని, సంఘసంస్కరణము నందు జ్ఞానము కలదనియుగాదు" అని వినయంగా పేర్కొన్నారు. ఈ శతకములో కుల, జాతిరహిత సమాజ ప్రస్తావన, సమాజంలో దళితులు అంటరానివారు అయిన విధానం, సమాజంలో వారిస్థితి, వారిని దోచుకునే వారి గురించి, గాంధీ వారికి చేసిన సేవగురించి ఇందులో ఉంది. చివరిలో రచయిత తన ప్రజలను సమాజంలో ఎలా జీవించాలో ప్రబోధించారు. ముఖ్యమైన అంశాలను ఈ విధంగా గుర్తించవచ్చు.

**1. కృతయుగంలో సమాజ పరిస్థితి :** కృతయుగంలో ప్రజలు కరువు కాటకములు, వ్యాధులు లేక పాడిపంటలతో ప్రశాంతంగా జీవించారని, ఆనాడు హక్కులు, అధికారాలు, ద్రవ్యకాంక్షలు, మోసాలు లేవని, ప్రజలందరు అన్నదమ్ములవలె జీవించారని తెలియజేశారు. అలాగే భాగ్యవంతుడు, పేదవాడు అనే భేదంలేదనే సంగతి గుర్తు చేశారు. (2-9)

**2. కలియుగంలో సమాజస్థితి :** ఈ యుగంలో ధర్మచింతన చచ్చి, ధనకాంక్ష హెచ్చిందని (11) గుణము అంతరించి, కులము ఘనత గాంచెందని (12), పెట్టుబడిని పెట్టి ధనికుడు బీదల కష్టములను దోచుకుంటున్నాడని (15), పేదరికం బాగా పెరిగినదని (14), కృతయుగము నాటి ధర్మము కలియుగంలో తల్లక్రిందులైనదని (10) ఆవేదన చెందారు.

**3. హరిజనులు అంటరాని వారైన విధానము :** హరిజనులు మొదట హిందూదేశాన్ని ఏలారని తెలియజేశారు. తరువాత ఆర్యులనెడి బ్రాహ్మణులు ఆసియానుండి వలసవచ్చి మనలను అణగద్రొక్కి అడవుల పాల్జేసి, తింటానికి తిండిలేక బిచ్చమెత్తువారిని నీచకులజులుగా చిత్రించి జాతి భేదమెంచి, ఊరువాడలలో ఉండనీయక, దూరాన గెంటి, అంటరానివారిగా అవమాన పరచారని, చివరకు వెలివేసి బానిసత్వంలోకి దించారని ఇది స్వార్థపరులు చేసిన చర్యగా పేర్కొన్నారు. (20-29)

**4. కవి ఆవేదన :** రైతు హరిజనులను దోచుకోవటాన్ని వివిధ పద్యాలలో వర్ణించారు. సమాజంలో ప్రజలు జీవహింసచేసే కటిక వానిని, పడుపు వృత్తిలో బ్రతికే వేశ్యలను, లంచగొండి పరులను, మోసకారులను, అప్పుచేసి ఎగవేసే వారిని, వావి వరసలు తప్పి ప్రవర్తించే వారిని, అబద్ధాలు చెప్పి పిల్లలను పోషించేవారిని, తప్పుడు సాక్ష్యమిచ్చి తంటాలను పెంచే వారిని గౌరవిస్తారు. కాని హరిజనులను మాత్రం దూరంగా ఉంచుతారని అది వంచనయని, ద్రోహ బుద్ధని ఆవేదన చెందారు (58-67) **కుక్కను భైరవుడు గాను, కోతిని హనుమంతు గాను, పందిని విష్ణువాహనం గాను, ఎలుకను వినాయకుని వాహనముగాను, గ్రద్దను గరుడు వాహనముగాను, ఎద్దును శివుని వాహనము గాను, పామును విష్ణువు పాన్పుగాను** ప్రజలు భావించి వివిధ జంతువులను పూజిస్తారని తోటి వారిని అంటటానికి శంకిస్తారని (71-74) ఆవేదన చెందారు. ఊరబావిలో నీరు తోడుకోనివ్వరని, సత్రములోనికి శ్రమదీర్చుకొనుటకు, దేవాలయంలోనికి దైవదర్శనమునకు వీళ్ళను రానీయరని ఆవేదన చెందుతూ, నీటికేమి అంటని, అనాధను రానీయని ఆ సత్రమెందుకని దీనులను చూడని దేవుడు దేవుడా అని ప్రశ్నించారు. (84-86) కవి ప్రబోధించిన సామాజిక న్యాయానికి ఈ క్రిందివి సహేతుకతను చూసే ఉదాహరణలు.

**కాయకూర లీయ కమ్మగా దిననేర్చు**
**పండు ఫలము లీయ పనికి వచ్చు**
**నంటు దోషమప్పుడంటరాదది యేల? (68)**

**పాలు నీవు పితుక పాపమంటరాదు**
**చేతబైక మిడిన చేదుకాదు**
**అంటుదోషమప్పుడంటరాదదియేమొ? (69)**

మొదలగు పద్యాలలో కష్టించి పండించినప్పుడు లేని అంటరానితనం మనుషుల మధ్య సంచరిస్తే ఎందుకొస్తుందని అగ్రజాతులను నిలదీశారు.

**5. కవి ప్రబోధం :** ఈ శతకములో చివర కవి తన ప్రజలకు జీవించు విధానమును వివిధ పద్యాలలో తెలియజెప్పారు. త్రాగుడికి అలవాటు పడి ఇంటిని, ఒంటిని, పిల్లలను గుల్ల చేసుకోవద్దని (98), తెల్లదొరలుగాని, నల్లదొరలు గాని ఆదరిస్తారని ఆశపడవలదని, స్వయంగా కష్టపడితే సౌఖ్యం కలుగుతుందని (92) గొడ్డు మాంసం తినుటమాని, శుభ్రంగా బుద్ధిగా ఉండి చదువు నేర్వమని (100-101) తన ప్రజలకు రచయిత హితము చెప్పారు. ఇంకా ఈ శతకములో హరిజనులను ఉద్ధరించిన గాంధీ మహాత్ముడిని (76-83) మొదలగు పద్యాలలో గుర్తు తెచ్చుకున్నారు.

 ISBN: 978-93-340-2436-4

**నిమ్న జాతి విముక్తి తరంగిణి (1921)** : హరిజనులు దేశానికి చేస్తున్న సేవలు, సమాజంలో అనుభవిస్తున్న బాధలు, వాటినుండి విముక్తి పొందటానికి కావలసిన ఉపాయాలు, ఎలాంటి కార్యక్రమాల్ని చేపట్టాలో తెలియజేస్తున్న చిన్న పుస్తకం. ఇది 19-03-1921 సంవత్సరంలో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగిన రెండవ ఆంధ్రరాష్ట్ర ఆది ఆంధ్రుల మహాసభలో ఇచ్చిన ఉపన్యాసం. అనంతరం దీనిని పుస్తకంగా ముద్రించారు. అప్పటి దాని వెల ఒక అణా మాత్రమే. (అనగా ఆరు పైసలు)

**నిమ్న జాతులు-ఉత్పత్తి (1924) :** ఇది పరిశోధన వ్యాసాల కోవకు చెందింది. గుడివాడ సేవాశ్రమ వ్యవస్థాపకుడు యోగి గూడూరి రామచంద్రరావు ప్రోత్సాహంతో, వ్యాసాల పోటీకోసం దీనిని రాశారు. ఈ పోటీ పరీక్షకు బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు, శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారు పరీక్షాధిపతులుగా వ్యవహరించారు. 25-05-1924 సంవత్సరంలో గుడివాడలో జరిగిన రెండవ ఆంధ్రప్రదేశ్ అస్పృశ్యతా నివారణ మహాసభలో సభాధ్యక్షులు శ్రద్ధానంద స్వాముల వారు కవిగారికి బహుమతిని అందజేశారు.

**మద్యపాన నిషేధము (1930) :** కల్లు, సారా తాగటం వలన కలుగు నష్టాలను వివరించే వ్యాసం ఇది. మద్యపానం సేవించుట వలన కలుగు కష్టాలను ఇందులో విపులంగా వివరించారు. 1930 సంవత్సరం మార్చి నెలలో తూర్పుగోదావరి జిల్లా మద్యపాన నిషేధ సంఘము (Temperance Committee) వారు నిర్వహించిన వ్యాసరచన పోటీ పరీక్ష కోసం ఈ వ్యాసం రాయగా, దీనికి ప్రథమ బహుమతిగా బంగారు పతకం వచ్చింది. ఆనాడు బంగారు పతకం వెల ఒక అణా మాత్రమే. మద్యపాన నిషేధము వ్యాసంలో 'తొలి పలుకు' 'జీవగణముల యొక్క విలువ', 'మద్యసారమనగానేమి?', 'మద్యము-దాని గుణము', 'మద్యము-ఆహారము కాదు', 'మద్యసారము ఔషదము కాదు', 'మద్యము ఆయుర్ధాయమును తగ్గించును', 'ఒక దృష్టాంతరము', 'మద్యసారము - కలుగురోగములు', 'మద్యము-దాని మజా', 'ఉపసంహారము' మొదలగు ఉపశీర్షికలున్నాయి.

**అసుర పురాణము అను హరిజన చరిత్రా సంగ్రహము :** ఇది పద్యకావ్యము. దీనిలో హరిజనులు చారిత్రకంగా ఉన్నత స్థితిలో ఉండి, రాజ్యాధిపతులుగా వ్యవహరించారని ఆర్యుల రాకతో వారి రాజ్యాధికారాన్ని కోల్పోయినట్లు వర్ణింపబడింది. వీరి జాతిలో ఎందరో ఋషులు, భక్తులు, పతివ్రతలు, కవులు, గాయకులు, యోధులు మొదలగు మహా పురుషులు పుట్టి భారత జాతి మాన, ప్రాణాలను కాపాడుటకు బలియైనట్లు ఈ కావ్యంలో వర్ణింపబడింది. అంతేగాక దళితులు ఆత్మ గౌరవం గల ఒక ప్రత్యేక జాతి అని, నీగ్రోలాంటి బానిస జాతి కాదని తెలియజెప్పారు. దీని వెల ఎనిమిదణాలు అనీ, త్వరలో వెలువడబోతుందనీ కవి గారే చెప్పుకున్నారు.

**'అంటరాని వాళ్ళు' :** సమాజంలో హరిజనులకు, అగ్రవర్ణాలకు మధ్య జరిగే సంఘర్షణలు, మత ఆచారాలకు సంబంధించిన కథల సంపుటి. సమర్థులకు, అసమర్థులకు జరిగిన సంఘర్షణలు కనబడతాయి. దీనిలో 1) మండోదరి – దండోర 2) మాధవశాస్త్రి – మాదిగ సుబ్బమ్మ 3) పల్లమ్మ పడవ ప్రయాణం – మడుగు బాపనయ్య 4) మాలపోలయ్య – మడుగులో బాపనయ్య 5) ముత్తమ్మ ముడుపు 6) పండిత గోష్ఠి – వీరభద్ర పాకయాజి మొదలగు కథలు ఎంతో మనోహరంగా, నవరసాలతో కన్పిస్తాయి. ఇవన్నీ హరిజనోద్యమానికి చేయూతనిచ్చేవే. ఇది 1) వాదులకు–వాత 2) ప్రతివాదులకు–పూత, 3) ప్రచారకులకు–ఊత అని ధర్మన్న గారు తెలియజెప్పి, ఇది త్వరలో వెలువడును అని పేర్కొన్నారు. దీని వెల నాలుగు అణాలు.

పైన పరిశీలించిన రచనలను బట్టి కుసుమ ధర్మన్న మొదట మహాత్మగాంధీ, ఆ తరువాత అంబేద్కర్‌ల ప్రభావంతో 'అస్పృశ్యతా సమస్య'ను మానవతా దృక్పథంతో చిత్రించారు. వీరు హరిజన సమస్యకే పరిమితం కాకుండా మొత్తం సమాజ అభ్యుదయాన్ని కాంక్షిస్తూ రచనలు చేశారనడానికి 'మద్యపాన నిషేధము' పైన వీరు రాసిన వ్యాసమే తార్కాణము. సమకాలీనుల చేత 'ఆది ఆంధ్ర కవి సార్వభౌముని'గా పిలిపించుకున్న ధర్మనగారు కలం ద్వారా, గళం ద్వారా హరిజనాభ్యుదయం కోసం రచనలు చేసి తెలివి, సృజనాత్మకత ఒక వర్గం సొత్తుకాదని నిరూపించారు. అటువంటి ధర్మన్న గారిని కాలగర్భములో కలిసిపోకుండా, కాపాడవలసిన బాధ్యత మనందరిమీద ఉంది. కావున వారి అముద్రిత రచనలను సంపాదించి అచ్చువేయడం ముద్రిత రచనలను పునర్ముద్రించి ప్రస్తుత సమాజానికి అందించటం ఎంతో అవసరం.

**ఆధార గ్రంథాలు :**


1. కుసుమ ధర్మన్న జీవిత ప్రస్థానం, డా. పుట్ల హేమలత, 2018.
2. తెలుగు సాహిత్యం – హరిజన రచయితల సేవ, డా. ఎల్లే విజయానందరాజు, అముద్రితం.
3. తొలి దళిత ఆత్మగౌరవ స్వరం కుసుమ ధర్మన్న కవి, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, 2018.
4. తొలిదళిత స్ఫూర్తి కుసుమ ధర్మన్న (వ్యాస సంకలనం), కె. ఉషారాణి, 2018.
5. దళిత సాహిత్య చరిత్ర, డా. పిల్లి శాంసన్, 2000.

 ISBN : 978-93-340-2436-4

# 4 కుసుమ ధర్మన్న సాహిత్యం - ప్రముఖుల సద్విమర్శ

**డాక్టర్. జి. వెంకట లాల్**
తెలుగు ఉపన్యాసకులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జంగారెడ్డిగూడెం
చరవాణి: 9949264650

కుసుమ ధర్మన్న తొలితరం దళితకవి. స్వాతంత్ర్యానికి పూర్వం 1993లో హరిజన శతకాన్ని రచించారు. అప్పటికి జాషువా గబ్బిలం వంటి కావ్యాలు రాలేదు. ఒక వైపు జాతీయోద్యమం కొనసాగుతున్న సంఘంలో కుల వివక్ష కొనసాగడాన్ని కళ్ళారా చూశారు. పరిస్థితులు పంజావిసిరితే నిస్సారమైన మెదడులో కూడా వ్యూహం పుడుతుంది. బలహీనమైన పక్షి కూడా తనగూడు మీద దాడి జరిగితే తిరుగుబాటు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్, గాంధీజీల ప్రభావాలతో స్ఫూర్తి పొంది అంటరాని తనాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంతో ఈ శతకాన్ని రచించారు. వర్ణ ధర్మం పేరిట భారతీయ సమాజంలో సృష్టించిన హెచ్చు తగ్గులను నిరసించారు. బూటకపు ప్రజా స్వామ్యవాదులకు తన వాదనలను బలంగా వినిపించారు. నోటితో పలకరింపు నుదిటితో వెక్కిరింపు ధోరణులను నిర్మొహమాటంగా ఖండించారు. లక్ష సబ్బులకు కూడా తొలగిపోని కులము పంకిలాన్ని తనజాతి జనుల తలమీద పులిమి ఎన్నటికీ పూడ్చలేని ఆగాదాన్ని సృష్టించిన ఈ వర్ణ సమాజంపై ద్వేషాన్ని రగిలించక, తన జాతి జనులకు ప్రబోధం గావించుటయే ఎంచుకున్న విశాల హృదయాలు. “మేలుకొనుము నీవు తరుణము మించకుండ జన్మ హక్కులకై పోరుసల్పు మిపుడే హక్కుకి ప్రాణమిడుట ద్రోహంబు కాదు స్వర్గ పదమని నమ్ముము స్వాంతమందు... అంటూ తన జాతీయుల్లో ఆత్మ గౌరవ స్ఫూర్తిని, దాప్తిని రగిలించారు. స్వాతంత్రోద్యమానికి నాయకత్వం వహించిన జాతీయ పార్టీలో సభ్యుడిగా ఉంటూనే వారి వ్యవహార శైలిలోని లోసుగులకు నిరసన తెలియచేస్తూ “మాకొద్దీ నల్ల దొరతనం“ అంటూ గళం విప్పి గానం అభివృద్ధి విషయంలో ఆనాటి నాయకుల ఆశయాలను విశ్వసించి గౌరవించినా వాటి ఆచరణలో లోపాలను ఎలాంటి సంకోచమూ లేకుండా ప్రతిఘటించేవారు.

ధర్మన్న వృత్తి చేత ఆయుర్వేద వైద్యులు. వీరి ప్రవృత్తి సంఘసంస్కరణ. వీరు తాము రచించిన గేయాలను, కథలను సంఘానికి ప్రబోధం కలిగించడానికి ఉపకరణంగా ఉపయోగించారు. దళిత వర్గాలను తొలుత పంచమ వర్గం అనేవారు. 1917 లో అది ఆంధ్ర అయింది. 1931లో హరిజన అయింది. 1936లో షెడ్యులు కులం అన్నారు. 1976 తర్వాత దళిత వర్గమనే పేరు ఖరారయింది. “హరిజన” పదం ప్రస్తుత నిషేదించినా ఈ పదం శతకంలో మకుటంగా ఉన్నందువల్ల స్వీకరించడం జరిగింది. ఒకప్పటి సమాజం

 ISBN: 978-93-340-2436-4

సుఖశాంతులతో ఎలా ఉండేదో చెబుతూ... "ఆదికాలమందు నవనిలో జనులెల్ల నన్నదమ్ములగుచు నాశనీడి చీకు చింతలేక చిరంజీవులైరయా ఆలకింపుమయ్య హరిజనుండ" అంటూ... ఆనాటి సమాజంలో వెల్లివిరిసిన ఆనందాన్ని వివరిస్తూ, నేడు స్వార్ధపరులు సమాజాన్ని ఎలా చీల్చి చండాడారో ధ్వని పూర్వకంగా వివరించారు. "హక్కు సత్వములును నధికారమును లేదు నేను నీవను తెగ నీల్గులేదు మాయబుద్ధి జూడ మచ్చుకైనను లేదు ఆలకింపుమయ్య హరిజనుండ" అంటూ... మనుషుల మనస్సులో స్వచ్ఛతను వివరిస్తూ... నేడు ముందు – వెనుక, కుడి – ఎడమ దగాలకు గురవుతూ సమాజమెలా దిగాలు పడిందో చెప్పకనే చెబుతున్నారు. "కడుపు నిండి యొకడు కడుపుమండి యొకడు తొత్తు యొకడు లేడు దొరయు లేడు భాగ్య వంతు డొకడు బడుగు పేదయులేడు ఆలకింపుమయ్య హరిజనుండ " అంటూ – మానవుల మధ్య సమతా భావం, సర్వజనుల శాంతి సంతోషాలతో చీకు చింతలేక ఆరోగ్యంగా జీవించిన తీరు వివరిస్తూ – నేడు దుఃఖ పూరిత శుష్క జీవనులుగా మనమెందుకుండాలని ప్రశ్నిస్తూ ప్రబోధిస్తున్నారు. "నరక కూపమాయె నరలోకమెల్లను సాగిపోయే సుఖము శాంత మెల్ల బ్రతుకు భారమాయే భ్రమరదూరమాయేరా ఆలకింపుమయ్య హరిజనుండ" రానురాను స్వర్ధపెరిగిన మనుషుల వాళ్ళ జీవితాలెంత దుర్భరమైపోయినవో, మనిషికీ మమతకూ అడ్డుగా నిలిచినా ఈ వ్యవస్థలో మనుగడ ఎంత కష్టమో వివరిస్తూ కర్తవ్య బోధ చేస్తున్నారు. మనం నవనాగరిక యుగంలో ఉన్నాం. ప్రచండ వేగంతో ప్రపంచం పురోగమిస్తుంది. నివ్వేరపరచే గుణాత్మక ప్రగతి అన్ని రంగాలలోనూ కనిపిస్తుంది. సర్వత్రా మానవులు తమ మనుగడ కోసం ఎంతటి సాహసానికైనా సిద్ధ పడుతున్నారు. అయినప్పటికీ నేటికీ వారి ప్రబోధం మన సమాజానికి ఎంతో అవసరం. "ఉన్నది ఒక్క జీవితమే మానవునిగ వీరునిగ బ్రతుకుము నరుడా చరిత్ర నీకోసం ప్రసన బాధపడుతున్నది భవిష్యత్తు నీకోసం పడిగాపులు కాస్తున్నది ఉన్నది ఒక్క జీవితమే మానవునిగ వీరునిగ బ్రతుకుము నరుడా" అంటూ నినదించాడు.

తెలుగునాట తొలి దళిత వైతాళికుడైన కుసుమ ధర్మన్న అక్షర యోధుడే కాదు, పోరాట ధీరుడు కూడా. ఆయన పోరాట పటిమ, ఆయన రచనలు ఈనాటికీ స్ఫూర్తిదాయకం. కుసుమ ధర్మన్న జీవితం, ఆయన రచనలు ఈనాటి తరానికి అందించాలనే సంకల్పంతో ఉభయ గోదావరి జిల్లాలోని వందకుపైగా సాహిత్య, సాంస్కృతిక, దళిత, వామపక్ష, అంబేద్కరిస్టు సంఘాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 18న రాజమహేంద్రవరంలో బొమ్మన రామచంద్రరావు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు హాలు (గోదావరి గట్టు)లో జరుగుతున్న 'కుసుమ ధర్మన్న సాహితీ సమాలోచన' కు అందరికీ ఆహ్వానం పల్కారు.

ఈ సందర్భంగా ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురించిన కుసుమ ధర్మన్న రచనలు 1.

 ISBN: 978-93-340-2436-4

మా కొద్దీ నల్లదొరతనం, 2. హరిజన శతకం, 3. సామ్యవాదాన్ని సహించని హిందూయిజం, 4. మధ్యపాన నిషేధం, 5. తొలి దళిత స్ఫూర్తి కుసుమ ధర్మన్న (వ్యాస సంకలనం), 6. కుసుమ ధర్మన్న రచనలు – దళిత దృక్పథం – డా॥ మద్దుకూరి సత్యనారాయణ, 7. కుసుమ ధర్మన్న జీవిత ప్రస్థానం – డా॥ పుట్ల హేమలత పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుంది. ఉదయం సదస్సు అంశం: కుసుమ ధర్మన్న – సామాజిక సాహిత్య నేపథ్యం, మధ్యాహ్నం సదస్సు అంశం: దళితులు – వర్తమానం – కుసుమ ధర్మన్న. ఈ కార్యక్రమంలో రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, తెలకపల్లి రవి, ఎండ్లూరి సుధాకర్, జి. కళ్యాణరావు, మల్లేపల్లి లక్ష్మయ్య, శిఖామణి, వి. బాలసుబ్రహ్మణ్యం, కుసుమ రాజకుమారి, దార్ల వేంకటేశ్వరరావు, జి.వి. రత్నాకర్, వేముల ఎల్లయ్య, సన్నిధానం నరసింహశర్మకె. మధుజ్యోతి, కె. శ్రీదేవి, శ్యాంషా, గూటం స్వామి, మద్దుకూరి సత్యనారాయణ, జి. సుబ్బారావు, మేడిపల్లి రవికుమార్, కోయి కోటేశ్వరరావు, వి. శ్రీనివాసరావు, కె. ఆశాజ్యోతి, చల్లపల్లి స్వరూపారాణి, పుట్ల హేమలత, గంటేడ గౌరునాయుడు, తరపట్ల సత్యనారాయణ, బొనిగల రామారావు, నూకతోటి రవికుమార్, కె. ఆనందాచారి, కె. గౌరేశ్వరరావు తదితరులు పాల్గొంటారు. సదస్సు చివరలో కుసుమ ధర్మన్న రచనల ఆధారంగా రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. చరిత్రలో విస్మరణకు గురైన తొలితరం దళిత కవి కుసుమ ధర్మన్న రచనలను ప్రచురించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన నవ తెలంగాణ (ప్రజాశక్తి) పబ్లిషింగ్ బుక్ హౌస్ వారు అభినందనీయులని వక్తలు ప్రశంసించారు.

హైదరాబాదులో నిర్వహించిన '30వ హైదరాబాదు నేషనల్ బుక్ ఫెయిర్ 2016'లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు 'కుసుమధర్మన్న రచనలు' ఆవిష్కరణ సభ జరిగింది. సభకు నవతెలంగాణ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య ఆహ్వానం పలికారు. ఈ సభకు కె.చంద్రమోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి, ప్రముఖ దళిత మేధావి మల్లేపల్లి లక్ష్మయ్య పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడుతూ చరిత్రలో విస్మరణకు గురైన కుసుమ ధర్మన్నజీవితాన్ని సమాజానికి తెలిపి, ఆయన రచనలను ప్రచురించిన ప్రజాశక్తి ప్రచురణల సంస్థను అభినందిస్తున్నానన్నారు. కుసుమ ధర్మన్న గానీ, ఒక దళిత నాయకుడు, సాహితీ వేత్తను గాని చరిత్ర చాలా పాక్షిక దృష్టితోనే చూస్తుందని, అది అంబేద్కర్ నుండి కుసుమ ధర్మన్న దాకా, ఇప్పుడున్న వ్యక్తుల దాకా అది కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు. ఒక వ్యక్తిని చరిత్రకారులు అంచనావేసేటప్పుడు ఆ వ్యక్తి కులం, మతం, భావజాలాలల్నే పరిగణనలోకి తీసుకుంటున్నారు తప్ప, దళిత సమస్యల కోసం సందర్భానుసారంగా కృషిచేస్తున్నారని గమనించడం లేదన్నారు. కుసుమ ధర్మన్న హిందూమతంలో అంతర్భాగంగా ఉంటూనే దానిలోని లోపాల్ని వ్యతిరేకించాడనీ, దానికి నిజామ్ కాలంలో హైదరాబాదు లో

గల భాగ్యరెడ్డివర్మ, శ్యామ్ సుందర్, వెంకట్రావు మొదలైన వారితో కలిసిపనిచేయాల్సిన సందర్భాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒకవైపు గాంధీజీ భావాలకు ప్రభావితుడైనా అంబేద్కర్ భావాలకే ప్రాముఖ్యాన్నిచ్చాడని వ్యాఖ్యానించారు. ఆనాడు కుసుమ ధర్మన్న "హరిజన" అనే పదాన్ని వాడటమే నాడున్న గాంధీజీ తాత్త్విక చింతన ప్రభావం తెలుస్తుందని చెప్పారు.

ప్రముఖ సాహితీవేత్త, ప్రజాశక్తి మాజీ సంపాదకుడు తెలకపల్లి రవి మాట్లాడుతూ నేడు ఆవిష్కరించిన కుసుమధర్మన్న రచనల్ని చూస్తే, చరిత్ర ఇతిహాసపు చీకటికోణాల్ని చీల్చుకొంటూ వెలుగుని విరజిమ్మిన రచనలుగా వీటిని పేర్కొనవచ్చునని అభివర్ణించారు. చరిత్రలెప్పుడూ విజేతల కథనాల నుండే రాస్తారనీ, అందువల్ల పరాజితుల జీవితాలు విస్మరణకు గురవుతుంటాయని, దానికి పాలకుల ప్రభావమే ప్రధాన కారణమని విశ్లేషించారు. బ్రౌన్ మహాశయుడు రాకుంటే మనకు వేమన దక్కుండేవాడుకాదు.

ధర్మన్న రచనల విషయంలోను జరిగిందని, ఆధిపత్య వర్గాలెప్పుడూ తమకు హాని జరిగేవాటికి ప్రాధాన్యం లేకుండా చేస్తుంటారు. అలా ఎంతోమంది చరిత్రలు కాలగర్భంలో కలిసిపోయాయి. కుసుమ ధర్మన్న ధర్మం కోసం పోరాడిన కవి, సామాజిక సంఘసంస్కర్త. సుమారు నూరేళ్ళ క్రితం అంటే 1917 వ సంవత్సరంలో ఆదిఆంధ్రమహాసభ విజయవాడలో జరిగింది. కుసుమ ధర్మన్న అధ్యక్షులుగా ఆ సభను విజయవంతం చేశారు. నేడు మరలా కుసుమ ధర్మన్న రచనలను 2016లో మనం ఒకచోటకు తెచ్చి ఆవిష్కరించుకుంటున్నామంటే, ఆ రచనల్లోని ప్రాసంగికతను అర్థం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆరుద్ర గారంటే తనకెంతో అభిమానమనీ, అయినా ఆయన రాసిన సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో కూడా కొంతమందిని విస్మరించారనీ, అలా విస్మరించిన వారిలో కుసుమధర్మన్న కవికూడా ఉన్నారని తెలిపారు. భారతీయ సమాజంలో కుల, మత, వర్గ వైరుధ్యాల వల్ల ఇలాంటి చారిత్రక తప్పిదాలు జరిగిపోతుంటాయని, వాటిని తర్వాత వచ్చేవారు సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దానిలో భాగంగానే నేడు కుసుమ ధర్మన్న రచనలను తీసుకొస్తున్నందుకు, వాటిని పుస్తకరూపంలో ఆవిష్కరించడం సంతోషదాయకమని అన్నారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటి అసోసియేట్ ప్రొఫెసర్ డా.దార్ల వెంకటేశ్వరరావు వివరిస్తూ కుసుమ ధర్మన్న జీవితాన్ని, రచనలను, భావజాల వైరుధ్యాలను సోదాహరణంగా విశ్లేషించారు. ఒక ఆయుర్వేద వైద్యునిగా జీవిస్తూ, తన కులం వల్ల కలిగే సంఘర్షణలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి తనవంతు కృషిచేసిన సామాజిక వేత్త, సాహితీవేత్తగా కుసుమ ధర్మన్న కవిని గుర్తించాల్సిన అవసరం ఉందన వ్యాఖ్యానించారు. ఆయన రచనలను ఒక చోటకు తీసుకురావడంలో విశేషమైన కృషిచేసిన ప్రజాశక్తి బుక్ హౌస్ వారిని

అభినందించారు. ఈ పుస్తకాలను తొలిసారిగా రాజమహేంద్రవరంలో ఆవిష్కరించారని, అప్పుడు తనకు విశ్వవిద్యాలయంలో ఒక అర్జెంటు పనివల్ల ఆ సభకు హాజరు కాలేకపోయానని, అయితే హైదరాబాదు బుక్ ఫెయిర్ లో ఆవిష్కరించే సమయంలో తనకు అవకాశం కల్గించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. కుసుమ ధర్మన్న జీవితాన్ని చరిత్రీకరించడంలో ప్రజాశక్తి వారు విశేషమైన కృషి చేసి ఆ జీవితాన్ని, ఆ రచనలను సేకరించి, వాటన్నింటినీ ఆకర్షణీయంగా ముద్రించి, అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చినందుకు ప్రచురణ కర్తలను అభినందించారు. గతంలో ఎండ్లూరి సుధాకర్ గారి పర్యవేక్షణలో కుసుమధర్మన్న రచనలపై పరిశోధన చేసిన మద్దుకూరి సత్యనారాయణ పరిశోధన పుస్తకాన్ని కూడా ప్రచురించడం అభినందనీయమన్నారు. ఆ పుస్తకంలో చరిత్ర రచనకు సంబంధించిన కొన్ని చక్కని పద్ధతులున్నాయని, వాటిని దళిత నాయకులు, సాహితీవేత్తల గురించి చరిత్ర రాసేవారు దృష్టిలో పెట్టుకోవాలన్నారు. కుసుమ ధర్మన్న రాసిన 'హరిజనశతకం' పై నల్గొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, దూరవిద్య లో చదివే విద్యార్థుల కోసం సరళంగా ఒక పాఠాన్ని రాశానని తెలిపారు. నేడు విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన చేసేవారికి ఇప్పుడు ప్రచురించిన పుస్తకాలు ఒక చక్కని ఆకారాలుగా ఉపయోగపడతాయని, ఆ కృషి చేసినందుకు ఒక విశ్వవిద్యాలయ అధ్యాపకుడిగా సంతోషిస్తున్నానని, ప్రచురించిన వారిని అభినందిస్తున్నానని అన్నారు. కుసుమ ధర్మన్న పుట్టిన తేదీ విషయంలో భేదాభిప్రాయలున్నాయనీ, కొంతమంది ఆయన 1894లో పుట్టి, 1948 వరకు జీవించినట్లు పేర్కొనగా, మరికొంతమంది 1900లో పుట్టి 1946 వరకు జీవించినట్లు పేర్కొంటున్నారని దీనికి చరిత్రకారులు దళిత సాహితీవేత్తలను విస్మరించడం ఒక ప్రధాన కారణమన్నారు. దీనితో పాటు ఆయన చేస్తున్న కార్యక్రమాల పట్ల ఆధిపత్య అగ్రవర్ణాల వారు ఆయన గృహాన్ని దహనం చేయడం వల్ల బహుశా ఆయన రచనలు కూడా కోల్పోయి ఉండవచ్చునన్నారు. తాను చదువుకున్నది తక్కువే అయినప్పటికీ తన జీవితానుభవంలో కులం వల్ల ఎదుర్కొంటున్న అవమానాలను, వాటికి కారణమైన వాటిని గుర్తించడం వల్లనే సంఘసంస్కరణకు పూనుకున్నారని వ్యాఖ్యానించారు. తన జీవిక కోసం ఆయుర్వేద వైద్యునిగా పనిచేస్తూనే, మరొక వైపు తన జాతి అభ్యున్నతికి కృషిచేయడంలో భాగంగానే 'జయభేరి' వంటి పత్రికను కొన్నాళ్ళపాటు ప్రచురించారన్నారు. కుసుమ ధర్మన్న భావజాలంలో వివిధ పరిణామాలు కనిపిస్తాయని, ఆయనపై గాంధీజీ ప్రభావం అత్యధికంగా ఉందనీ, అందువల్లనే తన కుమారులకు గాంధీజీ పేరు కలిసి వచ్చేటట్లు కూడా పెట్టుకున్నారని వివరించారు.

గాంధీజీ సంస్కరణోద్యమ ప్రభావంతో పాటు అప్పటికి బలంగా ఉన్న జస్టిస్ పార్టీ ప్రభావం, దానితో పాటు మద్రాసులో జరిగిన ఆది ద్రావిడ ఉద్యమం ప్రభావం కుసుమ ధర్మన్నలో కనిపిస్తుందన్నారు. అందువల్లనే దళితులు ఈ దేశ మూలవాసులనే స్పృహతో 'ఆదిఆంధ్ర ఉద్యమా'నికి నాయకత్వం వహించారని, తర్వాత కాలంలో అంబేద్కర్ తో

 ISBN: 978-93-340-2436-4

సంబంధాలు ఏర్పడ్డాయని వివరించారు. అయినప్పటికీ, కుసుమ ధర్మన్నలో హిందూ మతంలో భాగంగా భావించే వాల్మీకి, వేదవ్యాసుడు, అరుంధతి మొదలైనవారు తమవారనే ఆలోచనలు ఆయన రచనల్లో కనిపిస్తాయని చెప్పారు. తొలితరం దళిత కవుల్లో ముఖ్యంగా బోయి భీమన్న తదితరుల్లో కూడా ఈ రకమైన ఆలోచనలు ఉన్నాయని వివరించారు. ఆ విధంగా భావజాల తాత్త్విక సంఘర్షణ కుసుమ ధర్మన్నలో కనిపిస్తుందనీ, దాన్ని లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రముఖ విమర్శకుడు డా. ద్వానాశాస్త్రి మాట్లాడుతూ, తాను కుసుమ ధర్మన్నపై ఒక చిన్న పుస్తకాన్ని ఈ పుస్తకాలేవీ లేనప్పుడే ప్రచురించానని చెప్పారు. కుసుమ ధర్మన్నను తొలి దళిత కవిగా గుర్తించాలన్నారు. సభలో నవతెలంగాణ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య సభను పరిచయం చేస్తూ, మరలా హైదరాబాదులో కుసుమధర్మన్న రచనలను ఆవిష్కరించాల్సిన అవసరమేమిటో వివరించారు. సభలో ప్రముఖ కవి తంగిరాల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలు గ్రంధాలు:

1. కుసుమ ధర్మన్న కవి రచనలు – దళిత దృక్పథం, మధుకూరి సత్యనారాయణ, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.
2. కుసుమ ధర్మ న్న జీవిత ప్రస్థానం, డాక్టర్ పుట్ల హేమలత, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్
3. చరిత్రలో కుసుమధర్మన్, వి చెంచయ్య, విప్లవ రచయితల సంఘం, హైదరాబాద్
4. తొలి దళిత స్ఫూర్తి కుసుమధర్మన్న, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.

* * *

 ISBN : 978-93-340-2436-4

# 5 అంబరాన్ని తాకిన దళితోద్యమ కెరటం - ధర్మన్న పోరాటం

**డా॥ తరపట్ల సత్యనారాయణ**
సహాయాచార్యులు, తెలుగు శాఖ,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

**ప్రవేశిక :**

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఉద్యమ కవిత్వం ఉవ్వెత్తున ఎగసి అంబరాన్ని తాకి ఉజ్వల కెరటమై చరిత్రలో నిలిచింది. సామాజిక సమస్యలను భుజాన వేసుకొని, విభజన భజనపరుల గుండెల్లో తూటాలై పేలింది. నిజాన్ని నిర్భయంగా చాటే అస్త్రంగా నిలిచి అనేక ఉద్యమాలకు భూమిక అయ్యింది. అనేక అంశాలకు చర్చావేదిక అయ్యింది. అందుకే ఉద్యమాలు సంఘ సంస్కరణకు, సమానతకు ప్రతీకలయ్యాయి. ప్రజలను ఆలోచింపచేసాయి. ఆధునిక భావనతో ప్రగతిపథానికి నాందీ గీతాలయ్యాయి. ఆధునిక కవిత్వంలో వాస్తవికత ప్రత్యేకంగా కనిపించే అంశం. రాజులు, రాజ్యాలు, రాణులు, దేవుళ్ళు, దేవతలు, శృంగారాలు, అంగాంగ వర్ణనలు పోయి అభ్యుదయమే పునాదిగా నిలిచి సాంఘిక అసమానతల నిరోధనకు, సంఘ సంస్కరణకు, జాతీయ సమతాభావనకు బాసటగా నిలిచింది. అందుకే అవి ఉద్యమాలకు వేదికలయ్యాయి. అటువంటి ఉద్యమాల్లో దళితోద్యమం ఒక ప్రత్యేకతను, ప్రాధాన్యతను సంతరించుకొని దశదిశలా విస్తరించింది. ఎందరో మహాకవుల రచనలవల్ల దళితులకు విముక్తి కలిగింది. అందులో తొలితెలుగు దళిత కవితా వైతాళికుడు కుసుమ ధర్మన్న.

**ముఖ్యోద్దేశ్యం :**

దళిత కవిత్వం వాస్తవిక పునాదుల మీద ఏర్పడింది. దళితుల ఆవేదనలు, ఆక్రందనలు, అవమానాలు, బహిష్కరణలు, దూషణలు, వివక్షతలు, కవితా వస్తువులయ్యాయి. నిరంతరం అరణ్య ఘోషగా మిగిలిన గొంతుకలు ఒక్కటై దిక్కులు పిక్కటిల్లేలా ఎన్నాళ్ళీ కన్నీళ్ళు? ఎన్నేళ్ళీ కన్నీళ్ళు అంటూ నిరసనతో నినదించిన స్వరాలే దళిత కలాలై కొత్త చరితకు నాందీ గీతాలై నవసమాజ నిర్మాణానికి పునాది రాళ్ళైయ్యాయి. వీటన్నిటికి తెలుగునేలపై పునాది వేసి గాంధీ అంతటి వాణ్ణే ప్రశ్నించి ఇంటికి రప్పించికుని, అంటరాని తనం నిర్మూలనకు కంకణం కట్టి ఉద్యమకెరటమై గోదావరి నది ఒడ్డున ఉప్పెనవలె ధ్వజమెత్తిన తొలితెలుగు దళిత కవితా వైతాళికుడు కుసుమ ధర్మన్న ఉద్యమ స్ఫూర్తిని నేపథ్యాన్ని వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశ్యం.

**కీలక పదాలు :**

దళిత ఉద్యమ నేపథ్యం, పదునెక్కిన కలాలు, అంబరాన్ని తాకిన ఉద్యమ కెరటం, జయభేరి, ఉద్యమ స్ఫూర్తి.

**దళితోద్యమ నేపథ్యం :**

భారతదేశంలో చాతుర్వర్ణ వ్యవస్థ వల్ల వటవృక్షంలా పాతుకు పోయిన కులవ్యవస్థలో మనిషికి మనిషికి మధ్య అడ్డుగోడలు అధికమయ్యాయి. దాని ఫలితంగా అసమానతలకు, న్యూనతాభావానికి, అస్పృశ్యతకు భారతదేశం ప్రతీకగా నిలిచింది. ఈ అసమానతలను తొలగించడం కోసం ఎందరో కృషిచేసారు. అంతేకాదు. ఎన్నో ఉద్యమాలు నడిపారు. అందులో దళితోద్యమం ప్రధానంగా చెప్పుకోదగ్గది. 1818లో మహారాష్ట్రలో దళిత చైతన్యాన్ని తీసుకురావడంలో గోపాల్‌బాబా వాలంకర్, అనార్య దోషక్ పరిహార్ మండలి స్థాపన, తరువాత శివరామ్ జాంబి కాంబ్లే, కిషన్‌పక్ష్ గోజి బాన్సోడే, సాధుజీ గైక్వాడ్, మొదలైనవారెందరో నడిపిన ఉద్యమాలు దళితులకు వెలుగుబాటలయ్యాయి. అలాగే మద్రాస్, బొంబై రాష్ట్రాల్లో నడిపిన పోరాటాలు, హైదరాబాద్‌లో ఉన్న దళితులను ప్రభావితం చేసాయి. 1906లో హైదరాబాద్‌లో తొలి దళిత ఉద్యమం మాదారి భాగ్యరెడ్డి వర్మ ప్రారంభించిన జగన్ మిత్రమండలితో ప్రారంభమైంది. ఈ ఉద్యమంలో దళితులే ఈ దేశపు మూలవాసులని, ఆర్యులు దురాక్రమణ దారులై వచ్చి ఆధిపత్యం చెలాయించారని ఎలుగెత్తిన దళిత ఉద్యమనేత భాగ్యరెడ్డి వర్మ. ఈ ప్రభావంతోనే తెలుగునాడు దళిత ఉద్యమం పుంజుకుంది. ఈ నేపథ్యంలో ఆది-హిందూ జాతీయోన్నత సభ, కోస్తాఆంధ్రాలో ఆదిఆంధ్ర ఉద్యమం, అప్పటికే దక్షిణాదిలో ఆది-ద్రావిడ ఉద్యమం మొదలైంది. అదే సమయంలో బెజవాడలో పంచమ కాన్ఫరెన్స్ తరువాత ఆదిఆంధ్ర కన్ఫరెన్స్‌గా మారింది. ఆ సభలోనే ఆదిఆంధ్ర సభ ఆవిర్భవించింది.

1917-47 మధ్యకాలంలో ఆదిఆంధ్ర సభ కోస్తా ఆంధ్రా ప్రాంతాల్లో అనేక సభలు నిర్వహించింది. అంతేకాకుండా దళితోద్యమాన్ని మరింత బలోపేతం చేసి ఆనాటి సమాజంలో ఉన్న కుల విభజనను వ్యతిరేకిస్తూ, అంటరానితన నిర్మూలన కోసం వేలగొంతుకలు ఒక్కటయ్యాయి. ఈ సమయంలో కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో దళితోద్యమాలు ఆవిర్భవించి మరింత పోరాటాన్ని రగిలించి సరికొత్త ఆలోచనలు రేకెత్తించాయి. అంబేద్కర్ రాకతో దళితోద్యమాలు కొత్తపుంతలు తొక్కి అనేక సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపిస్తూ పదునెక్కిన పోరాటాలకు వేదికలయ్యాయి. హక్కుల సాధనకై పోరుబాట వేసాయి. అందులో తెలుగు కవులు ఉద్యమాల్లో పాల్గొని తనవంతు కృషిగా సామాజిక చైతన్యాన్ని రగిలించాయి.

**దళితోద్యమాలు - పదునెక్కిన కలాలు :**

ఆధునిక తెలుగు సాహిత్యంలో తొలి తెలుగు దళిత కవితా స్ఫూర్తి కుసుమ ధర్మన్న. వీరు ఆనాటి రోగగ్రస్థమైన కులవ్యవస్థకు వైద్యం అందించిన అసలైన వైద్యుడు. అందుకే తెలుగు సాహితీ లోకంలో వీరికొక ప్రత్యేక స్థానం లభించింది. మొట్టమొదటిగా మాకొద్దీ నల్లదొరతనం అంటూ గొంతెత్తిన కవితా వైతాళికుడు, అంతేకాదు గాంధీని ప్రశ్నించి

 ISBN : 978-93-340-2436-4

ధిక్కార స్వరాన్ని వినిపించిన అసలు సిసలైన దళిత కవే కుసుమ ధర్మన్న. తరువాత గుఱ్ఱం జాషువా తన గబ్బిలం ద్వారా, అరుందతీ సుతుని ఆవేదనను ప్రపంచానికి చాటాడు. అలాగే డా॥ బోయి బీమన్న తమ పాలేరు ద్వారా ఆనాటి సాంఘిక రుగ్మతలపై కలం ఎక్కుపెట్టి కులం అడ్డుగోడల్ని తొలగించాడు. ఆ తరువాత దళిత సింహ గర్జనతో ఆంధ్రరాష్ట్రాన్ని కదిపి, కుదిపిన దళితోద్యమ చైతన్య రవి కత్తిపద్మారావు, బొజ్జాతారకం, డా॥ శిఖామణి, డా॥ యెండ్లూరి సుధాకర్, ఆచార్య కొలకలూరి ఇనాక్, సతీష్ చందర్, మద్దూరి నగేష్‌బాబు, గూడ అంజయ్య, కాలేకూరి ప్రసాద్ వంటి వారెందరో దళిత కవులుగా, దళితుల హక్కులకోసం కలాలను, గళాలను, పదునెక్కిన పాళీలుగా మార్చి దళిత చైతన్యాన్ని నిప్పుకణికల్లా రగిలించారు. వీరందరికి దళితోద్యమ తెలుగు చైతన్య స్ఫూర్తి కుసుమ ధర్మన్న.

**గోదావరి తీరంలో అంబరాన్ని తాకిన పోరాట కెరటం :**

వేదనాదాలతో విలసిల్లిన సంప్రదాయ ఘని, సాంస్కృతిక రాజధానిగా గణనకెక్కిన రాజమహేంద్రిలో దళితోద్యమ జయభేరి మ్రోగించిన పోరాట కవన యోధుడు కుసుమ ధర్మన్న. కులమనే అంటురోగంతో రోజురోజుకు కృషించిపోతున్న రోగగ్రస్థ సమాజానికి మెరుగైన వైద్యం అందించిన అరుదైన వైద్య విద్వాన్ కుసుమ ధర్మన్న. సనాతన సంప్రదాయ నది పక్కన ధర్మపోరుతో ఎరుపెక్కిన కుసుమమై వికసించిన ఉద్యమ సూరీడే ధర్మన్న. వీరి కలంపోటుతో నాల్గుపడగక హైందవనాగరాజు శిరస్సును ఛిద్రంచేసిన కవన ధీరుడు ధర్మన్న. ఆనాటి దేశరాజకీయాలపై పదునైన పదజాలంతో కవిత్వాన్ని శక్తివంతమైన అస్త్రాలుగా సంధించిన సాహస వీరుడు. అందరూ తెల్లదొరతనం పోవాలి అని ఘోషిస్తే దాని వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పసిగట్టి 1921లోనే మాకొద్దీ నల్లదొరతనం అంటూ గళమెత్తి

**తెల్లదొరలు దేశమెల్ల గుల్లగజేసి**
**రనుచు బోధసేయ న్యాయమేమిటో**
**నల్లదొరలు నీకు మల్ల చిప్పీయ్యరే...** అంటూ అసలు నిజాన్ని బయటపెట్టిన ధర్మన్న కేవలం స్వాతంత్ర్యం అంటే జెండా మార్పిడే తప్ప సామాన్యులకు అందులో ముఖ్యంగా దళితులకు ఒరిగిందేమీ లేదనే భావనతో పదవుల పంపకంతో, వాటాల పంపకంతో ఉన్న నాయకుల అభిలాషను నిర్భయంగా చాటి గొప్పసంచలనాన్ని కలిగించారు.

అంటరానివాళ్ళుగా వెంటరాకూడదని శాసించిన నిచ్చెనమెట్ల వ్యవస్థను, అశాస్త్రీయమైన మనుధర్మ శాస్త్రాన్ని ధిక్కరిస్తూ నిరసన గళమెత్తి అడుగడుగునా ప్రశ్నలు సంధిస్తూ వెలివాడల బ్రతుకులను, వెట్టి చాకిరీని, దుర్మార్గపు అహంకారాన్ని దుయ్యబడుతూ 1933లో హరిజన శతాకాన్ని వ్రాసి ఆలకించుమయ్య హరిజనుండ అంటూ వీధి వీధిల్లోనూ వీరగాథగా వినిపించారు. ఆనాటి అంటురోగాన్ని నిరసిస్తూ..

**ఊరబావి చేదనీరు తోడగ బోవ**
**ముట్టనీక నన్ను గొట్టచూసి**
**నిందజేయు నెంచు నీటకేమంటురా....** అంటూ ఆనాటి అగ్రవర్ణ అహంకార భ్రష్టుల వికృతచేష్టలపై అక్షరాలతో అగ్ని వర్షం కురిపించారు ధర్మన్న. కులాల కంపుతో నిండిన ఈ సమాజంపై ఒక విధంగా ఆనాడు ఒక తిరుగుబాటుచేసి ధిక్కార స్వరమై జ్వలించాడు.

కుసుమ ధర్మన్న మంచి ఉపన్యాసకుడు. అంతకు మించి శ్రావ్యంగా పాడే గాయకుడు కూడా అందుకే వారి కవిత్వంలో ఒక లయతో కూడిన విభిన్న శైలి కనిపిస్తుంది. ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న గొప్ప ఉద్యమనేత. కందుకూరి సంఘసంస్కరణను ప్రేరణగా తీసుకొని దళిత చైతన్యాన్ని తీసుకొచ్చిన ఆదర్శవాది. ధర్మన్న గారు అంబేద్కర్ మార్గమే నిమ్నజాతుల విముక్తికి మార్గమని భావించిన అభ్యుదయ వాది. అందుకే తూచా తప్పకుండా అంబేద్కర్ ఆశయ సాధనలో ముందడుగు వేసారు. అందుకే 1921లో నిమ్నజాతుల విముక్తితరంగిణి, 1924లో నిమ్నజాతుల ఉత్పత్తిని వ్రాసి దళితుల పూర్వాపరాలను అసలు సిసలైన దళితుల చరిత్రను నేపథ్యాన్ని ఆధారాలతో బహిర్గతంచేసి మనుధర్మశాస్త్ర మూకల మెదళ్ళలో గొప్ప అలజడిని రగిలించి దళితోద్యమాన్ని దశదిశలా వ్యాపింపచేసి ముందుకు నడిపిన ఉద్యమ సారధి ధర్మన్న.

**విజయభేరై మ్రోగిన జయభేరి :**

ఉద్యమాల్లో భాగంగా జయభేరి పత్రికను స్థాపించి ఆంధ్రదేశమంతటా దళితుల గుండె చప్పుడు వినిపించిన కవన యోధుడు. ఆనాడు పీఠాధిపతులపై ప్రశ్నల వర్షం కురిపించి వారు చెప్పే కల్పిత కథలకు సమాధికట్టిన కవన ధీరుడు. యజ్ఞాలు, యాగాలు, మంత్ర తంత్రాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను ఛేధించడమే కాదు బహిర్గతంచేసి నిజాన్ని నిర్భయంగా చాటిన కుసుమ ధర్మన్న గొప్ప సంఘ సంస్కర్తగా, పోరాట వీరుడుగా నిలిచాడు. కుసుమ ధర్మన్న పోరాటాల్లో నిమ్నజాతుల విముక్తే ప్రధానంగా భావించాడు. దేశస్వాతంత్ర్యం కోసం పోరాటం కన్నా ఆదేశంలో అంటరానివారిగా, పశువుకన్నా హీనంగా నిశిద్ధ జీవిగా, అశుద్ధ జీవిగా పరిగణింపబడుతున్న వెలివాడల్లో బ్రతికే బడుగు జీవుల స్వాతంత్ర్యం కోసం, స్వేచ్ఛ కోసం కలం పట్టిన సామాజిక విప్లవ యోధుడు ధర్మన్న. అందుకే నల్లదొరల పాలనను నిరసించాడు. వీధి వీధిల్లో విజయ గీతికగా ఆలాపించాడు. మాల మాదిగల బ్రతుకులు, నిమ్నజాతుల వెలివేత జీవితాలు వంటి అంశాలు కవితా వస్తువులుగా చేసుకొని కలాన్ని సంధించారు. హరిజన సమస్యలపై స్పందించడమే కాకుండా ఆలోచించే విధంగా సరికొత్త విధంగా రచనకు శ్రీకారం చుట్టి చైతన్యాన్ని కలిగించాడు. మధ్యపాన నిషేధాన్ని ఒక ఉద్యమంగా రగిలించి ఆనాటి పేదల బ్రతుకుల్లో ఆ వ్యసనాన్ని

తొలగించేందుకు విశేష కృషిచేసి కృతకృత్యుడయ్యాడు. సంఘ సంస్కరణలో భాగంగా ఆనాటి దురాచారాలపై, మూఢాచారాలపై, ఛాందస భావాలపై నిరంతరం శ్రమించాడు. దేవాలయ ప్రవేశాల కోసం కోర్టులో కేసువేసి విజయం సాధించి దేవాలయ ప్రవేశాన్ని అధికారికంగా పొంది, ప్రజాసమూహంతో ప్రవేశించి విజయఢంకా మ్రోగించారు.

**ముగింపు :**

కుసుమ ధర్మన్న వ్రాసిన రచనలు ఆనాటి అనేక సామాజిక సమస్యల సాధనకు నిలువటద్దంగా కనిపిస్తాయి. వారి రచనల్లో వాస్తవికత, ప్రత్యేకంగా కనిపించే అంశం. దళితుల కోసం, వారు ఎదుర్కొంటున్న సమస్యలకోసం, అనుభవిస్తున్న అవమానాల కోసం ఎంతగానో ఆలోచించి ఉద్యమాన్ని ఊపిరిగా భావించారు. అందుకే కుల వ్యవస్థను, మత వ్యవస్థలో ఉన్న మూఢత్వాన్ని విభజన రేఖక్రింద న్యూనతా భావంతో కృంగిపోతున్న వారికోసం తన జీవితాన్ని ధారపోసిన అభ్యుదయవాది. చివరకు అనతికాలంలోనే, అతిచిన్న వయస్సులోనే అమరత్వం పొందినా నేటికీ విజయశీలుడుగానే ప్రజల నాలుకలపై నిలిచాడు, దళితోద్యమ చరిత్రలో వేగుచుక్కై నిలిచి దళిత స్ఫూర్తిని అందించి సమసమాజ నిర్మాణానికి, కుల రహిత సమాజానికి పునాది రాళ్ళుగా అక్షరాలను మలచిన అరుదైన ఆదర్శకవి కుసుమ ధర్మన్న. అందుకే తొలితెలుగు దళిత కవితా వైతాళికుడై అంబరానికెగసిన ఉద్యమ కెరటమే ధర్మన్న పోరాటమైంది.

ఆధార గ్రంథాలు :
1) తొలి తెలుగు దళిత కవితా స్ఫూర్తి – విశాలాంధ్ర పబ్లికేషన్స్
2) సాహితీ వ్యాసాలు – డా॥ తరపట్ల సత్యనారాయణ

 ISBN: 978-93-340-2436-4

# 6 తొలి తెలుగు దళిత వాగ్గేయ కారుడు ధర్మన్న

**ఆచార్య డి. జ్యోతిర్మయి**
ఆంగ్ల విభాగ అధ్యక్షులు
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

**డా॥ దొంతరాజు లక్ష్మీనరసమ్మ**
సహాయాచార్యులు, తెలుగుశాఖ
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

నవయుగ కవితా వైతాళికుడు, స్త్రీ జనోద్ధారకుడు, సంఘ సంస్కర్త అయిన కందుకూరి వీరేశలింగం గారి అడుగు జాడల్లో నడుస్తూ భావి తరాలకు ఉద్యమ స్ఫూర్తినిచ్చిన మహనీయుడు కుసుమ ధర్మన్న. విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణుడై ఆయుర్వేద వైద్యునిగా, ఉపాధ్యాయుడుగా, కవిగా, రచయితగా, పరిశోధకుడుగా తన జీవనం సాగిస్తూ హరిజనుల కోసం, సమానత్వం కోసం, వారి దాస్య విముక్తి కోసం తన జీవితకాలం అంతా పోరాడిన ధీరుడు. ఆంధ్ర – ఆంగ్ల భాషల్లో గొప్ప పండితుడు. మంచి వక్త. 1937 సం॥లో జయభేరి అనే పత్రికను స్థాపించి సమాజంలో దళితులపై జరిగే అరాచకాలన్నీ, ఎత్తి చూపారు. అంతేకాకుండా సమకాలీన రాజకీయ ఎత్తుగడలను, కుహనా సంస్కరణ ధోరణులను తూర్పారబెట్టాడు. దళితుల్లో చైతన్యం తేవటానికి, హరిజనులను ఉద్ధరించటానికి దోహదపడిన తొలి దళిత పత్రికాధిపతి కుసుమ ధర్మన్న.

త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్య, రామదాసు మొదలైన తెలుగు వాగ్గేయ కారులు ఎన్నో గేయాలు రాసారు. అటు ఆధ్యాత్మికంగా, ఇటు సాంఘికంగా సమాజంలో మార్పును తెచ్చారు. అన్నమయ్య "బ్రహ్మమొకటే పర బ్రహ్మమొక్కటే" అనే కీర్తనలో అందరూ భగవంతుని దృష్టిలో అందరూ సమానులే అని బోధించాడు.

**"నిండార రాజు నిద్రించు నిద్రయు నొక్కటే**
**అండనే బంటు నిద్ర అడియు నొక్కటే**
**మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే**
**చండాలుడుండేది సరిభూమి యొకటే"**

రాజు నిద్ర, బంటు నిద్ర ఒక్కటే, అన్ని శాస్త్రాలు చదివిన, బ్రాహ్మణుడు, చండాలుడు, ఉండే భూమి ఒక్కటే అని. ఇందులో ఏదీ ఎక్కువకాదు, ఏదీ తక్కువ కాదు అంతా సమానమే అని అన్నమయ్య బోధించాడు.

ధర్మన్న పుట్టిన తేదీ సరిగ్గా తెలియదుకాని, వీరి తల్లిదండ్రులు నాగమ్మ, వీరాస్వామి. కూలీ నాలీ చేసుకునే నిరుపేద కుటుంబంలో జన్మించాడు. చిన్న తనం నుండే తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించాడు. ఆనాటి సమాజంలో ఉన్న అసమానతలు,

హెచ్చుతగ్గులు, అణచివేతలు, దోపిడీలు దూషణలు అన్నింటిని తట్టుకొని సమాజానికి ఎదురు తిరిగిన ధైర్యశాలి ధర్మన్న. తన కవితనే ఆయుధంగా తీసుకున్నాడు.

జాతీయోద్యమంలో గరిమెళ్ళ సత్యనారాయణ ఎంతగానో ప్రాధాన్యంవహించారు. బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా

**మాకొద్దీ తెల్లదొరతనము దేవ**
**మాకొద్దీ తెల్ల దొరతనము**
**మా ప్రాణాలపై పొంచి మానాల హరియించే**
**మాకొద్దీ తెల్ల దొరతనము**
**పన్నెండు దేశాలు పండుచున్నా గాని పట్టెడన్నమె తాప నుండే;**
**ఉప్పు పుట్టుకుంటే దోస నుండే**
**నోట మట్టి గొట్టి పోతారండీ**
**కుక్కలతో పోరాడి కూడా తింటారండీ**

అని పాటను రాసి తానే స్వయంగా పాడుతూ ఊరూరా తిరిగి బ్రిటీష్ వాళ్ళ పరిపాలనా విధానాన్ని ఎండగట్టాడు.

ఈ పాటే ధర్మన్న ప్రేరణ. ఆనాడు సమాజంలో దళితుల పట్ల జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపుతూ

**“మాకొద్దీ నల్ల దొరతనము**
**మాల – మాదిగంటే మండి పడిపోతారు”**

అనే గేయాన్ని రాసాడు ఆర్థికంగా, సాంఘికంగా, ఎలా వెనకబడ్డారో వివరించాడు.

**“పన్నెండు మాసాలు పాలేరు తనమున్న**
**పస్తూలు బడుచు బతకాలండి**
**ఆలి కూలి జేసి తీరాలండి**
**పిల్లగాడూ పశువుల గాయాలండి**
**పగలు రేయీ పాటు పడ్డానండి**
**కట్ట గుడ్డా – కూడు గిట్ట దండి**
**రోగ ముస్తే నాగ దప్పు దండి**
**అప్పు తీరదీ చిత్రమేనండి”**

గరిమెళ్ళ “పన్నెండు దేశాలు పండు చున్న గాని పట్టెడన్నమెలేపనుండే” అని చెపితే

 ISBN: 978-93-340-2436-4

"ధర్మన్న" పన్నెండు మాసాలు పాలేరుగా ఉన్న పస్తులే ఉండాలి. ఇంటిలో అందూ పనిచేసిన పస్తులే ఉండాలి. పగలూ రేయి పాటు బడ్డా కూడు, గుడ్డా కూడా లేదు. జీవితకాలం పనిచేసినా అప్పు తీరదు అని దళితులు పై జరుగుతున్న ఆర్థిక నేరాలను వివరించాడు.

దళితుల శ్రమ దోపిడీని చెప్పుతూ

**"పాడి పంటలు మేము కూడబెడితే వారు**
**కూర్చొని తింటామంటారు**
**నాము లిచ్చి నట్టేట ముంచేరు**
**యెంచి అప్పు నప్పు బెంచుతారు"**

శ్రమపడేది ఒకళ్ళు దాని ఫలితాన్ని అనుభవించేవారు మరొకరు. పంట పండించేది దళితులు కూర్చుని తినేది ధనికవర్గం. డబ్బులు యిచ్చి అప్పులు పెంచుతారు అని శ్రమ దోపిడి గురించి రాసారు.

దళితుల దారిద్రమును చెప్పుతూ

**"ఊరి వెలుపనున్న పూరి గుడిసెలగాని**
**చాది కొంపలు మాకు లేవు**
**గాలి వెలుగు సుంత తొంగిరాదు**
**సారమైన కూర కూడు లేదు"**

వీరు ఎప్పుడూ ఊరు బయటే ఉండాలి. గాలి, వెలుతురు లేని కొంపల్లో మగ్గిపోతూ ఉండాలి. తింటానికి సరియైన కూడు కూడా ఉండదు.

**"దేశమందరికి మేము చేదు**
**మా దారిద్రయము జూడ దయపుట్టగా రాదు"**

దేశంలో ఉన్న వారికి మేము అంటే గిట్టదు. కనీసం దారిద్రాన్ని చూచికూడా ఎవ్వరికీ దయపుట్టదని దళితుల దయనీయ స్థితిని వర్ణించారు.

అంటరాని తనాన్ని గురించి చెప్పుతూ :-

**"మాల మాలని చాల తూలనాడి మమ్ము**
**అంటరాదని గెంటు తారు**
**ఆసుపత్రి మందు లడుగు తారు**
**మాల మందులు చాల తాగేరు**

**మాల పాలు నీళ్ళని మానలేరు**
**మాల చనుబాలు మందు కడిగేరు**
**మాల పొత్తు లేక మసలలేరు"**

మనుష్యుల్ని అంటరాని వారిగా చూస్తారు. మాల మందులు తాగుతారు, మాల చనుబాలు మందులోకి అడుగుతారు. చనుబాలు మందుకు పనివ వచ్చినప్పుడు మనుష్యులు ఎందుకు పనికిరారని సమాజాన్ని నిలదీసారు.

**"సాని ప్రక్క జేర సాగుతారు**
**కుష్ఠరోగి సరస కూర్చుంటారు**
**కుక్క కోతిని కోరిపెంచేరు**
**పల్లి పిట్టలను ప్రేమించుతారు**
**....**
**కాకి నీటిని తాకనిస్తారు**
**మమ్ము దరికి చేరనీరుదడదడ తిట్టేరు"**

సాని వాళ్ళ ప్రక్కన, కుష్ఠరోగుల సరసన కూర్చుంటారు. నోరు లేని జంతువు లను ఎంతో ప్రేమగా పెంచుతారు. కాని సాటి మానవుల్ని మాత్రం దరిచేరనివ్వరని తన ఆవేదన వ్యక్తం చేసారు.

పనులు చేయించుకొనే దప్పుడు దళితులు కావాలి వారు లేకపోతే ఆపనులు అవ్వవు.

**"పొలముపనులు జేసే తరుణాలతో మమ్ము**
**తాకితె తప్పులేదంట**
**వారు మేము కలబడ వచ్చునంట**
**కాళ్ళు తగిలీన తప్పుకాదంట**
**కలిసి చేతులు కలపొచ్చునంట**
**పంట వారింట నింపొచ్చునంట**
**మాతో యేమి పని లేనప్పుడు యెడగాలుండాలంట"**

ఇందుతో అంటరాని తనంతో పాటు శ్రమ దోపిడి ఏవిధంగా ఉందో చెప్పాడు. పొలం పనులు చేసేదప్పుడు వాళ్ళని తాకితే తప్పులేదు. పని అయిపోయిన తరువాత వాళ్ళని ముట్టుకోరాదు. పంట ధనికుల ఇళ్ళకు చేరుతుంది. శ్రమ వీరికి మిగులు తుంది.

స్వాతంత్ర్యం కోసం అందరూ అడిగారు. అది వచ్చాక కంతమందికే పరిమితం

చేసి, కొంత మందిని బానిసలుగా మార్చారు అదే విషయాన్ని ధర్మన్న "మాకు హక్కు లేదంట – స్వరాజ్యమెక్కడ దక్కు" అని ప్రశ్నించాడు

**"స్వరాజ్యమనుచు సర్కారుతో పోరాడి**
**స్వాతంత్ర్యము అడుగుతారు**
**మమ్ము స్వాతంత్ర్యము తాకనీరు**
**కూడి – నూతిలో తోడుకోనీరు**
**మాలలంటే లేను మయి లేనంటారు**
**మాకు హక్కు లేదంటి స్వారాజ్య మెక్కడ దక్కు?"**

స్వాతంత్ర్యం వచ్చాక దళితులను అంటరాని వారిగానే చూసారు. వారికి స్వేచ్ఛరాలేదు అని చెప్పాడు.

ఆనాటి సమాజ సరిస్థితులను కళ్ళకు కట్టినట్టుగా ధర్మన్న తన గేయంతో చూపించారు. అందరితోను చైతన్యం తీసుకొచ్చిన చైతన్య దీప్తి కుసుమ ధర్మన్న

* * *

 ISBN : 978-93-340-2436-4

7

# ధర్మ పథమెరింగిన దళిత సూరీడు

**డా. ర్యాలి శ్రీనివాసు**
తెలుగు అసిస్టెంట్ ప్రొపెసర్
వియస్ఎం అటానమస్ కళాశాల
రామచంద్రపురం – 533255 ఆం.ప్ర.

కుసుమ ధర్మన్న పూరించిన శంఖనినాదం నిత్య చైతన్య ప్రవాహమై... ఇప్పటికీ మన చెవుల్లో ధ్వనిస్తూనే ఉంది కదా! ఈ ధ్వని తరంగాలే సేవానిరతి, సంఘ సంస్కరణ వీటిని చాటే కలం ఘాటు తూటాలాంటి పత్రికాయుధం. ఆయా విషయాల ప్రధాన భూమిక ఏమైయుంటుంది. ఇప్పటికే చాలామంది దళిత రచయితలు, దళితేతర రచయితలు అవలోకించినా... ఇంకా పరికించి చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇలాంటి సందర్భంలో మరోసారి "దళిత బాంధవ ఘన కీర్తి – కుసుమ ధర్మన్న స్ఫూర్తి" మననం చేసుకోవడంలో మరిన్ని విషయాలు సువ్యక్తమయ్యే అవకాశం ఉందని నా భావన. ఇది ఒక్కడి ధీయుక్తి. సమానంగా పుట్టినా అంటరానితనం అంటగట్టి నలుగురిలోనూ స్వతంత్రంగా జీవించే హక్కునీయక దేశానికి స్వాతంత్ర్యం ఇమ్మని అడుగుతున్న అగ్రకులాల పెత్తందారీ విధానానికి చెంపదెబ్బే ఇతడి సాహసం. మాకొద్దీ తెల్లదొరతనమని గరిమెళ్ళ అనడాన్ని అవహేళన చేయడం కాదు...గానీ...అప్పటికే... వేళ్ళూనిన మాకొద్దీ నల్లదొరతనమనే ఎజెండా ఒకటి ఉందని సంఘసంస్కరణ జెండా ఎత్తి చూపుతున్నాడని గాంధీ వంటి కాంగ్రెస్ వాదుల దృష్టి ఇటుగా మళ్ళించిన సమర యోధుడేనని బోధపడింది కదా! గాంధి హరిజన వాడలను వెతుక్కుంటూ వచ్చి లోపలికి రావడానికి ముఖం చాటేస్తే హెచ్చరికల బళ్ళాలు పట్టి మరీ నిలబడిన వైనం ఆయన ధీరత్వాన్ని మనకు కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది కదా! ఏం చూడటానికి వచ్చారు. మీ వద్దకు వస్తే మా జీవన స్థితిగతులు ఏం తెలుస్తాయని గాంధీని ప్రశ్నించడం ఒక సమదృష్టి తాలూకు చైతన్య బావుటా కిశోర శౌర్యమే కుసుమ ధర్మన్న. ఇది వాడవాడలా ప్రతిధ్వనించింది అనాడే...ఆ వేళ్ళలోంచి తలలెత్తిన చైతన్యపు మొలకలు మహావృక్షాలుగా పెరగకుండా అడ్డుపడుతున్న అవకాశవాదాల మూలాల్ని సమూలంగా తునమాడాలన్నదే నేటి సదస్సుల యొక్క ప్రధానోద్దేశం! ఆ చైతన్యం కొరవడేందుకు ఇంకా పెత్తందారీ ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి!

**జీవిత విశేషాలు :** కుసుమ ధర్మన్న రాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపుపేటలో 1900 సంవత్సరం మార్చి 17న వీరాస్వామి నాగమ్మ దంపతులకు జన్మించారని మనకు తెలుస్తుంది. వీరి జనన తేదీ విషయాల్లోనూ స్పష్టత సంశయాత్మకమే! అయితే ధర్మన్న గారి రెండవ కుమారుడు మోహన్‌దాసుకు కలిగిన సంతానంలో రెండవ కుమారుడు శేఖర్ బాబు

మార్చి 17న పుడితే తాత పుట్టిన రోజునే పుట్టాడని కుటుంబ సభ్యులు అనుకోవడం, అలాగే మోహన్ దాస్ రెండవ కుమారుడుకి కూతురు కూడా అదే రోజు జన్మించిందని వారు చెప్పుకోవడంతో మార్చి 17 కుసుమ దర్మన్న గారి జననంగా మనం భావించాల్సి వచ్చింది.

చిన్నతనం నుండి చదువుతోబాటు సామాజిక విషయాల పట్ల అవగాహన కలిగిన ధర్మన్న ఆంధ్ర భాషతోబాటు సంస్కృతం, ఆంగ్లం, హిందీ, ఉర్దూ మొదలైన భాషల్లో పట్టు సాధించారు. మరీ ముఖ్యంగా థర్డ్‌ఫారం వైద్య విద్వాన్ చదువుకున్నారు.

కుసుమ ధర్మన్న మేనకోడల్ని పెద్దక్క మూడవ కూతురు వెంకట లక్ష్మీనారాయణమ్మను వివాహం చేసుకున్నారు. ఐదుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. కోర్లమ్మపేటలో ధర్మన్న 1100 గజాల స్థలంలోని ఇంటిలో నివాసం ఉండేవారు. కుసుమ ధర్మన్న (1900-1946) ఐదు దశాబ్దాల జీవితం అది పూర్తికాలేదు. కానీ సమాజాన్ని ఉద్ధరించేందుకు ఆయన చేసిన కృషి వేల సంవత్సరాలైనా తీరని ఋణం.

**కుసుమ ధర్మన్న రచనలు :** 1920 నిమ్న జాతి విముక్తి తరంగిణి, మాకొద్దీ నల్లదొరతనం 1921, నిమ్నజాతీయుల ఉత్పత్తి-1924 , మద్యపాన నిషేధం-1930, అసురపురాణం, హరిజన చరిత్ర-సంగ్రహణం, అంటరానివాని కథలు, మాలకాకి నవల, స్వస్థవృత్త (వైద్య గ్రంథం), హరిజన శతకం1933, మాలపోలయ్య, మాలవశాస్త్రి మాదిగసుబ్బయ్య వంటి తత్వ గ్రంథాలు కుసుమ ధర్మన్నకు ప్రతిరూపకాలుగా కనబడతాయి.

**కుసుమ ధర్మన్న - సామాజిక సేవ :** ఈయన సామాజిక సేవా తత్పరుడుగా మనకు కనిపిస్తారు. ఏ వ్యక్తి అయినా ప్రజలకు దగ్గరయ్యేది ఒక్క సేవ ద్వారానే.వైద్య విద్వాన్ విద్యభ్యసించి ఆయుర్వేద వైద్యునిగా తన సంపాదనను సైతం ఆర్తులకు పణంగా పెట్టాడు. ఈ కోవలోనే హరిజన కుటుంబాల్లో విద్య అవసరమని రాజమండ్రిలో పాఠశాల ఏర్పాటుకు ఎంతగానో కృషి చేసారు. దళిత విద్యార్థి సంఘాల ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించారు. 1920 నుండి 1937 కాలానికి దళితుల విద్యాభ్యాసం 43శాతానికి పెరిగిందంటే ఆనాడు సమాజంలో దళితస్థానాన్ని పెంచిన ఘనత ధర్మన్నకే దక్కుతుంది.

అలాగే ఆర్థికంగా ఎదుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాడు. దీనిలో భాగంగా దళితుల సమైక్యత, వారికి కలిగిన కష్టసుఖాలు పంచుకునే వేదిక అవసరమని దళిత కుటుంబాల పరిచయ వేదికలు అవసరమని వారందరినీ ఒక చోట చేర్చి కులభోజనాలు ఏర్పాట్లు చేసాడు. నేటి వనభోజనాలకు అంకురార్పణ ఆనాడే కుసుమధర్మన్న చేసారనడానికి ఇది ఒక ఉదాహరణ. సమాజాన్ని అభ్యుదయ పథంలోకి తీసుకురావాలంటే దళితులకు విద్య తప్పనిసరియని భావించాడు.

హరిజన బ్యాంకు తర్వాత కోఆపరేటివ్ బ్యాంకులకు స్ఫూర్తి అనేది మనం తెలుసుకోవచ్చు.

దళితుల ఆర్థిక స్వావలంబన కోసం హరిజన బ్యాంకును 1933లో ఏర్పాటు చేసి వారి ప్రగతిలో భాగస్వామ్యం పొందిన దాతృత్వశీలి ధర్మన్న. ఆదిశగా దళితులను నడిపించాలని, పనులు లేని రోజుల్లో హరిజనకూలీలు ఆ బ్యాంకునుండి ఋణాలు తీసుకుని తిరిగి చెల్లించేలా ఆనాడే చర్యలు చేపట్టిన ఆర్థికవేత్త. వారు డబ్బు దాచుకునే స్థలాలైన చూర్లు, కుండలు నుండి బ్యాంకులో పొదుపు చేసుకునే అవకాశం కోసం ప్రచారం చేసాడు. అవగాహన కల్పించడం వారి సొమ్ముకు భద్రతను ఇవ్వడం చేసాడు. అయితే ఇందుకు ప్రధాన కారణం ఏమంటే దళితులు తిరుగుబాటు చేసినప్పుడల్లా గుడిసెలు తగలపెట్టే పెత్తందారుల నుండి కష్టార్జితాన్ని దాచుకుంటే రేపటిరోజు బాగుంటుందని ఆనాడే ఆయన ఈ బ్యాంకులకు రూపకల్పన చేసాడు. ఈరోజు హరిజనవాడల్లో సంఘంలో డబ్బు నిల్వ ఉంచుకోవడం, సంఘ పెద్దలు కూలీలకు పనులు లేనిరోజుల్లో ఆర్థికంగా సాయం చేయడం జరుగుతూనే ఉంది. ఇది ధర్మన్న దళిత వాడలకు నేర్పిన జీవిత పాఠమే!

**కుసుమ ధర్మన్న సాహిత్యం :** 1920నాటికే కుసుమ ధర్మన్న కలం పట్టినట్టు మనకు తెలుస్తుంది. మాకొద్దీ నల్లదొరతనం అంటూ ప్రశ్నించే గొంతుకతో బయటకు వచ్చాడు. ఓపక్క జాతీయోద్యమం, మరోపక్క సంస్కరణోద్యమం నడుస్తున్న రోజులు అవి. గరిమెళ్ళ మాకొద్దీ తెల్లదొరతనం దేవా...అని మొదలెడితే ఇక్కడి అసమానతల గోతులు పూడ్చి అప్పుడు స్వాతంత్ర్య ఉద్యమం కోసం పాటుపడండయ్యా అని ఎద్దేవా చేసాడీయన. సామాన్యులకు అర్థమయ్యేలా సరళంగా వాడుక భాషలో మాకొద్దీ నల్లదొరతనం రచించాడు. తదుపరి నిమ్నజాతి ముక్తి తరంగిణి, నిమ్న జాతుల ఉత్పత్తి 1924, మద్యపాన నిషేధం 1930, హరిజన శతకం1933 రచనలతో సమాజాన్ని ఒక్కసారిగా కుదిపేసాడు. తొలి దళిత కవిగానే కాదు ఒక కవి ప్రత్యక్షంగా ఉద్యమ కవిగా వెలిసాడు.

అంటుదోషము మానరెలా... దాని విడుదలకై యింతపంతాము మీకేల? అంటూ ప్రశ్నించాడు.

**ధర్మన్న మంచి గాయకుడు**

**ఏకులమేకుల మేకులమని**
**వివరమడిగిన ఏమని దెల్పుదు నాకులము**
**లోకులకు పలుగాకులకు**
**ఏమని దెల్పుదు నాకులము?**

 ISBN: 978-93-340-2436-4

ఆధునిక వేమనగా కీర్తి గడించిన ధర్మన్న కవి జీవితం గురించిన సమాచార సేకరణలో సాహితీమూర్తులు ఇంకా కృషి సాగించాల్సి ఉంది. వారి కుటుంబాలకు చెందిన వారు మనకు అందుబాటులోనే ఉన్నారు కాబట్టి మరింత సేకరణకు ప్రయత్నం అవసరం. పద్యం గేయం, కథ నవల వ్యాసం వంటి ప్రక్రియల్లో రచనలు చేసిన సృజనాత్మకత కనబడుతుంది. జాతిని మేల్కొలిపే రచనలు చేయడమే కాదు వాడవాడలా తిరిగి ప్రచారం చేసిన ప్రజా కళాకారుడు కూడా!

1922లోని మాకొద్దీ నల్లదొరతనం గేయం, 1933లో రచించిన హరిజన శతకం గ్రంథాలలో మనువాదంతో పాటు అగ్రవర్ణ భూస్వాములు దళిత కూలీలపై సాగిస్తున్న దోపిడీని ప్రశ్నించారు.

**పన్నెండు మాసాలు పాలేరుతనమున్న**
**పస్తులబడి బ్రతకాలండి**
**.....**
**మా గుణము, ధనము చెఱచి కూడుతిన జూచేరు**
**నాముల పంట నంటగట్టి నట్టేట ముంచుదురు**

అని రైతులు దళితులపై జరుగుతున్న ఆర్థిక దోపిడీని వివరిస్తాడు. కర్షక సాహిత్యపు ధ్వని వినిపించాడు.

వ్యవస్థలో లోపాలు క్రమక్రమంగా బయటపెట్టే ఆలోచన ఈయన రచనల్లోనే కనిపిస్తుంది, చరిత్రలో ఆనవాళ్ళు వేళ్ళూనేలా చేసిన చరిత్రకారుడు ధర్మన్న. నిమ్న కులాలకు చెందిన చరిత్ర యుగయుగాలుగా అనుభవిస్తున్న స్థితిని విభజించి రచనల్లో పొందుపరిచాడు.

ఒక స్థాయికి చేరాక రచయితలో తాత్త్వికత గోచరిస్తుందంటారు గానీ... కుసుమ ధర్మన్న రచనల్ని తాత్త్విక దృష్టితో చూస్తే ఆయన జీవన పోకడంతా తాత్త్వికతతోనే నిండి ఉంటుంది. ప్రతి విషయంలోనూ ఆలోచనాత్మక దృక్పథం నెరపిన మహామనిషిగా మనకు సాక్షాత్కరిస్తాడు.

## ధర్మన్న సంస్కరణ వాదం

ఓ ప్రక్క బ్రహ్మసమాజం, మరోపక్క కందుకూరి సంస్కరణోద్యమ ప్రభావంతో స్పందించిన ధర్మన్న నిమ్న కులాల ఉద్ధరణకై నడుంకట్టాడు.

***కుసుమ దర్మన్న అంబేద్కర్ ఉద్యమాలకు గోదావరి ప్రతినిధి. అంబేద్కర్ ప్రతిబింబమే*** అంటారు ఎండ్లూరి సుధాకర్.

 ISBN : 978-93-340-2436-4

దళితులకు మతంతో పనిలేదు. ఆత్మగౌరవం ముఖ్యం. ఇది ధర్మన్నగారి వాదం. సంఘ సంస్కరణ అనేది మతంతో రాదనేది నిర్వివాదం. కులాలు మతాలు మానవాళి శ్రేయస్సు కంటే కష్టాలు తెచ్చిపెడతాయంటారు. శాస్త్రాలు–శాసనాలు అంటూ దళితులను సవర్ణులు ఎలా మోసం చేస్తున్నారో తెలియజేసాడు.

నల్లదొరతనం వద్దనడంలో చేసిన సాహస వాక్యాలు.....

**మాల పాలు మందూలు చాలా తాగేరు**
**మాల పాలు నీళ్ళని మానలేరు**
**మాల చనుబాలు మందుకడిగేరు**
**అసమానతల లోకంలో ఇదేంటి మరి!**
**మాలలతో పొత్తు లేకుండా మసలలేరు అంటూ**
**మాలలంటితేను మైలవునంటారు**
**హక్కు మాలలడుగరాదంటారు**....అని ఎద్దేవా చేసారు

సంస్కరణలో మొదట విద్య, వ్యసనాలు మానడం. సమానత్వ పోరాటం. ఆయన గుఱ్ఱపుబగ్గీపై వెడుతుంటే చుట్ట కాల్చేవారు సైతం పక్కన పడేసి లేచి నిలబడి గౌరవించేవారు. మద్యపానం విడనాడాలంటూ ఎన్నో ప్రసంగాలు వాడల్లో చేసారు.

**పత్రికా రంగం :** ఇతర కులాల వారికి పత్రికతో పనిలేదు. వారికి ప్రభోదము అవసరము లేదు. జాతి దాస్యవిముక్తి ప్రధానంగా ఈ పత్రిక నెలకొల్పబడినది. ప్రజలను విద్యావంతుల్ని చేయడం, కూడకట్టడం, సంఘముల ఏర్పాటు, సంఘీభావం కుదర్చడం పోరాట వీరుల్ని తయారు చేయడం వంటివి ఈ పత్రిక ద్వారా సాధ్యపడతాయని ఆలోచించి ఆర్థికంగా స్థోమత లేకపోయినా జయభేరి స్థాపించారు. 1936లో రాజమండ్రిలో దీనిని ప్రారంభించారు. అంతకుముందు అంబేద్కర్ పిలుపునందుకుని నాగపూర్ సమావేశానికి హాజరయ్యాక ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. పత్రిక కోసం బర్మా దేశం వెళ్ళి ఉపన్యసించిన డబ్బు, అక్కడి వారి ఆర్థిక సహాయం ఈ పత్రికకు ఆర్థిక పరిపుష్టి చేకూర్చారు. మొదట గాంధీ సిద్ధాంతాలకు చేరువైనా దానికంటే జాతి దాస్య విముక్తికి అంబేద్కర్ వాదమే నిజమైనదని నమ్మి జయభేరి నడిపినట్టు మనకు కనిపిస్తుంది.

నిజాం రాష్ట్రంలో మాదిరి భాగ్యరెడ్డి వర్మ ప్రారంభించిన పంచమం, భాగ్యనగర్, ఆదిఆంధ్ర, ఆది హిందూ వంటి పత్రికలు హరిజనోద్యమానికి ఊపిరి పోసాయి. ఇదే జయభేరికి మరింత ఊపునిచ్చాయి. 1938లో బోయి భీమన్న గారూ ఒక ఉద్యమంలా పత్రికలో రచనలు చేసారు. ఆకాలంలో పిపాసి అనే కలం పేరుతో కథలు రాస్తే అతణ్ణి

 ISBN: 978-93-340-2436-4

పట్టుకుని కొట్టి గోదాట్లో పాడేయండి అని బ్రాహ్మణ వర్గాలు శపథాలు పూనాయని భీమన్న రాసుకొచ్చారు.

**ముగింపు :** దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగు సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో బలమైన ముద్ర వేసిన కుసుమ ధర్మన్న ప్రభావం జాషువా, జాలారంగ కవి తదితరులపై స్పష్టంగా కనబడుతుంది. జాషువా, భీమన్న వంటివారు ధర్మన్న ఇంటికి వెళ్ళి చర్చోపచర్చలు జరిపేవారు.

**సామాజిక సత్యశీలత :** ధర్మన్న రచనల్లో కనబడేది ఇదే! సమాజాన్ని జాగృతం చేయడానికి విద్య చాలా అవసరం. వ్యసనాలనుండి ప్రజలు బయటపడాలి. చైతన్యవంతులు కావాలి. అగ్రవర్ణాల ఆధిపత్యం ఒక్కవిద్యతోనే సాధ్యపడుతుంది. శుభ్రత చాలా అవసరం. మొత్తం 9 రచనలు ఉన్నా 5మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పత్రికలో సామాజిక జాడ్యాలు ఎండగట్టే పనిపట్టారు. గొప్ప గొప్ప రచయితలు దీనిలో రచనలు చేసారు. ఉన్నదాన్ని ఉన్నట్టుగా నిర్భయంగా చెప్పడమే సత్యశీలతకు తార్కాణం దీనివల్ల సమతావాదం వస్తుందని భావించి ఆయన స్వజనులనుద్దేశించి అనేక ఉపన్యాసాలు ఇచ్చారు. ఇందుకోసం ఆస్తులు పణంగా బెట్టడంతోపాటు తన ప్రాణాలను అంకితం చేసారు. నిజంగా ఆయన ధర్మపథంబెరిగిన దళిత సూరీడు అని చెప్పాల్సిందే!

ఆధార గ్రంథాలు

1. తొలి దళిత స్ఫూర్తి –కుసుమధర్మన్న వ్యాసాలు
2. కుసుమ దర్మన్న జీవిత ప్రస్థానం – డా.పుట్ల హేమలత
3. ప్రస్థానం పత్రికా వ్యాసం.

8

# దళితోద్యమ వైతాళికుడు

**డా.తలారి వాసు,**
తెలుగుశాఖ
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం,
రాజమహేంద్రవరం.

దళిత జాతి అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితమిచ్చిన కవి కుసుమ ధర్మన్న.ఆయన నడకలతో గోదావరితీరం పునీతమైంది.ఆ రోజుల్లో సమాజంలో ఉన్న అడ్డంకులను అధిగమించి వైద్య విద్వాన్ అభ్యసించి వైద్యుడయ్యారు.తన వృత్తినే కాకుండా ప్రవృత్తిని ప్రజలకు అంకితమిచ్చారు. విలక్షణ గాత్రంతో ప్రజలను చైతన్యవంతుల్ని చేసి ఉత్తేజపరిచారు.సుందరమైన జీవన మార్గాన్ని చూపించి దిక్సూచిగా నిలిచారు. ఆయన రచనలన్నీ తోటి ప్రజల జీవితాన్ని చక్కదిద్దేందుకు, మెరుగుపరిచేందుకు, ఉత్తేజపరిచేందుకు. ఆయన రచించిన గేయాలు అణగారిన ప్రజల స్వరాలు.ఆయన జీవితం ఒక ఆదర్శం. ఆచరణీయం. పాలకుల కుటిలత్వాన్ని బట్టబయలు చేసిన ధీశాలి. మార్గదర్శకుడు.

అక్షరాలను బూడిద చేసినా ఉద్యమ పోరాటానికి, అక్షరశక్తికి మరణముండదు. కుసుమ ధర్మన్నది తెలుగు సాహితీలోకంలో ఒక వీరగాథ. ఆయన దళిత చైతన్య భానుడు. మాటలను తూటాలుగా మలచటం తెలిసిన కవి వీరుడు.ఇంటిపేరు చాలా మెత్తనిది.వంట పట్టించుకున్న ఉద్యమం మాత్రం చాలా తీవ్రమైంది.

దళిత రచయితలు తమ స్వీయానుభావాలను నిష్కర్షగా ప్రకటించటం వరకు పరిణమించిన క్రమంలో కుసుమ ధర్మన్న ఏర్పరచిన మార్గం, కృషి భావి రచయితలకు సరైన మార్గాన్ని సుగమం చేసింది కూడా.

“ఆలకింపుమయ్య హరిజనుండ” అనే మకుటంతో సాగిన హరిజన శతకం ఒకనాటి అంటరాని కులాలలో చైతన్యం నింపడానికి రచించిన చైతన్య సాహితీ మాలిక. హరిజన శతకం పేరుతో రాసిన ఆ పద్యాలన్నీ అంటరాని కులాల పుట్టుక, దోపిడీకి గురవుతున్న తీరు, వివిధ పద్ధతుల్లో వివక్ష, కర్తవ్యబోధ వంటి అంశాలకు అక్షర రూపం. ఒకరకంగా చెప్పాలంటే కుసుమ ధర్మన్న దళితుల కోసం ఆనాడు రచించిన ఉద్యమ మేనిఫెస్టో హరిజన శతకం.

మాకొద్దీ నల్ల దొరతనం... అంటూ గర్జించిన గేయంలో దళితుల ఆక్రందన, ఆవేదనను వ్యక్తం చేశారు. ఎన్నో ప్రశ్నలను లేవనెత్తారు. కుసుమ ధర్మన్న కవి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి వాస్తవ్యులు. 1900 సంవత్సరంలో జన్మించారు. 1921లో గరిమెళ్ళ సత్యనారాయణ మాకొద్దీ తెల్లదొరతనం అంటూ పాడిన గేయానికి ప్రతిగా మాకొద్దీ నల్ల

 ISBN: 978-93-340-2436-4

దొరతనమంటూ ధర్మన్న రాసిన ఈ గీతం తెలుగు నేలంతా ప్రతిధ్వనించింది. విద్యావంతులైన దళితులనే కాకుండా దళితేతర ప్రజాస్వామిక వాదుల్ని కూడా ఆలోచింపజేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే కుసుమ ధర్మ తొలి తెలుగు ప్రజా వాగ్గేయకారుడు. దళిత ఉద్యమ వైతాళికుడిగా కూడా కొంతమంది ఆయన్ని అభివర్ణించారు. కానీ తెలుగు సాహిత్య చరిత్రలో ఆయన పేరు మనకి పెద్దగా ఎక్కడ కనిపించదు. గొప్ప కవి, సంస్కర్త, పోరాట యోధుడైన ధర్మన్న రచనలన్నీ సాహిత్య సామాజిక కళా సాంస్కృతిక దళిత వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో 2016లో ధర్మన్న సాహితీ సమాలోచన సందర్భంగా ప్రచురణలోనికి తీసుకొచ్చారు. ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురించిన ఈ పుస్తకాలన్నీ ప్రస్తుతం సాహిత్య లోకానికి అందుబాటులో ఉన్నాయి. చరిత్ర పుటల్లో ఒక ఉద్యమ రూపంగా ఉన్న వ్యక్తులు, వారి సాహిత్యాన్ని పునరాలోచన చేయటం సామాజిక చైతన్యానికి చాలా అవసరం కూడా.

తొలితరం దళిత కవుల్లో చాలా ప్రాధాన్యాన్ని పొందిన వారు కుసుమధర్మన్న. అంబేద్కర్ సాంఘిక విప్లవ పోరాటాన్ని ఆకలింపు చేసుకున్న వారిలో వీరు ప్రథములని చెప్పొచ్చు. అంబేద్కర్ ఆంధ్రరాష్ట్ర పర్యటన చేసినప్పుడు ధర్మన్నగారి చేత ప్రభావితమైన వర్గం ఆయనకు బ్రహ్మరథం పట్టింది. హరిజన శతకంతో పాటుగా సుదీర్ఘమైన యాభైఆరు చరణాలు కలిగిన నల్లదొరతనం పాట సమాజాన్ని చాలా ప్రభావితం చేసింది. మాకొద్దీ తెల్ల దొరతనం గేయానికి ఎంత ఆదరణ లభించిందో మాకొద్దీ నల్లదొరతనానికి కూడా అంతే ఆదరణ, ప్రాధాన్యం ధర్మన్నకు లభించింది. దళితులు దారుణ జీవన స్థితి నుంచి కోలుకునే వరకు ఈ భావజాలం శిరోధార్యమైంది. తెల్ల దొరతనం గేయం స్వాతంత్ర్యం సమపార్జించు కోవడంతో దాని అవసరం తీరింది. నల్ల దొరతనం పాటకు ఇంకా జీవం ఉంది. దాని అవసరం కూడా సమాజానికి ఉంది. జయభేరి అనే వార పత్రికను స్థాపించి దళితుల స్థితిగతుల్ని, వారి కోరికల్ని దాని ద్వారా వ్యక్తం చేశారు. ఆ పత్రిక సాంఘిక చైతన్యాన్ని, రాజకీయ అవగాహన తీసుకురావడానికి ఎంతో దోహదం చేసింది. ఆ రోజుల్లో అంబేద్కరిజానికి అద్దం పట్టిన పత్రిక జయభేరి. దానికి సహాయ సంపాదకులుగా కొన్నాళ్లు బోయి భీమన్న గారు కూడా సేవలందించారు.

నల్లదొరతనం గేయం లో చిలకమర్తి లక్ష్మీనరసింహం, కందుకూరి వీరేశలింగం, మంగిపూడి వెంకట శర్మ మొదలైన వారు కొంతమందైనా సంఘసంస్కరణాభిలాషులు దళిత జాతి ఉద్ధరణకు కృషి చేయటాన్ని ఆయన మెచ్చుకున్నారు. గాంధీజీ అంటే విపరీతమైన అభిమానం ఉండడం వల్ల ఆయన హరిజనోద్ధరణ కార్యక్రమం కొంతవరకు మార్పుకు అవకాశం కల్పించిందని చెబుతారు. స్వార్థాన్ని తెగించి సోదర ప్రేమను పంచమని, అంటరానితనాన్ని మంటగలిపి అందరం ఒకటిగా బ్రతుకుదామని అభ్యర్థన ఈ గేయం నిండా మనకు కనిపిస్తుంది. ఆ రోజుల్లో దళిత ఉద్యమానికి బాటలు వేసిన గీతంగా మనం

 ISBN: 978-93-340-2436-4

దీనిని చెప్పుకోవచ్చు. దళిత సాహిత్యం ఉద్యమరూపాన్ని సంతరించుకోటానికి పదును పెట్టిన మొదటి కవి మాత్రం కుసుమధర్మన్న. సమాజంలో వర్ణ వివక్షత ఉన్నంతవరకు ఈ గేయానికి సముచిత స్థానం ఉంటుంది.

హరిజన శతకంలో హరిజనుల దీనగాథను పద్యాల రూపంలో చెప్పి పాఠకులను మెప్పించారు. వ్యవస్థలో ఉండే అవస్థలు, దుర్మార్గ పరిణామక్రమాలను బయటపెట్టిన వ్యక్తి ధర్మన్న. అందుకే ఆయన రచనలు చరిత్ర ఆనవాళ్లుగా మిగిలాయి. క్రమబద్ధమైన దళిత జీవనల చరిత్రను యుగయుగాలుగా విభజించి రచనలు చేయటం అందరికీ సాధ్యమయ్యే పని కాదు. వెతలతో జీవితాన్ని సాగించే సజీవ సాక్ష్యాలైన వారి జీవితాలపై రచనలు చేయడం అంత తేలికైంది కాదు. అది ఆ వర్గంలోనే పుట్టి ఆ బాధలన్నీ పడ్డ వాళ్లకే అవి తెలుస్తూ ఉంటాయి. అప్పుడే ఆ రచనలో జీవం ఉండటానికి కారణం అవుతుంది.

నిమ్నజాతి విముక్త తరంగిణి,నిమ్న జాతుల ఉత్పత్తి, మద్యపాన నిషేధం, అసుర పురాణం, మాకొద్దీ నల్ల దొరతనం, హరిజన శతకం, అంటరాని వాళ్ళు కథలు, మాల కాకి నవల ఇవి కుసుమ ధర్మన్న సాహిత్య పరమైన రచనలు. దళితులు మధ్య సంభాషణలే అంటరాని వాళ్ళు కథలలోని సారాంశం. సామాజిక సాహిత్య శాస్త్ర కోవలో ధర్మన్న రచనలు చేశారు. అయితే ప్రధానంగా మాకొద్దీ నల్ల దొరతనం, హరిజన శతకం ఈ రెండు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. అమానుషమైన అసమానతల రక్త కన్నీటిలోనుంచి జాలువారిన కవితా బిందువు హరిజన శతకం. భాష తేలికగా భావ తీవ్రత కలిగిన రచనలుగా ఈ రెండింటిని చెప్పుకోవచ్చు. చారిత్రక సామాజిక పరిణామ చిత్రణ మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. సమాజాన్ని, దళితులను మేల్కొలిపే లక్ష్యంతోను, తన దళిత ఉద్యమ ప్రయాణానికి బాసటగాను ఈ రచనలు నిలిచాయి.

కుసుమ ధర్మన్న గారి రచనల గురించిన అంశాలన్నిటిని చర్చించటానికి ఒక జాతీయ సదస్సును, కవిసమ్మేళనాన్ని నన్నయ విశ్వవిద్యాలయంలో జరపటం కుసుమ ధర్మన్న పేరుని, ఆయన సాహిత్యాన్ని, కృషిని, నాటి ఉద్యమ చైతన్యాన్ని తెలుగు పాఠకులకు, విద్యార్థులకు అందించటానికి జరిగే ప్రయత్నం. చరిత్ర పుటల్లో ఒక ఉద్యమ రూపంగా ఉన్న వ్యక్తులు, వారి సాహిత్యాన్ని పునరాలోచన చేసుకోవటం సామాజిక చైతన్యానికి అవసరం. అటువంటి సాహిత్యాన్ని పునఃస్మరించుకోవటం చారిత్రక అవసరం కూడా.

* * *

 ISBN: 978-93-340-2436-4

# 9 కుసుమ ధర్మన్న హరిజన శతకము - ఒక విశ్లేషణ

**డా॥ చాట్ల కిశోర్**
తెలుగుశాఖ,
కాకాని వేంకటరత్నం కళాశాల,
నందిగామ. సెల్ : 9866820524

**నివసుధ హిందూ దేశ వాసుండవై పుణ్య**
**భారతాంబ ముద్దు పట్టివయ్యు**
**నూరు పేరు లేక నుండెద వదియేల**
**నాలకింపునయ్య హరిజనుండు**

భరతమాత ముద్దు బిడ్డవై, పవిత్ర హిందూ దేశ వాసుడవై ఊరు పేరు లేకుండా, ఎందుకు ఇలా బల హీనుడిలా బానిసలా బ్రతుకుతున్నావని నిలదీసి ప్రశ్నించిన తొలి తెలుగు దళిత కవి కుసుమ ధర్మన్న. గాంధీజీ స్ఫూర్తితో అంబేద్కర్ అడుగు జాడలలో పయనిస్తూ 'నిమ్న జాతుల అభవృద్ధి' అనే ఆశయానికి కంకణ బద్ధుడై ముందుకు సాగిన వాడు ధర్మన్న. హరిజనోద్ధారకులైతే మా పేటలకు వచ్చి ఇక్కడ మాట్లాడాలని గాంధీజీకే సవాలు విసిరి, దళితుల ఆత్మగౌరవాన్ని చాటినవాడు కుసుమధర్మన్న. ఆంధ్రుల సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో 1900 మార్చి 17న వ్యవసాయ కూలీలైన కుసుమ వీరాస్వామి నాగమ్మ దంపతులకు జన్మించి, ఆది ఆంధ్ర జూనియర్ ఎలిమెంటరీ పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదివాడు. తర్వాత థర్డ్‌ఫారం వరకు చదువుకుని, ఆయుర్వేద వైద్య విద్వాన్ పట్టా పొందాడు. తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం సంపాదించి, చదువుకునే రోజుల్లోనే కందుకూరి వీరేశలింగం పంతులు సంఘ సంస్కరణ విధానాలచేత ప్రభావితుడైనాడు.

ఈ అవగాహనతోనే ఆయుర్వేద వైద్యుడిగా, ప్రజలకు సేవచేస్తున్న కుసుమ ధర్మన్న జీవితంలో మేలిమలుపు గుడివాడకు చెందిన ప్రముఖ హరిజనోద్యమ నాయకులు గూడూరి రామచంద్రరావు గారితో పరిచయం. గూడూరి రామచంద్రరావు గారు అప్పటికే సేవాశ్రమాలు స్థాపించి గాంధీజీ భావాలను ప్రచారం చేస్తున్నారు. గుడివాడ సేవాకేంద్రంలో చేరిన ధర్మన్న జాతీయవాద దృక్పథాన్ని అలవరచుకొన్నారు. అలాగే తన గురువు రామచంద్రరావు గారు పంచముల కోసం తన జీవితాన్ని త్యాగం చేసివారి సర్వతోముఖాభివృద్ధికి అవిశ్రాంతంగా పనిచేయడం ధర్మన్నను ఆకర్షించింది. బందరు కాపురస్తులు వేమూరి రాంజీరావు, వెల్లంకి

కృష్ణమూర్తి వంటి హరిజనోద్ధారకుల సాంగత్యంలో ధర్మన్నకు తన జీవితలక్ష్యం స్పష్టంగా అర్థమైంది.

1917 లో జరిగిన ఆది ఆంధ్రమహాసభకు కుసుమధర్మన్న జీవితంలో ప్రముఖ స్థానం ఉంది. 20వ శతాబ్దం మొదటి పాదం నుండే సమాజంలో చైతన్యం ప్రారంభమైంది. కులం పేరుతో జరుగుతున్న అకృత్యాలు, అస్పృశ్యత, నిదానంగా ప్రజలకు అర్ధమౌతున్నాయి. నాటి కులవ్యవస్థ మీద, బ్రాహ్మణాధిక్యత మీద మహాత్మ జ్యోతీరావు పూలే చేసిన తిరుగుబాటు, ముఖ్యంగా గులాంగిరి వంటి రచనల ద్వారా ప్రచారం చేసిన భావాలు, వేసిన ప్రశ్నలు ప్రజలలో ఆలోచనలను రేకెత్తించాయి. అదే సమయానికి ఆంధ్రదేశంలో కందుకూరి, రఘుపతి వేంకటరత్నం నాయుడు స్త్రీవిద్య, వితంతు వివాహం, మూఢనమ్మకాల నిరసన వంటి కార్యక్రమాలతో సమాజాన్ని మేల్కొలిపారు. ఒక ప్రక్క క్రైస్తవ మిషనరీల మూలంగా పంచములలో విద్యా వ్యాప్తి జరిగి, భాగ్యరెడ్డి వర్మ వంటి ఆలోచనాపరులు బయలుదేరారు. భాగ్యరెడ్డి వర్మ 1906 లోనే హైదరాబాదులో జగన్ మిత్రమండలి స్థాపించి 1910 నాటికి అనేక పాఠశాలలు నెలకొల్పారు. 1911లో మాన్య సంఘం ఏర్పాటు చేశారు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని పంచమ జాతుల్లోనే కాక మేధావుల్లో కూడా భాగ్యరెడ్డి వర్మ ప్రముఖుడయ్యాడు. ఈ సందర్భంలో 1917లో విజయవాడ వేదికగా జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో మహాసభలు జరిగాయి. అవి విజయవంతం కావడంతో ఆది ఆంధ్ర మహాజనసభ జరపాలనే ఆలోచన ఆనాటి హరిజనోద్యమ నాయకులకు కలిగింది. ఆనాటి ప్రముఖ జాతీయవాది శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు ఈవిషయాన్ని తెలియజేస్తూ నిమాంటేగ్యూగారు మద్రాస్ వచ్చుచున్నందున, ఆయనను పంచముల ప్రతినిధులు కలుసుకొని శాసన సభలలో పంచములకు ప్రత్యేక స్థానం కావలెనని అడుగుటకూ, పంచముల ఇక్కట్ల నివారణ గూర్చి అడుగుటకు ఆంధ్ర పంచముల సభ యొకటి బెజవాడలో చేద్దామని వీరందరూ మా ఇంటిలోనే సమావేశమై నా సలహా మీద నిశ్చయించారు – అన్నారు. ఆనాటి సమావేశంలో పాల్గొన్న నాయకులు రాయుడు గంగయ్య, చుంద్రు వెంకయ్య, అత్తిలి సూర్యనారాయణ, వరాలశెట్టి దేవేంద్రుడు, చింతాశేషయ్య, కుసుమ వేంకటరామయ్య, మంగళగిరి రాఘవదాసు, నూతక్కి వేంకటేశ్వర్లు. వీరందరి అభిప్రాయం ప్రకారం ఆసభకు అధ్యక్షత వహించుటకు హైదరాబాద్ నుండి ఆది ఆంధ్ర నాయకుడైన భాగ్యరెడ్డి వర్మను తీసుకురావడం జరిగింది. ఈ సభ జరిగిన మూడు రోజులు, 1917 నవంబరు 4,5,6 తేదీలలో భాగ్యరెడ్డి వర్మతో కుసుమ ధర్మన్న కలిసే వున్నాడు. ఆ సభలోనే పంచములను ఆది ఆంధ్రులుగా మార్చాలనే తీర్మానం జరిగింది. 1922 నాటికి మద్రాసు ప్రభుత్వం 'పంచమ' అన్న పదానికి బదులుగా తెలుగు జిల్లాలలో ఆది ఆంధ్ర అని, తమిళ జిల్లాలలో ఆదిద్రావిడ అనే మాటను వాడాలని ఆర్డరు జారీచేసింది.

 ISBN : 978-93-340-2436-4

కుసుమ ధర్మన్న భాగ్యరెడ్డి వర్మతో కలిసి 1919లో మచిలీపట్నంలోనూ, 1920లో గుడివాడలోనూ, 1921లో ఏలూరు, భీమవరంలలోనూ జరిగిన మహాసభల్లో పాల్గొన్నాడు. ఈ సమయంలోనే గరిమెళ్ళ గేయం స్ఫూర్తితో మాకొద్దీ నల్ల దొరతనం రాశాడు. ఈ విధంగా 1917 నుండి 1938 వరకు జరిగిన ఆది ఆంధ్ర మహాసభలకు ప్రాతినిధ్యం వహించి ఒక ప్రముఖ నాయకుడిగా ఎదిగాడు.

రెండో రౌండ్‌టేబుల్ సమావేశం సెప్టెంబరు 7, 1931 న లండన్‌లో ప్రారంభమైంది. ఈ సమావేశ ప్రధాన కార్యక్రమం అల్ప సంఖ్యాక వర్గాలపై నియమించిన రెండు కమిటీలు నిర్వర్తించాయి. మహాత్మా గాంధీ ఈ రెండు కమీటీలలో సభ్యులు. రెండవ రౌండ్‌టేబుల్ సమావేశం తర్వాత బాబాసాహెబ్ డా॥ బి. ఆర్. అంబేద్కర్ అభ్యర్థన మేరకు అణగారిన వర్గాలకు కమ్యూనల్ అవార్డు ఇవ్వడానికి బ్రిటీష్ ప్రభుత్వం అంగీకరించింది. హిందూ సమాజాన్ని విడదీస్తుందని భావించిన గాంధి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎర్రవాడ జైలులో నిరవధిక నిరాహారదీక్ష చేశాడు. 1932 సెప్టెంబరు 24న అంబేద్కర్‌తో పూనా ఒప్పందం చేసికొని దీక్ష విరమించాడు. తర్వాత జరిగిన పరిణామాలను పురస్కరించుకొని, సమాజంలో అంటరాని తనాన్ని తొలగించడానికి గాంధీ 1932 సెప్టెంబరు 30న ఆల్‌ఇండియా యాన్టీఅన్టెచ్చబిలిటి లీగ్ ను స్థాపించాడు. దానిని 1932 అక్టోబరు 30న హరిజన సేవక్ సంఘ్‌గా మార్చి దాని ద్వారా దేవాలయాలు, పాఠశాలలు, రోడ్లు, నీటి వనరుల వంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు ప్రభుత్వస్థలాలను డిమాండ్ చేశాడు. అలాగే అణగారిన వర్గాలకు సహాయం చేయడానికి, కులాంతర వివాహాలు, భోజనాలు నిర్వహించడానికి, దేశవ్యాప్తంగా అనేక పాఠశాలలు, వసతి గృహాలు నిర్మించడానికి ఈ సంస్థ పూనుకొన్నది. హరిజనులకు దేవాలయ ప్రవేశం అనే కార్యక్రమం కూడా ఈ హరిజన సేవక్ సంఘ్‌లో భాగమే. 1939 జూలై 7న ఏ వైద్యనాథ్ ఆధ్వర్యంలో తమిళనాడుకు చెందిన హరిజన సేవక్ సంఘ్ మధురమీనాక్షి ఆలయంలోకి ప్రవేశించింది.

– ఇటువంటి నేపథ్యంలో కుసుమ ధర్మన్న హరిజన శతకం రాయడం జరిగింది. 1933లో రాసిన ఈ శతకంలో గాంధీజీనే కథానాయకుడిగ కన్పిస్తారు. దీనజన బాంధవుడు, దివ్యతేజోమూర్తి గాంధీ అవతరించి, కరుణ నుంచి అంటూ గాంధీజీని పొగిడి అంత్యజాతి వారి అణచివేతను నిరసించిన వానిగ గాంధీని గుర్తించాడు ధర్మన్న.

ఆలకింపుమయ్య హరిజనుండు అనే మకుటంతో రాసిన ఈ శతకం నాటి పంచముల దుర్గతికి అద్దం పట్టింది. ఈ శతకానికి ముందు మాటలుగా రెండు మాటలు రాసిన ధర్మన్న నిస్వకులమునకాపాదించిన హైన్యత హృదయమునకు నాటి వేదించుటచే దానిని నివారించుటయే జీవితంగా నెంచి ఈ శతకమును నాశక్తి కొలది వ్రాసితినే గానీ, నాకు

పాండిత్యము గలదనియు, సంఘ సంస్కరణము నందు జ్ఞానము గలదనియుగాదు, విద్యావిహీనులగు నా జాతీయులకు ఇది తేటతెల్లముగా నర్ధమగుటకును, రసపుష్టి కొఱకును అవసరమని తోచినచోట్ల భాషా సంధి నియమములను పాటించటలేదని స్పష్టంగా పేర్కొనారు. అలాగే ఈ శతకాన్ని చదువదలచిన వారికి హరిజన శబ్దం అనేక ప్రాంతాల్లో అనేక రకాలుగా పిలువబడుతుందని, ఆయా ప్రాంతాల వారి కనువుగా చదువుకోవచ్చు అంటూ సూచించారు. అలాగే తన జాతిని తరుణము మించకుండా మేలుకొని జన్మహక్కులకోసం పోరాటం చేయాలని, హక్కులకోసం ప్రాణాలను సైతం కోల్పోవడం ద్రోహం కాదని, స్వర్గపథమని విశ్వసించాలని హెచ్చరించాడు. ఇతరులు ధన, మాన, ప్రాణాలను హరించి బ్రతకడం పాపం అని భావించే వారు ధన్యులు. అటువంటి నిస్వార్ధపరులను తన శతకాన్ని అంకితం చేస్తున్నానని తెలియజేశారు.

శతకం ప్రారంభంలోనే ఈ దేశపు పంచముల అవస్థల పట్ల దేశమాత దుఃఖిస్తుందని చెప్పడం ధర్మన్న దేశభక్తికి నిదర్శనం. ఈ శతకంలో 109 ఆటవెలది పద్యాలు ఉన్నాయి. కుసుమ ధర్మన్న కవితా ధర్మాలను గురించి వివరిస్తూ కవిత్వంలో మృదుత్వం, భావవ్యక్తీకరణలో సూటిదనం, పదప్రయోగంలో అర్ధగాంభీర్యం, పీడిత ప్రజల పట్ల ప్రగాఢ ప్రేమానురాగం, కిరాతకమైన వైదిక సాంఘీక వ్యవస్థ పట్ల పట్టరాని ఆగ్రహం, హేతుబద్ధమైన తార్కిక దృక్పథం, సామాజిక పరిస్థితుల్ని గూర్చి నిశితమైన అవగాహన, ఇవే ధర్మన్న కవితలో విశిష్టమైనవి అంటాడు సి.వి. ముఖ్యంగా నాటి సమాజంలోని దురాగతాలను ఖండించడానికి కుసుమధర్మన్న శతక ప్రక్రియను ఎన్నుకోవడంలోనే గొప్ప వ్యూహం ఉంది. సమాజంలోని అవకతవకలను ఎలుగెత్తి చూపడానికి శతక ప్రక్రియ దోహదం చేసింది.

తెలుగులో శతక వాఙ్మయ చరిత్రను ఈ సందర్భంగా ఒకసారి స్మరించుకోవాలి. ఈ ప్రక్రియలో వృషాధిప శతకం మొదటిది. దీని కర్త పాల్కురికి సోమనాధుడు. తర్వాత కాలంలో ఎన్నో భక్తి, వేదాంత, వైరాగ్య, నీతి, శృంగార, హాస్య, ప్రకీర్ణ, అధిక్షేప శతకాలు వచ్చాయి. శతకంలో సంఖ్యా నియమం, మకుటనియమం, ఛందోనియమం, రసనియమం, ఇతి వృత్త నియమం, ఆత్మాశ్రయ కవితా ధర్మం వంటి లక్షణాలు తప్పని సరిగా ఉంటాయి. హరిజన శతకం అధిక్షేప శతకాల కోవకు చెందినది.

ఈ అధిక్షేప శతక కర్తలలో, క్రీ.శ. 17వ శతాబ్దికి చెందిన కవి చౌడప్ప అగ్రగణ్యుడు. తరువాత కూచిమంచి తిమ్మకవి, బర్గ, కుక్కుటేశ్వర శతకాలను రచించాడు. ఇందులో సమకాలీన రాజుల ప్రవర్తనలను, సాంఘీక దురాచారాలను ఖండించాడు. ఇదే అంశాన్ని స్వీకరించి కూచిమంచి జగ్గ కవి భక్తి మందార శతకం రాశాడు. అటువంటిదే అడిదము సూరకవి రాసిన రామలింగేశ్వర శతకం. తర్వాత కాలంలో వీరి అడుగు జాడల్లో నడుస్తూ

 ISBN: 978-93-340-2436-4

వేణుగోపాల శతకం, చంద్రశేఖర శతకం, మదనగోపాల శతకం వంటివి వచ్చాయి. ఈ కోవలోనిదే మరొక ప్రసిద్ధ శతకం గువ్వలచెన్నా శతకం. సమకాలీన సమాజంలోని కుళ్ళును, అరాచకాలను, మూఢనమ్మకాలను ఖండిస్తూ ఈ శతకాలన్నీ వచ్చాయి. ఆధునిక కాలంలో కూడా సుందర రామిరెడ్డి రాసిన సుందరయ్య సూక్తులు, దాశరథి శతకం, బోయి భీమన్న పిల్లి శతకం, శ్రీశ్రీ సిరిసిరిమువ్వ శతకం ఎంతో ప్రసిద్ధి చెందాయి.

శతక సాహిత్య చరిత్రలో ప్రత్యేకంగా పేర్కొన దగినవాడు వేమన. మహాకవి శ్రీశ్రీ, గురజాడ అప్పారావు ముత్యాల సరాలను ఆంధ్రదేశానికి పరిచయం చేస్తూ, ఆది కాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ తెలుగులో మహాకవులు అని పేర్కొన్నాడు. ప్రజాకవి, తిరుగుబాటు కవి, అయిన వేమన శతకాన్ని ఆయుధంగా మలచుకొని తన కాలంనాటి సాంఘీక దురాచారాలను, మూఢ విశ్వాసాలను, అవినీతిని, లంచగొండి తనాన్ని తూర్పారబట్టాడు. కులాలకు, మతాలకు, జాతులకు అతీతంగా సర్వమానవ శ్రేయస్సును కాంక్షించిన వాడు వేమన. అధిక్షేప శతక ప్రక్రియలో వేమన అద్వితీయుడు. దేశవాళీ ఛందస్సు ఆటవెలదిలో వెలుగులు విరజిమ్మిన వేమన కుసుమ ధర్మన్న కు పథగామి అనడంలో అతిశయోక్తి లేదు.

కుసుమ ధర్మన్న హరిజన శతకం ప్రారంభంలో ఆదిమ కమ్యూనిష్టు సమాజంలోని మంచి లక్షణాలను ప్రస్తావిస్తూ

**ఆదికాల మందు - నవనిలో జనులెల్ల**
**నన్నదమ్ములగుచు: నాశవీడి**
**చీకుచింతలేక: చిరజీవులైరయా**
**ఆలకింపుమయ్య: హరిజనుండు** అంటాడు. ప్రత్యేక హక్కులు, అధికారాలు, నీవూ, నేనూ అనే మూలుగులు లేకుండా, మాయబుద్ధి మచ్చుకైనా లేకుండా జీవించారని వివరించాడు. కానీ కలియుగం మొదలవ్వగానే సమాజం మారిపోయిందని చెబుతూ

**మాయ కప్పమంచి: మటుమాయమైపోయె**
**హెచ్చు తగ్గులంకురింపజొచ్చె**

కులము ఘనత గాంచె, గుణ మంతరించెరా.. అంటూ సంపదంతా సమాజంలోని కొద్ది మంది చేతుల్లోకి ఇమిడి పోయిందంటాడు. పెట్టుబడిదారీ సంస్కృతి పెరిగి పోయిందనీ, దాంతోటే దోపిడీ వ్యవస్థకు అంకురార్పణ జరిగిందని, తద్వారా అప్పటి వరకు సుఖశాంతులతో వర్థిల్లిన సమాజం నరకకూపంగా మారిపోయిందంటాడు కవి. ఈ క్రమంలో పంచముల దుస్థితి దిగజారిపోవడం జూచి

**ఎవడనీవు యిట్టి యడముల గుడువంగ,**
**నెవరు కారణంబు – యలవచ్చె**
**నెంత కాలము వెలిచింతచేగుందెదో** అని ప్రశ్నిస్తాడు.

కులము స్థలములేదో? గుణగణంబులు లేవో? అంటూ అతి ప్రాచీన కాలంలో ఈ దేశం మూలవాసుల దేననీ, ఈ దేశ సంపదకూ, అసలు సిసలు వారసులు మీరేనని ఇప్పుడు బానిసలలాగా నలిగి పోవడం పరువు తక్కువ అని హెచ్చరిస్తాడు. ఆదిపత్యవర్గాలు ఎక్కడి నుండి వచ్చారో ఎలా ఆక్రమించారో అన్న విషయాలపై తన జాతి జనులకు అవగాహన కల్పించాడు. మాలవాడనీ, పంచముడనీ, అంటరాని వట్టి అథముడనీ నీ స్వాతంత్ర్యాన్ని హరించి, కులము పేర నేల కూల దోసిరి కాదా! ధనము పేర తలను దున్నలేదా? మతము పేర రూపు మాపలేదా? అని అంటూ స్వార్ధపరులు నిన్ను దేశ ద్రిమ్మరిని చేశారని వాపోయాడు.

అప్పులు, వడ్డీలమీద వడ్డీలు లెక్కగట్టి మనల్ని అణగద్రొక్కి ఆటలాడించే రైతుల నీచమైన మనస్తత్వాన్ని బహిర్గతంచేశాడు.

**అక్కరైన కొంత యప్పిచ్చి తక్కువ**
**కూలికెపుడు బనుల గొనుచునుండు**
**పేదవగుట నిన్ను పీడింపదే రైతు** అంటాడు.

ఈ సమాజం అంటరాని వాని పట్ల చూపే నిరాదరణ గురించి చెబుతూ కుష్టు రోగుల దగ్గర కూచోగలరు, సాని ప్రక్కన చేరగలరు, చాకలి, మంగలి, ఎఱుకుల, ఏనాదుల, చెంచుల, తురకల, క్రైస్తవుల... ఇలా అందరి పట్ల సానుభూతి చూపగల దయార్ధ హృదయులు. కాని నీ నీడనే అసహ్యించుకునే కఠినాత్ములు అంటాడు. కటిక వాళ్ళను, గడన కత్తెలను, అసత్యవాదులను, లంచగొండులను, అప్పులు చేసి ఎగ్గొట్టే వాళ్ళనూ, ధనం కోసం కన్న బిడ్డలనైనా తెగనమ్మే వాళ్ళనూ, వావి వరుసలు తప్పి నీచంగా ప్రవర్తించే వాళ్ళనూ త్రాగుబోతులను, తప్పుడు సాక్ష్యాలను చెప్పేవాళ్ళనూ, తలలు మార్చి తప్పు దావాలు సృష్టించి బ్రతికే వాళ్ళనూ అవినీతి పరులందరినీ, ఆప్యాయంగా అక్కున జేర్చుకొనే సమాజం నీ పట్ల చూపించే ఆ హేయబుద్ధి ఏమాత్రం హేతుబద్ధం కాదంటాడు. అయినా శ్రమలోలేని అంటరాని తనం సహచర్యంలో ఎలా ఉంటుందంటాడు. కుక్కలనూ, కోతులనూ, ఎద్దులనూ, పాములనూ, ఎలుకలనూ, కాకులనూ, గద్దలనూ, పందులనూ వివిధ దేవుళ్ళ పేరుతో పూజించే సమాజంలో బీద సాదల పట్ల ఈ నిర్ధయ ఎందుకు అంటాడు.

– ఇంత చీకట్లో చిరుదీపంలాగా కవికి గాంధీ దర్శనమిచ్చాడు.

 ISBN: 978-93-340-2436-4

**దేశవాసులిట్లు : గాసి వెట్టగజూచి**
**కంటనీరుగార్చి : గారవించి**
**భరతమాత నీదు బాగోగులరసెరా** అని చెబుతూ దీన బాంధవుడూ, దివ్యతేజోమూర్తి అయిన గాంధి అవతరించి కరుణతో దీక్షబూని అర్ధరహితమైన అస్పృశ్యతను, పారద్రోలాలని నొక్కి చెబుతున్నాడని దళితకోటికి గాంధీజీ తరపున అభయ హస్తం ఇచ్చాడు.

**నిమానుషంబుగాదు: మర్యాదయునుగాదు**
**మతముగాదు అంటు: మానుడనుచు**
**నిన్ను దరికిదీయ: నీతి దెల్పడె గాంధీ...** అంటూ అంటరానితనం మంట గలపకపోతే బానిసత్వం పోదని, కాబట్టి అస్పృశ్యుల వెంట గాంధీజీ ఉంటాడని తన జాతికి హామీ ఇస్తాడు కవి. 1932లో గాంధీజీ ప్రారంభించిన హరిజన సేవక్ సంఘ్ కార్యక్రమాలు ధర్మన్నపై ప్రభావం చూపాయి. అయినా హిందువుల ద్వంద్వ నీతిని ప్రశ్నిస్తూనే వుంటాడు ధర్మన్న. ఊర బావుల్లో నీరు తోడనీయక పోవడం, అస్పృశ్యులకు సత్రాల్లో స్థానం లేకపోవడం, దేవాలయాల్లో ప్రవేశం లేకపోవడం వంటి అమానుష కార్యాలు చేస్తూ, పరాయిదేశాల్లోని హింసను ఎలా ఖండిస్తారంటాడు.

**నితెల్లదొరలు గానీ; నల్లదొరలు గాని**
**యాదరింతురన్న యాశలేల**
**స్వయము కష్టపడిన సౌఖ్యంబు గలుగదే** – అంటూ ఎవరో వచ్చి ఏదోచేస్తారనే ఆశ వీడి మనల్ని మనం ఉద్ధరించు కోవాల్సిన సమయం ఆసన్నమైందని దిశానిర్దేశం చేశాడు. మన పాలేరు తనాలు మనల్ని బాగుచేయవని, మనలోని దుర్గుణాలను, మడ్డితనాలను వదలి చదువుశాస్త్రాలు తెలిసికొని ప్రవర్తించాలంటాడు.

**చీలి కూలి బలము చెడి తూలి పడియున్న**
**కులమునెల్ల ముందు కుదురు గట్టి**
**యాత్మగౌరవంబు నలరంగ చాటరా...** అంటూ సాంఘీక సమరం కులం ఐక్యంగా ఉండాలని ప్రభోధించాడు. అప్పుడే నీకు

**అపుడుగాదె నీకు నఖిలా పదలు బాసి**
**అన్న వస్త్రములును ఆస్తిగల్గి**
**గౌరవంబు గల్గి గలుగును సౌఖ్యంబు** అని తన జాతియావత్తును 'హరిజన శతకం' ద్వారా మేల్కొలిపినవాడు కుసుమ ధర్మన్న.

 ISBN : 978-93-340-2436-4

**ముగింపు :** కుసుమ ధర్మన్న గుడివాడలో గూడూరు రామచంద్రరావు స్థాపించిన సేవాశ్రమంలో శిక్షణ పొందినా, జస్టిస్ పార్టీ పట్ల ఆకర్షితుడైనా, జాతీయ కాంగ్రెస్‌కు దగ్గరై గాంధీజీ శిష్యరికం చేసినా, అనతి కాలంలోనే, డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ మార్గంలోకి వచ్చి, ఆయన ఆశయాలను ఆంధ్రదేశంలో ప్రచారం చేస్తూ, మరో ప్రక్క ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ప్రజల హృదయాలలో స్థానం సంపాదించుకొన్నాడు. హరిజనోద్ధారకుడు జాలా రంగస్వామితో కలిసి అంటుదోషము మానరేలా? అంటూ ఆది హిందూ ధార్మిక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాడు. సాహిత్యాన్ని ఆయుధంగా మలచుకొన్నాడు. బాబాసాహెబ్ ఆశయాలను ప్రజల గుండెల్లో నింపడానికి జయభేరి పత్రికను స్థాపించి వాడవాడలా అంబేద్కర్ పేరు మారుమ్రోగునట్లు చేసిన తొలితరం కవి మాననీయుడు కుసుమ ధర్మన్న.

ఆధార గ్రంధాలు:

1. కుసుమ ధర్మన్న – హరిజన శతకము
2. తెలుగు సాహిత్య సమీక్ష – మొదటి సంపుటము – డా॥ జి. నాగయ్య
3. డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ – రచనలు – ప్రసంగాలు – సంపుటం 9
4. నవ్యాంధ్రము – నా జీవితకథ – అయ్యదేవర కాళేశ్వరరావు
5. సామ్యవాదాన్ని సహించని హిందూయిజం – కుసుమ ధర్మన్న
6. తొలిదళిత ఆత్మగౌరవ స్వరం – ఆచార్య కొలకలూరి మధుజ్యోతి

* * *

 ISBN: 978-93-340-2436-4

# 10 కుసుమ ధర్మన్న జీవితం - సంఘసంస్కరణ దృక్పథం

డా॥ నూనె అంకమ్మరావు
ఆంధ్రోన్యాసకులు
చరవాణి:- 9397907776

కుసుమధర్మన్న 1900లో రాజమహేంద్రవరంలోని లక్ష్మివారపు పేటలో వ్యవసాయ కూలీలైన కుసుమ వీరాస్వామి, నాగమ్మ దంపతులకు జన్మించాడు. ఇతడు ఆదిఆంధ్ర జూనియర్ ఎలిమెంట్ స్కూలులో 5వ తరగతి వరకు చదివాడు. తరువాత థర్డ్ ఫారం చదివి ఆయుర్వేదంలో వైద్య విద్వాన్ పట్టా పొందాడు. ఇతడికి తెలుగు, సంస్కృతము, ఆంగ్లము, హిందీ, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం ఉంది. చదువుకునే రోజుల్లోనే సంఘసంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం చేత ప్రభావితుడైనాడు.

ఇతడు తన జాతి హీనత్వంతో అవమానంతో అమానుషంగా, అంటరాని తనం, సామాజిక వివక్షలతో, బాధపడుతున్న దళితులను (మాల, మాదిగ, ఇతర అణచబడ్డ కులాలను), ఇతర అణగారిన వర్గాలను సంఘ-సంస్కరించాలనే దృక్పథంతో "హరిజన శతకాన్ని" రచించాడు. ఇతను హైదరాబాద్లో ఉన్న దళిత ఉద్యమకారులైన భాగ్య రెడ్డి వర్మ, బి.ఎస్. వెంకట్ రావు, అరిగే రామస్వామి లాంటి నాయకులతో అనునిత్యం సంబంధాలు ఏర్పర్చుకొంటు ఒక బలమైన రచయితగా ఎదగడం జరిగింది.

ఈయన అంబేద్కర్ స్ఫూర్తి పొంది అంటరాని తనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో తపించిన తొలి తరం కవి. ఇతడు గుడివాడ సేవాశ్రమం వ్యవస్థాపకుడు గూడూరి రామచంద్రరావు వద్ద, సీతానగరం ఆశ్రమం, చాగల్లు ఆనందాశ్రమాలలో కొంతకాలం వుండి తన ఉద్యమస్ఫూర్తిని మెరుగుపరచుకున్నాడు.

"దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు" అనే పుస్తకంలో సి.వి.గారు కూడా ఈయన గురించిన సమాచారం తనవద్ద లేదని రాశాడు. 1921లో కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము రాశారు. దళిత వర్గం నుంచి అతి కష్టంమీద చదువుకుని పైకొచ్చి, తిరిగి ఆ చదువును తన జాతి మేలు కోసం వెచ్చించిన అతికొద్ది మంది దళిత విద్యావంతుల్లో 'కుసుమ ధర్మన్న కవి' ఒకరు. దళితులు, బ్రిటిషు పాలనలో కంటే, స్థానిక అగ్రవర్ణాల పాలనలో మరింత నలిగిపోతారని మొట్టమొదటగా చాటింది కుసుమ ధర్మన్నే. కాంగ్రెస్లో ఉంటూనే 'మాకొద్దీ నల్లదొరతనము' అంటూ గళం విప్పిన ధైర్యశాలి.

ధర్మన్న అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితుడై అంబేద్కర్ గురించి ఆంధ్రదేశంలో

విస్తృతంగా ప్రచారం చేశాడు. ఆంధ్రదేశానికి అంబేద్కరును తొలిగా పరిచయం చేసింది ఈయనే. అణగారిన జాతులకు గొంతుకనిస్తూ, అంబేద్కర్ భావాలను ప్రచారం చేయటానికి "జయభేరి" అనే పక్ష పత్రికను స్థాపించాడు. 1930వ దశకంలో కాంగ్రేసు పార్టీ చొరవ తీసుకొని హరిజన సేవా సంఘం యొక్క ఆంధ్ర విభాగాన్ని ప్రారంభించింది. మహాత్మా గాంధీ అంటరాని కులాల ప్రజలకు హరిజనులు అని పేరుపెట్టడంతో అది ప్రాచుర్యం పొందింది. క్రమేణా ఆది ఆంధ్ర నాయకులంతా కాంగ్రెసు స్థాపించిన హరిజన సేవా సంఘంలో భాగమైనా కుసుమ ధర్మన్న వంటి కట్టుబడిన నాయకులు మాత్రం దాన్ని వ్యతిరేకించారు. దళిత చైతన్యం కోసం ధర్మన్న పడిన తపన ఈయన 1933లో వ్రాసిన హరిజన శతకంలో చూడవచ్చు. "ఆత్మ గౌరవంబు నలరంగ చాటరా" అని ఉద్బోధించిన ధర్మన్న కవిగారు వర్ణధర్మం పేరిట భారతీయ సమాజంలో నెలకొని ఉన్న హెచ్చు తగ్గులను నిరసించిన జాతీయ వాది. సమకాలికులు ఆయనను 'ఆది ఆంధ్ర కవి సార్వభౌమ'గా పేర్కొన్నారు.

1936లో విజయనగరంలో జరిగిన ఆది ఆంధ్ర మహాసభ సమావేశానికి కుసుమ ధర్మన్న అధ్యక్షత వహించాడు. ఈ సమావేశంలో అధ్యక్ష ప్రసంగం చేస్తూ సామ్యవాదాన్ని సహించని హిందూమతం అనే శీర్షికన ప్రసంగం వెలువరించాడు.

తన జాతి జనులు హీనత్వంతో అమానుషంగా బాధపడుతున్న స్థితిని నివారించే సంఘ సంస్కరణ దృక్పథంతో కుసుమ ధర్మన్న అనేక రచనలు చేశారు.నిరక్షరాస్యులైన తన జాతీయులను ప్రబోధించే లక్ష్యంతో సరళ సుబోధకంగా, రసపుష్టితో రచనలు గావించిన తొలి దళిత కవి కుసుమ ధర్మన్న.

ఆంధ్రదేశంలో అంబేద్కర్,గాంధీజీల ప్రభావాలతో స్ఫూర్తి పొంది అంటరానితనాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంతో 1933లో హరిజన శతకాన్ని రచించాడు.అప్పటికి జాషువా గబ్బిలం వంటి కావ్యాలు వెలుగులోకి రాలేదు. స్వార్థపరుడైన మానవుడే అస్పృశ్యతా విషాన్ని ఉగ్గుపాలతో రంగరించి పోసి మోసగించాడని, తన దాసాను దాసుడిగా దళితుణ్ణి బంధించాడన్న విషయాన్ని గ్రహించి తన జాతీయులను ఉద్దేశించి ప్రబోధిస్తూ

**మేలు కొనుమీవు తరుణము మించకుండ**
**జన్మ హక్కులకై పోరు సల్పు మిపుడె**
**హక్కుకై ప్రాణమిడుట ద్రోహంబు కాదు**
**స్వర్గ పథమని నమ్ముము స్వాంతమందు**

తరుణం మించకుండా మేల్కొని జన్మహక్కులకై పోరాడమని ప్రాణత్యాగమైనా స్వర్గ పథమని ప్రబోధించి, ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని చాటిచెపుతాడు. వర్ణ ధర్మం పేరిట

 ISBN: 978-93-340-2436-4

భారతీయ సమాజంలో నెలకొని ఉన్న హెచ్చు తగ్గులను నిరసించిన జాతీయవాది కుసుమ ధర్మన్న. తన జాతీయుల్లో ఆత్మగౌరవ స్ఫూర్తిని... రగిలించిన కవి, ఆంధ్ర కవి సంఘాలకు సలహాలిచ్చి సమైక్యతతో మెలిగేందుకు కృషి చేసిన ఉదారవాది.

**ధర్మన్న వ్యక్తిత్వం:–** కాంగ్రెస్ పార్టీ తరపున రాజమండ్రి తాలుకా బోర్డుకు సభ్యుడిగా ఎన్నికైనా బోర్డు ప్రెసిడెంటు ఎన్నికల్లో ఆ పార్టి అభ్యర్థికి ఓటు వేయమని స్వతంత్ర వ్యక్తిత్వ విలసితుడు. కాంగ్రెస్ పార్టీలో సభ్యుడిగా ఉంటూనే "మా కొద్దీ నల్ల దొరతనము" అంటూ గళం విప్పి గానం చేసిన ధైర్యశాలి.

**ఆత్మగౌరవం:–** నిమ్నజాతులు అభివృద్ధి విషయంలో గాంధీజీ ఆశయాలను విశ్వసించి, గౌరవించినా,వాటి ఆచరణలో లోపాలను ధర్మన్న సహించక ప్రతి ఘటించేవాడు. ఆంధ్రరాష్ట్ర పర్యటనలో భాగంగా గాంధీజీ రాజమండ్రి వచ్చిన సందర్భంగా ఆయన నిర్వహించిన హరిజన నాయకుల సమావేశాన్ని ధర్మన్న బహిష్కరించాడు. మీరు హరిజనులపట్ల అభిమానం గల నాయకులైతే మా పేటలకు వచ్చి యిక్కడ సమావేశం నిర్వహించాలని కబురు పెట్టాడు. ధర్మన్న కోరిక మేరకు గ్రహించిన గాంధీజీని ఇతర కాంగ్రెస్ నాయకులను తమ పేటకు రప్పించి అతిథ్యమిచ్చి తన ఆత్మగౌరవాన్ని చాటుకున్న ధీశాలి. తన జాతి చైతన్యకోసం ఎంతో తపించిన సంస్కరణశీలి.

**ధర్మన్న రచనలు:–** కుసుమ ధర్మన్న వృత్తి చేత ఆయుర్వేద వైద్యులైనా ఆయన ప్రవృత్తి సంఘసంస్కరణం. ఆయన సాహిత్యాన్ని సంఘ సంస్కరణకొక ఉపకరణంగా భావించి గేయాలద్వారా, కథలద్వారా ప్రబోధం కలిగించాడు. ఆయన 1921లో నిమ్మజాతి ముక్తి తరంగిణి పేరిట ప్రసంగ పాఠాన్ని నల్లదొరతనం పేరిట హరిజనుల హక్కుల పోరాటానికి స్ఫూర్తినిచ్చే గీతాలను,1924లో గుడివాడ సేవాశ్రామాధిపతి యోగి రామచంద్రుడు నిర్వహించిన వ్యాసరచనల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందిన వ్యాసం "నిమ్మజాతుల ఉత్పత్తి" (వ్యాసం), 1930లో తూర్పు గోదావరి జిల్లా మద్యపాన నిషేద సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటిల్లో ప్రథమ బహుమతి, స్వర్ణ పతకాన్ని గెలుపొందిన వ్యాసం "మద్యపాన నిషేధం" వారి "అసురపురాణం" పద్యకావ్యం హరిజనులు ఆత్మగౌరవం గల ప్రత్యేక జాతిగా తీర్చిదిద్దిన రచన యిది. దీన్ని సరళసుందరమైన శైలిలో రచించాడు. హరిజనోద్యమానికి చేయూతనిచ్చిన గ్రంథంగా అంటరాని వాళ్ళా? కథల సంపుటిని, దళితుల్లో చైతన్యాన్ని కలిగించేందుకు హరిజన శతకాన్ని రచించారు.

**హరిజన శతకము – దళితప్రబోధం:–** గాంధీజీ స్ఫూర్తితో 1933లో దళితులను ప్రబోధించు లక్ష్యంతో కుసుమ ధర్మన్న "ఆలకింపుమయ్య హరిజనుండ" అనే మకుటంతో

ఆటవెలదులలో ఈ శతకాన్ని రచించాడు. నేటి దళితులను మొదట పంచములు అనేవారు. 1917లో అది ఆదిఆంధ్ర అయ్యింది. 1931లో హరిజన అయ్యింది 1936లో షెడ్యూల్ కులం అని పిలిచారు. 1976లో దళిత వర్గం అనేపేరు ఖరారయ్యింది.

పురాతన కాలంలో ప్రజలంతా కులమత భేద రహితంగా అన్నదమ్ముల్లా ఐకమత్యంతో నిశ్చింతగా జీవించారు. స్వార్ధ పరులైన ప్రజలు అంటరాని తనమనే విషాన్ని ఉగ్గుపాలతో పోసిమోసగించి దాసాను దాసునిగా చేశారన్న విషయాన్ని గ్రహించామని కుసుమ ధర్మన్న ఈ శతకం ద్వారా ప్రబోధాన్నిచ్చారు. దళితులంతా హక్కులకోసం పోరాడాలని కోరాడు. హక్కుల పోరాటంలో అసువులు బాసినా వీర స్వర్గంగా భావించాలని చాటి చెప్పడమే ఈ శతక ఉద్ధేశ్యంగా కనిపిస్తోంది.

**కృతయుగంలో ప్రజల జీవన విధానం:-**

**ఆదికాల మందు నవనిలో జనులెల్ల**
**నన్న దమ్ములగుచు నాశనీడి**
**చీకు చింత లేక చిరజీవులైరయా**
**ఆలకింపుమయ్య  హరిజనుండ**

కృతయుగంలో జనులకు దురాశలు తెలియవని, అన్నదమ్ముల వలె జీవించారని వారికి ఎలాంటి విచారాలు ఉండేవి కావని, అందువల్ల వారు చిరకాలం జీవించే వారని తెలిపారు. ఆ రోజుల్లో హక్కులు, ఆస్తులపై అధికారమూ ఎవరికి లేవని, నేనూ నీవు అని వీఱ్రవీగడం లేదని మచ్చుకు కూడా మాయబుద్ధి ఉండేది కాని తెలియజేస్తూ

**ద్రవ్యకాంక్ష సుంత తలయెత్తగాలేదు**
**కూడబెట్టి దాని గొలువలేదు**
**పాడి పంట వారి భాగ్యభోగము లయా**
**ఆలకింపుమయ్య హరిజనుండ**

అంటూ దేశమాత ఇచ్చే సంపదలను అన్నింటినీ పోగుచేసి దానితో సంఘసేవ చేయడాన్ని ఆనాడు మర్యాదగా భావించే వారని పేర్కొన్నారు. అంతేగాక

**కాయకష్టపడుచు కడుపార గుడుచుచు**
**కఱవు కాటకముల కంటబడక**
**వ్యాధి బాధలేక వర్ధిల్లి నారయా**
**ఆలకింపుమయ్య హరిజనుండ**

 ISBN: 978-93-340-2436-4

అని తెలుపుతూ ఆ కాలంలో ఒకడికి కడుపునిండా తిండి ఉండడం,మరొకడు తిండిలేక కడుపుమండి బాధపడడం ఉండేది కాదని, ఒకడు బానిసగాను, మరొకడు పేదవాడుగానూ ఉ ండడం లేదనీ, ప్రజలు భేదభావాలు లేకుండా సమానంగా ఉండేవారని అప్పటి ప్రజలు తమకు తిండి, బట్టలు లేవని, కాళ్ళూ, కళ్ళు లేవని మరొకరి ఇంటికి వెళ్ళి ఏడవడం లేదని ఆనాడు దరిద్రం లేదని, బాధలులేవని, కృతయుగమంతా దైవహితంగా సాగిందని, అప్పుడు లోకమంతా స్వర్గలోకంలా ఉండేవని-చావు పుట్టుకల విచారం లేదని,కృతయుగం భోగభోగ్యాలతో, సుఖశాంతులతో స్వర్గంలోకంగా ఉండేదని హరిజన శతకంలో కుసుమ ధర్మన్న తెలియచేశాడు.

**కలియుగంలో ప్రజల పరిస్థితులు:-** కలియుగంలో పాపాలు పెరిగిపోయి, తిండి బట్టకీ లేక ఏడ్చేలా చేసిందని, ప్రజల్లో కలవరం చెలరేగిందని, కలతలు పెరిగాయని ధర్మ విచారం పోయి ధనకాంక్ష ఎక్కువయ్యిందని చెబుతూ

**మాయకప్పి మంచి మటుమాయమై పోయె**
**హెచ్చు తగ్గులంకు రింప జొచ్చె**
**కులము ఘనతగాంచె గుణ మంతరించెరా**
**ఆలకింపుమయ్య హరిజనుండ**

అని ఉద్బోధిస్తూ సంఘాలకు చెందవలసిన ఆస్తులను అపహరించి కోటిమంది ప్రజలలో ఒకడే కోటేశ్వరుడయ్యాడనీ ప్రజలు భోగభాగ్యాలకు లొంగి వాటికి బానిసలయ్యారని పేర్కొంటూ

**పేదరికము జూడ పెనుభూతము పెన**
**గొన కు చేలులైరి కోట్లకొలది**
**లోకమందు ధనయు లోభుల పరమయ్యె**
**ఆలకింపుమయ్య హరిజనుండ**

అంటూనే ఈనాడు లోకంలో ఒక ధనవంతుడు పెట్టుబడి పెట్టి,పేదవారి కష్టాన్ని దోచుకొని గొప్పవాడవుతున్నాడని, ఈ ధనవంతులందరూ భూమి మీద దయ్యాల లాగా ప్రవర్తిస్తున్నారని, మానవ లోకం నరక కూపంగా మారిందని, సుఖశాంతులు తొలగిపోయియాని, బ్రతుకు బరువు అయ్యిందని, భ్రాంతి తొలగిందంటూ తన బాధను వ్యక్తం చేశారు.

ISBN : 978-93-340-2436-4

**కుసుమధర్మన్న హరిజనులకిచ్చిన సందేశం:-**

**ఎవడ నీవు యిట్టి యిడుముల గుడువంగ**
**నెవరు కారణంబు యేల వచ్చె**
**నెంతకాలము వెలి చింతచే గుందెదొ**
**ఆలకింపుమయ్య హరిజనుండ**

అంటూ "నీకు కులము, స్థలము, గుణగణాలు, ధనము, బలము, బ్రతుకుదారి అన్ని ఉన్నాయి. ఎందుకు బానిసగా మారి, పరువు లేకుండా బ్రతుకుతున్నావు. నీవు ఈ లోకంలో హిందు దేశంలో పుణ్యమూర్తి అయిన భారత మాత ముద్దుబిడ్డగా పుట్టావు, కాని ఊరు పేరు లేక పడి ఉండటానికి కారణం తెలుసుకో. నీకులం వాళ్ళు పూర్వం హిందూ దేశాన్ని పాలించి సుఖపడ్డారు అని శాస్త్రం చెబుతుంది". అని కుసుమ ధర్మన్న ప్రబోధంగావించాడు. హరిజనులు తమ హీనస్థితికి కారణం తెలుసుకొని, పూర్వం హిందుదేశాన్ని పాలించిన దళితుల లాగానే పాలించాలనే హితాన్ని సందేశంగా ఇచ్చాడు.

* * *

11

## అంటరానితనం పై సమరశంఖం పూరించిన ధర్మన్నకవి "దండాలుపాట"

**డా. గూటం స్వామి**
తెలుగు భాషోపాధ్యాయులు
రాజమండ్రి.
సెల్:9441092870

స్వాతంత్రోద్యమం ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లో పలువురు కవులు కళాకారులు స్వాతంత్ర్య సాధన కోసం రచనలు చేసి జైలు పాలు అయ్యారు. అదే సమయంలో కొంతమంది సంఘసంస్కర్తలు సామాజిక దురాచారాలపై పోరాటం చేశారు. గాంధేయవాదులు కొంతమంది అంటరానితనం నిర్మూలనకు కృషి చేశారు. వలస పాలన పుణ్యమా అని తక్కువ కులాల వారు ఎంత చదువుకున్నా అవహేళనకు, అణచివేతకు గురవుతున్న సందర్భంలో ఒక వ్యక్తి అంటరానితనంపై సమర శంఖం పూరించాడు. ఆ వ్యక్తి ఎవరో కాదు కుసుమ ధర్మన్నకవి. స్వాతంత్రోద్యమం, సంఘసంస్కరణ ఉద్యమం జరుగుతున్న తొలినాళ్ళల్లో ఒక దళిత కుటుంబంలో జన్మించిన ధర్మన్న స్వయంకృషితో ఎదిగారు. సంస్కృతం, ఆంగ్లం, హిందీ, ఉర్దూ, భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. ఆయుర్వేద విద్య చదువుకున్నారు. ఒకవైపు వైద్యం చేస్తూ సాంఘిక సమానత్వాన్ని సాధించే దిశగా కవిత్వం రాయడం ప్రారంభించారు. తొలుత గాంధేయవాదిగా పిమ్మట అంబేద్కరిస్టుగా సాంఘిక అసమానతులపై ముఖ్యంగా అంటరానితనంపై పోరాటం చేశారు.

ఈ నేపథ్యంలో కుసుమ ధర్మన్న రాసిన అనేకనేక పాటల్లో దండాలుపాట ప్రత్యేకమైనది. మాకొద్దీ నల్ల దొరతనం పాట తరువాత అంతే చైతన్యం రగిలించిన పాట ఈ దండాలు పాట. ధర్మన్న ఈ పాట ద్వారా తన జాతి అస్తిత్వాన్ని,వేదనను ఏకరువు పెట్టాడు. కులం, మతం దళిత జాతిని ఏ విధంగా అణచివేసిందో కళ్ళకు కట్టినట్లు చూపారు. ప్రతి చరణం లోను దళితుల ఆవేదన కనిపిస్తుంది. ఆ రోజుల్లో అంటరానితనం ఎంత భయంకరంగా ఉండేదో అర్థమవుతుంది. పాట పల్లవి నుంచే తన నిరసన మొదలుపెడతారు ధర్మానకవి.

**"దండాలండోయ్ బాబు దండాలండి**
**మేము ఉండలేమండోయ్ బాబు దండాలండి**
**ఈ సైతాను మతముతోను సాగలేమండోయ్**
**మేమేగ లేమండోయ్ బాబు దండాలండి"**

 ISBN: 978-93-340-2436-4

అని కులభేదం చూపించే వారికి కవి ఒక దండం పెట్టేసారు. ఈ సైతాన్ మతంతో ఇక సాగలేమని, సహించలేమని, కరఖండిగా చెప్పారు ధర్మన్న. ఆ తరువాత సాగే చరణాలు తన ఆవేదనకు పరాకాష్టగా నిలుస్తాయి. అంటరానితనం పేరుతో మాల మాదిగలను ఊరు బయటకు గెంటేసారని వాపోయారు. మతం పేరుతో హీనులుగా చూసిన విషయాన్ని తెలియజేశారు. కులం, మతం అంటూ దూరం పెట్టే వాళ్ళు కోరికలు తీర్చుకోవడానికి మాత్రం కులం అడ్డురాదని విమర్శించారు ధర్మన్న.

**"తక్కువెక్కువనుచు యెంతొ నిక్కు చుందురండి బాబు**
**రొక్కమిచ్చి సానివాళ్ళ పక్క చేరుతారు బాబు"**

అంటూ ధర్మన్న కవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కుష్టు రోగుల ప్రక్కన కూర్చోవడానికి ఇష్టపడతారు కానీ మాల వాళ్ల పక్కన కూర్చోడానికి ఇష్టపడరని, వారి కష్టాన్ని తినడానికి మాత్రం అమితమైన ఇష్టాన్ని కనపరుస్తారని ధర్మన్న చురకలంటించారు. ఈ దేశంలో పంటలు పండించేది దళితులు వీరు పండించిన పంట తింటారు అప్పుడు దానికి మైలురాదు. పంటకు మైలు తగలదు. కానీ పండించిన వాడు పక్కకు వస్తే మైలు పడిపోతారు ఇదెక్కడి నీతి? ఈ విషయాన్ని ధర్మన్న

**"పాడిపంట కూడ బెడితే బరువుగ తింటారు బాబు**
**రేపు మాపు లేడిపించి యేపుకు తింటారండి బాబు"**

అంటూ కవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంటరాని వాళ్లకు ఎండా వాన ఉండదు. కష్టపడి పనిచేయడమే తెలుసు. రోగం వచ్చినా వైద్యం ఉండదు. అలా అని పని మానడం ఉండదు. ఇంత సేవ చేసినా కనికరం లేకుండా ప్రవర్తిస్తారని కుసుమ ధర్మన్న కవి చాలా వేదన చెందుతారు ఈ గేయంలో...

**"రోగమెచ్చి మూలబడ్డ నాగ దప్ప రండిబాబు**
**బాగువోగులెంచబోక సాగదీస్తరండి బాబు**
**పగలు రేయి ఒక్కరీతి పాటుపడతమండి బాబు**
**కష్టజీవులైన మమ్ము కంట చూడరండి బాబు**

అని కష్టజీవుల వేదనను కళ్ళ ముందు ఉంచారు. అంటరాని వాళ్ళ శ్రమను దోచుకోవడమే కాదు వారికి రావలసిన గింజల విషయంలోనూ మోసపోతున్న వైనాన్ని గురించి చెబుతూ

 ISBN: 978-93-340-2436-4

**“పిచ్చుకుంచములతో గింజలిచ్చి చెరుపుతారుబాబు**
**పెచ్చుకుంచములతో పుచ్చుకుందురండి బాబు**
**గొప్ప గోడు తెంచి మాకు ముప్పు దెచ్చినారు బాబు**
**అప్పు సప్పు బెంచి మమ్ము సప్పళించి తారుబాబు**

అంటూ పెద్ద కులాల తీరును బహిర్గతం చేశారు. మరో ప్రక్క కులము మతము ఎంత చాకచక్యంగా రుద్దుతున్నది ధర్మన్న ఈ పాటలో చాలా స్పష్టంగా కళ్ళ ముందు ఉంచారు.

**“కులము పేర మమ్ము నేలకూలదోసినారుబాబు**
**ధనము పేర బానిసలుగా తన్ని పట్టినారు బాబు**
**మతములోని మహిమ మాకు**
**మరుగపరుచుతారు బాబు**
**గురువులనుచు తిరిగి మతము పరువు నిలపలేరు బాబు”**

అంటూ కులమతాల గుట్టు చెప్పడానికి ధైర్యంగా ముందుకురికిన ధైర్యశాలి కుసుమ ధర్మన్న. మతం పేరా, ధనం పేరా, ఏ విధంగా దళితుల భవిష్యత్తును కూలగొడుతున్నది ధర్మన్న చెప్పిన తీరు ఆ రోజుల్లో నిమ్న కులాల్లో ఆలోచనలు రేకెత్తించిన అంశం. వేదికలెక్కి అంతా సమానమే అని చెప్పి తప్పుడు ఉపన్యాసాలు ఇస్తారు. వేదిక దిగగానే అంతా మామూలే.....

**“సర్వజనులు సమమటంచు సాకు చెపుతారు బాబు**
**గర్వబుద్ధి మాని మాతొ కలసి తిరగరండి బాబు**
**నీతి నియమములను చాటి నిజము పలుకుతారు బాబు**
**జాతి భేద మెంచి వారె జంకి పోతరండి బాబు”**

నీతులు చెప్పడానికే ఆచరణలో శూన్యం. ఇది అగ్రకుల దురహంకారం అంటారు ధర్మన్నకవి. మేము గాంధీ వారసులం అని చెప్పుకునే వారు సైతం అంటరానితనం విషయంలో తటపటాయిస్తారని అంటూ

**“గాంధి గారి బోధలన్ని ఘనముగ వింటారు బాబు**
**అంటరానితనము మానమంటే యెంతొ తంట బాబు”**

అని గాంధేయవాదుల గుట్టురట్టు చేశాడు. ఆ రోజుల్లో అంటరాని వాళ్ళు నీళ్ల కోసం పడే పాట్లు వర్ణనాతీతం. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆ రోజుల్లో ఈ విషయమై గొప్ప

 ISBN : 978-93-340-2436-4

పోరాటమే చేశారు. మహాద్ చెరువు ఘటన అందుకు ఉదాహరణ. అంబేద్కర్ కి సమకాలీకుడైన ధర్మన్న దళితులు నీళ్ళ కోసం పడే పాట్లను తన పాటలో పొందుపరిచాడు.

**" నీళ్ళరేవులందు మమ్ము నిలువనీయరండి బాబు**
**నీచ బుద్ధి చూపుతారు నీటికేమి అంటూ బాబు**
**నూతి నీళ్ళు తోడబోతే బూతులాడతారు బాబు**
**జాతి నీతు లెంచబోరు సాని తోడుకుంటే బాబు"**

అంటూ కులదురహంకారాన్ని ధర్మన్న గట్టిగానే ప్రశ్నించారు. దళితులకు దేవాలయాల్లో ప్రవేశం ఉండదు. దేవునికి నైవేద్యం కోసం పెట్టే పంట పండించింది, పాలు పితికింది మాత్రం అంటరాని కులాల వాళ్లే. ఈ తీరును ధర్మన్న పూర్తిగా వ్యతిరేకించారు. దళితులను చదువుకు దూరం చేసి పాలేర్లగా స్థిరపరిచిన వైనాన్ని తీవ్రంగా ప్రశ్నించారు. మాకు శుద్ధి బుద్ధి లేదంటున్నారు, మరి శుద్ధి బుద్ధి ఎలా వస్తుందో కాస్త చెప్పండి అంటూ తన పాటల ద్వారా అడుగుతారు కవి. విద్య లేదని వెక్కిరించే మీరు బుద్ధి కలిగే మాటలను కాస్త చెప్పండి అంటూ బ్రతిమలాడుతారు ధర్మన్న కవి. మనుషులమై పుట్టాక బ్రతకాలి కదా? మరి ఎలా బ్రతకాలో దారి చూపమని ధర్మన్నకవి గేయంలో గట్టిగానే అడిగారు. మా దగ్గర డబ్బు లేదు, నీచులమే, దిక్కులేని వాళ్ళమే, కాబట్టి మీరు దిక్కు చూపండి.. లేకపోతే మా బ్రతుకు మేము బ్రతుకుతాం మమ్మల్ని అనగా దొక్క వద్దు అని ధర్మన్న తనగేయంలో వేడుకుంటారు. ఒకరకంగా ధర్మాగ్రహాన్ని ప్రదర్శించారు. చివరగా ఈ గేయం లో ఒక ప్రశ్న సంధించారు...

**"సోదరులని యెంచి మమ్ము ఆదరింపకుంటే బాబు**
**స్వరాజ్య మెట్లవచ్చు? వస్తే యెట్లు నిల్చు బాబు"**

దీనికి సమాధానం ఇప్పటికీ దొరకలేదు. స్వరాజ్యం వచ్చి 77 సంవత్సరాలు అయింది. ఇప్పటికీ దళితుల పరిస్థితి ఇలాగే ఉంది. చాపకింద నీరులా కులం, మతం సమాజమంతా ప్రవహిస్తూనే ఉంది.

కుసుమ ధర్మన్న గొప్ప దార్శనీకుడు. ఆనాటి సమాజంలోని కులమతాల జాడ్యాలపై తీవ్రంగా పోరాటం చేసిన ధైర్యశాలి. అంటరాని వాళ్ళ పక్షంగా అహర్నిశలు పోరాడిన యోధుడు. ఆ రోజుల్లో దోపిడీ వర్గాల ప్రక్కలో బల్లెం. ఎక్కువ తక్కువ బేధాలు చూపించే వారి తెలివి తక్కువ తనాన్ని ఎత్తి చూపే ప్రయత్నం చేశారు. ఆయన సమాజంలో అనేక రుగ్మతలపై తన కలాన్ని జులిపించారు. తన జీవితమంతా నిమ్న కులాల అభివృద్ధి కోసం పాటుపడిన ధర్మన్న నిష్కలంక ఉద్యమ నేత. తెలుగుజాతి, తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం కుసుమ ధర్మన్న జీవించే ఉంటారు. ఆయన చిరంజీవి చిరస్మరణీయుడు.

* * *

 ISBN: 978-93-340-2436-4

12

# దళిత ఉద్యమ తొలిపొద్దు -కుసుమ ధర్మన్న

డా॥ గంజికుంట్ల రామారావు

మాకొద్ది నల్ల దొరతనము మాల మాదిగలంటే మండిపడిపోతారు. అని వంద సంవత్సరాల ముందే నింగి నేల దద్దరిల్లే విధంగా నినదించిన కుసుమ ధర్మన్న. ఆధునికాంధ్ర సాహితీ చరిత్రలో ప్రప్రథమ వాగ్గేయకారుడు. ఈ గీతం తరతరాల దళితుల పరాభవ పరాజయ పరంపరల్ని ప్రతిబింబించే రక్త కన్నీటి గొంతు.

తెలుగువారి తొలి సాహిత్య రాజధాని రాజమహేంద్రవరం కార్యక్షేత్రంగా జాతియోద్యమ కాలంలో దళితుల కోసం పొలికేక వేసిన ధర్మన్న కవి. 1900 లో పుట్టి 17 ఏప్రిల్ 1945 నడి వయసులోనే కన్ను మూసిన ధర్మన్న జీవించిన జీవితం అటు దేశానికి, ఇటు దళిత జాతికి అంకితం చేసిన త్యాగశీలి. తను నేర్చిన వైద్యాన్ని సమాజం కన్నెత్తి, చూడడానికే నిరాకరించిన గ్రామీణులకు పేద దళితులకు అందించిన ప్రజా వైద్యుడు. పద్యం, గేయం, కథ, నవల, వ్యాసం వంటి ప్రక్రియల్లో రచనలు చేశారు. హరిజనుల స్థితిగతులను చూచి చలించి వారి కష్టాలను హరికథల రూపంలో రూపొందించి హరిజన వాడల్లా గొంతెత్తి గానం చేసి చిందేసిన వాగ్గేయకారుడు.

తొలిరోజుల్లో గాంధీ సిద్ధాంతాల వైపు చూసినా దళితుల విముక్తికి అంబేద్కర్ పంథాయే శరణ్యమని నమ్మి అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి జయభేరి (1936) పత్రికను స్థాపించిన తొలి దళిత పత్రికా సంపాదకుడు ధర్మన్న. ఇతని రచనల్లో 1. నిమ్న జాతి విముక్తి తరంగిణి (1921), 2) మా కొద్ది నల్ల దొరతనం (1921), 3) నిమ్నజాతుల ఉత్పత్తి (1924), 4) మద్యపాన నిషేధం (1930), 5) అసుర పురాణం – (చరిత్ర), 6) అంటరాని వాళ్ళు (కథలు), 7) మాలకాకి – (నవల), 8) స్వష్ఠ వృత్తము – (వైద్య గ్రంథం), 9) హరిజన శతకం ఇవి మాత్రమే లభ్యమవుతున్నాయి. వీరి తల్లిదండ్రులు నాగమ్మ, వీరస్వామి ఏలూరికి చెందిన లక్ష్మీ నారాయణమ్మతో ధర్మన్న వివాహం జరిగింది.

దళితుల జ్యోతి జాల రంగస్వామి జాల మంగమ్మతో కలిసి 1933లో హరిజన బ్యాంకును రాజమండ్రిలో స్థాపించారు. హరిజనులు రోజు కూలీలో కొంతైనా హరిజన బ్యాంకులో పొదుపు చేసుకోవాలని ఆయన ఉద్దేశం. దళితులు కూలీ నాలీ చేసిన సొమ్మును కుండలలో చూరులో దాయకండి, బంధువులు, కామంధులకు ఇచ్చి దాయకండి అని

ప్రచారం చేశాడు. నిమ్న కులాల ఉద్ధరణకు కలం పట్టిన ధర్మన్న ప్రత్యక్షంగా ఉద్యమాలు నడిపినవాడు. అంటుదోషము మానరెలా... దాని విడుదలకై యింత పంతము మీకేల అని 1921లోనే ప్రశ్నించారు. తరువాత వచ్చిన దళిత కవులకి తొలిపాటై నిలిచాడు.

1944 సెప్టెంబర్ 28న డా॥బి.ఆర్.అంబేద్కర్ రామచంద్రాపురం వచ్చినపుడు దళిత వాగ్గేయకారులు సోలుకొండ సోదరులు మాకొద్ది నల్ల దొరతనం, హరిజన శతకమును తత్త్వాలుగా పాడి వినిపిస్తే అంబేద్కర్ మంత్ర ముగ్ధుడయ్యారు. 1944వ సం॥రంలో రాజమండ్రిలో హరిజన శతకాన్ని కె. నారాయణ ఆంగ్లంలో అనువాదం చేసి అంబేద్కర్‌కి వినిపించడం జరిగింది. ఆ సభలో రాజమండ్రి ప్రజలు అంబేద్కర్‌కి బ్రహ్మరథం పట్టగా, ఆ వేదికలోనే కుసుమ ధర్మన్నను ఘనం సన్మానించారు.

కుసుమ ధర్మన్న జయభేరి పత్రికను ఒక లక్ష్యంతో ప్రారంభించారు. దళితులను విద్యావంతులుగానూ, ఆర్థిక, రాజకీయంగానూ, సాంఘీకంగానూ తీర్చిదిద్దాలనేది ఆయన ప్రధాన లక్ష్యం. ఈ పత్రిక ముఖ శీర్షికలో “మాలవాడ మేలుకో కూలీవాడ మేలుకో” అనే నినాదాన్ని ముద్రించడం విశేషం. 1939 జనవరి జయభేరి సంచికలో ఎడమవైపు గాంధీ చిత్రం ముద్రించి కుడివైపు అంబేద్కర్ చిత్రం ముద్రించి ఇద్దరి గురించి ఇలా రాశారు. “మధ్యాహ్నపు మాల సవతి తల్లి ప్రేమ స్వరాజ్యవాది కలవారి అండ” అని గాంధీ గురించి వ్యాఖ్యానించారు. అంబేద్కర్ గురించి రాస్తూ మహానాటి మాలకన్నతల్లి ప్రేమ స్వతంత్రవాది లేనివారి అండ” అని వ్యాఖ్యానించారు. ధర్మాన్న సామాజిక ఉద్యమాన్ని విశ్లేషించే క్రమంలో నిమ్నకులాల చైతన్య పోరాడే స్ఫూర్తికి అద్దం పడుతుంది.

**అంటరానితనం లేదంటారు**
**గాంధీ గాంధీయని కలవరిస్తారు**
**వాని శిష్యులమని తిరుగుతారు**
**గాంధీ బోధ మరువలేదంటారు**
**మా మాల మాదిగలంటే మండి పడిపోతారు**

అనే గేయంలో గాంధీజీ ప్రబోధించే అస్పృశ్యతలోని ప్రధానమైన లోపాలను ఆచరణాత్మకంగా లేని సైద్ధాంతిక ప్రతిపాదనలను కుసుమ ధర్మన్న ప్రశ్నించాడు. గాంధీయిజాన్ని అనుసరించే, గాంధేయ వాదుల చిత్తశుద్ధిని నిలదీస్తూ జాతి బేధాలను మరువలేదంటారు. మరి మాల మాదిగలంటే మండి పడిపోతారు. ఆచరించని సిద్ధాంతాలతో వీళ్ళు అంటరాని తనాన్ని నిర్మూలించే నాయకులు ఇదేనా గాంధీయిజం అని లోతైన విమర్శ చేశారు.

తొలుత గాంధీని అభిమానించిన ధర్మన్న వారి పిల్లలకు పావన మూర్తి మోహన్ దాస్ భాగ్యలక్ష్మి, వసుమతి, భగవాన్‌దాస్, మనోరంజన్ దాస్, ఝాన్సీలక్ష్మి, చిత్తరంజన్. పెద్ద కుమారుడు పావనమూర్తి రాజమండ్రిలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేసేవాడు. ఇప్పుడు కుసుమ ధర్మన్న పిల్లలందరూ చనిపోయారు. వారి మనుమలు రాజమండ్రి, గుంటూరు, హైద్రాబాద్‌లలో స్థిరపడ్డారు. అంబేద్కర్ ప్రభావంతో ఆయన గాంధీ కుట్రలను గ్రహించారు. కులమనే కాలకూట విషం నరనరాన జీర్ణించుకున్న హైందవ వర్ణ వ్యవస్థకి భిన్నంగా రచనలు చేస్తూ ధైర్యంతో తన స్వరాన్ని ధర్మన్న వినిపించాడు. ఆత్మ విశ్వాసం తెగువ ఉన్నవాడు కావడం వల్ల గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన "మాకొద్ది తెల్ల దొరతనం"కి ధీటుగా మాకొద్ధి నల్ల దొరతనం అనే గీతాన్ని రాయగలిగారు. స్వాతంత్రం వస్తే తెల్ల దొరల స్థానంలో నల్ల దొరలు అధికారంలోకి వస్తారు. అంటరానితనం కొనసాగుతూనే ఉంటుంది. సమాజంలో ఎప్పుడైతే అస్పృశ్యతభావన సమసిపోతుందో అప్పుడే దళితులు స్వతంత్రులవుతారని భావించాడు ధర్మన్న.

1920లలో ధర్మన్న హరిజనులు భవిష్యత్తులో ఏం చేయాలి అనే విషయాల పట్ల కరపత్రాలు వేసి పంచాడు. హరిజనుల అభ్యున్నతికోసం ఆది ఆంధ్రమహాసభలలో తీర్మానాలు చేసి అమలులోకి తీసుకువచ్చారు. 1) కల్లు, సారాయి మానండి. 2) శుభ్రతను పాటించండి, 3) చచ్చిన గొడ్ల మాంసం తినకండి, 4) పన్నెండు రోజుల పెళ్ళిళ్ళు కాకుండా ఐదు రోజులు పెళ్ళిళ్ళు చేసుకోండి, 5) ప్రతి పేటలోను మన మల్లయోధులు, మాల మాస్టీడుల వద్ద యుద్ధ విద్యలు నేర్చుకోండి. 6) మతం మారాలనుకున్న దళితులు ఇస్లాం, క్రైస్తవం మతాలలోకి స్వేచ్ఛగా వెళ్ళండి. ధర్మన్న వన భోజనాలను ప్రోత్సహించారు. మాల మాదిగలు ఒకేచోట కలుసుకోవడం జాతి సమైక్యత చిహ్నంగా భావించారు. అంబేద్కర్ ప్రభావంతో హరిజనుల పక్షాన ఉండి చైతన్య పరుస్తున్న ధర్మన్నను 1933లో తూర్పు గోదావరి జిల్లా సీతానగరం లోని ఆశ్రమానికి రమ్మని ధర్మన్నకు కబురు చేస్తే మీ అగ్రహారానికి నేను రాలేను. మీరే మా అంటరాని వాడలకు రమ్మని సందేశం పంపించిన ధైర్యశాలి కుసుమ ధర్మన్న. గాంధీ తనని రాజకీయాల్లోకి రమ్మని ఆహ్వానించగా ధర్మన్న సమాధానంగా నేను పూర్తిగా నిమ్నజాతి కోసం పనిచేస్తున్నవాన్ని పదవుల పైన నాకు ఆశలేదని సున్నితంగా తిరస్కరించాడు.

1946లో ఆయన మరణించడానికి కొన్ని గంటల ముందే హరిజన సోదరులతో కలిసి రాజమండ్రి కోటి లింగాలపేటలోని హిందూ దేవాలయ ప్రవేశం చేసిన ధైర్యశాలి. కుసుమ ధర్మన్న 46 యేండ్లకే మరణించిన సజీవంగా మిగలాల్సిన ఆయన అక్షరాలను కూడా ఆయన ఇంటితో పాటు కాల్చి బూడిద చేశారు. గుర్తుతెలియని దళిత విద్వేషకులు

అక్షరాలకి ఉన్న శక్తి వలన జనాల నాల్కల మీద ఉన్న ఆయన సాహిత్యాన్ని క్రోడీకరించి కొంతమేరకు సంపాధించగలిగారు. ఇప్పుడు లభించే కుసుమ ధర్మన్న చిత్రం కూడా ఊహాచిత్రమే తప్ప అసలుది కాదు. ఆయన ఆనవాళ్ళను సమూలంగా బూడిద చేసినా ఆయన చూపిన మార్గం, పోరాటం, విలువలు, చైతన్యం, తెగువ ఇప్పటి దళిత సాహిత్యకారులు, ఉద్యమకారులు పాటిస్తే అధిక శాతం ఉన్న దళిత బహుజనులకు రాజ్యం సిద్ధిస్తుంది. జై భీమ్.

**ఆధార గ్రంథాలు:**

1. తొలి దళిత స్ఫూర్తి కుసుమ ధర్మన్న
2. దళిత ఉద్యమ వైతాళికుడు - కుసుమ ధర్మన్న

* * *

 ISBN: 978-93-340-2436-4

13

# జయభేరి - రణభేరి

మాకినీడి సూర్య భాస్కర్,
9491 50 4045

తొలి దళిత కవి, వ్యాసకర్త, పత్రికా సంపాదకుడు, ప్రజావాగ్గేయకారుడు, వక్త శ్రీ కుసుమ ధర్మన్న కవి (క్రీ.శ 1900–1946); మీదు మిక్కిలి దళితోద్యమకారుడు. వృత్తిరీత్యా ఆయుర్వేద వైద్యులైన కుసుమ ధర్మన్నగారు, ప్రవృత్తిరీత్యా దళిత సమాజ రుగ్మతల్ని స్వస్థపరచనెంచిన సామాజిక వైద్యుడిగా కూడా వ్యవహరించారు. ఆ వ్యవహారానికి సంబంధించిన తన భావజాలానికి నేపథ్యంగా కవిత్వాన్ని, సాహిత్యాన్ని ఎంచుకున్నారు కుసుమ. ఆయన సృజించిన సాహిత్యం – 'నిమ్నజాతి తరంగిణి', 'నిమ్నజాతుల ఉత్పత్తి వ్యాసం', 'మద్యపాన నిషేధ వ్యాసం', 'అసుర పురాణం పద్యకావ్యం', 'అంటరానివాళ్ళం', 'హరిజన శతకం', ముఖ్యంగా మాకొద్దీ నల్లదొరతనం. ఆ కవిత్వాన్ని, సాహిత్యాన్ని సమాజంలో వ్యాపింపజేయడానికి ఆయన చేపట్టిన రణభేరి – 'జయభేరి', పక్షపత్రిక (1)

**సంఘ సంస్కరణ–ఆత్మగౌరవ స్ఫురణ :** చదువుకునే రోజుల్నించీ సంఘసంస్కరణ పట్ల అమితాసక్తి గల కుసుమ, తాను పుట్టిన జాతి పొందుతున్న దైన్య హైన్య స్థితి–అంటరానితనం, సామాజిక వివక్షల పట్ల తీవ్రనిరసన వెలిబుచ్చుతూ 'ప్రజావాగ్గేయకారుడు'గా (2) తన భావజాలాన్ని వ్యాపింపజేశారు. దాన్నింకా బలంగా ప్రజలమధ్యకు తీసుకెళ్ళడానికి, "ఆత్మ గౌరవంబు నలరంగ చాటడానికి" (3) జయభేరిని ప్రజా'పక్షం'ం చేశారు కుసుమ ధర్మన్న.

1921లో గరిమెళ్ళ సత్యనారాయణ "మాకొద్దీ తెల్లదొర తనము" అంటూ రాసి పాడనారంభించారు. ఆ స్ఫూర్తితోనే ధర్మన్న కవి "మాకొద్దీ నల్లదొర తనము" అంటూ రాసి పాడేవారు. ఈ రెండూ రెండు వేదికలపైన మారుమ్రోగేవి. గరిమెళ్ళ స్వాతంత్ర్యోద్యమ వేదికలమీద గళమెత్తేవారు. ధర్మన్న హరిజనోద్యమ వేదికలను దద్దరిల్ల జేసేవారు. వీరు పంచుకున్న ఈ వేదికలే వీరి భావజాలంలోని తేడాని తేటతెల్లం చేస్తాయి. స్వాతంత్ర్యం రావాలి, తెల్లదొరలు పోవాలి–ఈ విషయంలో కుసుమగారికేమీ ఇబ్బంది లేదు. కానీ స్వాతంత్ర్యం వస్తే తెల్లదొరల స్థానంలో నల్లదొరలు వస్తారు. వారు అంటరాని తనాన్ని అలాగే కొనసాగిస్తారు. అంటరానితనమనే భావన మనసుల్లో తొలగనంతవరకు, అది అలా కొనసాగుతూనే ఉంటుందన్నది అంబేద్కర్ భావజాలం. దాన్ని అందిపుచ్చుకుని, అంటరానితనమనే భావన తొలగినప్పుడు మాత్రమే దళితులకు అచ్చమైన స్వాతంత్ర్యం లభించగలదన్నది ధర్మన్నగారి అవగాహన. ఆ దిశలోనే సాగింది ఆయన ఉద్యమస్ఫూర్తి యావత్తూ!

**ధర్మాగ్రహం...దళితజనాగ్రహ ధర్మం!**

"మాకొద్దీ నల్లదొరతనము దేవా! / మాకొద్దీ నల్లదొరతనము
మాకు పదిమందితో పాటు పరువు / గలుగకయున్న
॥మాకొద్దీ నల్లదొరతనము॥

స్వంత పరిపాలన చేసేద్దమంటారు / చెంతకు మము జేరనీరు
స్వరాజ్య మనుచు సర్కారుతో పోరాడి / స్వాతంత్ర్యమ్ము నడుగుతారు
మాకు స్వతంత్రమియ్య మంటారు / మాకు హక్కు లేదంటే
స్వరాజ్య మెక్కడ దక్కు.../ మాకు హిందు సంగమునందు
స్వాతంత్ర్యమాగు వరకు / మాకొద్దీ నల్లదొరతనము!"
॥మాకొద్దీ నల్లదొరతనము॥(4)

అంటూ, నల్లదొరల అంటరానితనమనే అరాచకపుటవినీతి అంతమయ్యేదాకా స్వాతంత్ర్యమే వద్దని ధర్మాగ్రహంతో ఘోషించారు ధర్మన్న.

**పత్రికల ఆవిర్భావం-నవ్య భావజాల సంభవం :** అంతలో దేశవ్యాప్తంగా వచ్చిన గొప్ప మార్పు పత్రికల ఆవిర్భావం. క్రైస్తవ మిషనరీలు ముద్రణ యంత్రాల్ని స్థాపించి విజయవంతంగా తమ మత ప్రచారం చేయగలగడం అన్ని ఉద్యమాల నాయకులకీ స్ఫూర్తినిచ్చింది. ఎన్నో పత్రికలు వెలిశాయి. భాషా సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలతో పాటు, స్వాతంత్ర్య హరిజనోద్యమాలు కూడ పత్రికా మాధ్యమాన్ని చక్కగా వినియోగించుకున్నాయి. గ్రాంథిక, వ్యవహారిక భాషోద్యమాల వ్యాప్తికి, స్త్రీవిద్య ఆవశ్యకత, మూఢనమ్మకాల మౌఢ్య ఖండన వంటివాటికి పత్రికలు ప్రధాన సాధనంగా వినియోగపడతాయని ప్రబలంగా గుర్తించబడింది. ఆ విధంగా 1917 నుంచీ, దళిత పత్రికలు ఎన్నో పుట్టుకొచ్చాయి. దళిత పత్రిక అన్నదాన్ని ఎలా నిర్వచించాలి? దళితులు నిర్వహించిన పత్రికలా? దళితులగురించి రాసిన పత్రికలా? ఈ రెండు ప్రశ్నలకూ జవాబుగా వచ్చేదే దళితపత్రికకు నిర్వచనం. దళితులచేత దళితుల కొరకు దళిత సమస్యలను చర్చించిన పత్రికలని చెప్పుకోవచ్చు. (5)

మచిలీపట్నం కేంద్రంగా వేమూరి రాంజీరావుగారు 'దీనబంధు' పత్రికను ప్రారంభించారు. హైదరాబాదు కేంద్రంగా 'పంచమం' పత్రికను మన్యసంఘం ప్రారంభించింది. అయితే ఇవి దళితులకు సంబంధించిన వార్తలనే అధికంగా ప్రచురించేవిగాని, దళితులకు "ఒక సైద్ధాంతికమైన స్ఫూర్తిని ఇవ్వలేకపోయాయి" (6)

**దళిత జర్నలిజం-సైద్ధాంతిక స్ఫూర్తి :** 1937లో ప్రారంభమైన కుసుమ 'జయభేరి' ఒకానొక సైద్ధాంతిక స్ఫూర్తిని దళితుల్లో కలిగించింది. "పెట్టుబడిదారులు నిర్వహించే పత్రికల్లో

పీడిత ప్రజల ఆకాంక్షలకు తావులేదని గ్రహించి అనేక వ్యయప్రయాసలకోర్చి 'జయభేరి' పత్రిక స్థాపించి దళిత జర్నలిజానికి అంకురార్పణ చేశాడు. అణగారిన ప్రజల పోరాటాలకు గొంతునిచ్చి సందేశాత్మకమైన, సృజనాత్మకమైన శీర్షికలతో, సమానత్వ ఎరుకను ప్రబోధించే చిన్న కథలతో, రాజకీయ వ్యంగ్య వ్యాసాలతో 'జయభేరి'ని వెలువరించాడు" అంటారు శ్రీ కోయి కోటేశ్వరరావు (7)

అంతే కాకుండా, ఇంకా ఏమంటారంటే– "ఆంధ్రోద్యమ నేపథ్యంలో తన సమకాలీన తెలుగు కవులు ఆంధ్ర ప్రశస్తిని కవిత్వీకరిస్తున్నప్పుడు ఆయన 'అసుర పురాణం'తో మూలవాసులైన దళితులే భారతదేశ పూర్వపాలకులని, ఆర్యుల దండయాత్ర మూలంగా నిందించబడి నీచ జాతులుగా చిత్రింపబడ్డారని కొత్త ప్రతిపాదనలు చేశా"దంటారు. నిజానికివి ఏమాత్రం కొత్త ప్రతిపాదనలు కావు; చరిత్ర కర్కశంగా మరుగుపరచిన విషయాలు.

**జెండా, ఎజెండా–భాష, మాధ్యమం :** భాష, జెండా, ఎజెండా, మాధ్యమం ఎవరిది వారిదే అవుతుంది. పెట్టుబడిదారుల, అగ్రవర్ణాల భాష, వారి భావజాలం, దాన్ని వ్యాపింపజేసే మాధ్యమం, వారి కార్యాచరణ ఎజెండా దళితుల దెప్పటికీ కాదు, కాబోదు. మాధ్యమం అన్నది భాషా భావజాలాల మాధ్యమాలే కావు, జెండా ఎజెండాల మాధ్యమాలు కూడా (8). దేనికైనా సమాజంలో వ్యాప్తి కలిగించాలంటే, ఇవన్నీ కలిసిన మూకుమ్మడి ప్రచార చైతన్య మాధ్యమం అవసరం. అది గ్రహించిన తర్వాతనే ప్రత్యేకించి సైద్ధాంతిక దళిత పత్రికల ఆవిర్భావం జరిగింది. అటువంటి తొలి దళిత పత్రిక జయభేరి.

రెండొందల ఏళ్ళపాటు తమ దేశాన్ని తమకు కాకుండా చేసిన తెల్లదొరల మీద అగ్రవర్ణ భారతీయులకు ఎంతో ఆగ్రహం కలిగింది. స్వాతంత్రోద్యమ తిరుగుబాటు రగిలింది. ఆ అవగాహనను, ఆగ్రహాన్ని సామాన్య జన జీవితంలో భాగం చేయడానికి అప్పటి మేధావులందరూ పత్రికా నిర్వహణను చేపట్టారు. రెండొందల ఏళ్ళకే ఇంతగా విజృంభించారే అగ్రవర్ణ మేధావులు; మరి మూడువేల ఏళ్ళుగా ఆ అగ్రవర్ణకులాధిపత్యంతో అంటరానివారిగా అణచిపెట్టబడిన, ఊరికి దూరంగా వెలివేయబడ్డ వాడబ్రతుకుల దళిత ఆత్మగౌరవాన్ని మేల్కొలిపే అవగాహనను కలిగించి వారిని ఆగ్రహోదగ్రులుగా చేయాలంటే ... ఆ అగ్రవర్ణ కులాధిపత్య భాష, భావజాలం ఎలా పనికొస్తాయి? అగ్రవర్ణ కులాధిపత్యం "స్వరాజ్యం నా జన్మహక్కు" అనగలిగిందే కాని, దళితులను కూడా కలుపుకుని "స్వరాజ్యంతో పాటు, స్వగ్రామం కూడా మా జన్మహక్కు" అని నినదించలేకపోయింది (9). అలా అనగలిగిననాడు, అంటరానితనం సమాజంలో ఎందుకుంటుంది? అదే జరగలేదు. అందుకే దళితులు వారిదైన భాషాభావజాలాలతో పాటు, వారి జెండా ఎజెండాల పరివ్యాప్తికోసం అచ్చంగా వారివే అయిన పత్రికలను నిర్వహించుకున్నారు. తన జయభేరి ద్వారా దళితజన సామ్యవాద

తాత్త్విక భావజాలాన్ని, తత్సంబంధిత సైద్ధాంతిక విలువలతో కూడిన చర్చోపచర్చల్ని సామాన్య ఆదిమజనుల ఆలోచనల్లోకి ఇంకింపజేశారు. ఈ దిశలో కుసుమ ధర్మన్నగారు ఒక అడుగు ముందుకే వేశారు. దీనికి కారణం గాంధీజీ కమ్యూనల్ అవార్డును తిరస్కరించడమే.

**గాంధీ నుంచి అంబేద్కర్ దాకా :** మొదట్లో ధర్మన్న గాంధీ ఆశయాలతో ప్రభావితులై, ఆయన హరిజనోద్యమంలో భాగమయ్యారు. తన రచనల్లో ఆ విషయాన్ని ఏ భేషజమూ లేకుండా వివరించారు కూడా (10). గాంధీపై గౌరవంతో తన ఇద్దరి కుమారులకు పతితపావన మూర్తి, మోహనదాసు అన్న పేర్లు పెట్టుకున్నారు (11). క్రమేణా భారత జాతీయ కాంగ్రెస్ ధనికుల, పెట్టుబడిదారుల, అగ్రవర్ణ పెత్తందారుల చేతిలో కీలుబొమ్మ కావడం గుర్తించారు. అంబేద్కర్ ప్రతిపాదనతో దళితుల రాజకీయ హక్కుల పరిరక్షణ కోసం బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించిన 'కమ్యూనల్ అవార్డు'ను గాంధీ వ్యతిరేకించడం, దానికి విరుద్ధంగా ఆమరణ నిరాహార దీక్ష చేయడం, ఆయనపట్ల ధర్మన్నగారికి వ్యతిరేకత కలిగించింది. అందుకే, "గాంధీగారు మేక పాలు పిండుకొని త్రాగుతూ, మేక పిల్లని ఒడిలో వుంచుకొని దాని తల తోక సవరించి, 'నా ప్రియమైన మేకపిల్లా!' అని ముద్దాడి ప్రేమించడం ఎంతో ఆయనకు గల హరిజన సేవకులపై ప్రేమ కూడా అంతే"నని (12) అసలు లోగుట్టును ఘాటుగా బట్టబయలు చేశారు కుసుమ. అందుకే 1933లో రాసిన 'దండాలు' పాటలో-

**"దండాలండోయి బాబు దండాలండి**
**మేముండలేమండోయి బాబు దండాలండి**
**మేమేగలే మండోయి బాబు దండాలండోయి**
**ఈ సైతాను మతముతోను /సాగలేమండోయి /**
**మేమింక సాగలేమండోయ్!"**

అంటూ, తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా దళిత హక్కుల 'జయభేరి' మ్రోగించారు కుసుమ ధర్మన్న.

అంబేద్కర్ భావాల్ని అర్థం చేసుకుని, వాటికి పూర్తివ్యాప్తిని కలిగించడానికి 'జయభేరి'ని బాగా ఉపయోగించుకున్నారు ధర్మన్న. అసలు అంబేద్కర్‌ను మొదటిసారిగా ఆంధ్రాకి తీసుకువచ్చి ఆంధ్ర దళితులకు పరిచయం చేసినదే ధర్మన్న గారన్న విషయం మరువరానిది. "తెలుగులో అంబేద్కర్ స్ఫూర్తితో రచనలు చేసిన తొలికవి కుసుమ ధర్మన్న" అంటారు, కోయి కోటేశ్వరరావు (13). ఇంకా ఏమంటారంటే- "జయభేరి పత్రిక ముఖచిత్రంపై గాంధీ, అంబేద్కర్ చిత్రాలను ప్రచురించి, గాంధీది సవతితల్లి ప్రేమ అనీ, అంబేద్కర్‌ది కన్నతల్లి ప్రేమ అనీ ధర్మన్న సత్యసమ్మతంగా, సాహసోపేతంగా సూత్రీకరించా"డంటారు. 1939 జనవరి జయభేరి పత్రికలో గాంధీ, అంబేద్కర్‌ల చిత్రాలు వేసి, కింద ఇలా వ్యాఖ్యానించారు కుసుమ ధర్మన్న.

 ISBN: 978-93-340-2436-4

| | |
|---|---|
| గాంధీ గురించి: మధ్యాహ్నపు మాల | అంబేద్కర్ గురించి: మహానాటి మాల |
| సవతి తల్లి ప్రేమ | కన్న తల్లి ప్రేమ |
| స్వరాజ్య వాది | స్వతంత్ర వాది |
| కలవారి అండ | లేనివారి అండ |

దళితుల విముక్తికి గాంధీ సిద్ధాంతం కంటే అంబేద్కర్ సిద్ధాంతమే అనుసరణీయమని కుసుమ ధర్మన్న నమ్మా" డంటారు డా. శిఖామణి (13)

'జయభేరి' పత్రికను ఎందుకు ప్రారంభించాల్సి వచ్చిందో, దాని ఆవశ్యకత ఏమిటో ఒక సంపాదకీయంలో వివరించారు స్వయంగా కుసుమ ధర్మన్న. "ఇతర జాతులకు పత్రికలు అంతగా అవసరం లేదు. ఆ జాతులన్నియు ఉన్నత దశలోనే యున్నవి. పత్రిక కావలసినను, ప్రబోధము కావలసినను, ప్రచారము కావలసిననూ హరిజన జాతికే. ఈ జాతికే పత్రికలత్యవసరము. ప్రజలను కూడగట్టుటకు, సంఘముల నేర్పరచుటకు, సంఘీభావం కుదుర్చుటకు, స్వాతంత్ర్య యుద్ధమునకు, జాతి దాస్యవిముక్తి పోరాటమునకు, వీరులను తయారు చేయుటకు హరిజనులకు ప్రత్యేకముగా పత్రికలవసరము'' అన్నారు. హరిజనాభ్యున్నతి ప్రచార, ప్రసార, ప్రబోధ, ప్రచోదనలకే 'జయభేరి'ని మ్రోగించి, రణభేరిని చాటించారు కుసుమ ధర్మన్న.

**ప్రత్యామ్నాయ దృక్పథం-ప్రత్యామ్నాయ వైతాళికత్వం:** అంబేద్కర్ భావజాలాన్ని అందిపుచ్చుకుని, గాంధీయేతరమైన ప్రత్యామ్నాయ అవగాహనతో ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ఏర్పరచుకున్నారు కుసుమ. ఈ ప్రత్యామ్నాయ దృక్పథమే దళితులకు ప్రత్యామ్నాయ వైతాళికత్వాన్ని ఆపాదించింది. ఈ పరిణామాన్ని పూర్తిగా సాకల్యం చేసింది 'జయభేరి' పత్రిక అనడం అతిశయోక్తి కాదు. 'ఆది ఆంధ్ర కవిసార్వభౌమ'గా కీర్తింపబడిన కుసుమ ధర్మన్నగారు 'ఆది ఆంధ్ర వైతాళికుడు' కూడా! "కవితా శూరుడిగా, క్రియాసూర్యుడిగా జాతిని మేలుకొలిపి మూలాలను వెతికి పట్టిచ్చిన దళిత వైతాళికుడు కుసుమ ధర్మన్న కవి" అంటారు డా. ద్వా.నా. శాస్త్రి (15)

**"ఆర్యులనెడు బ్రాహ్మణాదు లాసియనుండి**
**వలస వచ్చి నీదు పంచకొచ్చి**
**కొల్లగొట్టి రాజ్యమెల్ల దోచితిరటయ్య"** అంటూ అంటరానితనపు మూలాలను వెతికి పట్టి, 'మాకొద్దీ నల్లదొరతనం' అనే గేయాన్ని తన జాతిజనుల జాతీయగీతంగా మలచారు. తాననుకున్న దళిత జాతీయవాదానికి మేనిఫెస్టోగా రచించారు కుసుమ ధర్మన్న.

శ్రీ క్షీరసాగర్ మాటలతో ముగించుకుందాం-"He was a great poet... He was

 ISBN: 978-93-340-2436-4

an Ambedkarist, Thinker and Activist. He started Telugu weekly 'Jaya Bheri'...His poems were very popular in those days, therefore he was popularly known as 'Modern Vemana'(16)

**పాదసూచికలు:**


1. ఆంధ్ర సర్వస్వము, మాగంటి బాపినీడు–జయభేరి, కె. ధర్మన్న కవి పుట 406
2. సి.వి. కృష్ణారావు, దళిత ఉద్యమ వైతాళికుడు–కుసుమ ధర్మన్న కవీంద్రుడు, జీవిత చరిత్ర, 2000
3. కుసుమ ధర్మన్న, 'హరిజన శతకము'– Kinege.com/Archived from the original
4. కుసుమ ధర్మన్న, మాకొద్దీ నల్లదొరతనము, ప్రజాశక్తి ముద్రణ, సెప్టెంబర్, 2016
5. డా. దార్ల వెంకటేశ్వర రావు, తెలుగులో దళిత పత్రికల తీరుతెన్నులు వ్యాసం (అంతర్జాలం)
6. శ్రీ కొంకే గౌరీశ్వరరావు, 'తెలుగులో దళిత పత్రికలపై పరిశీలన' ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం)
7. శ్రీ కోయి కోటేశ్వరరావు, (కుసుమ ధర్మన్న రచనా సంకలనాల ఆవిష్కరణ – సాహితీ సమాలోచన సభ, సెప్టెంబర్18, 2016 రామచంద్రరావు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్, రాజమహేంద్రవరం) అంతర్జాలం
8. శ్రీ సతీష్ చందర్, ముందు మాటలు, మాటలో పాగా! జనవరి, 8, 2018, అంతర్జాలం
9. పైదే, శ్రీ సతీష్ చందర్.
10. పుట్ల హేమలత, 1, ఆగస్టు 2016, తెలకపల్లి రవి (ఎడిటర్) – 'కుసుమ ధర్మన్న–మాకొద్దీ నల్లదొరతనము', పి.డి.ఎఫ్, సాహిత్య ప్రస్థానం, హైదరాబాదు
11. శ్రీ కోయి కోటేశ్వరరావు, పైదే
12. శ్రీ కోయి కోటేశ్వరరావు, పైదే
13. డా. శిఖామణి, సమాంతర, ఆధునిక కవిత్వ వ్యాసాలు, నందిని పబ్లికేషన్స్, 2006 పుట 76,
14. శ్రీ కోయి కోటేశ్వరరావు, ఆధునిక తెలుగు కవిత్వంలో అంబేద్కర్, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 2023
15. డా. ద్వానా శాస్త్రి, తొలి దళిత కవి కుసుమ ధర్మన్న, 2004
16. Ksheer Sagar, Dalit Movement-In India and its Leaders, p225


* * *

 ISBN: 978-93-340-2436-4

14

# సమాజ హితం ధర్మన్న అభిమతం

**డాక్టర్ శివకుమార్ నందనవనం**
తెలుగు శాఖాధిపతి,
పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్సు కళాశాల,
విజయవాడ.
చరవాణి: 9440233351

"సమాజ హితం ధర్మన్న అభిమతం" గా భావించి కుసుమ ధర్మన్న తన ధర్మాన్ని ధర్మబద్ధంగా దర్శించిన ధర్మాత్ముడు. వీరి రచనలలో అణువణువునా సమాజం కోసం ఆయన పడ్డ తపన, తాపత్రయం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. వీరి రచనలు కొన్ని గమనిస్తే చాలు అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, వారిలో చైతన్య స్ఫూర్తిని నింపేందుకు తాను చేసిన కృషికి అద్దం పడతాయి.

కుసుమ ధర్మన్న "నిమ్నజాతి తరంగిణి" అనే ఈ కావ్యంలో ఏం చెప్పదలచుకున్నాడో ఆ పేరులోనే సూచించాడు. నిమ్నజాతులుగా ఆనాటి సమాజంలో పరిగణించబడే జనుల పక్షాన నిలబడిన మనీషి కుసుమ ధర్మన్న.

అలాగే గరిమెళ్ళ సత్యనారాయణ వ్రాసిన మాకొద్దీ తెల్లదొరతనం 1921లో వెలుగుచూస్తే, అదే సంవత్సరంలో అనగా 1921లోనే కుసుమ ధర్మన్న వెలుగు చూపిన పచ్చి నిజం మాకొద్దీ నల్లదొరతనం. ఇక్కడ ఉన్న అంతరార్థం మనం గమనిస్తే అసలు తెల్లదొరలు మన దేశాన్ని ఆక్రమించడానికి ఆజ్యం మన నల్లదొరలు పరాయిపాలకులు చూపే పచ్చడి మెతుకులకు ఆశపడి మన దేశీయులలోనే చిచ్చు రేగడానికి కారణభూతం అయిన వారు మన నల్లదొరలు అంటూ... అయ్యా గరిమెళ్ళ నువ్వు పరాయి పాలకులైన తెల్లదొరల గురించి ఆలోచిస్తున్నావ్. నేను నల్లదొరల గురించి ఆలోచిస్తున్నాను. కారణం ఏంటంటే "ఇంటగెలిచి రచ్చగెలవాలన్న" సామెత మన తెలుగు వారికి తెలియందికాదు కదా! ఈ నేపథ్యంలో ముందు మన నల్లదొరలు మన దేశీయులందరినీ భారతీయులుగా మానవతా ధర్మాన్ని ఆచరిస్తే అసలు తెల్లదొరలకు మనదేశాన్ని పరిపాలించే అవకాశం వచ్చేదా? అన్న ప్రశ్న ఉత్పన్న మయ్యేలా మాకొద్దీ నల్లదొరతనం అంటూ కుసుమ ధర్మన్న ఆనాటి సమాజంలోని చాతుర్వర్ణ వ్యవస్థలోని దుర్మార్గాన్ని "మాకొద్దీ నల్లదొరతనం" అంటూ తిరుగుబాటు బావుటా ఎగరేశాడు, తన రచనను వెలుగులోకి తెచ్చాడు. వాడ వాడలా ఈ పాటపాడేలా ప్రజలలో చైతన్యం తెచ్చిన స్ఫూర్తి, దళితరత్న కుసుమ ధర్మన్న. "రాజకీయ

స్వాతంత్ర్యం కోసం గరిమెళ్ళ గేయం రాశాడు. సాంఘిక సమానత్వం కోసం ధర్మన్న గీతం రాశాడు" (చూడుము పుట సంఖ్య 45 సి.వి రచనలు దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు)

అంతేకాదు ఆనాటి సమాజంలో భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తే కేవలం తెల్లదొరల పాలన పోయి నల్లదొరల పాలన వస్తుందే తప్ప సామాన్యుల, దళితుల బ్రతుకుల్లో ఏవిధమైన మార్పు రాదంటూ అంటరాని వారుగా సమాజంలో పరిగణించబడే జనుల పక్షాన నిలబడినవాడు కుసుమధర్మన్న అనడం అక్షరసత్యం.

కానీ మాకొద్దీ తెల్లదొరతనం ముందా లేక మాకొద్దీ నల్లదొరతనం ముందు రచనా అనే మీమాంశ పండితలోకంగా ఒక చర్చనీయాంశంగా కూడా జరిగనట్లు రేఖామాత్రంగా నేనెరుగుదును. ఏదిఏమైనా వారిద్దరికిని ఎటువంటి బేధభావం లేదనేది నా నిశ్చిత అభిప్రాయం. మాకొద్దీ తెల్లదొరతనం అంటూ పరాయి పాలకులను తరిమి కొట్టాలని గరిమెళ్ళ తన గళం విప్పి కలం కన్నెర్రజేస్తే మరొకరు మన ధర్మన్న, కుసుమ ధర్మన్న మన పాలకుల (ఉన్నత వర్గాల/నల్లదొరల) దాష్టీకాలను దుయ్యబట్టేలా తన కలం కత్తులను ఛురకత్తులుగా దూసిన దళిత వీరుడు.

అదే విధంగా 1930లో వెలుగు చూసిన కుసుమ ధర్మన్న 'మద్యపాన నిషేధం' గురించి ప్రస్తావించినట్లయితే అసలు మన భారతదేశంలో మద్యం తయారీ ఉన్నదా? అన్న ప్రశ్న ముందు మనం యోచించాల్సిన అవసరం ఉంది. వాస్తవంగా పురాతన కాలం నుండి పరిశీలిస్తే కేవలం కల్లు మాత్రమే మనదేశంలో ఉన్న మత్తుమందు అనేది పౌరాణిక కాలం నాటి నుండి మనమెరుగుదుము. కానీ ఎప్పుడైతే విదేశీయులు మనదేశంతో వాణిజ్య వ్యాపార కార్యకలాపాలకోసం అంటూ వచ్చారో అప్పుడు విదేశీ పాలకులు వారి అలవాట్లలో భాగంగా మన భారతీయులను కూడా మద్యం మత్తుకు అలవాటు చేసి ఆనాడు మన భారత భూభాగాన్ని పరిపాలిస్తున్న పలువురు రాజులను హతమార్చి లేదా వారిని మద్యం మత్తులో దించి, ముంచి మద్యానికి వారిని బానిసలను చేసి తనకు కావాల్సిన కార్యం (పరిపాలనకు పగ్గాలు చేపట్టడం) నెరవేర్చుకున్నాడని భావించాల్సి ఉంటుంది. కానీ మనదేశంలో తయారు కాని మద్యం, మద్యపానం నిషేధించాలంటూ ఆనాడే ప్రముఖ సాహితీవేత్తగా కుసుమ ధర్మన్న రచనల ద్వారా మనకు తెలియవస్తుంది. మద్యం మత్తుకు అలవాటు చేసి మనవారి ఇల్లు, ఒళ్ళు గుల్ల గుల్ల చేస్తున్నాడు అంటూ 'మాకొద్దీ తెల్లదొరతనం' లో గరిమెళ్ళ ఎత్తిన గళాన్ని సమర్థిస్తున్నాడా! కుసుమ ధర్మన్న! అనే విధంగా 'మద్యపాన నిషేధం' నిలుస్తుందని కూడా భావించవచ్చు. ఇక్కడ మద్యం మత్తులో బానిసలైతే మన

 ISBN: 978-93-340-2436-4

బంగారు భవిష్యత్తు, కుటుంబం వీధిన పడే స్థితిగతులు దాపురిస్తాయని హెచ్చరిక చేసిన సామాజిక హితైషి కుసుమ ధర్మన్న.

'అసుర పురాణం' విషయానికి వస్తే నాడు సమాజంలో దళితులను ఓ రాక్షసమూకలా భావించి దరి చేరనీయని ఉన్నతవర్గ ఛాందసవాద ధోరణులకు, దళితుల సాదక బాధకాలకు అద్దం పడుతుందీ అసురపురాణం అని చెప్పవచ్చు.

'అంటరానివాళ్ళు' కథాసంపుటిలోని కథల పేర్లు ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేకతను చాటుకున్న కథలు. ఆనాటి సమాజంలో పేదరాశిపెద్దమ్మ కథలు అంటే జనులు ఎంతో ఆసక్తిగా వినేవారు. అటువంటి జనుల నాడిని గమనించి నాటి జనులకు కథలంటే ఇష్టం గనుక సమాజంలోకి అత్యంత సులువుగా చొచ్చుకు పోగలిగిన కథా ప్రక్రియను కుసుమ ధర్మన్న ఎంచుకొని నాటి సమాజంలోని ఛాందసవాదులైన ఉన్నత వర్గాలను ప్రస్తావిస్తూ, కులాలను పేర్లుగా, పేర్లను సైతం కులాలుగా పాఠకుడికి అవగతమయ్యేలా కథలోని పాత్రలకు పేర్లు పెట్టి ఆనాటి సమాజంలోని ఉన్నత వర్గాలచేత సైతం తన కథారచనలను ఆసాంతం చదివించేలా చేశాడు కుసుమ ధర్మన్న. నాటి వాస్తవ గాథలను కథలుగా మలిచాడు. కన్నుల ముందు సాక్షాత్కరింపచేశాడు. ఈ నేపథ్యంలోనే కుసుమ ధర్మన్న సమాజంలో ప్రతి ఒక్కరూ పాటించాల్సిన మానవతా ధర్మాన్ని చాటి చెబుతూ, అంటే **"మన కులం మానవకులం మన మతం మానవత్వం"** అని చాటిచెప్పేలా అంటరాని తనం నేరం అనే ఒక చైతన్యాన్ని సమాజంలో ఉద్యమంలా లేవనేత్తాడు.

'మాలకాకి' నవల విషయానికి వస్తే మాలకాకి పేరు వినగానే మనకు గుర్తుకొచ్చేది. మన ఇరుగు పొరుగు ఇళ్ళ మధ్యలోని చెట్లపై గూడు కట్టుకుని నివాసముండే సృష్టి ధర్మాన్ని చాటిచెప్పే కావు కావు (ఈ క్షణభంగురమైన జీవితంలో నీవేవీ కావు) అని అరచే కాకులు. ఆ కాకుల మూకలు సైతం అదే కోవకు చెందిన మాలకాకి మరింత నలుపు రంగులో ఉండి చూచేందుకు కాకుల మూకకు భిన్నంగా ఉందని తోచి మాలకాకిని గోల చేసే కాకుల వలె నాటి సమాజంలోని కులపోళ్ళను పలురకాలుగా నిందిస్తున్న ఉన్నతవర్గాల జనులపట్ల ఛురకత్తులను దూసినవాడు కుసుమ ధర్మన్న. ఇక్కడ నువ్వు నేను ఇద్దరిదీ మానవకులమే. మనం మానవజాతి కులపోళ్ళమే అనే ధ్వని నర్మగర్భంగా పలికించాడు కవి కుసుమ ధర్మన్న.

కుసుమ ధర్మన్న ఆయుర్వేద వైద్యుడుగా తన తన వృత్తి ధర్మాన్ని స్వీకరించి అంకిత భావంతో ధర్మబద్ధంగా విధులు నిర్వర్తించి సమాజంలోని జనులకు స్వస్థతను చేకూర్చే పలు ఆయుర్వేద వైద్య విషయముల సారాంశమే 'స్వస్థవృత్తము' (వైద్య గ్రంథం) సమాజంలో

 ISBN : 978-93-340-2436-4

జనులకు ఆరోగ్య విషయాలకు సంబంధించిన పలు అంశాల సమాహారం.

“ఆలకింపుమయ్య హరిజనుండా!” అనే మకుటంతో రాసిన ‘హరిజన శతకం’ ఆసాంతం హరి జనులైన దేవుని బిడ్డల (హరిజనుల) పాలిటి కల్పవృక్షమే నని చెప్పాలి. ఈ హరిజన శతకంలో నాటి సమాజంలో హరిజనులుగా పిలువబడే ఒక జాతి జనులపై చూపిస్తున్న విపరీత ధోరణులను ఎదుర్కోవడమేలాగా అనే లోతైన భావాలు వారిలో (హరిజనులలో) ఉద్యమ స్ఫూర్తిని, చైతన్య దీప్తిని రగుల్కొలిపాయి అనడం అతిశయోక్తి కాదు.

మొత్తం మీద కుసుమ ధర్మన్న కేవలం సమాజ హితం కోరడమే తన అభిమతంగా తన రచనలను కొనసాగించిన ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎందుకంటే ఆనాటి పండితలోకంలో కూడా అంటే సాహిత్యలోకంలో కూడా ఆ కుల వివక్షత కొనసాగిన దాఖలాలు ఉన్నాయనడం అతిశయోక్తి కాదు. నాడే కాదు నేటి తరంలో కూడా అనేకమైన సన్నివేశాలలో, సంధర్భాలలో, అవకాశాలలో కూడా కులం పిచ్చిముదిరిన వైనం మనం గమనిస్తూనే ఉన్నాం. కుల వివక్ష పోవాలనే కుసుమ ధర్మన్న చేసిన పోరాటం నిజం చేయాలంటే నేటి తరం మానవతా ధర్మాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని భావించాలి.

“గాంధీజీ ఇండియాలో హరిజనోద్యమం ప్రారంభించడానికి చాలా ఏళ్ళకి పూర్వమే కృష్ణాజిల్లాలో హరిజనోద్ధరణ కృషి ప్రారంభించబడింది. అయితే ఈ కృషికి వున్న పరిమితుల్ని సైతం మనం తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి. కందుకూరి వీరేశలింగం యొక్క అగ్రగణ్య శిష్యుడైన రఘుపతి వెంకటరత్నం, కాకినాడ పి.ఆర్.కాలేజీ కేంద్రంగా చేసిన మహత్తరమైన కృషిని ఎట్టి పరిస్థితుల్లోనూ మనం మరువగూడదు.” (చూడుము పుట సంఖ్య 36 సి.వి రచనలు దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు)

**ఉపసంహారం :** కుసుమ ధర్మన్న వృత్తిరీత్యా ఆయుర్వేద వైద్యుడు ప్రవృత్తిరీత్యా సాహితీ కోవిదుడు, తొలి దళిత కవి, రచయిత, వక్త, జయభేరి పత్రిక సంపాదకుడు, గొప్ప ఉద్యమకారుడు, ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో పండితుడు. “మాకొద్దీ నల్లదొరతనం” గేయ రచయితగా ప్రసిద్ధికెక్కినవాడు, ఆయన రచనలలో కొన్నింటిని మాత్రమే ఇక్కడ రేఖామాత్రంగా ప్రస్తావించాను. ఆయన ఏనాడు తన స్వగతం చాటుకోలేదు. ఆ దిశగా అడుగులు వేయలేదు. కేవలం సమాజంలో మార్పు రావాలి. చైతన్యం తేవాలి అనే తపన, తాపత్రయం. ఇంకా చెప్పాలంటే నాటి సమాజంలోని దురాచారాలలో భాగమే ఈ అంటరానితనం అని భావించి ఓ సామాన్యుడిగానే తన కలాన్ని ఛురకత్తుల్లా ఝుళిపించి ఉన్నత వర్గాల పాలిటి యమపాశంలా నిల్చినవాడు మన కుసుమ ధర్మన్న. ఆయన పేరులోనే

 ISBN: 978-93-340-2436-4

కుసుమం పుష్పం ఉంది. అది ఎలాంటి పుష్పం? ధర్మన్న పుష్పం. అందుకే నేనంటాను నాటి సమాజంలో దుర్గంధ భరితమైన కులం కంపును పారద్రోలేందుకే పుష్ప పరిమళాలను వెదజల్లడానికి అవతరించిన రూపమే దళితజాతికి దార్శనికుడు కుసుమ ధర్మన్న. సమాజ హితమే తన అభిమతంగా భావించిన వాడు కుసుమ ధర్మన్న.

**ఆధార గ్రంథాలు : -**


1. మాకొద్దీ తెల్ల దొరతనం - గరిమెళ్ళ సత్యనారాయణ
2. మాకొద్దీ నల్లదొరతనం - కుసుమ ధర్మన్న
3. హరిజన శతకము - కుసుమ ధర్మన్న
4. అంటరానివాళ్ళు - కుసుమ ధర్మన్న
5. అసురపురాణం - కుసుమ ధర్మన్న
6. మాలకాకి - కుసుమ ధర్మన్న
7. మధ్యపాన నిషేధం - కుసుమ ధర్మన్న
8. దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న - సి.వి. రచనలు

 ISBN: 978-93-340-2436-4

# 15 మాకొద్దీ నల్ల దొరతనం – దళిత జీవన చిత్రణ

**డా. పసుపులేటి నాగమల్లిక**
తెలుగు ఆధ్యాపకులు
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అ)
కాకినాడ.

ఆనాడు దళిత వర్గం నుంచి అతి కష్టం మీద చదువుకుని తన జాతి మేలు కోసం కృషి చేసిన దళిత విద్యావంతుల్లో 'కుసుమ ధర్మన్నగారు' ఒకరు. వీరు 1900 లోరాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపు పేటలో కుసుమ వీరాస్వామి, నాగమ్మ దంపతులకు జన్మించారు. వీరికి తెలుగు, సంస్కృతము, ఆంగ్లము, హిందీ, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం ఉంది. చదువుకునే రోజుల్లోనే సంఘసంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం చేత ప్రభావితులైనారు. వైద్యరంగం, సాహిత్య, సృజన, కళారంగం, పత్రికా నిర్వహణమనే పలు వక్తృత్వగుణాలతో ధర్మన్న ఆనాటి ఆంధ్ర సమాజాన్ని ముఖ్యంగా దళితజాతిని ఉత్తేజపరిచారు.

వీరు వైద్య విద్వాన్ పరీక్ష ఉత్తీర్ణులైన ధర్మన్న తను నేర్చిన ఆయుర్వేద వైద్యాన్నినాటి గ్రామీణులకు, పేద దళితులకు అందించిన ప్రజా వైద్యులు. పద్యం, గేయం, కథ, నవల, వ్యాసం వంటి సాహితీ ప్రక్రియల్లో ఎన్నదగిన రచనలు చేసిన కవీ, రచయిత, పరిశోధకులు. హరిజనుల స్థితిగతులకు చలించి వారి వెతలను హరికథల రూపంలో కూర్చి హరిజన వాడల్లో గొంతెత్తి గానం చేసి, చిందేసిన ఆధునిక ప్రజావాగ్గేయకారులు, తొలి దళిత కవి ధర్మన్న. వీరు అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితులై అంబేద్కర్ గురించి ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారం చేసి ఆంధ్రదేశానికి తొలిగా పరిచయం చేసింది ఈయనే.అంతేగాక అణగారిన జాతులకు గొంతుకనిస్తూ, అంబేద్కర్ భావాలను ప్రచారం చేయటానికి జయభేరి అనే పక్ష పత్రికను సస్థాపించారు.

వీరు నిమ్న జాతి తరంగిణి, మాకొద్దీ నల్లదొరతనం,నిమ్న జాతుల ఉత్పతి వ్యాసం,మధ్య పాన నిషేధం వ్యాసరచన,అసుర పురాణం పద్యకావ్యం, అంటరాని వాళ్ళం, హరిజన శతకం, నల్ల కాకి నవల అనే రచనలు చేసారు. వీటిలో వీరు రాసిన "మాకొద్దీ నల్లదొరతనం గేయంలో ఆనాటి దళిత జీవితాల్ని ఏ విధంగా చిత్రీకరించారో" వివరించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

1921లో గరిమెళ్ల సత్యనారాయణ "మాకొద్దీ తెల్ల దొరతనము" అనే గేయాన్ని వ్రాశారు. అదే సంవత్సరం కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము అనే గేయాన్ని రచించారు. ఆ కాలంలో స్వాతంత్ర్యోద్యమ, హరిజనోద్యమ వేదికలపై ఈ రెండు గీతాలు

మారుమ్రోగేవి. స్వాతంత్ర్యం వస్తే తెల్లదొరల స్థానంలో నల్లదొరలు వస్తారు. అంటరానితనం కొనసాగుతూనే ఉంటుంది. ఎప్పుడైతే అస్పృశ్య భావన తొలగిపోతుందో అప్పుడే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం అని వీరు భావించి ఈ గేయాన్ని రచించి స్వయంగా గానం చేస్తూ ప్రచారం చేశారు.

**"మాకొద్దీ నల్లదొరతనము దేవా!**

**మాకొద్దీ నల్లదొరతనము......"** అనే పల్లవీ, అనుపల్లవులతో ఈ గేయాన్ని రాశారు. 1933లో ఈ పాటని నాల్గవ ముద్రణ చేసినప్పుడు ధర్మన్న కవి పల్లవిని మార్పుచేశారు. మాకొద్దీ నల్లదొరతనము అనే పల్లవికి బదులుగా 'అంటుదోషము బాపుమయ్య దేవా! అంటుదోషము బాపుమయ్య కడుపుగొట్టి, నెట్టి కడగండ్ల గుడిపేట–అంటుదోషం బాపుమయ్య' అని మార్పు చేశారు.

ఈ గేయంలో 32 ఖండికలున్నాయి. ఈ పుస్తక ప్రారంభంలో 'భారతమాత' అనే శీర్షికతో భారతదేశాన్ని ప్రస్తుతించటం కన్పిస్తుంది. కవులను, శూరులను, ఆధ్యాత్మిక క్షేత్రాలను సంపదకి నిలయమైన భరతమాత శుభాన్ని కలిగించాలని కోరుకుంటారు. ఈ విధానం ధర్మన్నలోని దేశభక్తిని వెల్లడిస్తుంది.

**"మాకొద్దీ నల్లదొరతనము దేవా!**
**మాకొద్దీ నల్లదొరతనము...**
**మాకు పదిమందితో పాటు పరువు**
**గలుగకయున్న మాకొద్దీ నల్లదొరతనము**
**పన్నెండుమాసాలు పాలేరుతనమున్న**
**పస్తులు పడుతూ బతకాలండీ**
**ఆలికూలీ జేసి తీరాలండీ**
**పిల్లగాడు పశువుల గాయాలండీ**
**పగలూరేయీ పాటుపడ్డానండీ**
**కట్టగుడ్డ కూడు గిట్టదండీ**
**రోగమొస్తే నాగ దప్పదండీ**
**అప్పుతీరదీ చిత్రమేనండీ**
**ఈ నిప్పుపైనిక మేము నిలువలేమో తండ్రీ!" //మాకొద్దీ//**

అంటూ కుసుమ ధర్మన్న గారు నల్ల దొరలూ చేసే అవినీతిని తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటారు. దళితులు, బ్రిటిషు పాలనలో కంటే, స్థానిక అగ్రవర్ణాల పాలనలో మరింత నలిగిపోతారని మొట్టమొదటగా చాటింది కుసుమ ధర్మన్నే. కాంగ్రెస్‌లో ఉంటూనే 'మాకొద్దీ నల్లదొరతనము' అంటూ గళం విప్పిన ధైర్యశాలి. హరిజన కులాన్ని కుయుక్తితో

వర్ణవ్యవస్థ స్థాపకులే సృష్టించారనే విషయాన్ని చూపుతూ మనుస్మృతి, భగవద్గీతల శ్లోకాలని ప్రస్తావించారు. నల్లదొరతనం గేయంలో పన్నెండుమాసాలు పాలేరుతనము ఉంటూ పస్తులు పడుతూ బతకాలని ఆలికూలీ జేసిన, పిల్లగాడు పశువుల కాసిన పగలురేయీ పాటుపడ్డా కట్టగుడ్డకూడు గిట్టదండీ రోగమొస్తేనాగ దప్ప దండి అప్పుతీరదీచిత్రమేనండి ఈ నిప్పుపైనిక మేము నిలువలేమో తండ్రీ! మాకొద్దీ నల్లదొరతనము అంటూ దళితుల దీనావస్థను పాటగా మలిచాడు.

**పాడిపంటలు మేము కూడబెడితేవారు**
**కూర్చోనితింటామంటారు**
**నాములిచ్చి నట్టేటముంచేరు**
**ఎంచి అప్పు - అప్పు పెంచుతారు**
**చెంపకొట్టి కొంపలాగుతారు............".//మాకొద్దీ//**

పాడిపంటలు మేము కూడబెడితేవారు కూర్చోనితింటామంటారు. నాములిచ్చినట్టేటముంచేరు ఎంచి అప్పు- అప్పు పెంచుతారు చెంపకొట్టి కొంపలాగుతారు. తమ దొరల దగ్గర ఇంటిల్లిపాదీ అనగా భార్యాబిడ్డలతో కాయకష్టం చేసి పొలంలో చెమట చుక్కలు కార్చి పంట పండించి ధాన్యరాశుల్నికూడబెడితే వారు. అప్పులను పెంచుతూ చెంప పగులగొట్టైనా ఉన్న చిన్నకొంపని కూడా లాక్కుంటారు. దళితులతో పని అవసరం ఉన్నప్పుడు మాత్రం అంటు చూపించరు. ఇళ్ళలో పనులు చేసేటప్పుడు, పాత్రలు, జొన్న కోసిన తర్వాత తిరిగి చిగురించే కడిగేటప్పుడు, బట్టలు ఉతికినప్పుడు, పంటనూర్చి వారికి అందించేటప్పుడు ఆ అంటరానితనాన్ని ఒంటరితనాన్ని చేస్తారని తెలుపుతూ ఆనాటికీ, ఈనాటికీ దళితకూలీలకు జరుగుతున్న అన్యాయాన్ని అప్పుడే ధైర్యంగా ప్రశ్నించిన ధర్మజ్ఞాని ధర్మన్న.

**"స్వంత పరిపాలన జేసేద్దమంటారు**
**చెంతకు మము జేర నీరు....**
**స్వరాజ్య మనుచు సర్కారుతో పోరాడి**
**స్వాతంత్రము మడుగుతారు**
**మాకు స్వతంత్రమియ్యమంటారు**
**మాకు హక్కు లేదంటే స్వరాజ్య మెక్కడ దక్కు ....**
**మాకు హిందుసంగము నందు**
**స్వాతంత్ర్య మాగు వరకు**
**మాకొద్దీ నల్లదొరతనము.!**

అంటూ మాకు హక్కులు లేవంటే నిజమైన స్వరాజ్యము ఎక్కడుందని ప్రశ్నించిన ధీశాలి. ఇంకా ఈ గేయంలో నిరుపేద దళితుల అణిచివేత భరించలేని బాధలను నిప్పులతో

 ISBN: 978-93-340-2436-4

పోలుస్తూ ఆ నిప్పులపైన దళితజాతి నిలబడలేదని ఆక్రోశిస్తూ కనికరం లేకుండా కడుపు మాడ్చే యజమాని జులుంని ప్రశ్నిస్తారు. పదిమందితో పాటు తమ జాతికి కూడా పరువుగా బ్రతికే హక్కుఉండాలని ఆశిస్తారు. కోర్టులకెక్కిస్తూ మాలమాదిగలంటూ మండిపడుతుంటారు. ఊరిచివరలో పూరిగుడిసెలో సరియైన గోడలు కూడా లేని తడికెల మధ్య నివసించే బడుగు వర్గాలకి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టని ఊహించలేము. ఇంకా నగలూ, దున్నుకోవడానికి పొలమూ వస్తాయని ఎలా ఆశపడగలరు? దేశంలోని ప్రజలందరికీ ఈ వర్గాల ప్రజలను భరించటం చేదుగా ఉంటుంది. కనీసం దయ కూడా పుట్టదు. ఇటువంటి స్థితిలో వున్న దళితుల బాధని తన బాధగా చేసుకుని ఈ గేయాన్నిఆవిష్కరించారు ధర్మన్నకవి.

ఆకలిని, లేమిని అవహేళన చేస్తూ పైకి మాత్రం ఎదుటివారి పేదరికాన్ని, ఒకవరంలా, భావించుకోమని ఉచిత సలహాలిస్తుంటారు. ఒంటినిండా గుడ్డకట్టుకోవడం కంటే గోచిగుడ్డేమేలని, చుట్టు గుడిసేలాంటి కొంపల్లోనే లక్ష్మీదేవి తిరుగాడుతుందని, గంజి బలమైన ఆహారమని దళితులకు నూరిపోస్తూ ఖాళీ చెంచాలతో కడుపునింపే కామాంధుల కుళ్లుని కడిగేస్తారు.

ఈ రోజుల్లో కూడా కొన్ని ప్రాంతాలలో హోటళ్ళలో అంటరానితనం, రెండుగ్లాసుల పద్ధతి కొనసాగుతూనే ఉంది. ఆకలితో చచ్చిపోయే స్థితిలో ఉన్నా కూడా అన్నసత్రాలు ఉండేవి కావని నోరెండి పోయినా, తాగటానికి నీరు దొరకదని మొక్కటానికి కనీసం దేవుడు కూడా లేడని, కనికరించు రాడని, తాము మనుషులమనే మాటే మరచిపోయారని ఆవేదనతో గుండెలు రగిలే దళితుల జీవితాల్ని ఈ గేయంలో ఏకరువు పెడతారు.

'ఈ గీతం తరతరాల దళితుల పరాభవ పరాజయ పరంపరల్ని ప్రతిబింబించే ఉష్ణరక్తకాసారం - రక్తకన్నీటి ప్రవాహం." అని సివి గారన్న మాటలు అక్షర సత్యాలు. "మాకొద్దీ నల్లదొరతనము- మాల మాదిగలంటే మండిపడిపోతారు" అని ఆనాడు మహోగ్ర కంఠస్వరంతో పంచ భూతాలు దద్దరిల్లేట్లు నినదించిన ధర్మన్న ఆధునికాంధ్ర సాహితీ చరిత్రలో ప్రప్రథమ దళిత ప్రజావాగ్గేయకారుడు. ఈ గేయం ఆధునికాంధ్ర గేయ కవితా చరిత్రలో దళిత జనోద్ధరణకు పూరించిన శంఖారావం.

ఆధార గ్రంథాలు :

1. కుసుమ ధర్మన్నకవి రచనలు - దళిత దృక్పథం -మద్దుకూరి సత్యనారాయణ
2. దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమధర్మన్న కవీంద్రుడు- సి.వి రచనలు
3. మాకొద్దీ నల్ల దొరతనము - కుసుమ ధర్మన్న
4. సాహిత్య ప్రస్థానం పత్రిక - హైదరాబాదు

 ISBN : 978-93-340-2436-4

16

# తొలి దళిత కవి కుసుమ దర్మన్న రచనలలో సంఘ సంస్కరణ

**డా॥ బిహెచ్.వి.రమాదేవి,**
తెలుగు ఉపన్యాసకురాలు,
ఆదిత్య డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం.
చరవాణి : 6305543917

సృజనకు ఒక సామాజిక వర్గం అని గానీ, తాడిత పీడిత వర్గం అనిగానీ, స్త్రీ పురుష భేదం గానీ ఉండదు. అనేక బాధలు పడుతూ, వైఫల్యాలను విజయాలుగా మార్చుకుని, మంచి చెడుల తారతమ్యం తెలియజేసే మహానీయులు ఉంటారు. మనీషులు ఉంటారు. తమ కవిత్వంలో, వారి బాధలు చెబుతుంటారు. బాధించేవారి అజ్ఞానానికి మూర్ఖత్వానికి కొందరు జాలిపడుతుంటారు. మరి కొందరు ఆవేదన చెందుతారు. ఇంకొందరు తమ సృజనాత్మకతతో ఉన్నతస్థాయికి తీసుకెళుతుంటారు. వీరందరి సమున్నత వ్యక్తిత్వం కుసుమధర్మన్న లో ఉంది. ఏది సముచితమో, అది చేస్తారు. ఎంతో వివేకంతో ఎలా వ్యవహరించాలో ఆ తీరును బోధించే సామర్థ్యం వీరికి ఉంది. మనసు కలిగి పరివర్తనతో బాధితులకు తోడు ఉండటానికి మార్క్సిజంతో పనిలేదు. ధిక్కార స్వరాలు వినిపించడానికి సంఘ సంస్కర్తలే అక్కర లేదు. బాధలో నుండే ఆ తత్వం పుడుతుంది. అది ఒక విప్లవానికి ఒక ఉద్యమానికి దారి తీస్తుంది.

తొలి దళిత కావ్యాన్ని ఆవిర్భవింపజేసిన దళితుడు కుసుమధర్మన్న. ఆయుర్వేద వైద్యంతో శరీరాలకు, సృజనాత్మక శక్తితో మనసులకు వైద్యం చేసిన గొప్పవ్యక్తి. వీరి ఇంటికి తన రచన 'పాలేరు'తో ఎందరో పాలేరులను కలెక్టర్లను చేసిన బోయిభీమన్న, నేను విశ్వనరుడను అని తన మహనీయ పాండిత్యంతో చాటిన మధుర శ్రీనాధుడు గుఱ్ఱంజాషువా వచ్చేవారు. జీవితంలో జరిగిన సంస్కరణలు, సంవేదనలు కుసుమధర్మన్న భావ చిత్రాలలో చూస్తూ, వారి అక్షరాలతో అనుబంధం పెంచుకున్నవారు ఎందరో రాజ్యాంగ రచన సమితి అధ్యక్షులు అంబేద్కర్ కూడా ఉన్నారు. ఇక్కడ కుసుమధర్నన్న గాంధీజీకి అభిమాని. తన "హరిజనశతకం" లో "ఆదికాలంలో అన్నదమ్ముల వలే జనం అంతా మెలిగినట్లు, ఏదో ఒక పనిచేసుకుని ఆత్మగౌరవంతో కుంటి, గుడ్డివాళ్ళు కూడా అడుక్కుతినకుండా బ్రతికే వారని చెప్పారు. ఇకధర్మన్న నడిపిన, "జయభేరి" పత్రిక దొరకడం లేదు. వారి మససులో

ఉవ్వెత్తున ఎగసిన భావాలు ఈ పత్రిక లోని వ్యాసాలతో సాహిత్యంతో ఈ కుళ్ళు సమాజాన్ని ఎలా ప్రక్షాళితం చేశాయో తెలిసేది. 1933 నాటకి ముందే వీరికి సమాజాన్ని ఉద్ధరించాలనే దృక్పథం కలిగింది. తనజాతి జనులు హీనత్వంతో అమానుషంగా బాధపడుతున్న స్థితిని, నివారించే సంఘ సంస్కరణ దృక్పధంతో హరిజన శతకాన్ని రచించిన కుసుమధర్మన్న అంతటితో తన బాధ్యతను విస్మరించలేదు. నిరక్షరాస్యులైన తన జాతీయులకు ప్రబోధించే, లక్ష్యంతో అందరికి సుబోధకంగా, రసపుష్టితో... హరిజనశతకం రాశారు.

ఆంధ్ర దేశంలో అంబేద్కర్, గాంధీజీల ప్రభావాలతో స్ఫూర్తి పొంది అంటరానితనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతోనే 1933 లో హరిజనశతకం రాశారు. అప్పటికి గుఱ్ఱంజాషువా, గబ్బిలము వంటి కావ్యాలు వెలుగులోకి రాలేదు. కుసుమధర్మన్నకు వ్యక్తిద్వేషం లేదు. వారి మనసుల్లో ఉన్న స్వార్ధపరత్వాన్ని, అస్పృశ్యతా విషాన్ని తొలగించడమే ధ్యేయం. అందుకే తన జాతీయులకు ఈ విధంగా ప్రబోధించారు.

**మేలు కొనుమీవు తరుణము మించకుండ**
**జన్మహక్కులకై పోరు సల్పుమిపుడె**
**హక్కుకై ప్రాణమిడుట ద్రోహంబుకాదు**
**స్వర్గ పథమని నమ్ముము స్వాంత ముందు**

కుసుమధర్మన్న తన రచనలతో ప్రేరేపించి మార్పు కోరిన కొన్ని అంశాలు. ఈ క్రింది విధంగా ఉన్నాయి గమనించండి.

**1) సాంఘిక అసమానతల నిర్మూలన :** వర్ణాశ్రమ ధర్మం పేరిట భారతీయ సమాజంలో ఉన్న హెచ్చు తగ్గులను నిరసించి ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం నెలకొల్పి వారిలో చైతన్య దీప్తిని రగిలించాడు. ప్రజలు అన్నదమ్ములవలె మెలగాలని చెప్పాడు.

**2) జాతీయవాదం :** జన్మహక్కులకై పోరాడటం తప్పుకాదని, ప్రజలు ఐకమత్య భావంతో దేశాభిమానం కలిగి ఉండే విధంగా స్ఫూర్తినిచ్చాడు. నిమ్నజాతుల విషయంలో గాంధీజీ ఆశయాలను గౌరవించినప్పటికినీ, వాటి ఆచరణలో లోపం ఉందని తెలుసుకుని ధర్మన్న ప్రతి ఘటించేవాడు. గాంధీజీ రాజమండ్రి వచ్చినపుడు ఆయన నిర్వహించిన హరిజన నాయకుల సమావేశాన్ని బహిష్కరించడమే కాకుండా, మీరు హరిజనుల పట్ల ప్రేమాభిమానాలు గల నాయకులైతే మా పేటలకు వచ్చి సమావేశాలు నిర్వహించాలని తెలిపాడు.

**రచనల ద్వారా ప్రేరణ :**

**1. నిమ్న జాతి ముక్తి తరంగణి:** ఏలూరు ఆంధ్ర రాష్ట్ర ద్వితీయ యాంధ్ర సభలో

 ISBN : 978-93-340-2436-4

19-3-1921 లో చేసిన ప్రసంగంలో భావదారిద్ర్యంతో, భాషా దారిద్ర్యంలో ఎల్లవేళలా బ్రతుకనవసరం లేదని అక్షరాస్యత సాధిస్తే,, ఎవరి జీవితాలు వారు బాగు చేసుకునే శక్తివస్తుందని, ధైర్యంతో జీవితంలో ఎన్నో విజయాలు సాధించగలమని చెబుతూ దళితులకు స్ఫూర్తి కలిగించారు.

**2) నల్లదొరతనం :** 1921లో హరిజనుల జన్మహక్కుల పోరాటానికి స్ఫూర్తినిచ్చే అనేక గీతాలు రాసి ప్రజలలో చైతన్యం కలిగించారు. "మా కొద్దీ నల్లదొరతనం" అనే గీతంలో ఆంగ్లేయులను మించి ఈ నల్లదొరలు వేధిస్తున్నారనే భావనను వ్యక్తం చేశారు. అదే భావనను హరిజన శతకంలో ఈ క్రింది పద్యం ద్వారా తెలుపుట జరిగింది.

**ఆది కాలమందు నవనిలో జనులెల్ల**
**నన్న దమ్ములగుచు నాశనీడి**
**చీకు చింత లేక చిరజీవులైరయా**
**ఆలకింపుమయ్య హరిజనుండ**

**3) నిమ్న జాతుల ఉత్పత్తి :** (1924) గుడివాడ సేవాశ్రమాధిపతి యోగిరామచంద్రుడు నిర్వహించిన వ్యాసరచనల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందిన వ్యాసంలో, సామాజికంగా, ఆర్థికంగా బలహీనులైన వారిని నిమ్న జాతీయులంటారని వారి పుట్టుపూర్వోత్తరాలు గమనిస్తే వారు ఎవరికంటే తక్కువకాదని ఒకప్పుడు వారు కూడా రాజ్యాలు ఏలిన వారని సహేతుకంగా నిరూపిస్తూ వ్యాసం రాసి బహుమతి పొందారు ధర్మన్న. దానికి ఉదా. ఈ పద్యం.

**నీకులంబు వారు, ప్రాకటంబుగ మున్ను**
**హిందు భూమి నేలి యెలమితోడ**
**సౌఖ్యమందిరనుచు శాస్త్రంబు చెప్పదే...** అంటారు.

**4) మద్యపాన నిషేదం :** 1930 లో తూర్పుగోదావరి జిల్లా మద్యపాన నిషేద సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి, స్వర్ణపతకం పొందారు. మందు మహమ్మారి వశమై, ఆలుబిడ్డలను కష్టాల పాలు జేసి, అనారోగ్యం బారిన పడరాదని తెలిపారు. దీనివలన విచక్షణారాహిత్యం, పరువు మర్యాదలు కోల్పోవడం, పేదరికంలో జీవించడం వంటి అనేక అనర్థాలకు నిలయమై సర్వస్యం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. మద్యపానం వలన భ్రష్టు బట్టిపోయి నష్టపోయిన వారి జీవితాలను ఉదహరించారు.

**5) అసురపురాణం గద్యకావ్యం :** ఇది హరిజనులు ఆత్మగౌరవంతో బ్రతికిన జాతిగా, ఆత్మాభిమానం కలిగిన గొప్ప సంస్కారవంతమైన జాతిగా తెలిపిన కావ్యం. దీనిని

 ISBN: 978-93-340-2436-4

సరళసుందరమైన శైలిలో రాశారు. ఇందులోని భావాలనే హరిజనశతకంలో ఒక పద్యంలో తెలిపారు. అధికారంకోసం, హక్కులకోసం తాము ఎప్పుడు వెంపర్లాడలేదని తెలిపారు. మోసం, ద్వేషం ఎరుగని వారిపై జులుం చేస్తూ కొందరు బ్రతుకుతున్నారని చెప్పారు.

**"హక్కు సత్వములను నధికారమునులేదు**
**నేను నీవనుతెగ, నీల్గు లేదు**
**మాయబుద్ధి జూడ మచ్చుకైనను లేదు"** అని వారి హృదయాన్ని ఆవిష్కరించారు.

**6) అంటరాని వాళ్ళా! (కథల సంపుటి):** హరిజనోద్యమంలో చేయూత నిచ్చిన గ్రంథం: అంటరానితనం అనే జాడ్యం తో అన్నదమ్ములులా ఉండేవాళ్ళు విభేదాలతో బ్రతుకుతున్నారని వివరించారు. వెలి వలన ఎందరి జీవితాలో కక్షలు, కార్పణ్యాలకు బలియైన విషయం తెలిపారు.

ధర్మం, లేక ధనకాంక్షతో క్రూరంగా కొందరు ఉన్నత సామాజిక వర్గం వారు నిలుస్తున్నారని చెప్పారు.

**"కలవరంబు రేగెకలతబుట్టి**
**ధర్మ చింత చచ్చె, ధనకాంక్ష,హెచ్చెరా"**

అని తన భావాలను 'హరిజనశతకంలో 'చెప్పడం జరిగింది.

అంటరానితనం పేరిట వారిని ఎన్నో హింసకు గురిచేసి అమాయకులను ఎదగనీయని తీరును, వారికి పరిశుభ్రత నేర్పక అస్పృశ్యులుగా చేసి, దేవాలయాలకు రానివ్వకుండా అడుగడుగున అవమానించిన తీరును తన కథల ద్వారా చెప్పారు. ప్రజలలో జాగృతిని కలిగించారు.

**7) హరిజన శతకం :** 1933 లో ఆనాటి పరిస్థితులను బట్టి మహాత్మాగాంధి హరిజనులు అనడం వలన ఆ కాలానికి తగ్గట్లుగా "ఆలకింపుమయ్య హరిజనుండ" అనే మకుటంతో ఈ శతకం రాయబడింది. దీనిలో ధర్మన్న ప్రస్తుతం దళితులు అని పిలవబడుతున్న వారిని గుర్తించి వారి పుట్టుపూర్వోత్తరాలు గురించి తెలియజేశారు. ఒకనాడు ఈ కులాలు మతాలు ఏమీలేవని చెప్పారు. ఒకరి కంటే ఒకరు గొప్ప అనే భేదభావాలు లేవని చెప్పారు. ఎవరిని మోసం చేసి బ్రతికే ఆలోచన ఆనాటి ప్రజలకు లేదని తెలియజేశారు. విపరీతంగా డబ్బు సంపాదించి తోటివారిని బానిసలుగా చూసే సంస్కృతి మొదట లేదని తెలియజేశారు.

**"హక్కు సత్వములును, నధికారమును లేదు**

 ISBN : 978-93-340-2436-4

**నేను నీవను తెగ, నీల్గులేదు**
**మాయబుద్ధి జూడ మచ్చుకైనను లేదు."**

అని ఆనాటి కాలంలోని పరిస్థితులు వివరించారు.

**"కాయ కష్టపడుచు కడుపార గుడుచుచు**
**కఱువు కాటకములు కంట బడక**
**వ్యాధి బాధ లేక వర్థిల్లి నారయ"**

కూడ, గుడ్డ లేక కుంటి, గుడ్డి వాళ్ళు సైతం ఒకరి పంచన బడక ఏదో ఒక ఉపాధితో, ఆత్మగౌరవంతో బ్రతికారని తెలియజేశారు కవి ధర్మన్న. లోకంలో ఉన్న సిరిసంపదలు పిసినారి వాళ్ళ పరమైనవిగా భావించారు.

అంతేకాకుండా బీదల కష్టంను దోచుకున్న ధనవంతుల గూర్చి వారు ఒక పద్య పాదం చెబుతారు.

**"పుడమి దయ్యములన, బుట్టిరిధనికులు"**

నేటి దుస్థితిని జూచి ఈ నరలోకల నరకకూపమయినట్లు, జీవితం భారమైనట్లుగా చెబుతారు. భరతమాత బిడ్డవయ్యి ఊరుపేరూ లేకుండా అనామకునిగా మిగిలి పోకూడదని, తమ పూర్వీకులు కూడా రాజ్యాల నేలినట్టు ఎందరో ఉన్నతస్థితిలో జీవించి ఉన్నట్లు తెలియజెప్పిన ధర్మన్న తన కవిత్వంతో హరిజనులకు స్ఫూర్తినిస్తారు.

**ధర్మన్న కవి వృత్తి– ప్రవృత్తి :** ధర్మన్నగారు అద్భుతంగా పాటలు పాడతారని వినికిడి. రాజమండ్రిలో లక్ష్మీవారపు పేట పూర్తిగా మాలపేట. అదొక మురికి ప్రాంతం వారు ముఖం చూచి రోగం గుర్తించేవారు. కొన్ని పేటెంటు మందులు కూడా తయారుచేసేవారు. వీరు మంచివక్త! ఆజానుబాహులు స్ఫురద్రూపి. స్నేహశీలి, దయాళువు, కులమత భేదాలెరుగని ఆపద్బాంధవులు. హిందూమతంలోని దురాచారాలను సహేతుకంగా తెలిపి ఖండించేవారు. వారి ఇంటికి హరిజనులు అభిమానులు, పండితులు, కాంగ్రెస్ నాయకులు, అన్ని వర్గాలకు చెందినవారు, వచ్చే వారని, ఖురానును తెలుగు చేసిన ఖాసింఖాను గారి పరిచయం కూడా అక్కడే జరిగిందని, కవి, రచయిత బోయిభీమన్న "నాకు తెలిసిన జాషువా" అనే పుస్తకంలో తెలిపారు.

"అంటు దోషము మానరేలా – దాని విడుదలకై ఇంత పంతమ్ము మీకేలా! ఇవన్నీ – ధర్మన్న పంక్తులు. కొనసీమలో వీరి గొంతు మార్మోగించి తాను హరిజనోద్యమాన్ని వ్యాప్తి చేశారు. బెజవాడ నుండి విశాఖ పట్టణం వరకూ వక్తగా అందరి మనసుల్లోని

కల్మషాన్ని ప్రక్షాళన చేసేవారు. వీరిని ఆధునికాంధ్ర సాహితీ చరిత్రలో ప్రప్రథమ ప్రజావాగ్గేయకారుడు అనవచ్చు. అగ్రవర్ణాల నక్కజిత్తుల గురించి ఒక సందర్భంలో ధర్మన్న ఇలా అంటారు.

**పంచనున్న నిన్ను పాటింపగా రాక**
**దక్షిణాఫ్రికా నెడ దలచి వలచి**
**గొల్లుమనగ నేడ్చి గోటిల్ల గారారె?**

అని హరిజన శతకంలో చెప్తారు.

**ముగింపు :** కుసుమధర్మన్న మాత్రమే కాదు. దళిత మేధావులు, కవులు రచయితలు ఎవరైతే ఉన్నారో, బాధితులు చెప్పేవి నిజాలు. ఆ నిజాలను, వారి కవిత్వంలో నున్న పటుత్వం, వేదనలు. భావాత్మకంగా బహిర్గతం చేయాలి. వారందరి పుస్తకాలు, వ్యాసాలు సంకలనాలుగా తీసుకురావలసిన బాధ్యత అందరిపైనా ఉంది. పాండిత్యం కవిత్వం సరస్వతీ స్వరూపం. అది ఎవరి సొత్తు కాదని తెలియజేస్తూ స్వస్తి!

ఉపయుక్త గ్రంథసూచి:
1) అంతర్జాలం.
2) 2009, 2010 లో డిగ్రీ పుస్తకం హరిజన శతక పాఠ్యాంశం
3) దళిత ఉద్యమ వైతాళికుడు. కుసుమ ధర్మన్న కవీంద్రుడు. – డా. రామారావు గంజికుంట్ల
4) తొలి దళిత స్ఫూర్తి కుసుమధర్మన్న – డా. రామారావు గంజికుంట్ల.

 ISBN : 978-93-340-2436-4

17

# ఆత్మగౌరవ ప్రతీక - కుసుమ ధర్మన్న కవిత్వం

- డా. మార్జియానా. జడ్
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల - ఖమ్మం

భారతీయ సమాజం మిగతా సమాజాలకంటే నిర్మాణంలో ఎన్నో వైరుధ్యాలను, సంక్లిష్టతలను కలిగి ఉన్న సమాజం. మిగతా సమాజాలలో లేని వర్ణం, కులం భారతీయ సమాజం ప్రత్యేకత. ఆ కులం కూడా వేలాదిగా శాఖోప శాఖలుగా విస్తరించింది. దీనివల్ల భారతీయ సమాజంలో అనేక అంతరాలు, అసమ వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఋగ్వేదం పదవ మండలంలోని పురుషసూక్తంలో కుల విభజనకు సంబంధించిన శ్లోకం ఉంది. రామాయణంలో నాలుగు కులాల ప్రస్తావన ఉంది. భారతం కాలం నాటికి నాలుగుగా ఉన్న కులాలు ఆ తరువాత ఐదుగా తదనంతర కాలంలో అనేక ఉపకులాలుగా విస్తరించాయి.

పంచము కులస్తులుగా ముద్ర వేసి, ఊరికి దూరంగా నెట్టబడి, నీచమైన వృత్తులు అంటగట్టి వారి పట్ల అస్పృశ్యతను పాటిస్తూ వారిని కనీస మానవులుగా గుర్తించలేదు. సమాజం దీనికి పూర్వజన్మలో చేసుకున్న కర్మలే కారణమని, ఒక అభూత కల్పనలతో కూడిన కర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేసింది. దీనివల్ల ఎన్నో ఏళ్లుగా, ఎన్నో తరాలుగా పంచములు ఊరికి దూరంగా, జనజీవన స్రవంతికి దూరంగా కాలం వెళ్లదీస్తూ వచ్చారు. ప్రాచీన సాహిత్యంలో కనబడుతున్న దళిత పాత్రలు వర్ణాశ్రమ ధర్మ పరిరక్షణలో భాగంగా నిర్మించిన పాత్రలే రామాయణంలో శంభూకుని వధించిన శూద్రునికి తపస్సు చేసే హక్కు, అధికారం లేదనీ చెప్పడానికే మనుధర్మ శాస్త్రం వంటి గ్రంథాలు దళితులను శాసించే శాసనాలు అయ్యాయి.

ప్రాచీన కాలం నుంచి సమాజంలో వర్ణ వ్యవస్థను నిరసించిన కవులు లేకపోలేదు. అది భక్తి మార్గంలోనూ, తాత్విక దృక్పథంలోనూ జరిగింది. శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యదలో మాల దాసరి వృత్తాంతం కూడా ఎందుకు ఉదాహరణ. తెలుగులో వేమన, పోతులూరి వీరబ్రహ్మం, అన్నమాచార్య వంటి వారు ఈ అస్పృశ్యతా దురాచారాన్ని ఖండించారు.

**"మాల మాలగాడు మహిమీదనే పొద్దు
మాట తిరుగువాడు మాలగాక
వాని మాల అన్నవాడే పో పెనుమాల
విశ్వధాభిరామ వినురవేమా!**

అని కులం కంటే గుణం గొప్పదనీ, మాట తప్పిన వాడు మాల కానీ, మాల మాల కాదు అని వేమన అభిప్రాయం పోతులూరి వీరబ్రహ్మం కూడా

**"పంచముడని నిన్ను కించపరిచిరని బాధపడకు కక్క**
**తిట్టిన నోరే పొగుడుతున్నప్పుడు వదిలేనురా వాళ్లతిక్కా**

అని దేవుళ్లకు లేని అంటు, పంచభూతాలకు లేని అంటు ఈ మనుషులకేలరా కక్కా అని ప్రశ్నిస్తాడు. అందుకే అందరూ దాసోహం అనే కాలం దగ్గరలోనే ఉంది. అగ్రగాములై రాజ్యమేలే అదృష్టం దక్కుతుంది అంటాడు.

ఆధునిక యుగంలో సంఘసంస్కరణ ఉద్యమం ప్రారంభానికి ముందే అస్పృశ్యతా నిరసన ప్రభుత్వం కనిపిస్తుంది. గాంధీ రాజకీయ రంగ ప్రవేశం చేయకముందే అస్పృశ్యత నివారణకు పిలుపు ఇవ్వకముందే ఆంధ్ర దేశంలో ఈ చైతన్యం ఉండడం గమనించదగిన అంశం అని చెప్పవచ్చు. 1909లో ఆంధ్రభారతి పత్రికలో "మాల వాంధ్ర పాట" అన్న గేయంలో అస్పృశ్యత నిరసన కనిపిస్తుంది. ఇదే తెలుగు సాహిత్యానికి మొదటి అస్పృశ్యతా రచన. అయితే దీని కర్త ఎవరో తెలియదు.

**అందారు పుట్టిరీ హిందమ్మ తల్లికి**
**అందరూ ఒక్కటై ఉందారి సక్కంగ**
**అమ్మోరు దీవించి అయిసర్యమిచ్చును**

కుల నిర్మూలనాపరంగా గొప్ప ముందు చూపు ఉన్న గేయం. 1910 లో గురజాడ అప్పారావు రాసిన "లవణ రాజు కల" గేయంలో అస్పృశ్యతా నిరసన కనబడుతుంది.

**మలిన దేహుల మాలలనుచు**
**మలిన చిత్తుల కధిక కులముల**
**నెలవవొసంగిన వర్ణ ధర్మ**
**మధర్మ ధర్మంబె**

అని దేహాలు మలినం అయినంత మాత్రాన వారిని నీచ కులస్తులని, మనసులో మాలిన్యం ఉన్న వారిని అధిక కులస్తులని అన్న ధర్మం అధర్మధర్మం అని గురజాడ నిరసించాడు.

అంతేకాదు

**మంచిచెడ్డలు మనుజులందున**
**యెంచి చూడగ రెండె కులములు**

**మంచియున్నది మాలయైతే**
**మాల నేనగుదున్**

అని పంచములతో మమేకం ప్రకటిస్తాడు. ఆ తర్వాత గురజాడ మార్గాన్ని ఎందరో అనుసరించారు. 1915లో మంగి పూడి వెంకట శర్మ గారు నిరుద్ధ భారతం అనే పద్య కావ్యం రాశారు. జాతికి వెన్నెముక అన్నదగిన ఈ అట్టడుగు కులాల వారిని అస్పృశ్యత పేరుతో మనకు కానీ వారిగా చేసుకోవడం ఆత్మహత్య లాంటిదని, ఇది ధర్మం కాదని ఆవేదన చెందాడు. ఇంతవరకు వచ్చిన అస్పృశ్యత నిరసన కవిత్వంపై గాంధేయ వాద ప్రభావం లేదు. గాంధీ రంగ ప్రవేశంతో జాతీయోద్యమం వేడెక్కింది. దీనితోపాటు అస్పృశ్యత నిరసనను ఒక ఉద్యమంగా ప్రచారం చేస్తూ కొత్తగా 'హరిజన' అనే పదాన్ని సృష్టించి వ్యాప్తిలోకి తెచ్చాడు. స్వాతంత్రోద్యమ ప్రభావంతో, గాంధీ పిలుపుతో అనేకమంది కవులు అస్పృశ్యతా నిరసన కావ్యాలు రాశారు. జాతీయ కవిగా ప్రసిద్ధి పొందిన గరిమెళ్ళ రాసిన మాకొద్దీ తెల్లదొరతనం తెల్ల దొరకను అనే గేయం ప్రసిద్ధి పొందింది. ఇంతవరకు హరిజన ఇతరులు హరిజనేతరులు హరిజనుల పక్షాన కవిత్వం రాస్తే 1930 దశకం నుంచి హరిజనులు సాహిత్య రంగ ప్రవేశం చేసి తమ సమస్యలను తామే గానం చేసుకోవడం మొదలుపెట్టారు. అటువంటి వారిలో గుర్రం జాషువా, కుసుమ ధర్మన్న కవి ఒకరు.

**కుసుమ ధర్మన్న – రచనలు :**

హరిజన శతకం, మాకొద్దీ నల్ల దొరతనం, జయభేరి పత్రికా సంపాదకులు, వక్త, ఉద్యమకారులు, వృత్తిరీత్యా ఆయుర్వేద వైద్యులు దళితుల స్ఫూర్తి కుసుమ ధర్మన్న. ధర్మన్న తమ పదునైన రచనలతో అస్పృశ్యతా సమస్యను ఎండగట్టారు. మాకొద్దీ నల్ల దొరతనం గేయంలోను, హరిజన శతకంలోనూ దయనీయమైన హరిజనుల కడగండ్లు ఆవిష్కరిస్తాడు.

**పన్నెండు మాసాలు పాలేరు తనమున్న**
**పస్తూల బడి బ్రతుకులండి**
**ఆలుమగలు కూలీ జేయాలండి**
**పిల్లగాడు పెయ్యల గాయాలండీ**
**పగలు రేయి పాటు పడ్డానండి**
**కూడు గూడు గుడ్డేదండి**
**రోగమొస్తె నాగ తప్పదండి**
**అప్పుతీరదయ్యె చిత్రమండి**

ఈ నిప్పుపై మేము నిలువలేము తండ్రి అని కుసుమ ధర్మన్న కవి ఈ కులం అనే

నిప్పుపై మేమిక నిలువలేమని తెగేసి చెప్పాడు. 1933లో హరిజన శతకం రాసిన కుసుమ ధర్మన్న కవి

**ఆలకింపుమయ్య ఆది హిందూ**
**ఆలకింపుమయ్య ఆది ఆంధ్ర**
**ఆలకింపుమయ్య మాలవర్య**
**ఆలకింపుమయ్య హరిజనుండ**

అనే మకుటంతో సాగుతుంది ఈయన శతకం. హరిజనులు ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాలలో ఆది హిందువులు, ఆది ఆంధ్రులు, మాలలు మొదలైన పేర్లతో పిలవబడు కారణంగా ఆయా ప్రాంతాల వారికి అవసరమని తోచినచో అందుకు అనుగుణంగా మార్చి చదువుకోవడానికి అని సూచనలో పేర్కొన్నారు.

దళిత చైతన్యం కోసం ధర్మాన్నపడిన తపనను హరిజన శతకంలో చూడవచ్చు. ఆత్మగౌరవంబు నలరంగా చాటరా అని ఉద్బోధించిన ధర్మన్న వర్ణధర్మం పేరిట సమాజంలో నెలకొని ఉన్న అసమానతలను, హెచ్చుతగ్గులను నిరసించిన జాతీయవాది. సమకాలీనులు ఆయనను ఆది ఆంధ్ర కవి సార్వభౌమగా పేర్కొన్నారు.

1936లో విజయనగరంలో జరిగిన ఆది ఆంధ్ర మహాసభ సమావేశానికి ధర్మన్న అధ్యక్షత వహించాడు. ఈ సమావేశంలో సామ్యవాదాన్ని సహించని హిందూ మతం అనే శీర్షికన ప్రసంగం వెలువరించారు. ఈయన నిమ్నజాతి విముక్తి తరంగిణి, వాళ్లు అంటరానివాళ్ళా, హరిజన చరిత్ర మొదలైన రచనలు చేశాడు. హరిజన నాయకులు అయితే మా పేటలకు వచ్చి ఇక్కడ మాట్లాడాలని కబురు పెట్టి గాంధీని, ఇతర కాంగ్రెస్ నాయకులను తమ పేటకు రప్పించి, ఆతిథ్యమిచ్చి, దళితుల గౌరవాన్ని చాటిన దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న
2. దళిత కవిత్వం - తెలుగు అకాడమీ

* * *

 ISBN : 978-93-340-2436-4

# 18 కుసుమ ధర్మన్న కవిత్వం - ఆర్థిక దృక్పథం

**భమిడిపాటి గౌరీ శంకర్**
విభాగాధిపతి, తెలుగు విభాగం,
గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ & మేనేజ్మెంట్,
శ్రీకాకుళం 9492858395.

**మనవు బాట నడిచే మా నల్లదొరతనం**
**మాకు వొద్దంటంచు మహిని చాటే**
**మాకు పెద్ద అన్న మా కుసుమ ధర్మన్న**
**తియ్యమావి కొమ్మ తిరుపతమ్మ**

– నక్కా అమ్మయ్య (తిరుపతమ్మ శతకం)

కుల వ్యవస్థ.. ఏ దేశంలోను లేని ఓ ప్రత్యేక 'అంటు'తనం. భారతీయ సమాజంలో అనాదిగా వేళ్ళూనుకొని ఉందంటారు. ప్రాచీనకాలం నుండి అస్పృశ్యుల ఉద్ధరణ కోసం సమాజంలోని భాగమైన సాహిత్యంలో ప్రయత్నాలు జరిగాయి. 1910 నుంచి ఓ 'అజ్ఞాత రచయిత' రాసినదిగా చెప్పుకుంటున్న 'మాలవాంద్రపాట' దళిత గేయంగా పరిశోధకులు భావిస్తున్నారు. ఆ పాటలో "అందరుపుట్టిరి హిందమ్మ తల్లికి/అందరూ ఒక్కటై ఉండాలి సక్కగా" అంటూనే ఎన్నెన్నో ప్రశ్నలతో వర్ణవ్యవస్థలోని అంతరాలను ప్రశ్నిస్తారు రచయిత. 1911లో వచ్చిన గురజాడ 'మాలలు' గేయం 'మలిన దేహులు మాలలనుచు/ మలిన చిత్తుల కథక కులముల/ నెలనొసంగిన వర్ణధర్మ మధర్మంబే' అని వెలుగెత్తారు. హరిజన గీతాలు రాసిన వారిలో గరిమెళ్ళ వారిని ప్రముఖులుగా పేర్కొంటారు. ఆయన 'హరిజన పాటలు' లో వర్ణవ్యవస్థను తీవ్రంగా విమర్శించారు. చెరుకువాడ వెంకటరామయ్య, కొండపల్లి జగన్నాథము, తిరునగరి వెంకటసూరి, నెల్లూరు వెంకట రామానాయుడు, బసవరాజు అప్పారావు వంటివారు హరిజన సమస్యల మీద ప్రబోధాత్మకమైన గేయాలు రచించారు. ఇక్కడ గమనించదగ్గ అంశమేమిటంటే– కావ్య ప్రక్రియలో సహితం కవులు హరిజన సమస్యను నిశితంగా విమర్శించారు. ఈ కోవకు చెందిన తొలి కవి మంగిపూడి వెంకటశర్మ (1915) రాసిన 'విరుద్ధ భారతం' మొట్టమొదటి చెప్పుకోదగిన గ్రంథంగా పేర్కొంటారు. "మాలలను పంచములటంచు, మాదిగలని/ శ్వప్రభులని చెప్పగరాని వారటంచు/ మరియు జండాలురని తోడి మానవులను/ దరిమి వేయుట సాంఘిక ధర్మమగునే అని ప్రశ్నిస్తారు." అని ప్రశ్నిస్తూనే వ్యాసుడు, వాల్మీకి, పరాశరుడు, వశిష్ఠుడు తదితరులు హరిజన వర్గాలకు

చెందిన వారేనని 'శర్మ'గారు పౌరాణిక, చారిత్రక ఆధారాలతో సమాజాన్ని నిలదీశారు. "మాలల భావికాల దశ మాన్యతరంబు; మహోన్నతంబునై గ్రాసెడు' అని భవిష్యత్ గానం చేశారు. కనుకనే ఈ గ్రంథమును అస్పృశ్యతా నివారణోద్యమానికి ఎగురవేసిన పతాకగా చెబుతారు. ఆ పరంపరలో మహాకవి, పద్మభూషణ్ గుర్రం జాషువా వ్రాసిన రచించిన గబ్బిలం కావ్యం, అనాధ వంటి ఖండకావ్యాలు హరిజనోద్యమ తీవ్రతను వ్యక్తం చేశాయి. దళిత సాహిత్యంలో కేవలం వర్ణ వ్యవస్థను మాత్రమే కవులు ఎత్తి చూపలేదు. తద్వారా శ్రమదోపిడీ వలన జరుగుతున్న సామాజిక, శారీరక హింసను ప్రశ్నించారు. ఆర్థికంగా వారికి జరుగుతున్న అన్యాయాలపై కలం, గళం ఎత్తారు. దళితుల త్యాగాన్ని, వారిని దోచుకుంటున్న వర్గాల వారిని తీవ్ర స్వరంతో జాషువా "ముప్పు ఘటించి వీని కులమున్ గలిమిన్ గబళించి దేహమున్/ బిప్పియెనర్చు నా భారత వీరుని పాదములు కందకుండగా/ జెప్పులు గుట్టి జీవనము సేయును గానీ నిరాకరింపలే/ దప్పుడు నప్పుపడ్డది సుమీ భరతావని వీని సేవకున్" అని పరోక్ష ఆర్థిక అసమానతల వెనుక కులగోడల నడుమ శ్రమ దోపిడీకి గురవుతున్న వర్ణాలను వెనకేసుకొచ్చి, వారి ఆవేదనకు అక్షరరూపమిచ్చారు. ఈ కోవకు చెందిన కవి 'కుసుమధర్మన్న'.

హరిజన కవి సార్వభౌముడుగా, ప్రజాకవిగా, వాగ్గేయకారుడుగా, హరిజన కవీంద్రుడుగా ప్రసిద్ధికెక్కిన వైద్య విద్వాన్ కుసుమధర్మన్న తూర్పుగోదావరి జిల్లా (నేటి బి.ఆర్. అంబేద్కర్ జిల్లా) రాజమండ్రిలోని లక్ష్మీవారపు పేట (కోర్లమ్మపేట)లో 1900న జన్మించారు. కుసుమ నాగమ్మ- నాగయ్యలు ఆయన తల్లిదండ్రులు. వీరు వ్యవసాయ కూలీలు. వీరి బాల్యమంతా తల్లిదండ్రులు, మేనత్తల సమక్షంలో జరిగింది. ధర్మన్న కవి మేనకోడలు వరుసైన ఏలూరుకు చెందిన లక్ష్మీనారాయణమ్మగారితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఐదుగురు మగ పిల్లలు. గాంధీగారి ఉద్యమానికి ప్రభావితులై తమ పిల్లలకు పతిత పావనమూర్తి, మోహన్‌దాసు, భగవనదాసు, చిత్తరంజన్ దాసు, జగన్మోహన దాసు అనే పేర్లు పెట్టారు. ఆడపిల్లలకు వసుమతి, భాగ్యలక్ష్మి, కుసుమ అని పెట్టుకున్నారు. ఇటువంటి కుసుమ ధర్మన్న హరిజనులను చైతన్యవంతం చేసి వారి సమస్యలను వారే గుర్తించి పరిష్కరించుకునే విధంగా తీర్చిదిద్దటానికి సాహిత్యాన్ని ఒక ఆయుధంగా మలుచుకున్నారు. గరిమెళ్ళవారు రచించిన 'బ్రాహ్మణ బ్రాహ్మణా పంచనూ బ్రాహ్మణ భేదాలు తెగలు మాకేలా మీ భేదాలు వడి గాల్చలేరా ఈ మధూకరం వృత్తి మరిగినారదియేలా' అనే వ్యాఖ్యానాలు గమనించిన కుసుమధర్మన్న కవి తెల్లదొరతనం పోయి స్వరాజ్యం వస్తే మాత్రం హరిజనులకు ఒరిగేదేముందని ప్రశ్నించారు.

'కుసుమధర్మన్న' పద్యం, గేయం, వచనం వంటి ప్రక్రియలలో రచనలు చేసినవారు.

 ISBN : 978-93-340-2436-4

ఆయన రచనలలో ప్రధాన భూమిక 'దళిత చైతన్యం' ముఖ్యంగా నాటి సమాజంలో దళితులు రాత్రిపగళ్ళూ కష్టించిన, మధూకర వృత్తిలో జీవించడం వెనుకున్న 'కొన్ని వర్గాల వారి' సామాజిక కుట్ర నేపథ్యంలోని 'ఆర్థిక సూత్రాల' అసమానతలను ఎత్తిచూపారు. 'హరిజన శతకం'లో కూడా ఈ ధోరణి కనిపిస్తుంది. 'హరిజనశతకం' కు ఓ ప్రత్యేకత ఉంది. ఆనాటి వరకు (1909) సమాజంలో దళిత సమస్యలను ఎలుగెత్తి రచనలు చేసిన వారంతా సమస్య మూలాల్లోకి వెళ్లి వ్యక్తిగతమైన వ్యధలను తమదైన దృక్కోణం నుంచి, చైతన్యం అవసరమని చెప్పారు. కానీ.. కుసుమధర్మన్న 'హరిజన శతకం'ను తనవారి యొక్క సమస్యలను 'తానే' అనుభవించిన వారు కనుక 'తమదైన' దృష్టికోణం నుంచి సమస్యలు, వ్యధలు, తిరస్కరణ, అనాదరణ, అవహేళన, అవమానాల నుంచి చూపుసారించిన దళిత కవి. అంతకు ముందు వరకు ఈ అస్పృశ్యత పైన కవిత్వం, రచనలు చేసిన వారంతా 'దళితేతరులు' కావటం గమనించదగ్గ అంశం. కనుక హరిజన శతకానికి ప్రత్యేకత ఉంది. కుసుమధర్మన్న 'హరిజన శతకం'లో ఆర్థికకోణంను సహితం స్పృశించారు. కాలక్రమంలో 'మార్పు' వలన హరిజనులు వ్యవసాయ కూలీలుగా మారారు. రైతుల చేత దోపిడికి గురయిన వైనం ధర్మన్న గారిని కలిచివేసింది. హరిజన కూలీకి 'రైతు' చేస్తున్న అన్యాయంపై ఆగ్రహం ప్రకటించారు.

**'పరుల పొలముదున్ని పాట పంటలనెల్ల**
**గూడబెట్టి కూడు గుడ్డ లేక**
**గుండు చుంటనీకు కులవృత్యయయ్యెరా**
**ఆలకింపుమయ్య హరిజనుండ'**

స్వంత భూములు లేని హరిజన కూలీలు ఇతరుల పొలాల్లో పనిచేసి పాడిపంటలు పండిస్తున్న, వారికి మాత్రం తిండి బట్టా లేకుండా వినిపిస్తున్నాడంటారు. చేసిన కష్టానికి సరైన విలువనివ్వక, పిడికెడు అన్నాన్ని కూడా ఇవ్వకుండా, ఎండనకా, వాననకా భార్యాభర్తలిరువురూ శ్రమిస్తున్నా వారికి 'కూలీ' సరిగ్గా చెల్లించరు. కూలిని పెంచరు. అసలు పెంచడమనే విషయాన్నే ఇష్టపడరంటూ –

**'కొల్చు నీకు పిచ్చకుంచంబుతో దాను**
**గొల్చుకొనడె? పెచ్చు కుంచమునను**
**దోచుకొనక నీకు దొరమెట్టులగు? రైతు**
**ఆలకింపుమయ్య హరిజనుండా?'**

దోపిడీదారుడైన రైతు కూలీకివ్వవలసిన దానిని దొంగకుంచంతో గిరిజనులు

 ISBN: 978-93-340-2436-4

కొలుస్తారు. తాను మాత్రం పెద్ద కుంచంతో కొలుచుకుంటాడు. అటువంటివాడు నీకు దొర ఎలా అవుతాడని కవి ప్రశ్న. పేదవారైన హరిజన కూలీలు అవసరానికి పది, పరకా అప్పు తీసుకుంటే 'అంతకంత' పద్దు రాసి, తరతరాల వారిని తమ పొలంలో పనివారిగా, వారిని హీనంగా చూస్తూ బ్రతకమని చెప్పే రైతులను, ప్రశ్నిస్తే 'రచ్చకీడ్చి' అణగ దొక్కుతున్న వైనాన్ని అక్షరాయుధంతో అడ్డుకుంటారు కవి.

**"నాములంట గట్టినట్టేటుముంచుచు**
**పదికి పాతికనుచు పద్దు రాసి**
**వెంగళప్పవగుట వేధింపడే? రైతు**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

ఓడలోని ఓడమల్లయ్య, ఓడ దిగితే ఓటి మల్లయ్య అనే రకం రైతులు హరిజన కూలీలతో తమ ఆర్థికావసరాలను తీర్చుకునేందుకు వారిని బుజ్జగించలేని అభిమానం, ఆప్యాయతలను ఒలకబోసి తమ, తమవారి ఆర్థిక మిళిత పనులను పూర్తి చేయించుకొని, అవతలకి నెట్టివేసే రకాలను చూసి కుసుమ ధర్మన్న ఆవేదనతో–

**"అదను పదును వెతిగియాదరంబున బిల్చి**
**సదయ హృదయముని వలె సంచరించి**
**యదును దాటి నిన్ను నాదరించునే? రైతు**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

అనే మేలుకొలుపు గీతం వెనుక ఆర్థికపరమైన అసమానతలకు కారణం 'తమకు తాముగా తమ శ్రమ, కృషి, పట్టుదల, ఐక్యతలను తెలుసుకోలేకపోవడమేననే ఆయన ఆరాటం, ఆవేదన, తన వారి పట్ల బాధ్యతతో కూడిన ఆశయం వంటివి తెలుస్తాయి. రైతులేని ప్రపంచం లేదు. రైతుపడని కష్టం లేదు. అంటరానితనం, అవిద్య, అనైక్యతతో కునారిల్లిన జాతిని తట్టిలేపేందుకు కుసుమ ధర్మన్న చేసిన రచనలు విప్లవ పూరిత చైతన్య శంఖారావాలు. ఆర్థిక అసమానతలను ఎత్తి చూపిన అజెండాలు.

**'నీవు లేక ఒక్క నిమిషమైనను వాని**
**కేగదనుచు దెలసి సాగదీయు**
**బానిసీడవగుట బాధంబడే? రైతు**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

అని వీపుపైన చరచి తన జాతికి మెరుపులు కురిపిస్తూ లేవమని గర్జించాడు.

 ISBN : 978-93-340-2436-4

హరిజన కూలీ లేనిదే నిమిషం గడవదని తెలిసినా రైతు అతడిని పట్టించుకోవటం లేదంటే తప్పెవరిది? బానిసరికంలోనే 'సంపద' సృష్టించుకోవాలనుకోవడం 'ఆకలి' పేదరికాలను భావితరాలకందించటమేనని గ్రహించకుంటే రైతు 'కూలీ'ని ఎందుకు బాధించడు? సంపాదించిన ప్రతినయాపైస 'తాగుడికి' వెచ్చించి- డబ్బులు లేక 'కోరి' దరిద్రాన్ని తెచ్చుకునే 'త్రాగుడు'ను కూడా కుసుమ ధర్మన్న ఓ 'ఆర్థిక అసమానత'కు కారణమని చెప్పారు.

**'కల్లు త్రాగి పిల్ల జెల్లల నేడ్పించి**
**ముల్లె మూటనెల్ల చెల్ల చేసి**
**యిల్లు ఒళ్ళు నేల గుల్ల జేసేదవోకొ?'** అనిచ్చిన సందేశం నాటికే కాదు నేటికీ వర్తించే అక్షర సత్యం. కుసుమ ధర్మన్న రచనల్లో ఆర్థికపరమైన దృక్కోణంను వివరిస్తే పెద్ద పరిశోధనా గ్రంథమవుతుంది.

ఆధార గ్రంథాలు:

1. హరిజన శతకం- కుసుమధర్మన్న- ప్రజాశక్తి ప్రచురణ.
2. రచనలు- దళిత దృక్పథం- డా॥ మద్దుకూరి సత్యనారాయణ- ప్రజాశక్తి ప్రచురణ.
3. సాహితీ సుధ- డా॥ గుమ్మనూరి బాల శ్రీనివాసమూర్తి- బండ్ల పబ్లికేషన్.

 ISBN: 978-93-340-2436-4

19

# కుసుమ ధర్మన్న ఆశయసాధన

**డా. దేవులపల్లి పద్మజ**
అసిస్టెంటు ప్రొఫెసర్ & రచయిత్రి
విశాఖపట్టణము
ఫోను 9849692414

స్వాతంత్ర్యవిప్లవ సమయానికి భారతదేశము ఆర్థికముగా, వైజ్ఞానికముగా దారిద్ర్యమున మునిగియున్నది. మన నీతి మత ధర్మముల గొప్పదనము రుజువుచేయగల సమర్థులైన విద్వాంసులు గాని పరిషత్తులు గాని లేవు. ప్రజలలో సరియైన భావములను కలిగించు వార్తాపత్రికలును లేవు. మన శాస్త్రముల యంతరార్థమును వెల్లడించి అన్ని మతములు, అన్ని ధర్మములు నొకే పరమసత్యమును బోధించు భిన్నమార్గములేయను పరమార్థమును బోధించు వారు లేరు. ఈ తరుణములో సంఘ సంస్కర్తలు, మతోద్ధారకులు కొందరు బయలుదేరినారు. భారతదేశములోని వివిధ వర్ణములవారు వివిధ మతశాఖలకు చెందినవారు మేల్కొని తమతమ సంఘముల విద్యాభివృద్ధిని, ఆర్థికాభివృద్ధిని పొందుటకు కృషిచేయుటయేగాక భారతదేశములోని తక్కిన జాతులు కూడా తమతో సమానమేయను భావనతో తమకు తోచిన సహాయము చేయుట తమ కర్తవ్యమేయను భావముతో ప్రవర్తింపసాగిరి. భారతదేశములోని దరిద్రులకు, దుఃఖార్తులకు, దీనజనులకు జాతి మత వర్ణ వివక్షత లేకుండా తగిన సహాయము చేయుటకు గొప్ప సంఘ సంస్కర్తలు మత సంస్కర్తలు బయలుదేరి దేశములో ప్రచారము చేయుటవల్ల సంఘ సంస్కరణోద్యమము జాతీయ భావము దేశములోని వివిధ ప్రాంతముల ప్రజలలో బాగా వ్యాప్తిచెందినది. స్వాతంత్రోద్యమం లో అవ్యాజమైన దేశభక్తి కలిగిన పోరాటయోధులు వివిధ రకాల ప్రయత్నాలు, నిరసన ద్వారా నిరంతరం బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేస్తూండే సమయంలో కుసుమ ధర్మన్న కవనంతో, గానంతో, ప్రసంగాలతో తన బాటను ఎన్నుకుని పోరాటం సాగించారు.

ఎందరో మహానుభావులు అందులో కొందరు గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, జ్యోతీబాపూలే, అంబేద్కర్, రాజారామ్మోన్ రాయ్, స్వామీవివేకానంద వంటి మహానుభావులు ఎందరో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. వారి సామాజిక హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాటాలు సలిపారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న అంధవిశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయ జీవన విధివిధానాలు, అనేక సామాజిక రుగ్మతల నివారణకు నడుం బిగించారు.

అనేకమంది సంఘ సంస్కర్తల జీవన విధానాలను, వారు అనుసరించిన మార్గాలను పరిశీలిస్తే మనకు అనేక విషయాలు అవగతమౌతాయి. కొందరు భారతదేశాన్ని తమ విషయ వస్తువుగా స్వీకరిస్తే, కొందరు తమ మత, కుల, ప్రాంతాన్ని విషయ వస్తువుగా భావించి, వాటి ఉద్ధరణకు కృషి చేశారు. మార్గాలు వేరైనా అందరి గమ్యం ఒక్కటే.

"దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్--మతం వేరైతేను యేమోయి, మనసు లొకటై మనుషులుంటే లోకమున రాణించునోయ్" అన్నారు గురజాడ.

మనుషులతో మానవత్వం మమేకమై ఉండాలి. కేవలం భౌగోళిక ప్రమాణాలే కాదు దేశమంటే. కొలతలతో నియంత్రించిన స్థలం దేశమనిపించుకోదు. మనిషి సామాజిక స్పృహకలిగిన జీవనం సాగించాలని ఏ మతమైనా మసలేది మట్టిపైనే అనే అభిప్రాయం తెలియజేసారు.

ధర్మన్న కలం నుండి

**"మాలమాలని చాల తూలనాడి మమ్ము**
**అంటరాదని గెంటుతారు. ఆసుపత్రి మందు లడుగుతారు**
**మాల మందూలు చాలా తాగేరు**
**మాల పాలు నీళ్ళని మానలేరు"**

అంటూ ఒక వర్గప్రస్థావనతో పోరాడి చైతన్యం తేవాలనుకున్నట్టు తన మాటలు వెలువరించాడు.

**పన్నెండు దేశాలు పండుచున్నాగాని, పట్టెడన్నమె లోపమండీ,**
**ఉప్పుముట్టుకుంటే దోసమండీ!**
**నోటమట్టి గొట్టి పోతడండీ!**
**కుక్కలతోపోరాడి పోరాడి కూడు తింటామండీ**

అంటూ గరిమెళ్ళ సత్యనారాయణ గారి గేయంలో భారతీయుల అసహాయత, గత్యంతరం లేక రోజు గడుపుకుంటూ బ్రిటిష్ పాలకుల దురాక్రమణ, దుష్ట పాలనను నిరసిస్తున్న వైనం, పాడిపంటలు సమృద్ధిగా కలిగిన మా దేశంపై మీ ఆంక్షలు ఏమిటని నిలదీయడం విశేషం. అయితే భారతజాతి మొత్తాన్ని తెల్లదొరల పాలన నుంచి స్వాధీనం చేసుకుని కాపాడుకోవాలనే జాతీయత గమనించవచ్చు.

**పన్నెండు మాసాలు పాలేరుతనమున్న**

 ISBN: 978-93-340-2436-4

**పస్తులుబడుచు బతుకాలండీ**
**ఆలికూలీజేసి తీరాలండీ**
**పిల్లగాడూ పశువుల గాయాలండీ**
**పగలు రేయీ పాటపడ్డానండీ**
**కట్ట గుడ్డా- కూడు గిట్టదండీ**
**రోగమొస్తే నాగ దప్పుడండీ...**

అంటూ ధర్మన్న గారు ఆత్మావలోకనం చేసుకుంటూ తమకు శ్రమకు తగిన ఆదాయం లేక కుటుంబం అంతా కష్టపడుతున్నా కడుపు నిండడం లేదనే నిరాశ నిస్పృహత్వ ధోరణి ఈ నల్లదొరతనం గేయంలో కనిపిస్తుంది.

అలాగే గరిమెళ్ళ వారి కలం నుండి

**"ప్రజలా క్షేమం కోసం పెట్టీన సంస్థల ప్రభులకోసం మార్చేస్తాడు**
**వాటిని ప్రజల శత్రువుల చేసుతాడు**
**మమ్ము గజగజ లాడించుతాడు**
**వాడి గజిబిజీ వర్ణింపగాదు..బ్రహ్మకునైనా..**

ప్రజల కష్టాన్ని దోచి పెత్తందార్లకి అనుభవిస్తారు.మా కోసం ఏర్పాటుచేసిన సంస్థలకు మేము శత్రువులుగా మారుస్తారు. వివేకహీనమైన పథకాలను ప్రవేశపెట్టి మమ్మల్ని భయపెడతాడు. ఈ తెల్లదొర పాలన మాకొద్దు మాదేశం విడిచిపెట్టి నడవండి పొలిమేరలు దాటి అనే భావన.

**"పాడిపంటలు మేము కూడబెడితే వారు**
**కూర్చోని తింటామంటారు**
**నాములిచ్చి నట్టేట ముంచేరు**

అవిశ్రాంత శ్రమ చేసి మేము పాడి పంటలు కూర్చితే హాయిగా కూర్చుని తింటారా? అని ధర్మన్న ప్రశ్నిస్తాడు.

**"ఘోరశాసనాలు కూడ దీసీమాదు సారామునెల్లా పీల్చాడు**
**సంసారము లెల్లా కూల్చాడు!**
**మా చీరాల నెల్లా నొల్చాడు!**
**వాడు ధనవంతులను బట్టి దడదడలాడుతాడు!!**

భారతీయ మహిళలను నీ విలాసాలకు బలిచేసి జీవం లేని బ్రతుకు, చైతన్యం

కోల్పోయిన జీవితం మిగిల్చి, ధనవంతుల ముందు జమీందారు కనపడితే చేతులు కట్టుకున్న నిలబడతావు ఓ తెల్లదొర తొలగిపో అంటారు గరిమెళ్ళ.

**"యెంచి అప్పునప్పు బెంచుతారు**
**చెంపగొట్టి కొంపలాగుతారు**
**మాలపొత్తులేక మసలలేరు"**

అంటూ ఒకే సందర్భాన్ని భిన్నంగా చెప్పారు ధర్మన్న. మాకు అప్పులిచ్చి దొంగలెక్కలు కట్టి మా కొంప లాక్కుంటారు, మా స్త్రీలను వాడుకుంటావు. మనసులేని మృగాలను తలపిస్తున్నారని అభిప్రాయపడ్డారు.

**తెల్ల దొరలుగాని నల్లదొరలుగాని**
**యాదరింతురన్న యాశలేల?**
**స్వయము కష్టపడిన సౌఖ్యంబు గలుగదే?**
**పరువు నురువులేని పాలేరు తనమేల?**
**కరువు గొట్టు బ్రతుకు గడపనేల?**
**కూలి విలువ దెలసి గుట్టుగా మనగేల?**

ఎవరో ఎవరినో ఉద్ధరించాలనే యాశతో ఎదురు చూడడం అవివేకం. స్వయంగా కష్టపడితే వచ్చే ఫలితం సంతృప్తిగా ఉంటుంది కదా! ఎవరి దగ్గరో పాలేరు పనిచేసుకుని బ్రతకడం అవమానకరం అనిపించదా! కండ కరిగించుకుంటే వచ్చే ఆదాయం తో గౌరవంగా జీవనం సాగించవచ్చు కదా! అని హితబోధ చేసి చైతన్య సెగను రగిలిస్తున్న ధర్మన్న మాటలు.

**గురజాడ వారి గేయంలో కూడా మనకి ఇలాగే చైతన్యం రగిలిస్తూ..**
**పాడిపంటలు పొంగిపొర్లే**
**దారిలో పాటుపడవోయి**
**తిండి కలిగితే కండ కలదోయి**
**కండ కలవాడేను మనిషోయి!**

మనిషి కష్టపడటానికి ఇష్టపడి అభివృద్ధికి దోహదపడి, ఆరోగ్య ఐశ్వర్యమును పొంది హాయిగా బ్రతికేవాడే మనిషిగా గుర్తింపబడతాడు అంటారు.

"దండాలు దండాలు భరతమాత ఇది అందుకుని దీవించు భరతమాత" అని ఎలుగెత్తిన శ్రీకాకుళం వాసి గరిమెళ్ళ సత్యనారాయణగారు తమ రచనలతో సంఘములోని

 ISBN: 978-93-340-2436-4

దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడారు. "మాకొద్ధీ తెల్లదొరతనము" అనే గేయాన్ని వ్రాసి దేశభక్తి పొంగి పొరల జేసి, రాజకీయ స్వాతంత్ర్యానికై పాటు పడిన గొప్ప దేశభక్తుడు.

కులానికి బ్రాహ్మణుడైనా వేమూరి రాంజీరావు హరిజనోద్ధరణకి చేసిన కృషి మరువరానిది. సాంఘిక దురాచారాలు రూపుమాపటానికి అక్షర జ్ఞానం ఎంతో అవసరమని గ్రహించి, దానిని సాధించటానికి తన జీవితాన్ని సర్వస్వం త్యాగం చేసిన మహామనీషి. బందరులో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై రాత్రి పాఠశాలలు నిర్వహించి, తదనంతరము పాఠశాల స్థాపించి, వాటి నిర్వహణకై జోలె పట్టుకుని విరాళాలు సేకరించి అక్షర జ్ఞానం పెంపొందించటానికి ఎంతో శ్రమించారు. "మంచియన్నది మాలయయితే ఆ మాల నేనగుదున్" అన్న గురజాడవారి గేయాన్ని నిర్మాణాత్మకంగా ఆచరించి చూపించిన ధీశాలి.

ఈ విధంగా మనం సంఘసంస్కర్తల జీవితాలను పరిశీలిస్తే అనేక ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోనికి వస్తాయి. అనేక మంది దేశ భక్తులు వెలుగులోనికి రాకుండా ఉన్న విషయాలు కూడా అవగతమౌతాయి. దానికి రాజకీయ, సామాజిక, సాహిత్యపరమైన కారణాలు ఎన్నోవుంటాయి. వృత్తికి, ప్రవృత్తికి పోలిక లేకుండా తమ కుల, మత, జాతి అభివృద్ధికై కృషిచేసిన మహనీయులు ఎందరో వున్నారు. ఈ కోవలోనికే శ్రీకుసుమ ధర్మన్నగారు ఒక మహనీయుడు. వీరు ప్రవృత్తి రీత్యా సాహితీ కోవిదులు. దళిత ఉద్యమకర్త. దేశానికి స్వాతంత్ర్యము వచ్చినప్పటికీ అణగారిన వారి జీవితాలలో వెలుగు రేఖలు చిగురిస్తాయనే ఆశలేదని వీరి అభిప్రాయము. నిస్వార్థంగా జీవిస్తూ, ప్రజలలో చైతన్యం కలిగించటానికి వీరు శ్రమించారు. అందుకే వారు "మాకొద్ధీ నల్లదొరతనం" అనే గేయాన్ని రచించారు.

"మా మేలు మెప్పుపొంది మేకై తిరుగుతారు", "మేము మనుషులనే మాట మరచిపోయారండి", "మాకు హక్కులేదంటే స్వరాజ్యమెక్కడదక్కు", "పదిమందితో పాటు పరువు గలుగకయున్న మాకొద్ధీ నల్లదొరతనము". ఇలా పదునైన పదాలతో తన భావావేశాన్ని వ్యక్తీకరించారు.

"పన్నెండు దేశాలు పండుచున్నగాని పట్టెడన్నము లోపమండి" అన్న గరిమెళ్లవారి భావనకు....

"పన్నెండు మాసాలు పాలేరుతనమున్న పస్తులుబడుచు బ్రతుకాలండి" అని కుసుమ ధర్మన్నగారు పలికారు. సమసమాజ స్థాపనకు వ్యక్తుల ఉన్నతి ప్రధానమని, అది ఉంటే దేశము మొత్తం అభివృద్ధి చెందుతుందుని అభిప్రాయపడినారు.

 ISBN : 978-93-340-2436-4

హరిజనుల మనోభావాలకు అద్ధం పట్టే రచన హరిజన శతకం. ఈ శతకంలో ఎన్నో వైరాగ్య భావాలు కనిపిస్తాయి. "ఎవడ నీవు యిట్టి యిడుమల గుడువంగ, నెవరు కారణంబు యేల వచ్చె నెంతకారము వెలి చింతచే గుందెదో ఆలకింపుమయ్య హరిజనుండ"

"రక్తమాంసములను రైతులకమ్ముచు శక్తిలేక ముక్తి లేక సార్ధకంబులేక చచ్చెద వదియేల" ఉత్తేజాన్ని నింపే అనేక పద్యాలు కనిపిస్తాయి

"తెల్లదొరలుగాని నల్లదొరలు గాని యాదరింతురన్న యాశలేల స్వయము కష్టపడిన సౌఖ్యంబు గలుగదే", "పరువు నురువులేని పాలేరు తనమేల కరువు గొట్టు బ్రతుకు గడపనేల కూలి విలువ దెలసి గుట్టుగా మనవేల", "సాటి జాతిలోన మేటి ప్రేమను బెంచి కష్టసుఖములందు గలయజేసి సాంఘిక సమరంబు సలుపంగ నేర్వరా ఆలకింపుమయ్య హరిజనుండ", "కల్లుత్రాగి పిల్లజెల్లల నేడ్పించి ముల్లె మూటల నెల్ల చెల్లజేసి యిళ్ళు వళ్ళు నేల గుల్లజేసెదవాకో" ఈ వాక్యాలు ఒక కులానికో, ఒక మతానికో, ఒక జాతికో చెందినవికావు, యావత్తు మనుష్యజాతికి సంబంధించినవి.

అపురూపమైన పదగుంభనతో సాగే వీరి రచనలు నేటి సమాజానికి ఆదర్శవంతమైనవి.

వృత్తిరీత్యా ఆయుర్వేద వైద్యులు. ప్రవృత్తి రీత్యా సాహితీ కోవిదుడు. ఆంధ్ర ఆంగ్ల భాషల్లో పండితుడు. కవి, వ్యాసకర్త, ఉత్తమ వక్త, "జయభేరి" పత్రికా సంపాదకుడు.

ఆధునికాంధ్ర సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమ చరిత్ర లో ప్రభవించిన మాణిక్యం, నిప్పులాంటి నిజాయితీ కల్గిన ఉద్యమకారులు అంటారు సీ.వి. మనం కూడా అదే అభిప్రాయంతో ముందుకు వారి ఆశయాలను నడిపిద్దాం.

జై భారత్.

 ISBN: 978-93-340-2436-4

# 20 నిన్నటి ఊహ.. నేటి సత్యం.. 'నాకొద్దీ నల్లదొరతనం'

**ఎం. లక్ష్మి**
తెలుగు లెక్చరర్
వి.ఎస్.ఎం. కళాశాల
రామచంద్రాపురం
98488434500

"కవిత్వం శ్రవ్యకళ. వినసొంపుగా ఉండే నడక కలిగిన మాటల సమాహారం కవిత్వం. ఈ గుణం ఛందస్సు వల్లనే సిద్ధిస్తుంది. ఛందస్సుకు నిత్యనూతనంగా ఉండవలసిన ధర్మం శ్రావ్యత." అంటాడు ప్రాచీనాలంకారికుడు క్షేమేంద్రుడు. **"గేయతి ఇతిగీతం"** అంటుంది అమర కోశం. మనిషి మనుగడ కన్నా ముందు నుంచే గేయం అనేది ఉంది. కాలమాన పరిస్థితులతోపాటుగా సమాజ గమనాల మధ్య తనను తాను మార్చుకుంటూ సంఘసంస్కరణ, దేశభక్తి, అభ్యుదయం వంటి వాటి తనలో ఇముడ్చుకుంటూ ముందుకు పరుగు తీసింది గేయం. పాట దుర్మార్గులైన పాలకుల గుండెల్లో తూటాగా మారింది. గురజాడ, గరిమెళ్ళ, కుసుమ ధర్మన్న తదితరులు పాటతో ప్రజలను ఉవ్విళ్ళూరించారు. ముఖ్యంగా 20వ శతాబ్దంలో జరిగిన ప్రపంచ యుద్ధాలు మానవ జీవనగతినే ఒక కుదుపు కుదిపి కకావికలం చేశాయి. యుద్ధాలనంతరం సాటి మనిషికి మేలు చేయడానికి, మనిషిని మనిషిగా చూడడానికి, సమాజ అసమానతలను అంతం చేయడానికి, విశ్వజనీన అభ్యుదయ భావాలను విశ్వవ్యాప్తం చేసేందుకు గేయరచన దోహదం చేసిందని చెప్పాలి. ఈ నేపథ్యం నుంచి గమనిస్తే 'కుసుమ ధర్మన్న' రచించిన 'మాకొద్దీ నల్ల దొరతనం' గేయ రచయితగా తొలి దళిత కవి (1900 –1946), వ్యాసకర్త, వక్త, జయభేరి పత్రికా సంపాదకుడు, ఉద్యమకారుడు, వృత్తిరీత్యా ఆయుర్వేద వైద్యుడు. సాహితీ కోవిదుడు, ఆంగ్ల–ఆంధ్ర భాషలలో పండితుడు. ఆయన రచించిన 'మాకొద్దీ నల్లదొరతనం' అనే గేయం నాటి ఊహకు.. నేటి వాస్తవానికి మధ్య సమాజంలోని మారాలి అనుకున్న 'వివక్ష' మరో రూపంలో 'వికృత' రూపంలో 'అతి సున్నితంగా' కదలాడుతున్న దృశ్యం శోచనీయమనిపిస్తుంది..

**చైతన్య స్ఫూర్తి..దళిత దీప్తి..** కుసుమ ధర్మన్న 1900లో రాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపుపేటలో వ్యవసాయ కూలీలైన కుసుమ వీరాస్వామి, నాగమ్మ దంపతులకు జన్మించాడు. ఇతడు ఆది ఆంధ్ర జూనియర్ ఎలిమెంట్ పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదివాడు. తర్వాత థర్డ్‌ఫారం చదివి ఆయుర్వేదంలో వైద్య విజ్ఞాన్ పట్టా పొందాడు.

ISBN: 978-93-340-2436-4

చదువుకునే రోజులలోనే సంఘసంస్కరణ అభిలాష కలిగింది. వీరేశలింగం చేత ప్రభావితుడైనాడు. తన జాతి హీనత్వంతో అవమానంతో, అమానుషంగా, అంటరానితనంగా, సామాజిక వివక్షలలో బాధపడుతున్న దళితులను సంస్కరించాలనే దృక్పథంలో 'హరిజన శతకాన్ని' రచించాడు. భాగ్యరెడ్డి వర్మ, బి.ఎస్. వెంకటరావు, అరిగే రామస్వామి వంటి వారి సంబంధాలు వలన ఒక బలమైన రచయితగా తనకంటూ ఓ సాహిత్య లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. దళితులు బ్రిటిష్ పాలనలో కంటే స్థానిక అగ్రవర్ణాల పాలనలో మరింత నలిగిపోతారని మొట్టమొదటిసారిగా చాటింది కుసుమ ధర్మన్న. కాంగ్రెస్‌లో ఉంటూనే 'మాకొద్దీ నల్ల దొరతనమని' గళం, కలం కదిలించిన ధైర్యశాలి.

**'మాకొద్దీ...' గేయ నేపథ్యం... భావజాలం** 1921లో గరిమెళ్ళ సత్యనారాయణ 'మాకొద్దీ తెల్ల దొరతనమని' రాశారు. అదే సంవత్సరం కుసుమధర్మన్న "మాకొద్దీ నల్ల దొరతనమని' వ్రాశారు. ఆ కాలంలో స్వాతంత్ర్యోద్యమ, హరిజనోద్యమ వేదికలపై ఈ రెండు గీతాలు మారు మ్రోగేవి. **స్వాతంత్ర్యం వస్తే తెల్లదొరలకు బదులు నల్లదొరలు వస్తారు. అంటరానితనం కొనసాగుతూనే ఉంటుంది.** ఎప్పుడైతే అస్పృశ్య భావన తొలగిపోతుందో అప్పుడే దళితులకు నిజమైన స్వాతంత్ర్యమని ధర్మన్న గారి భావన. దేశంలో 'ప్రజాస్వామ్యం' వెల్లివిరుస్తున్నదని, కుల, వర్గ వివక్షను అంతరించాయని, ప్రజలంతా సమానమేనని వేదికలెక్కి గుండెలు బాదుకునే నాయకులు నిజంగా 'వర్ణవివక్షతను' విడనాడుతున్నారా అని ప్రశ్నిస్తే సమాధానం దాదాపుగా శూన్యమనే చెప్పాలి. 'అంబేద్కరిజం'ను మేనిఫెస్టోలలో చేర్చి 'మానవత్వం' మా మతమని చెప్పుకునే వారంతా 'దళితులకు' తమ పార్టీలో కేటాయిస్తున్న సీట్లెన్ని? అందుకే కుసుమధర్మన్న **స్వంత పరిపాల జేసేద్దామంటారు/ చెంతకుమముజేరనీరు** అని కాస్త ధిక్కార స్వరం వినిపించారు. ఆయన నిబద్ధత కలిగిన కవి. చెప్పినది ఆచరించి, అక్షర రూపమిచ్చిన దార్శనిక కవి. ఇక్కడో సంఘటనను ప్రస్తావించాలి. గాంధీ తన ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం వచ్చి హరిజన నాయకులలో సమావేశం నిర్వహించే సమయంలో కుసుమ ధర్మన్న ఆ సమావేశాన్ని బహిష్కరించారు. హరిజన గాయకులైతే మా పేటలకు వచ్చి, యిక్కడ మాట్లాడాలని కబురు పెట్టి గాంధీని, ఇతర కాంగ్రెస్ నాయకులను తమ పేటకు రప్పించి, ఆతిథ్యమిచ్చి దళితుల గౌరవాన్ని చాటారు. స్వరాజ్యసమరంలో తమ వారి పాత్ర ఎక్కువగానే ఉన్నా.. తమకు గౌరవమివ్వరని, తమను దూరంగా ఉంచుతారని చెబుతూ **'స్వరాజ్యమనుచు సర్కారుతో పోరాడే/ స్వాతంత్ర్య మడుగుతారు/ మాకు స్వాతంత్ర్యం ఇవ్వబోరు'** అని నాటి సమాజ చిత్రణకు దృశ్యమానం చేశారు..

**చైతన్యం.. ప్రబోధం** అంటరానివారిని దేవాలయాల ప్రవేశం ఈయని సన్నివేశాలను తను కవిత్వీకరిస్తూ **'గుడి గోపురాలకైన రానీరు/ సత్రమ్ములందు మమ్ముండనీరు/ నూతి**

 ISBN: 978-93-340-2436-4

**నీళ్ళన్న తోడుకోనీరు/ మాలలంటే హక్కు లేదంటారు'** అని నాటి, నేటి సమాజ సత్యాలను చెబుతూ చైతన్యవంతమైన ప్రబోధాలను ఈ గేయంలో చేశారాయన. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినా 'వివక్ష' ఏదోరూపంలో ఎక్కడో ఒక దగ్గర (అనేక చోట్ల) నేటికి కొనసాగుతుండడం గమనార్హం. విద్యకు దూరంగా మసలి.. జ్ఞాన సముపార్జనకు 'నోచుకోని' తమవారిని తలచుకొని, తలయెత్తిననదిస్తూ, ప్రశ్నిస్తూ.. ఎందుకీ నల్ల దొరతనమని అస్త్రాలను సంధిస్తూ, **'అచ్చరాలు నేర్వ ముచ్చటున్న గాని/ చదువు బడిలో జేరనీరు/ చదువు చదివితే సహించుకోరు/ విద్య లేదని వెయ్యి తిట్టేరు/ సరివారినీ దరికి రానీరు...'** విద్యలేని వింత పశువుని నిందించే వారే, విద్య నేర్చుకునేందుకు ఎందుకు బడికి రానివ్వరనేది ఓ భేతాళ ప్రశ్న అనేది ఓ వ్యాఖ్యానంగా కుసుమధర్మన్న గారి ఆలోచనలోని ఆవేదన. **"తెల్ల దొరల పైన కళ్ళరాజేసి హక్కులడగ జూచు నా గ్రహమున/ ప్రక్కనున్న నిన్ను తొక్కిపెట్టేరేవారు.."** తెల్లదొరలలో హక్కులకోసం ఉద్యమాలు చేసేవారంతా తమ ప్రక్కనున్న 'తన మనిషి'ని ఎందుకు 'మనిషి'గా చూడరో అని వేదన వ్రెళ్ళగక్కిన వైనం ఎక్కడో దక్షిణాఫ్రికాలోని జాతి వివక్ష గురించి మాట్లాడే వారంతా తమకున్న హిపోక్రసీని బట్టబయలు చేస్తున్నారంటారాయన. వర్తమానంలో స్థితిగతులేమైనా భిన్నంగా ఉన్నాయా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

**అక్షరవేదనా...** 'దోపిడీ వ్యవస్థలో శ్రామికులు, కర్షకులు పాత్ర ఎక్కువ కానీ.. వారికి దక్కేది మాత్రం పిడికెడే' అంటారు మార్క్స్. నిజమని చరిత్ర చెప్పింది. వాస్తవం గణాంకాలతో వివరిస్తున్నది. 1921లోనే కుసుమ ధర్మన్న **"పాడిపంటలు మేము కూడాబెడితే వారు/ కూర్చొని తింటామంటారు/ నాములిచ్చి నట్టేట ముంచేరు/ ఎంచి అప్పు- అప్పు పెంచుతారు/ చెంపకొట్టి కొంపలాగుతారు"** సత్యాలకు అక్షర రూపమిచ్చి, తన కోపాగ్రహాన్ని సందేశంగా ఇచ్చారు. తన సాటివారిలో చైతన్యం నింపారు. ఇకనైనా 'మారాలి' అని తన జాతి వారిని ఉత్సాహపరిచారు. **"ఈ నిప్పు పైనిక మేము విలువలేమో తండ్రి"** అని కూడా ధర్మాగ్రహంను చూపిస్తారు.

చివరిగా-

**'మాకు హిందూ సంగమునందు**
**స్వాతంత్ర్య మాగువరకు**
**మాకొద్దీ నల్ల దొరతనము'** అనే కుసుమ ధర్మన్నను సి.వి. గారు 'దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడ'ని కీర్తించారు. అంబేద్కర్ స్ఫూర్తి పొంది అంటరానితనాన్ని నిర్మించాలనే లక్ష్యంతో తపించిన తొలి తరం కవి. 'అంబేద్కర్‌ని ఆంధ్రదేశానికి పరిచయం చేసింది- కుసుమ ధర్మన్న.. ఈయన కవిత్వంలో 'అనఘోర' ఓ

పాయగా కదలటం గమనించవచ్చు.. వాస్తవమా? కాదా అనేది.. విమర్శకులు తేల్చి చెప్పాలి...

ఆధార గ్రంథాలు:

1. మాకొద్దీ నల్ల దొరతనం- కుసుమ ధర్మన్న- ప్రజాశక్తి ప్రచురణలు
2. సాహితీ సుధ- డా. బాల శ్రీనివాసమూర్తి- బండ్ల ప్రచురణలు
3. కవిత్వం- డిక్షన్- డా. చిక్కి కృష్ణ- మల్లెతీగ ప్రచురణలు.

 ISBN: 978-93-340-2436-4

21

# చైతన్య దీప్తి - కుసుమ ధర్మన్న

**కె.ఎం. సౌందర్యవతి**
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ కళాశాల (అ),
రాజమహేంద్రవరం
సెల్ : 8374539203

**రచయిత విశేషాలు :**

కుసుమ ధర్మన్న తొలి దళిత కవి. ఈ యన తన జాతి హరిజనులు హీనత్వంతో అమానుషంగా బాధపడుతున్న స్థితిని నివారించడానికి సంఘ సంస్కరణ దృష్టితో హరిజన శతకాన్ని రచించారు. ధర్మన్న అంబేద్కర్, గాంధీజీల ప్రభావంతో స్ఫూర్తిని పొంది, అంటరానితనాన్ని నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో ఆలకింపుమయ్యా! హరిజనుడా! అనే మకుటంతో హరిజన శతకాన్ని తనదైన రచనాశైలిలో రచించారు.

తన జాతి చైతన్యం కోసం తపించిన సంస్కరణ శీలి. వృత్తి రీత్యా ఆయుర్వేద వైద్యుడైన ధర్మన్న ఎన్నో రచనలు చేశారు. ముఖ్యంగా 1) నిమ్నజాతి ముక్తితరంగిణి, 2) నల్లదొరతనం, 3) నిమ్నజాతుల ఉత్పత్తి, 4) అసుర పురాణం (పద్యకావ్యం), 5) అంటరానివాళ్ళా! (కథాసంపుటి), 7) హరిజన శతకం.

**చైతన్య దీప్తి :** ప్రజలు అంటరానితనం అనే విషాన్ని మింగి తిరుగుతున్న తరుణంలో తన జాతి హరిజనులను ప్రబోధిస్తూ హరిజన శతకం ద్వారా వారిలో పాతుకుపోయిన మూఢవిశ్వాసాలను వదిలిపెట్టాలని జన్మహక్కులకై పోరాడమనీ, ప్రాణత్యాగం అయినా అది స్వర్గ మార్గమనీ, ఆత్మాభిమానాన్ని ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలని చైతన్యం కలిగించారు.

ప్రజల్లో పాతుకుపోయిన అంధ విశ్వాసాలకు చరమగీతం పాడాలన్నారు. సామాజిక చైతన్యానికి సాహిత్యం దోహదపడుతుందని ప్రజలకు చైతన్య ప్రబోధం చేయాలని ఆశించిన కుసుమ ధర్మన్న గారు తనదైన శైలిలో ఎన్నో అద్భుతమైన రచనలు వ్రాసి, ప్రజల్లో చైతన్యం కలిగించారు. అందులో ముఖ్యంగా గాంధీజీ స్ఫూర్తితో 1933లో దళితులను ప్రబోధించే లక్ష్యంతో “ఆలకింపుమయ్య హరిజనుండ” అనే మకుటంతో ఆటవెలది పద్యాలతో శతకాన్ని రచించి సాహిత్యంతో ప్రజల్ల చైతన్య దీప్తి కలిగించారు.

 ISBN: 978-93-340-2436-4

పురాతన కాలంలో ప్రజలంతా కులమత బేధాలు లేకుండా అన్నదమ్ముల వలె ఐకమత్యంతో నిశ్చింతగా జీవించేవారు. స్వార్ధపరులైన ప్రజలు, అంటరానితనం అనే విషాన్ని ఉగ్గుపాలతో రంగరించిపోసి, మోసగించే దళితుల్ని దాసానుదాసులుగా చేశారన్న విషయాన్ని గ్రహించమని ధర్మన్న గారు ప్రబోధించారు. వారిలో చైతన్యాన్ని నింపి, దళితులంతా తమ హక్కులకోసం పోరాడాలని వీరు కోరారు. హక్కుల పోరాటంలో ప్రాణాలు పోయినా దాన్ని వీరస్వర్గంగా భావించాలని జనులకు హితబోధ చేశారు.

కుసుమ ధర్మన్న తన జాతీయాల్లో ఆత్మగౌరవ స్ఫూర్తినీ దీప్తిని కలిగించిన కవి. ధర్మన్న భారతీయ సమాజంలో నెలకొన్న హెచ్చుతగ్గులను నిరసించిన జాతీయ వాది.

ఓ హరిజనుడా! నీ శ్రేయస్సుకై నేను చెప్పే నిజం నీ మనస్సులోపల దర్శించు. పూర్వకాలంలో భూమిపై ప్రజలంతా అన్నదమ్ముల్లా కలసిమెలసి దురాశ, చీకు, చింతా లేకుండా ఉండి చిరంజీవులయ్యారు. ఆనాడు హక్కులూ, ఆస్తులపై అధికారములేవు. నీవు, నేనూ అనే అహంకారం లేదు. మాయా మర్మాలు లేవు.

ఆ రోజుల్లో ప్రజలకు డబ్బుపై ఆశలేదు. పాడిపంటలే వారికి భోగభాగ్యాలు. దేశమాత ఇచ్చిన సంపదలు ప్రోగుచేసి, సంఘ సేవ చేసవారు. అంతేకాక ప్రజలంతా కష్టపడి పనిచేసుకుంటూ, కడుపునిండా తిని, పేదరికం, అనారోగ్యం లేకుండా బతికేవారు. ప్రజల్లో నూతన చైతన్యం ఉరకలు వేసేది. అంతేకాక కడుపునిండి ఒకడు, ఆకలితో ఆలమటించేవాడు మరొకడు ఉండేవారు కాదు. అందరూ సంతోషంగా, సుఖంగా జీవించేవారు. ఆ రోజుల్లో గ్రుడ్డి, కుంటి వారు తిండి బట్ట లేక, పరుల దగ్గర చేయిచాచేవారు కాదు. వారికి దారిద్రం లేదు.

కృతయుగం దైవ హితంగా సాగింది. మొత్తం ప్రపంచమంతా స్వర్గంగా ఉండేది. కలియుగంలో కృతయుగ ధర్మములు తారుమారు అయ్యాయి. పాపం పెరిగి పోయింది. తనడానికి తిండి లేక ప్రజలు ఆకలితో పస్తులు ఉంటున్నారు. అందరిలో కలహాలు పెరిగిపోయాయి. డబ్బు పై ఆశ పెరిగి, ధర్మం దారితప్పింది.

కుసుమ ధర్మన్న కవితలో మృదుత్వం, భావ వ్యక్తీకరణలో సూటితనం, పద ప్రయోగంలో అర్ధ గాంభీర్యం, పీడిత ప్రజలపట్ల ప్రగాడ ప్రేమానురాగం, కిరాతకమైన వైదిక సాంఘిక వ్యవస్థపట్ల పట్టరాని ఆగ్రహం, హేతుబద్దమైన తార్కిక దృక్పథం, సామాజిక పరిస్థితులను గూర్చి నిశితమైన అవగాహన ఇవే ధర్మన్న కవితలోని విశిష్ట లక్షణాలు.

ఈటెల్లాంటి మాటలతో, బరిసెల్లాంటి ప్రశ్నలతో అగ్రవర్ణ పెత్తందార్ల గుండెల్లో ఫిరంగి గుళ్ళు విసిరిన వీరాధి వీరుడు ధర్మన్న. మధుర మంజుల మార్ధవమైన తేట తెలుగులో దళితుల

 ISBN: 978-93-340-2436-4

గతుకుల బతుకుల్లోని వెతల్ని, ధర్మన్న అత్యంత శక్తివంతమైన కవిత ద్వారా "ఆలకింపుమయ్య హరిజనుడ" అనే మకుటంతో "హరిజన శతకం"లో చెప్పారు.

పూర్వకాలంలో సంఘంలో ఎవ్వరూ తమకు కూడు గుడ్డ లేవని కుంటివారమని గుడ్డితనంతో బాధపడుతున్నామని చెప్పుకొని ఇతరుల వద్ద ముష్టి ఎత్తుకొనేవారు కాదు. ఎవరికీ ఆరోజుల్లో పేదరికం లేదు. ఎవరికీ బాధలు లేవని ఆనాటి సంఘ స్థితిని ధర్మన్న గారు తన హరిజన శతకంలో సవివరంగా తెలియజేసారు మరియు కృత యుగంలో సమస్త జగత్తు స్వర్గంలా ఉండేదని ఆనాటి ప్రజలకు జనన మరణ విచారం లేదని భవగవంతుని ద్యాసలో సుఖంగా ఉండేవారని వివరించారు.

కలియుగంలో కృతయుగ ధర్మం తలకిందులైంది. పాప ధర్మములు పండిపోయాయి. కూడు గుడ్డలు లేక ప్రజలంతా ఘోషిస్తున్నారు. అందరిలో కలవరం కలిగింది. కలత పుట్టి ప్రతి ఒక్కరిలో డబ్బుపై ఆశపెరిగి ధర్మ చింతన నశించింది. మనుషుల్లో మాయ అనే పొరకప్పి మంచితనం మాయమైపోయింది. ఎక్కువ, తక్కువ బేధాలు మొదలు పెట్టారు, కుల మతాల పిచ్చి పెరిగి సంఘంలో ఉన్న ధనాన్ని దొంగిలించి కోటిమందిలో ఒకడు కోటీశ్వరుడయ్యాడు. అప్పుడే పేదరికం భయంకరంగా వ్యాపించి కోట్లాది ప్రజలు పేదవారయ్యారు. లోకంలో ధనం లోభులు పాలయ్యింది. ఒకడు పెట్టుబడి పెట్టి బీదల కష్టాన్ని దోచుకుని తాను ధనవంతుడయ్యాడు. అప్పుడే కుసుమ ధర్మన్న తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని నింపిన కవీంద్రుడు.

ఓ! దళితుడా! నీకు కులము లేదా? స్థలం లేదా? నీకు గుణ గణములు లేవా? ధనబలం లేదా? బ్రతుకు దారిలేదా? ఎందుకు ఊరూ, పేరూ లేకుండా పడి ఉంటావు? నీవు హిందూ దేశ వాసివి. భరతమాత ముద్దు బిడ్డవు, అందుకే నీ హక్కులకై పోరాడు గెలువు అని తన రచనల ద్వారా ప్రజల్లో నూతన చైతన్యాన్ని తీసుకొచ్చి దళిత ప్రజలను కాపాడి, ఎన్నో అద్భుతమైన రచనలు చేసి ప్రజల్లో ధైర్యాన్ని, చైతన్యాన్ని నింపిన మహానుభావుడు – మన కుసుమ ధర్మన్న.

ఆధార గ్రంథాలు :

1) హరిజన శతకం
2) తొలి దళిత స్ఫూర్తి – కుసుమ ధర్మన్న

* * *

 ISBN: 978-93-340-2436-4

22

# హరిజనోద్ధారకుడు-కుసుమ ధర్మన్న

**డా॥ డి. సత్యలత**
తెలుగు లెక్చరర్
గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, జగ్గంపేట.

తొలి దళిత కవి "దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు తెలుగు, సంస్కృతము, ఆంగ్లము, హిందీ, ఉర్దూ భాషలలో ప్రవీణుడు, దళిత వర్గం నుంచి అతి కష్టంమీద చదువుకుని పైకొచ్చి, తిరిగి ఆ చదువును తన జాతి మేలు కోసం వెచ్చించిన అతి కొద్ది మంది దళిత విద్యావంతుల్లో ఒకరు' కుసుమ ధర్మన్న. ఈయన రచనలు పరిశీలిస్తే 1) నిమ్న జాతి విముక్తి తరంగిణి 19211, 2) మాకొద్దీ నల్ల దొరతనం 1921, 3) నిమ్నజాతుల ఉత్పత్తి 1924, 4) మద్యపాన నిషేధం 1930, 5) అసుర పురాణం అను హరిజన చరిత్ర 6) అంటరాని వాళ్ళు (కథలు), 7) మాల కాకి(నవల), 8) స్వస్థ వృత్తము (వైద్య గ్రంథం) 9) హరిజన శతకం 1933, వంటి రచనలు వెలువరించారు. చదువుకునే రోజుల్లోనే సంఘసంస్కరణాభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం చేత ప్రభావితుడై, తన జాతి హీనత్వంతో అవమానంతో అమానుషంగా, అంటరాని తనం, సామాజిక వివక్షలతో, బాధపడుతున్న దళితులను (మాల, మాదిగ, ఇతర అణచబడ్డ కులాలను), ఇతర అణగారిన వర్గాలను సంస్కరించాలనే దృక్పదంతో "హరిజన శతకాన్ని" 1933లో రచించారు. నిజాం రాష్ట్రంలో మాదరి భాగ్యరెడ్డి వర్మ ఆది హిందూ సంస్థను స్థాపించి దళితుల అభ్యున్నతికి పాటుపడ్డట్టు కోస్తా ఆంధ్రాలో కుసుమ ధర్మ కృషి చేశారు. ఈయన హైదరాబాద్లో ఉన్న దళిత ఉద్యమ కారులైన భాగ్య రెడ్డి వర్మ, బి ఎస్. వెంకట్ రావు, అరిగే రామస్వామి లాంటి నాయకులతో అనునిత్యం సంబంధాలు ఏర్పర్చుకొంటు ఒక బలమైన రచయితగా ఎదిగారు. ధర్మన్న ఆ రోజుల్లోనే మనువాదాన్ని దాటి, దళితులశ్రమదోపిడి, ఆర్థిక పరిస్థితుల గురించి ఆలోచించాడు. "కాపులెల్ల పాలెకాపులై మమ్ము పట్టికొట్టి బాధించి రట్టుచేసి రసము పిండుతారని", బ్రాహ్మణేతర వర్గాల దోపిడిని తొలిసారి గుర్తించిన వాడు ధర్మన్న. దీనిని గమనించే దళిత కూలీల ఆర్థిక స్వావలంబన కోసం 1945లోనే హరిజన బ్యాంకును స్థాపించిన దళిత ఆర్థికవేత్త కుసుమ ధర్మన్న. దళితులు బ్రిటిషు పాలనలో కంటే, స్థానిక అగ్రవర్ణాల పాలనలో మరింత నలిగిపోతున్నారని గ్రహించారు. గరిమెళ్ల సత్యనారాయణ రాసిన 'మా కొద్దీ తెల్ల దొరతనం గేయానికి ప్రతిగా 1921లో ధర్మన్న కవి రాసిన మా కొద్దీ నల్లదొరతనం' గేయంతో కోనసీమతోపాటు ఆంధ్రదేశం అంతటా దద్దరిల్లిపోయింది. స్వాతంత్ర్యం వస్తే, తెల్లదొరలు పోయి నల్లదొరలు వస్తారు తప్ప దళితుల బతుకుల్లో పెద్దగా

వారిగేదేం వుండదన్నారు. కాంగ్రెస్లో ఉంటూనే 'మాకొద్దీ నల్లదొరతనము' అంటూ గళం విప్పిన ధైర్యశాలి. ధర్మన్న అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితుడై అంబేద్కర్ గురించి ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారం చేశాడు. ఆంధ్రదేశానికి అంబేద్కరును తొలిగా పరిచయం చేసింది ఈయనే. అణగారిన జాతులకు గొంతుకనిస్తూ, అంబేద్కర్ భావాలను ప్రచారం చేయటానికి 'జయభేరి'అనే పక్ష పత్రికను స్థాపించాడు. అంబేద్కర్ స్ఫూర్తి పొంది అంటరాని తనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో తపించారు ధర్మన్న.

ఈయన గుడివాడ సేవాశ్రమం వ్యవస్థాపకుడు. గూడూరి రామచంద్రరావు వద్ద, సీతానగరం ఆశ్రమం, చాగల్లు ఆనందాశ్రమాలలో కొంతకాలం వుండి తన ఉద్యమస్ఫూర్తిని మెరుగుపరచుకున్నాడు. మహాత్మా గాంధీ అంటరాని కులాల ప్రజలకు హరిజనులు అని పేరుపెట్టడంతో అది ప్రాచుర్యం పొందింది. క్రమేణా ఆది ఆంధ్ర నాయకులంతా కాంగ్రేసు స్థాపించిన హరిజన సేవా సంఘంలో భాగమైనా కుసుమ ధర్మన్న వంటి కట్టుబడిన నాయకులు మాత్రం దాన్ని వ్యతిరేకించారు. నిమ్న జాతుల అభివృద్ధి విషయంలో మహాత్మా గాంధీ ఆశయాలను నమ్మి గౌరవించినా, ఆచరణలో లోపాలను ధర్మన్న సహించలేదు. గాంధీ యొక్క ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం వచ్చిన హరిజన నాయకులతో సమావేశం నిర్వహించిన సందర్భంలో, ధర్మన్న ఆ సమావేశాన్ని బహిష్కరించాడు. 'హరిజన నాయకులైతే మా పేటలకు వచ్చి యిక్కడ మాట్లాడాలని' కబురుపెట్టి గాంధీని, ఇతర కాంగ్రెస్ నాయకులను తమ పేటకు రప్పించి, ఆతిథ్యమిచ్చి దళితుల గౌరవాన్ని చాటాడు.

హరిజన శతకంలో 'కుసుమ ధర్మన్న ప్రతి దళితుడి తట్టి లేపి అతని సజీవమైన భవిష్యత్తును మేలు కొలిపే ప్రయత్నం చేశాడు. ఉన్నత వర్గాలవారి పెత్తందారి వ్యవస్థను విమర్శించారు. ఈ శతకంలో దళితుల జీవన స్థితిగతుల గురించి వీరు ముఖ్యంగా ఏడు అంశాలను వివరించాడు. అవి :

1. దళితుల ఆత్మగౌరవాన్ని తట్టిలేపడం, 2. దళితుల పట్ల సమాజంలో ఉన్న చిన్న చూపుకు స్పందించడం, 3. దళితుల వాస్తవ జీవితాలను తెలియజేయడం, 4. దళితుల శ్రమ దోపిడీని నిరసించటం, 5. వారి జీవితాలలోని వేదనలను, ప్రతి ఘటనలను వినిపించడం, 6. దళిత సమస్య కేవలం కుల సమస్య కాదని, అందులో అనేక ఇమిడి ఉన్నాయని తెలియజేయటం, 7. దళితునిగా పుట్టినందువల్ల అతడు కోల్పోతున్న జీవితాన్ని సూచించటం.

కుసుమ ధర్మన్న ఈ గ్రంథాన్ని నాటి శతకాల మాదిరిగానే శ్రీకారం చుట్టి 'ఆలకింపుమయ్య హరిజనుండ! అనే మకుటంతో పద్యరచన చేశాడు. 9 పద్యాలలో

 ISBN : 978-93-340-2436-4

హరిజనులు అనాది నుండి పేదరికంలోనూ, కులవైషమ్యాల మధ్య నలిగిపోలేదని ఇప్పటి అగ్రకులాల వారి జీవనం లాగే నాటి దళితుల జీవనం ఉండేదని అంటరానితనం అనే ప్రసక్తేలేదని కవి సూచించాడు. 10వ పద్యం నుండి దళితులు శ్రమదోపిడీకి గురి అవటం, పాలేర్లుగా మారిపోవటం, అగ్రవర్గాల వారి చేతిలో అన్యాయాలకు గురవటం లాంటి విషయాలను తెలియజేస్తూ

**"నరక కూపమాయె నరలోకమెల్లను**
**సాగిపోయే సుఖము శాంతమెల్ల**
**బ్రతుకు భారమాయె భ్రమదూరమాయెరా**
**ఆలకింపుమయ్య హరిజనుండ!"**

పూర్వకాలంలోని శాంతియుతమైన సమాజం నశించి పోయిందని నేటికాలంలో దళితుల బ్రతుకు ప్రశ్నార్థకమైందని కవి తన ఆవేదనను వెలి బుచ్చాడు. నేటి సమాజంలో దళితులు పడుతున్న అగచాట్లకు కారణమెవరో ఒకసారి ఆలోచించమని కవి దళితుడ్ని అడుగుతున్నాడు. కులము, స్థలము లేవా? గుణగణంబులు లేవా? బానిసలై పరువు తీసుకోవద్దని కవి హెచ్చరిస్తున్నాడు. బాధ్యతను గుర్తుచేస్తున్నాడు.

పుట్టుకతోనే హిందూ దేశస్థుడివై యుండి భరతమాతకు ముద్దుబిడ్డవై ఉండి నేడు ఊరు పేరు లేకుండా ఊరికి దూరంగా వెలివేయబడి బ్రతకడం ఎందుకు? ఒక్కసారి నీ వెనకటి జన్మ గురించి ఆలోచించుకో అని ధర్మన్న తన జాతిని మేల్కొల్పుతున్నాడు. హరిజనులనే వారు నిజాం ప్రాంతంలో ఆది హిందువులుగా, ఆంధ్రరాష్ట్రంలో ఆది ఆంధ్రులుగా, పిలవబడుతున్నారని అన్నారు.

**"నీకులంబువారు – ప్రాకటంబుగ మున్ను**
**హిందుభూమి నేలి యెలమితోడ**
**సౌఖ్యమందిరనుచు శాస్త్రంబు చెప్పదే?**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

ఇదే జాతివారు పూర్వకాలంలో ఈ హిందూదేశాన్ని పరిపాలించారని ఆ విషయాన్ని ఒక్కసారి గుర్తుతెచ్చుకొమ్మని కవి ప్రబోధిస్తున్నాడు. తమ జాతి అగ్రవర్ణాల చేతిలో చిక్కిందని అనేక రకాలుగా వారి దుర్మార్గానికి, దోపిడీకి అల్లాడిపోతుందని బాధపడ్డారు. ఒకప్పుడు వృత్తుల కోసం కులాలు ఏర్పడితే నేడు వృత్తులు అంతరించి కులాలు మాత్రమే మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. దళిత జీవితాలలోని విషాద ఘట్టాలను పాఠకుడి గుండె కదిలిపోయేటట్లుగా చెప్పి తన జాతిని, ఉద్యమానికి పురి కొల్పడమే కవి ఉద్దేశ్యం. దళితుల

స్థితిగతుల మీద బరువు బాధ్యతల మీద, బాధలమీద, బానిసత్వం మీద తీరని తపన అంతులేని ఆవేదన ఈ హరిజన శతకంలో కనిపిస్తాయి.

ఈ శతకంలో కవి చాలా సరళమైన భాషను ఉపయోగించారు. అగ్రవర్ణాల అహంకారాలను విమర్శ చేస్తూ కుల నిర్మూలనే అంతిమ లక్ష్యం అని నిర్దేశించాడు. దళిత జీవన వాస్తవాలతో పాటు దళిత స్పృహను చైతన్య పరచడం వీరి ముఖ్య ఉద్దేశ్యం. తన కులానికి ఆపాదించిన అంటరానితనం హృదయానికి గాయమై వేధిస్తుంటే దానిని నివారించడమే తన జీవిత గమ్యంగా భావించి ఈ శతకాన్ని రాశానని కవి చెప్పడంలో అతని బాధాతప్త హృదయం తెలుస్తుంది.

ఒకప్పుడు ప్రజలంతా కులమత భేదాలు లేకుండా అన్నదమ్ముల్లా కలిసిమెలసి, నిశ్చింతగా జీవించారు. స్వార్థపరులైన కొందరు అంటరానితనమనే విషాన్ని ఉగ్గుపాలతో పోసి మోసగించి దళితుడ్ని దాసానుదాసునిగా చేశారనే విషయాన్ని గ్రహించమని ప్రబోధం చేశారు. దళితులంతా హక్కుల కోసం పోరాడాలని, హక్కుల పోరాటంలో అసువులు బాసినా వీరస్వర్గంగా భావించాలని శతకం ద్వారా కవి కుసుమ ధర్మన్న పేర్కొన్నారు.

తన జాతి ప్రజలు సంఘంలో హీనంగా, అమానుషంగా బాధపడుతున్న స్థితిని చూసి, ఆవేదన చెంది సంఘ సంస్కరణ దృష్టితో హరిజన శతకాన్ని కుసుమ ధర్మన్న గా వ్రాయటం జరిగింది. ఈ శతక రచన కాలం 1933 వ సంవత్సరం. అంటే ఈ శతకం తొలి తెలుగు దళిత కవితా రచన. అంటే కుసుమ ధర్మన్న తొలి తెలుగు దళిత కవి. వర్ణ వ్యవస్థ పేరుతో భారతీయ సమాజంలో ఉన్న హెచ్చుతగ్గులను నిరసించిన జాతీయ వాది కుసుమ ధర్మన్న కవి. ఈయన రాజమండ్రిలో 1900లో పుట్టి 17 ఏప్రిల్ 1945లో నడి వయసులోనే కన్ను మూసిన ధర్మన్న జీవించిన జీవితం అటు దేశానికీ, ఇటు దళితజాతికి అంకితం చేసిన త్యాగశీలి. సాంఘిక, సాంస్కృతిక, సాహితీ రంగాలలో కుసుమ ధర్మన్న వేసిన ముద్ర అనితర సాధ్యమైంది. బహుముఖీనమైనది ధర్మన్న ప్రతిభ.

**ఆధార గ్రంథాలు :**

1) హరిజన శతకం–కుసుమ ధర్మన్న

2) చిత్తజల్లు వరహాలరావు రచనలు– ప్రజాశక్తిబుక్ హౌస్

* * *

 ISBN : 978-93-340-2436-4

# 23 సంస్కరణ పథంలో వాడని కుసుమ పరిమళం (కుసుమ ధర్మన్నకవి)

**డా॥ దండెబోయిన పార్వతీదేవి**
తెలుగు ఉపన్యాసకురాలు,
కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల
కర్నూలు. సెల్ : 94408 34017

దళితజాత్యుద్ధరణ పథంలో ఓ వాడని కుసుమ పరిమళమే కుసుమ ధర్మన్న కవిగారు. తెలుగునాట తొలి అంబేద్కరిస్టుగా వర్ణించబడినా; దళితుల పాలిట ప్రబోధాత్మక వూపిరిలూదిన ఝంఝామారుతంలా ఊగిపోయినా; సత్యాహింసలను సాధనంగా విశ్వసామరస్య విజ్ఞానసంధాత గాంధీ గారి బాటన అడుగులు కదిపినా; హిందూత్వంలో మరుగైన సామ్యవాదాన్ని తన భుజాలకెత్తి సమాజానికి చూపించిన దార్శనికుడైనా, మద్యపానమే మనిషి పాలిట మహాశాపమని తరిమికొట్టజూచిన మహా ఉద్యమనేత అయినా; నిమ్నజాతులను పట్టిపీడించే కులవ్యవస్థ దౌష్ట్యాన్ని నిరసించిన సంఘ సంస్కరణ సంపన్నుడైనా కుసుమ ధర్మన్న కవి వ్యక్తిత్వాన్ని ఇవన్నీ సంపూర్ణంగా నిర్వచించినట్లు కాదని నా భావన. వీటన్నింటిని శిఖరాయమాన స్థాయికి చేర్చగల గొప్పగుణం వీరికున్న దేశభక్తి. అదే కుసుమ ధర్మన్న కవికి మహోత్కృష్టతను కలిగించింది. భరతమాత పట్ల వారికున్న గౌరవం, భక్తి అపారమైనవిగా నాకగుపిస్తాయి. వీరికున్న ఈ దేశభక్తే మిగిలిన వీరి బహుముఖీన లక్షణాలకు పాదు అయిందన్నది గమనించదగ్గ అంశం.

భారతదేశ ప్రతిష్ట బహుదేశాలలో చల్లిన గాంధీగారి అనుయాయిగా కుసుమ ధర్మన్న కవిగారికి విశేషమైన దేశప్రేమ ఉంది. ఈ దేశంలో పుట్టి పెరిగినవాడిగా ప్రతిదీ ఆయన ప్రేమించాడు. దేశ వారసత్వ సాంస్కృతిక సంపదలేమేమి వున్నాయో వాటన్నిటినీ తనవిగా చూసుకొని మురిసిపోయాడు. వాటన్నిటికి తాము వారసులమని పొంగిపోయాడు. ఈ విషయంలో గుఱ్ఱం జాషువాకు కుసుమ ధర్మన్నకవికి చాలా సామ్యం కనిపిస్తుంది. వీరిరువురూ సంఘంలో వున్న కులమౌఢ్యాన్ని నిరసించారే తప్ప సంఘాన్ని అసహ్యించుకోలేదు. ఈ సంఘం నాది కాదని దూరంగా జరగలేదు. సంఘంలో వుంటూనే తాను తన జాతి ఈ సమాజానికి ఎందుకు కొరగాని వాళ్ళయ్యారో సభ్య భారతీయ సోదరులారా! యోచించమని అర్థించాడు. ఒక్కచోట నిలదీశాడు, మరొక్కచోట ఉద్యమబాట పట్టవలసిందే నని నిగ్గుతేల్చి చెప్పాడు.

ఆ కోవలోనిదే కుసుమధర్మన్న కవి వ్రాసిన హరిజన శతకం. ఇందులో కవిగారికున్న

 ISBN: 978-93-340-2436-4

దేశభక్తి, దేశం పట్ల గల తనవంతు బాధ్యత; అవగతమవుతాయి. అనేకచోట్ల భారతదేశ వైభవాన్ని గర్వంగా స్తుతించటం చూస్తాం. అలాంటి కొన్ని సందర్భాలను చూద్దాం.

తొలి దళిత వైతాళికుడుగా స్తుతించబడ్డ కుసుమధర్మన్న కవి హరిజన శతకంలో తనజాతికి సిసలైన తన నేతృత్వాన్ని నిరూపించు కున్నాడు. సమాజంలో నలుగురిలో తానూ ఒకడిగా బ్రతకటమనేది ప్రతిఒక్కరి జన్మహక్కు అని దాన్ని సాధించుకోవటానికి ప్రాణం పోయినా సరే పోరాడవలసిందేనని గర్జించిన గళం వీరిది. ఇలాంటి కార్యకర్తృత్వమే కాదు రచనా నైపుణ్యం గల ప్రతిభావంతుడు శ్రీ కుసుమ ధర్మన్న కవి.

ధర్మన్న కవి హరిజన శతకం వ్రాస్తూ ప్రారంభంలో చేర్చిన శ్లోకాన్ని చూద్దాం.

**"స్వస్తి ప్రజాభ్యః పరిపాలయాన్తాం**
**న్యాయేన మార్గేణ మహిం మహీశాః"**

ఇందులో న్యాయమార్గములో రాజులు భూమిని పాలింతురు గాక! ప్రజలకు న్యాయము చేకూరుగాక! అన్న భావాన్ని ప్రకటిస్తాడు. అంటే నాయకుడు న్యాయమార్గంలో వుండాలి. తదనుగుణమైన రాజ్యము వల్ల ప్రజలు సుఖంగా ఉండాలి. ఈ మాటల్లోనే కవి సమరసతా వాంఛ సర్వభారతీయులు క్షేమంగా వుండాలన్న ఉదాత్తలక్షణం అర్థమవుతోంది.

అంతేగాదు గ్రంథ అంకితం గురించి చెబుతూ కుసుమ ధర్మన్న కవి సజ్జనులకు ఈ గ్రంథం అంకితం చేస్తాడని; తద్వారా దేశములో శాంతి చేకూరి తేజరిల్లు తుందంటాడు. వారి హృదయంలో దేశ శాంతిపట్ల గల వాంఛ బలీయమైందిగా తెలుస్తోంది. హరిజన శతకం ప్రారంభమే ఆదికాలంలో ఈ దేశంలో జనులంతా అన్నదమ్ముల్లా బ్రతికారని, మాయామర్మములు లేక కలిసిమెలిసి వున్నారని; పాడిపంటలే వారి భాగ్యభోగ్యములని చెబుతారు. అలా తన పూర్వీకుల మానవతా దృక్పథాన్ని తనదిగా మురిసిపోవటం ఇక్కడ గమనార్హం. ఇంతటితో ఆగక

**"దేశమాత యొసగు దివ్య సంపదలెల్ల**
**సేకరించి సంఘసేవ సేయ**
**పాటుపడుట పరువు చేటుకాదానాడు**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

ఈ దేశము చిలకమర్తి వారు చెప్పినట్లు ఒక కామధేనువు. కోరిన సంపదలనిచ్చే గొప్ప నెలవు. కనుక ఈ సంపదలతో సంఘసేవ చేయటం మనిషి కర్తవ్యమన్న సూచన ఇక్కడ గమనార్హం.

 ISBN: 978-93-340-2436-4

సామ్యవాదం, సమభావం, కలిగిన ఈ దేశమును స్వర్గలోకమని; కృతయుగము దైవహితంగా సాగిందని గర్వంగా చెబుతాడు.

**"కడుపునిండి యొకడు కడుపుమండి యొకడు**
**తొత్తు యొకడులేడు దొరయు లేడు**
**భాగ్యవంతుడొకడు బడుగు పేదయు లేడు**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

ఇలాంటిదేదో నేడు కొరవడుతుందన్న భావాన్ని వ్యక్తం చేశాడు. తర్వాత యుగంలో అంటే నేడు సర్వం నాశనమైందని దీన్ని సమాజం ఆలోచించవలసిన అవసరాన్ని హరిజన శతకంలో చెబుతాడు.

హరిజనశతకంలోని ప్రతి అంశం, ప్రతి పద్యం సరళ సుబోధకాలై, సత్యసమ్మతాలై, సుందరభావస్ఫోరకాలై ఒప్పుతున్నాయి. కవి కుసుమ ధర్మన్నగారి హృదయవేదనను సూటిగా చెబుతాయి.పదునైన వారి భావజాలం అంటరానితనాన్ని పులుముకున్న ఈ సమాజాన్ని నిలదీసింది.

**"మాయకప్ప మంచి మటుమాయమై పోయె**
**హెచ్చు తగ్గులంకురింప జొచ్చె**
**కులము ఘనతగాంచె గుణమంతరించెరా**
**ఆలకింపుమయ్యా! హరిజనుండ!!**

అంటూ ఒకే ఒక్క మాటలో మొత్తం లోకం తీరును చెబుతాడు. కోటీశ్వరులు లోభులుగా స్వార్థపరులుగా భూతాలై జనాన్ని కాల్చుకుతినడం మొదలైందని చెప్పడంలో ఒక్క హరిజనుని దైన్యాన్ని మాత్రమే కాదు సర్వసమాజంలో పేదల స్థితిని వర్ణించాడు. అందులో ప్రత్యేకించి ఎందుకు దళితుడి ఉనికి అన్నిచోట్ల మాయమయ్యిందని వాపోతాడు. ఆ సందర్భంలో

**వసుధహిందుదేశ; వాసుండవై పుణ్య**
**భారతాంబ ముద్దుపట్టివయ్యు**
**నూరు పేరులేక నుండెదవదేల!"**...అంటాడు.

ఈ మాటల్లో హిందూదేశ నివాసుడు కావటం, పుణ్య భారతాంబ ముద్దుపట్టి యనటం – తన దేశంపట్ల, దేశ దేశౌన్నత్యం పట్ల వారికున్న గాఢమైన భక్తి మరువదగ్గది కాదు. హిందూ భూమినేలిన నిమ్నజాతి పెద్దలను ఆయన గుర్తు చేసుకోవటం ఇక్కడ గమనార్హం.

అంటరానివాడని ఛీత్కరించి వాడి శ్రమను మాత్రం దోచుకొని స్వేచ్ఛనపహరించి దాసునిగా మార్చిన ఈ దేశ వర్ణ దుస్థితిని తప్పుబడుతూ భరతమాత కంట తడిపెడుతుందని; మన బాగోగులు తెలుసుకుంటుందని కవి వర్ణించటం మార్పుకోసం ఆశపడటం, అందుకోసమే గాంధీ పుట్టాడని మనకోసం ఉద్యమిస్తాడనటం చూస్తాం.

అంతేగాక

**"అర్థరహితమైన యస్పృశ్యతను బార**
**దోలకున్న దేశ; పాలనంచు**
**చిక్కదనుచు గాంధి – నొక్కి బల్కుచునుండె"** అంటారు
**అంత్యజాతి వారి నడుగంట ద్రొక్కెడు**
**వారికేల దేశవాంఛ యనుచు** – అని మరోచోట వర్ణించాడు. సర్వమానవ సమాజం ఆర్థిక సాంఘిక సామాజిక సమానత్వంతో సాగిననాడే దేశ స్వాతంత్ర్యం సాధించిన ఫలితం దక్కుతుందంటాడు. సాంఘిక భీరుడు దేశమును ఉద్ధరించే ధీరుడెట్లా అవుతాడంటాడు. అందుకే మాకొద్దీ నల్లదొరతనం అని నినదించాడు. కుసుమ ధర్మన్న కవి పురోగమన శీలత్వం ప్రతిరచనలోను ప్రస్ఫుటమైంది.

అదే విధంగా హరిజన శతకంలో అనుబంధంగ వారు చెప్పిన పద్యంలో భారతమాత వర్ణించిన తీరులో దేశ ప్రేమను ఉద్బోధించే మేటి లక్షణం ఉన్నది.

**కాళిదాసాది సత్కవి పుంగవుల గాంచి**
**విద్యావతి యననే వెలది యొప్పు**
**రణశూరులగు కృష్ణ రాయాదులను గని**
**వీరమాతయన నే నారి తనరె**
**నతుల కాశ్యాది పుణ్యక్షేత్రములు గల్గి**
**పుణ్యవతి యన నే పొలతి నెగడె**
**కోహినూరు మొదలగు మహిత మణుల నీని**
**రత్నగర్భయన నే రామవెలసె**
**నట్టి సద్గుణ సంఘాత; యఘవిధూత**
**సన్నుత వ్రాత; విపుల తేజస్సమేత**
**బహుళ విఖ్యాత యాచక పారిజాత**
**భద్రముల మీ కొసగుగాత భరతమాత!"**

కాళిదాసాది సత్కవులు, కృష్ణరాయలు, కాశీమొదలైన క్షేత్రాలు, రత్నగర్భ అయిన తన

 ISBN: 978-93-340-2436-4

దేశం గుణవంతం శీలవంతంఅని చెబుతూ అట్టి నా దేశం అందరకూ శుభముల నిచ్చుగాక అంటాడు. యావద్భారత జాతి తనను తనజాతిని ప్రక్కన బెట్టినా కుసుమ ధర్మన్న కవి మాత్రం నిరసించలేదు సుమా! పైగా సోదరభావమే కనబరిచారు. ఇది మొత్తంగా కరుణశ్రీ గారు వ్రాసిన ఆమె అభ్రంకషంబౌ హిమాలయంబే తల్లి మౌళి జుట్టిన మల్లెపూలచెండు... అనే పద్యాన్ని పోలి వుంది. ఇందులో భరతమాతను గుణములు కలది; పాపములు తొలగించేది; తేజశ్శీలి; అనటం ఈదేశ గర్వానికి తగిన వారసులం కావాలన్న ఆకాంక్షను వెలిబుచ్చటమే. దేశప్రేమకు మనల్ని దగ్గరకు చేర్చటమే. ఒకగొప్ప ప్రజాస్వామిక వాతావరణాన్ని కోరుకోవటమే.

**"ధర్మమున కడ్డుపడెడు మదత్రయంబు**
**హైందవుల డెందముల నాశమందు వరకు**
**ప్రథిత మంగళదత్త స్వరాజ్య రథము**
**తెంపు సాగింతురే భారతీయ హితులు"**

కామక్రోధ లోభములు లేనిదై ధర్మము తప్పని భారతీయత కోసం ఆశించిన కుసుమ ధర్మన్న కవి స్వరాజ్య రథమును సాగించుటకై పేద ధనిక కులమతాలు లేని సమసమాజమును కదలిరమ్మని మనసారా వాంఛించాడు. అభివృద్ధి అప్పుడే సాధ్యమన్నాడు. సర్వమానవాళి శాంతిసౌఖ్యాలకోసం కలాన్ని గళాన్ని ఎక్కుపెట్టిన కుసుమ ధర్మన్న కవి ఓ మానవతా ప్రభంజనం. తొలి దళితధిక్కార శంఖారవం. అసమానతలతో ఒరుగుతున్న స్వరాజ్యరథానికి శాయశక్తులా భుజమొడ్డిన పోరాటయోధుడు.

**"జాతిభేదమెంచి స్వాతంత్ర్యమును చంపి**
**నీతిజెరచి సత్యనిరతి జెరచి**
**గొప్ప గోడు చాటుకొన జాచినారయ"**

అనగా స్వాతంత్ర్య ఫలం జాతిభేదాలు మరచిననాడే నీతిని, సత్యాన్ని తప్పనినాడే ఒనగూరుతుందని అలాంటి విశాల భారతదేశం కోసం తపించిన మనీషి కుసుమ ధర్మన్న కవి. వీరి ఆలోచనలను అందుకోవటమే ఈనాటికీ మన కర్తవ్యం.

* * *

 ISBN: 978-93-340-2436-4

24

# కుసుమ ధర్మన్న కవితా వైభవం

**డా॥ శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతీ పేరమాంబ**
పాఠశాల సహాయకురాలు, తెలుగు
కేశవరం, మండపేట మండలం,
చరవాణి : 9440152037

**"మంచి చెడ్డలు మనుజులందున**
**యెంచి చూడగ రెండె కులములు**
**మంచి అన్నది మాలయైతే**
**మాల నేనగుదున్"** అని గురజాడ వర్ణవ్యవస్థపై తిరుగుబాటు బావుటా ఎగరేశాడు. దేవుణ్ణి, శాస్త్రాల్ని, హిందూ మతాన్ని విశ్వసించినా ఆపరిధిలోనే తన కాలానికి అనుగుణంగా అస్పృశ్యతకు వ్యతిరేకంగా సంచలనాత్మకమయిన కవిత్వాన్ని వ్రాసి 'నవయుగ వైతాళికుడయ్యాడు" ఈ భావాలను అందిపుచ్చుకున్న కుసుమ ధర్మన్న 'దళిత ఉద్యమ వైతాళికుడయ్యాడు"

తూర్పు గోదావరి పాపిట సింధూరమయిన, కవిసార్వభౌములకు ఆలవాలమయిన రాజమహేంద్రవరాన రాజసంగా, లక్ష్మీవారపుపేటలో లక్షణంగా కుసుమ వారింట కుసుమ కోమలంగా ఉదయించిన ధర్మన్న జననీజనకులు నాగమ్మ, వీరాస్వాములు. వ్యవసాయ కూలీల ఇంట జనియించిన ధర్మన్న ఐదవ తరగతి వరకు రాజమహేంద్రవరంలోని ఆదిఆంధ్ర జూనియర్ ఎలిమెంటరీ స్కూల్లో చదివాడు. తరువాత థర్డ్‌ఫారం చదివి, ఆయుర్వేదంలో "వైద్య విద్వాన్" పట్టా పొందాడు. ధర్మన్నకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం ఉంది.

విద్యార్థి దశ నుంచే ఖద్దరు ధరించి గాంధీ ఆశయాలను గౌరవించాడు. ఏలూరుకు చెందిన లక్ష్మీనారాయణమ్మతో వివాహమయ్యింది. వీరికి ఐదుగురు మగపిల్లలు కలిగారు. పెద్దవానికి గాంధీ పేరు పెట్టుకున్నారు. మిగిలిన పిల్లలకు గాంధీ పేరు కలిసేలా పెట్టుకున్నారు. పాటలు పాడడంలో ప్రజలను ఆకర్షించాడు. వైద్య వృత్తిలో ప్రజల మనసుకు కూడ వైద్య చేసే జ్ఞానవంతుడు. మద్యం తాగేవారిని మద్యం మాన్పించగల మాటల మాంత్రికుడు. ముఖం చూసి రోగం గుర్తించి, నాడి చూసి మందులిచ్చే ధర్మన్న ఆజానుబాహుడు, స్ఫురద్రూపి, స్నేహశీలి, దయాళువు, ఆపద్బాంధవుడు, వక్త, హరిజన నాయకుడు.

సామాజిక దురాచారాలను సహేతుకంగా ఖండించే ధర్మన్న గాంధీ ఆశయాలను గౌరవించినా, ఆచరణలో లోపాలను సహించలేదు. వర్ణధర్మం పేరిట భారతీయ సమాజంలో నెలకొనియున్న హెచ్చుతగ్గులను నిరసించి జాతీయవాది అయ్యాడు. సంఘ సంస్కరణ అభిలాషతో కందుకూరి వీరేశలింగం చేత ప్రభావితుడయ్యాడు. అంటరానితనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో తపించి, దళిత చైతన్యవ్యాప్తికి కృషిచేశాడు. భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూనే హరిజన సమాజానికి సేవ చేశాడు.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన మన దేశంలో స్వాతంత్ర్యానికి ముందు నిమ్నజాతుల పరిస్థితులను, వారి ఆకాంక్షలను గుర్తించి కవిత్వంలో మృదుత్వం, భావ వ్యక్తీకరణలో సూటిదనం, పదప్రయోగంలో అర్థగాంభీర్యం, సామాజిక పరిస్థితులపట్ల నిర్దుష్ట అవగాహన కలిగిన కుసుమ ధర్మన్న రచనలు....

**నిమ్నజాతి తరంగిణి**
**నల్లదొరతనం**
**నిమ్నజాతుల ఉత్పత్తి వ్యాసం**
**మద్యపాన నిషేధం వ్యాసరచన**
**అసుర పురాణం (పద్యకావ్యం)**
**అంటరాని వాళ్ళం**
**హరిజన శతకం**

యావదాంధ్ర ప్రజల దురదృష్టవశాత్తు ఇవేవీ లభ్యంకావటంలేదు. 2016వ సంవత్సరంలో 'ప్రజాశక్తి' వారు మద్దుకూరి సత్యనారాయణ, శిఖామణి, పుట్ల హేమలత, ద్వా.నా.శాస్త్రి, కొలకలూరి ఆశాజ్యోతి మొదలయిన వారి వ్యాసాలతో ఒక పుస్తకాన్ని ప్రచురించారు.

దళితులకు 'హరిజనులు' అనే పేరు పెట్టి పిలవడం నచ్చక, ఆత్మాభిమానంతో అంబేద్కర్ స్ఫూర్తిని పొందాడు. నాటి జాషువా, భీమన్నల నుంచి నేటి ప్రభాకర్, సుధాకర్ వరకు స్ఫూర్తి నిచ్చాడు. వివక్షకు వ్యతిరేకంగా గళం విప్పాడు. శ్రీశ్రీ మహాప్రస్థానానికి 'జయభేరి' మ్రోగించినట్లు, ధర్మన్న సాంఘిక సమానత్వం కోసం 'జయభేరి' అనే దళిత చైతన్య పక్షపత్రికను ఆరంభించి, అక్షరాలనే ఆయుధాలుగా మలచుకున్నాడు.

కవులలో పద్యాలు అందంగా చదివేవాళ్ళు అరుదుగా ఉంటారు. దేవులపల్లి, జాషువా, అడవి బాపిరాజు మొదలయిన వారితో సమానంగా ధర్మన్నపేరును కూడా కలిపితీరాలి.

 ISBN: 978-93-340-2436-4

మంచి వక్తగా ఎన్నో సమావేశాలలో ఉపన్యాసాలివ్వడమే కాకుండా, శ్రావ్యమైన గొంతుతో పాటలు కూడా పాడే ధర్మన్న ప్రజావాగ్గేయకారుడయ్యాడు.

1921లో గరిమెళ్ళ సత్యనారాయణ 'మాకొద్దీ తెల్లదొరతనము' గేయాన్ని వ్రాశాడు. అదే సంవత్సరంలో కుసుమ ధర్మన్న 'మాకొద్దీ నల్ల దొరతనము' గేయాన్ని వ్రాశాడు. స్వాతంత్ర్యోద్యమ, హరిజనోద్యమ వేదికలపై ఈ రెండు గీతాలు మార్మోగి యావద్భారతం దద్దరిల్లేది.

ప్రపంచ పురోగతిని చూసి, దళితులంతా ప్రగతి సాధించాలనే సత్సంకల్పంతో, దళితులందరినీ ఒకచోట చేర్చాలనే ఆశయంతో 'దళితబ్యాంకు' ఏర్పాటు చేశాడు. రాజమహేంద్రవరంలో 'కుసుమ కుటీరం' అనే ఆశ్రమాన్ని స్థాపించాడు. తూర్పు గోదావరి జిల్లా అంటరానితనం నివారణ సంఘం కార్యదర్శిగా పనిచేశాడు. ధర్మన్న కార్యదక్షత చూసి అంబేడ్కర్ సన్మానం చేశాడు. ధర్మన్న, జాషువాలు మంచి మిత్రులు. కుసుమ ధర్మన్న దళిత అస్థిత్వ సాహిత్యాన్ని జాతీయోద్యమకాలంలో లయాత్మకమైన పాటల్లో తెలుగు సామాజిక జీవనాన్ని దృశ్యీకరించాడు. కుసుమ ధర్మన్న కవిత్వంలో దళితుల ఆక్రందన, ఆవేదన వ్యక్తమవుతాయి. దళితవేదన దళితస్వరం నుంచి వచ్చినప్పుడు వాస్తవికత రూపుదిద్దుకుంటుంది.

జాతి అల్పత్వం, అంటరానితనం, సామాజిక వివక్షకు గురయిన దళిత మరియు అట్టడుగు వర్గాలను సంస్కరించాలనే బలమైన కోరికతో 'హరిజనశతకం' వ్రాశాడు. 'ఆలకింపుమయ్య హరిజనుండ' అనేది ఈ శతకానికి మకుటం.

**"వసుధ హిందూదేశ వాసుండవై పుణ్య**
**భారతాంబ ముద్దు పట్టివయ్య**
**నూరు పేరు లేక నుండెద వదియేల..."** అన్నాడు.

భారతాంబ ముద్దులపట్టియైన కుమారుడు ఊరు, పేరు లేక ఉండిపోవడ మెందుకని సందేశమిస్తూనే పూర్వ చరిత్రను కళ్ళముందుంచుతున్నారు.

**"నీ కులంబు వారు ప్రాకటంబుగ మున్ను**
**హిందుభూమి నేలి యెలమితోడ**
**సౌఖ్యమంది రనుచు, శాస్త్రంబు చెప్పదే..."** అన్నాడు.

ఒకసారి ప్రాచీన చరిత్ర చూస్తే మల్లయుద్ధంలో మహాయోధులు మల్లలు. రాజ్యపాలన చేసి మహాయోధులుగా ఉన్న మల్లలు తరువాతి కాలంలో యుద్ధంలో నష్టపోవడంతో

 ISBN : 978-93-340-2436-4

ముస్లింరాజులు మల్లలను అణచివేసేందుకు అనేక ప్రయత్నాలు చేసి సమాజానికి దూరంగా ఉంచారు. అలా వీరు గ్రామ రక్షక భటులుగా, కావలివారుగా మారారు. వృత్తిరీత్యా చూస్తే వీరు యుద్ధవిద్యలను బోధించేవారు. పల్లవులకాలంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మల్లయుద్ధం వీరు సృష్టించినదే. దీనిని వీరి స్వర్ణయుగకాలంగా చెప్పవచ్చు. నాటి 'మల్ల' వాడుకలో 'మాల'గా మారిందని ఒక వాదన.

**"ఎల్లలోకము లొక్క యిల్లై**
**వర్ణ భేదము లెల్ల కల్లై...**
**మతములన్నియు మాసిపోవును**
**జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును..."**

అన్న నాటి గురజాడ మాటలు తలచినపుడు 'గురజాడ' పేరును తన ప్రియపుత్రునికి పెట్టుకున్న నేటి గరికిపాటి వారి మాటలు విందాం... "కుల వ్యవస్థను నిర్వీర్యం చెయ్యాలంటే మొట్టమొదట మన రాజ్యాంగం నుంచి కులం అనే పదాన్ని తొలగించాల"న్నారు. కులం వృత్తిని బట్టి నిర్ణయించాలి కాని పుట్టుకను బట్టికాదు. కులవృత్తులు పోయాయి. కుల పిచ్చిలు మిగిలాయి" అని అన్నారు. ధర్మన్న ఆనాడే "ఎప్పుడు అస్పృశ్యభావన తొలగుతుందో అప్పుడు దళితులకు నిజమైన స్వాతంత్ర్యం" అన్నాడు. ముందు రాజకీయ నాయకులు సమానత్వం పాటిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నాడు. 'ఆత్మగౌరవంబు నలరంగ చాటరా' అని ఉద్బోధించాడు. సమకాలికులచే 'ఆది ఆంధ్ర కవి సార్వభౌమ' అని కీర్తింబడ్డాడు.

**"మాకొద్దీ నల్లదొరతనము**
**దేవ మాకొద్దీ నల్ల దొరతనము**
**మాకు పదిమందితో పాటు**
**పరువు గలుగకున్న**
**మా కొద్దీ నల్లదొరతనము"** అన్నాడు. ధర్మన్న జీవించిన కాలంలో స్వాతంత్ర్యపోరాటం దేశమంతా వ్యాపించింది. త్వరలోనే స్వాతంత్ర్యం వస్తుందని కవి నమ్మకం. ఆ పోరాటస్ఫూర్తి అధికారమార్పుతో ఆగిపోక, దేశంలో వేళ్ళూనికొనియున్న అసమానతలు అంతమయ్యేవరకు ధర్మయుద్ధం చేశాడు.

**'ధర్మమున కడ్డుపడెడు మదత్రయంబు**
**హైందవుల దెందముల నాశమందు వఱకు**
**ప్రథిత మంగళదత్త స్వరాజ్య రథము**
**తెంపు సాగింతురే భారతీయ హితులు"**

 ISBN: 978-93-340-2436-4

ధర్మమునకు అడ్డుపడే మదత్రయమయిన విద్యామదం, ధనమదం, కులమదం నాశనమయ్యేవరకు భారతీయుల మేలును కోరేవారు స్వరాజ్యరథాన్ని నడపాలి.

**"మేలు కొనుమయ్య తరుణము మించకుండ**
**జన్మహక్కులకై పోరు సల్పుమిపుడె**
**హక్కుకై ప్రాణమిడుట ద్రోహంబు కాదు**
**స్వర్గ పథమని నమ్ముము స్వాతమందు"**

ఓ భారతీయ దీనజనుడా! మేలుకో! సమయం దాటిపోనియ్యకు సుమా! ఈదేశంలో పుట్టిన నీకు అన్నింటిపై అందరిలాగే హక్కులున్నాయి. ఆ హక్కులకోసం పోరాటం చెయ్యి. హక్కులకోసం పోరాడినపుడు ప్రాణం పోయినా అదే స్వర్గమని నమ్మమన్నాడు. ఈ విధంగా తనువున్నంతవరకు తరతరాల కుల అహంకారంపై ధర్మయుద్ధం చేశాడు ధర్మన్న.

**'పరుల ధనమాన ప్రాణ సంపదల ద్రుంచి**
**మనుచనుండుట పాతకంబని దలంచు**
**వారలెందున ధన్యులు వారికెల్ల**
**నంకితమొనర్తు దానినే నధికభక్తి**
**దేశమున శాంతి చేకూరి తేజరిలగ'** అన్నాడు.

ఇతరుల ధనం, గౌరవం, ప్రాణం, ఐశ్వర్యం నాశనం చేసి బ్రతకడం పాపమని అనుకునే వారు ధన్యులు. దేశానికి శాంతి చేకూరేలా చేసే అటువంటి వారికే నేను నాకవిత్వాన్ని అంకితమిస్తానని అన్నాడు. మాటకు, చేతకు మధ్య ఏమాత్రం తేడా చూపని త్యాగధనుడు ధర్మన్న కవీంద్రుడు.

సామాజిక దురాచారాలను సహేతుకంగా ఖండించి, సాంఘిక సమానత్వం కోసం దళితసింహంగా రంగంలోకి దూకిన ధర్మన్న పాలకుల కుటిలత్వాన్ని బట్టబయలు చేశాడు.

**"మాలవాడని యవమానంబు గావించి**
**పంచముండని పరువు పారద్రోలి**
**ఆదిమాంధ్రుడవని సోది చెప్పిరిగాదె**
**ఆలకింపుమయ్య హరిజనుండ"** అన్నాడు.

ఈ కులవ్యవస్థ నాశనం కావాలంటే మనమేం చేయాలనే విషయం గురించి తీవ్రంగా ఆలోచించాలి. మనం దాన్ని సృష్టించలేదు. మనం ఒకరినొకరు నిందించుకుని ప్రయోజనం లేదు. దేశానికి పట్టిన ఈ చీడపురుగును పెంచి పోషించక, ఇక్కడితో వదిలించుకోవాలంటే

 ISBN : 978-93-340-2436-4

ధర్మన్న స్ఫూర్తిని యావదాంధ్రలోకానికి దీప్తిగా సమ సమాజ భావంతో మనిషిని మనిషిగా గౌరవించే రేపటి రోజుకు ఆహ్వానం పలుకుదాం!!!

ఒక్కసారి ప్రజాకవి వేమన పద్యాన్ని ఈ సందర్భంలో గుర్తుతెచ్చుకుందాం...

**జాతులందు మిగుల జాతియేదెక్కువో**
**యెఱుక లేక తిరుగ నేమి ఫలము?**
**యెఱుక కలుగువాడె యెచ్చైన కులజుడు**
**విశ్వదాభిరామ వినురవేమ!!**

ఈ జగతిపై నివసించే జాతులలో ఒకటి ఎక్కువ, మరొకటి తక్కువ కానేకాదు. జ్ఞానము లేని మనుష్యులు ఏకులం ఎక్కువని ఎంత తిరిగినా ప్రయోజనం ఏమీలేదు. ఎవడు జ్ఞానవంతుడో అతడే గొప్ప కులమువాడు అన్న మాటలు నిత్యసత్యాలు. అజ్ఞానాంధకారంలో మునిగి కులం, మతం అని వృధాగా కాలం గడపక ఉన్న సమయాన్ని జ్ఞానార్జనకు ఉపయోగించి జ్ఞానమొక్కటి నిలిచి వెలిగేలా చేద్దాం!! ధర్మన్న ఆశయాలు నిజం చేద్దాం!! కులమత బేధాలు లేని సమసమాజానికి చక్కటి బాటలు వేద్దాం!!

ధర్మన్న గురించి మహనీయుల మాటలను ఒకసారి గుర్తుచేసుకుందాం!!

“దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు” – సి.వి.

“అఖిలాంధ్ర సహృదయ సామ్రాజ్యాన్ని నేటికీ పరిపాలిస్తున్న జాషువా అంటే నాకిష్టమే. కవి కుమారునిగా క్రియా సూర్యునిగా జాతిని మేలుకొలిపి మూలాలను వెతికి పట్టిచ్చిన దళిత వైతాళికుడు కుసుమ ధర్మన్న కవి అంటే మరీ ఇష్టం” – ద్వా.నా.శాస్త్రి.

“ధర్మన్న కవి చూపు జాషువా కంటే విశాలమైనది. నిమ్నజాతులు అనే స్పృహ కలిగిన కవి” – ద్వా.నా.శాస్త్రి.

ఉపయుక్త గ్రంథసూచి :

1) తొలిదళిత ఆత్మగౌరవ స్వరం కుసుమ ధర్మన్న కవి –కొలకలూరి మధు జ్యోతి
2) అంతర్జాల ఉపన్యాసాలు
3) అద్దేపల్లి రామ్మోహనరావు అంతర్జాల వ్యాసాలు
4) ఆంధ్రప్రదేశ్ 6వ తరగతి తెలుగువాచకం.

* * *

 ISBN: 978-93-340-2436-4

# 25 సమతా రాజ్య సాధనోద్యమ తొలి దిక్సూచి డాక్టర్ కుసుమ ధర్మన్న కవి

**పండిట్ ఎలగొండ రాములు**
రీసెర్చ్ స్కాలర్, తెలుగుశాఖ,
కాకతీయ యూనివర్సిటీ, విద్యారణ్యపురి,
వరంగల్లు. సెల్ : 9618598847

**నీతి జాతి లేని నీచులమని, మమ్ము**
**నిందించి బంధించుతారు**
**జాతిబేధాలెన్నో చాటుతారు**
**నీతి జాతి వారే నిలుపలేరు**
**చేయరాని పనులెన్నో జేసేరు**
**మా, మాల మాదిగలంటె మండి పడి పోతారు**

**॥ మాకొద్దీ నల్లదొరతనము॥"**

(మాకొద్దీ నల్లదొరతనము – 5వ చరణం. ఈ పుస్తకం ప్రచురించబడిన సంవత్సరం 1933. దీనికి ఆనాటి వెల : ఒక అణా)

తెలుగు సాహిత్యంలో వెయ్యి ఏండ్ల కింద రచనలు చేసిన నన్నయ లాంటి కవులకు తగిన స్థానమిచ్చిన మనం ఏడున్నర దశాబ్దాల క్రితం కవిత్వం రచించి, సామాజిక సమత కోరినట్టి డాక్టర్ కుసుమ ధర్మన్న కవి గురించిన చర్చ జరగవలసినంతగా జరగలేదు. సాహిత్య వెలితిని పూడ్చేటందుకు ఈ జాతీయ సదస్సును నిర్వహించడం సంతోషదాయకం.

1900 సంవత్సరంలో మార్చి 17వ తారీఖున జననమొంది, 1946 ఏప్రెల్ 17 నాడు 46 ఏండ్ల మధ్య వయస్సులోనే జీవితం చాలించిన డాక్టర్ కుసుమ ధర్మన్న కవి కృషి, శ్రమ బహుముఖాలుగా సాగింది. బహుముఖ ప్రజ్ఞాశాలిగా వెలుగొందారు.

రాజమండ్రిలో గల ఆదికవి నన్నయ యూనివర్సిటీ – తెలుగు శాఖ & కుసుమ ధర్మన్న కళాపీఠం వారి సంయుక్త నిర్వహణలో "కుసుమ ధర్మన్న కవి సాహిత్య సమాలోచన" అనే అంశంపై 16 మార్చి 2024 తారీఖు నాడు తెలుగు ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ గారు డైరెక్టర్‌గా జరుగుతున్న జాతీయ సదస్సుకు సమర్పిస్తున్న పరిశోధనా వ్యాస పత్రమిది. ధర్మన్న సాగించిన ధర్మయాత్రలో సాహిత్య, సామాజిక, సాంస్కృతిక,

 ISBN : 978-93-340-2436-4

ఆర్థిక, రాజకీయ తదితర రంగాలలో చేసిన అమూల్యమైన సేవల్ని రేఖామాత్రంగా ప్రస్తావించడం ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

19వ శతాబ్దపు తొలి రోజుల్లో స్వాతంత్ర్యోద్యమం, సంఘసంస్కరణోద్యమం ప్రబలంగా ఉన్న కాలంలో నాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లాలో తెలుగు సాహిత్యానికి తొలి రాజధాని అయిన రాజమండ్రి పట్టణంలో గల లక్ష్మీవారపు పేటలో ఒక నిమ్నజాతి కుటుంబంలో కుసుమ నాగమ్మ, వీరస్వామి దంపతులకు జన్మించారు – 'కుసుమ ధర్మన్న కవి'. 'కులవ్యవస్థ వేళ్ళూనుకున్న ఇండియా సమాజంలో కులతత్వపు అణిచివేతకు గురైన కుటుంబంలో పుట్టిన 'ధర్మన్న కవి' సాహితీవేత్తగా, కులాన్ని రద్దు జెయ్యాలనే ఉద్యమానికి నాయకుడిగా, సమాజ సమానత్వోద్యమానికి తొలి దిక్సూచిగా నిలిచారు.

వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన ధర్మన్న, బాల్యదశలో చదువుల్లో, ఆటపాటల్లో చురుకైనవాడు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా చిన్న వయస్సులోనే ధర్మన్నలో ప్రగతి భావాలు వికసించాయి. ఆది ఆంధ్రా జూనియర్ బేసిక్ ఎలిమెంట్ స్కూలులో 5వ తరగతి, ఆ తర్వాత థర్డ్‌ఫారం చదివారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం పొందారు. వైద్యవిద్వాన్ పట్టా సాధించి, ప్రజలకు వైద్యసేవలందించే డాక్టర్ అయ్యారు. ఆ రోజుల్లో రాజమండ్రి కేంద్రంగా కందుకూరి వీరేశలింగం చేస్తున్న సాహిత్య, సామాజిక చైతన్యోద్యమ ప్రభావం డాక్టర్ కుసుమ ధర్మన్న కవిపై పడింది. ఒకవైపు ప్రకృతివైద్యాన్ని ప్రజలకుఅందించే డాక్టర్‌గా కొనసాగుతూ, సాంఘిక సమానత్వాన్ని సాధించే ందుకు కవిత్వాన్ని, వ్యాసాల్ని మొదలగు సాహిత్య ప్రక్రియల్ని రచిస్తుండేవారు. అనేక సభలలో వేదికలమీద ఉపన్యసించారు. 'జయభేరి' అనే పేరుతో ఒక పత్రికను స్థాపించి, సంపాదకత్వం వహించారు. రాజమండ్రి కేంద్రంగా తన కార్యక్రమాల్ని ధర్మన్న విస్తరింపజేశారు. రాజమండ్రి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ప్రతిగ్రామంలోనూ, కులాన్ని లేకుండజేసే మహోద్యమ బీజాన్ని నాటినాడు. 1945లో నిమ్నజాతీయుల్లో పొదుపు చెయ్యడం కొరకు దేశంలోనే తొలిసారిగా 'హరిజన బ్యాంకు'ను స్థాపించిన మహనీయుడు ధర్మన్నకవే.

డాక్టర్ కుసుమ ధర్మన్న కవికి యుక్తవయస్సు వచ్చేనాటికి తెలుగునాట సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, చారిత్రక, ఆర్థిక నేపథ్యాలు రకరకాల ఆలోచనలతో ముడిపడి ఉండేవి. ఆనాటి కాంగ్రెస్ నాయకత్వంలో జాతీయోద్యమం, గాంధీజీ నాయకత్వంలో హరిజనోద్యమం ఉధృతంగా సాగుతుండేవి. జాతీయోద్యమ నాయకులు అంతర్గతంగా బ్రాహ్మణీయ భావజాలాన్ని కొనసాగిస్తూ ఉండేవారు. నాటి పాలకులు బ్రిటిష్ వాళ్లు మతప్రచారం మీద చూపించిన ఆసక్తి అంటరానితనాన్ని తొలగించటంపై చూపకపోవడం

వలన నిమ్నజాతీయుల ఉద్ధరణ కుంటుతూ సాగుతూ వుండేది.

ఈ నేపథ్యంలో సంస్కరణలో భాగంగా అంటరానివారితో సహపంక్తి భోజనాలు జరిపేవారు. ఇందులో పాల్గొన్న సంస్కరణ వాదుల్ని బ్రాహ్మణ కులం నుంచి బహిష్కరించేవారు. ఆలయ ప్రవేశం కూడా నిమ్నజాతీయులకు నిషిద్ధమే. గ్రంథాలయాల్లోకి కూడా వీరికి ప్రవేశం లేదు.

అట్లాంటి కాలంలో డాక్టర్ కుసుమ ధర్మన్న కవి గాంధీజీ నడుపుతున్న హరిజనోద్యమం పట్ల ప్రభావితుడు కావటం జరిగింది. ధర్మన్న గారు తన పిల్లలకు గాంధీ కుటుంబానికి చెందిన పేర్లను పెట్టుకున్నారు. ఆ పేర్లు పావనమూర్తి, మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ, భాగ్యలక్ష్మి, కాశీవిశాలాక్షి.

గుడివాడ సేవాశ్రమ స్థాపకుడైన గూడూరి రామచంద్రరావు గారి వద్ద కొంతకాలం, సీతానగరం ఆశ్రమం, చాగల్లు ఆనందాశ్రమం వంటిచోట్ల కొంతకాలం వుండి డాక్టర్ కుసుమ ధర్మన్న కవి జాతీయోద్యమ స్ఫూర్తిని మెరుగుపరుచుకున్నారు. ఈ స్ఫూర్తి వల్లనే కొన్నాళ్ళు జస్టిస్ పార్టీలోనూ, ఆ తర్వాత రాజమండ్రి తాలూకా బోర్డుకు కాంగ్రెస్ పార్టీ సభ్యుడుగా పనిచేశాడు. బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్ పరిచయం జరిగాక, అనుచరుడిగా ఉంటూ ఆయన భావాలను ప్రచారం చేస్తూ నిమ్నజాతీయుల్లో చైతన్యాన్ని కలిగించారు. తెలుగు సమాజానికి డా॥ అంబేద్కర్‌ను ప్రచారంలోకి తీసుకొచ్చిన ప్రథముడు ధర్మన్న కవి.

బర్మాదేశ రాజధాని రంగూన్ (మయన్మార్) కు బతుకు దెరువు కొరకు వెళ్ళి, అక్కడే స్థిరపడిన ఆది ఆంధ్రులు నిరవహించుకున్న సభకు ఆహ్వానం అందుకొని, ఆ సభలకు హాజరై స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు కుసుమ ధర్మన్న కవి. అక్కడి ఆది ఆంధ్రులు ఇచ్చిన విరాళాలు స్వీకరించి, 1937లో రాజమండ్రి నుంచి 'జయభేరి' పత్రికను తన సంపాదకత్వంలో ప్రారంభించారు. ధర్మన్న కవిపై ఎంత నమ్మకం ఉంటే, ఈ విరాళాలు సమకూరుతాయో మనం ఆలోచించాలి. ఏ పని చేసినా, ఎంతో అంకితభావంతో ముందుకు సాగేవారని ధర్మన్నకవిని అర్థం చేసుకోవాలి.

'జయభేరి' పత్రిక ద్వారా ధర్మన్న కవి డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను ప్రచారం చేశారు. ఈ పత్రిక ఆది ఆంధ్రుల ఉద్ధరణ, అణిచివేతకు, పీడనకు గురైన శ్రామిక జనాల కష్టాలను జనబాహుళ్యంలోకి తీసుకరావటానికి కృషి చేసింది. ఈ పత్రిక నిమ్నజాతీయులు కాని ప్రజలకు కూడా ప్రీతిపాత్రమైంది. పద్మభూషణ్ 'బోయి భీమన్నగారు, దిడ్ల పుల్లయ్యగారు

 ISBN : 978-93-340-2436-4

ఈ పత్రికకు ఉపసంపాదకులుగా పనిచేశారు.

నిమ్నజాతీయులుగా చెప్పబడుతున్న ఆది ఆంధ్రులు కార్తీకమాసాల్లో జరుపుకునే వనభోజనాల సంస్కృతిని డాక్టర్ కుసుమ ధర్మన్న కవి నూతనమైన ఆలోచనలతో ఆది ఆంధ్రుల పరిచయ కార్యక్రమాలకు వేదికగా మార్చుకున్నారు. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటుచేసి, ప్రతి ఇంటి నుంచి వంట సరుకులు సేకరించి, వనభోజనాలు నిర్వహించి, నిమ్నజాతీయుల పరిచయ వేదికగా మలిచారు. ఆది ఆంధ్రుల సమైక్యత, ఆది ఆంధ్రుల సమస్యల కార్యాచరణ పథకాల చర్చ జరుపుకునేతందుకు ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడింది.

హరిజన సేవా కార్యక్రమాలలో భాగంగా ఆ రోజుల్లో గాంధీజీ రాజమండ్రికి వచ్చిన సందర్భంలో జరిగిన సమావేశానికి డాక్టర్ కుసుమ ధర్మన్న కవి హాజరు కాలేదు. హరిజన నాయకుడిగా పర్యటనకు వచ్చిన గాంధీ, తమ పేటలకే వచ్చి మాట్లాడాలని కబురు పంపాడు. గాంధీతోపాటు మరికొంత మంది కాంగ్రెస్ నాయకులను కూడా తమపేటకు రప్పించి, ఆతిథ్య మిచ్చిన ధీరుడు. ధర్మన్న కవి. ఆది ఆంధ్రుల కొరకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ, చైతన్యపరుస్తూ కులవ్యవస్థను ప్రశ్నించిన ధైర్యశాలి కుసుమ ధర్మన్న కవి.

ఆది ఆంధ్రుల్లో చైతన్యం కలిగించేటందుకు ధర్మన్నకవి సాహిత్యాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించారు. పాట ఆశువుగా అతి సులువుగా ప్రజల్లోకి చొచ్చుకుపోయి. ఆలోచింపజేస్తుంది. నిమ్నజాతీయుల కష్టాలను, అణిచివేతను పాటరూపంలో ప్రవేశపెట్టారు ధర్మన్న కవి. ప్రజల్లో కులనిర్మూలనా చైతన్యమై నిలిచారు. 1909లో అజ్ఞాతకవి రచించినట్లుగా సాహిత్య లోకంలో ప్రచారంలో ఉన్న 'మాల వాండ్ర పాట' తొలి తెలుగు ఆది ఆంధ్రుల పాట. ఈ పాట రచన జరిగి వందేండ్లు దాటినా, అసలు కవి ఎవరనేది వెలుగులోకి రాలేదు. ఇటీవల కొందరు పరిశోధకులు తమిళనాడు తంజావూరు గ్రంథాలయంలో 'జయభేరి' పత్రిక ప్రతులు ఉన్నట్లు, ఆ పత్రికలో 'మాల వాండ్ర పాట' ప్రచురితమైనట్లు వెల్లడించడమేకాక, ఆ పాట రచించిన కవి డాక్టర్ కుసుమ ధర్మన్న కవిగా నిర్ధారించారు.

1921లో నాటి జాతీయోద్యమంలో భాగంగా గరిమెళ్ళ సత్యనారాయణ 'మా కొద్దీ తెల్లదొరతనము' అనే పాట రచించారు. బ్రిటీషు పాలకులు తెల్లదొరలు. వారిపాలన మనదేశానికి వద్దని - ఈ పాట సారాంశం. తెల్లదొరలకు వ్యతిరేకంగా సాగుతున్న జాతీయోద్యమంలో తెలుగు ప్రజలు పాల్గొనే తందుకు చైతన్యం తీసుకురావడానికి ఉద్దేశించిన ఉద్యమ గీతమిది. అయితే, నాటి జాతీయోద్యమంలో ఆధిపత్యమంతా వైదిక మనువార్య హైందవ బ్రాహ్మణీయానిదే. ఇట్టి ఆధిపత్య ధోరణి వెయిల ఏండ్లుగా 'కులం'

ముసుగులో కొనసాగుతున్నదనేది జగమెరిగిన సత్యం. గరిమెళ్ళ వారు రచించిన పాట కోరుకునేది అధికారమార్పిడి మాత్రమే. ఇదే జరిగితే, మూలనివాసి బహుజన ద్రావిడులకు పురోగతి ఉండదని, ఈ దేశంలో ఉన్న కులవ్యవస్థను పూర్తిగా తొలగించాలని, గరిమెళ్ళ పాటకు ప్రత్యామ్నాయంగా ధర్మన్న కవి 'మాకొద్దీ నల్లదొరతనము' పాటను ఈటెగా విసిరారు. దాని లక్ష్యం ఇంకా నెరవేరలేదు. 90 ఏండ్లయినా ఆ పాటకు సాహిత్యంలో పరిశోధనల్లో, విమర్శల్లో, విశ్లేషణల్లో ఎంతో ప్రాధాన్యత ఉన్నది.

పల్లవి : మాకొద్దీ నల్లదొరతనము – దేవ మాకొద్దీ నల్లదొరతనము
బాబు మాకొద్దీ నల్లదొరతనము
అనుపల్లవి : మాకు పదిమందితో పాటు – పరువు గలుగకయున్న
మాకొద్దీ నల్లదొరతనము
చరణం : వర్ణాశ్రమ ధర్మాలు – వదలి తిరుగుట చేత
వచ్చేను వెలి మీకంటారు
వేదాలు బ్రాహ్మణులు వదిలేరు – క్షాత్రధర్మము మానిరి క్షత్రియులు
కులవృత్తి మరచేరు కోమట్లు – శూద్రవరులు సేద్యము మానిరిపుడు
యిందు వర్ణాశ్రమధర్మాములెందున్నవో తండ్రి ॥మాకొద్దీ ॥

ఈ విధంగా 56 చరణాలతో ఈ పాట సుదీర్ఘంగా సాగుతుంది. మనిషిని మనిషిగా చూడని వ్యవస్థ మాకు వద్దంటూ, పదిమందిలో పరువు నిలిపే, మానవీయత మాకు కావాలని కవి ధర్మన్న కోరుతున్నాడు. నిచ్చెనమెట్ల చాతుర్వర్ణ వ్యవస్థ – బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర... అనే నాలుగు వర్ణాల వ్యవస్థ. ఇట్టి వ్యవస్థలో ఆయా వర్ణాల వాళ్ళు, వారికి కేటాయించబడిన వృత్తిని చేస్తలేరని, వేరే పనుల్ని చేస్తున్నారని, ఆది ఆంధ్రులకు ఇందులో స్థానం కల్పించక పోవడం ఈ వ్యవస్థ తప్పిదమని కవి ప్రశ్న. ఈకవి ప్రశ్నించినట్లే, డాక్టర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, పెరియార్ ఈ. వి. ఆర్, కబీరు, నారాయణ గురు మొదలగు మహనీయులు ఎంతోమంది ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదు.

చరణం : దారిలో మము జూచి దూరదూరముగాను
తొలగిపోయెదరయ్యొ రామ
మేము మీ తోటి నరులాము గామ?
తరిమికరిచే తాచుబాములమా?
పట్టిలాగేరేగు కంపలామా?
భయము పుట్టించె దయ్యాములామ?

కసిగుట్టే కందిరీగలామా? అయ్యో
చిన్నబుచ్చెదరేల యిది మీకు ధర్మమా? ॥మాకొద్దీ॥

అంటరానితనాన్ని పాటించే కులతత్వవాదులకు ఈ ప్రశ్నలన్నీ. మానవత కొరకు ఆది ఆంధ్రుల తండ్లాట.

'మాకొద్దీ నల్లదొరతనం' పాటలో ఆది ఆంధ్రులలో అనగా మూలనివాసి బహుజన ద్రావిడులలో మహనీయులుగా పేరొందిన వారిని గుర్తు చేస్తున్నారు కవి ధర్మన్న. చోకమేళా, తిరుప్పాణాళ్వారు, నందనారు, ఆరంజ్యోతి, శబరి, మాతంగి, సత్యవతి, వాల్మీకి, కాళిదాసు, బాలముకుందు, రావిచెట్టు రంగారావు, హీరా బాయమ్మ, చిలకమర్తి, కందుకూరి, మంగిపూడి, ఆదిపూడి, బాజీ కృష్ణారావు, గయా ప్రసాదు, రాజా ప్రతాపగీరు, గోస్వామి ధనరాజగీరు, లాల్‌గీర్ బీర్‌భాన్‌గీరు, వనపర్తి నరేంద్రుడు, మునగాల నృపేంద్రుడు, రాజా వెంకట రామారెడ్డి, భాగ్యరెడ్డివర్మ, వల్లాటి శేషయ్య, మాదారి ఆదయ్య, అరిగె రామస్వామి, బత్తుల వెంకటరావు, దువ్వల చెన్నకృష్ణయ్య, గడ్డం సేవకదాసు, మాదరి వెంకటస్వామి, ధర్మన్నకవి, మాడపాటి, వడ్లకొండ... మొదలగు మహనీయులు మూలనివాసుల ఉద్యమానికి తోడునీడ లాగా ఎల్లప్పుడూ ఉంటారని కుసుమ ధర్మన్న కవి తెలిపారు. దేశంలో అన్నిచోట్లా ఉద్యమించిన వారి పేర్లు ఈ పాటలో పొందు పరచటం గొప్ప విశేషం.

గాంధీ మహాత్ముడు – కరుణతో మమ్ముల
గాపాడమని చెప్పుతారు
అంటరానితనమే లేదంటారు
గాంధీ గాంధీయని కలవరిస్తారు
వారి శిష్యులమని తిరుగుతారు
గాంధీబోధా మరువలేదంటారు
మా, మాల మాదిగ లంటే మండి పడిపోతారు ॥మాకొద్దీ ॥

గాంధీజీకి శిష్యులమని చెప్పుకునే వారు అంటరానితనం లేదంటూనే, మాల మాదిగలను నీచంగా చూస్తుండటం, వారి ద్వంద్వవైఖరికి, దుష్టత్వానికి నిదర్శనమని డాక్టర్ కుసుమ ధర్మన్న కవి భావన.

చరణం : స్వారాజ్యమంటారు – సభలెన్నో జేసేరు
గాంధీకి జయ్ జయ్ యంటారు – దేవ
హిందూ ముసల్మాను లేకమై యుందామంటారు
మన ఖద్దారుగట్టామంటారు

 ISBN: 978-93-340-2436-4

శాంతమే స్వారాజ్యమంటారు
శాంతి సైన్యామంటూ నిలుపుతారు
మా, మాల సంగతియేమి మహిమీద చెప్పారు ॥మాకొద్దీ ॥

స్వరాజ్యం, సభలు, గాంధీకి జై, హిందూ-ముస్లిం భాయీ భాయీ, ఖద్దరు ధరించడం, శాంతి... మొదలగు విషయాల్లో స్పష్టత ఉన్నవాళ్లు ... మాలల విషయాన్ని ఏం జేశారని కుసుమ ధర్మన్న ప్రశ్న.

సుమారు 99 సంవత్సరాల క్రిందట రాజమండ్రి కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలో గర్జించిన కంఠం డాక్టర్ కుసుమ ధర్మన్న కవిది. ధర్మన్న కవికి పద్యకవిగా పేరు తెచ్చినది, వారి 'హరిజన శతకం'. తెలుగు గడ్డ మీద అంటరానితనంపై యుద్ధం ప్రకటించిన యోధులలో ప్రముఖ వ్యక్తి ధర్మన్నకవి.

డాక్టర్ కుసుమ, ధర్మన్నకవి రచనల్లో ముఖ్యమైన గ్రంథం 'హరిజన శతకం'. 'ఆలకింపుమయ్య హరిజనుండ' అనే మకుటంతో ఆటవెలది పద్యంలో సాగిన ఈ శతకం ఆనాటి అంటరాని కులాలలో చైతన్యం నింపడానికి అల్లిన ఒక చైతన్య సాహితీమాల. ఈ శతకాన్ని తన కులానికి ఆపాదించిన న్యూనతా భావాన్ని తట్టుకోలేక, దానిని ఎలాగైనా తొలగించాలనే ఉద్ధేశ్యంతో రాస్తున్నానే గానీ, తనకు రచనలో పాండిత్యంగానీ, సంఘ సంస్కరణలో జ్ఞానంగానీ లేదని కుసుమ ధర్మన్న కవి స్వయంగా ఈ శతకానికి రాసిన ముందుమాటలో తెలియజేశారు.

109 పద్యాలు గల గ్రంథం హరిజనశతకం. ఈ శతకంలో ప్రపంచంలో మొట్టమొదట జీవించిన జనాల గురించి మొదలుకొని, ఆ తర్వాత వచ్చిన హెచ్చుతగ్గులు, దోపిడీ, వివక్ష మొదలగు వాటి గురించి ఎంతో చక్కగా కవిత్వీకరించారు ధర్మన్నకవి.

**ఆర్యులనెడు బ్రాహ్మ - ణాదులాసియ నుండి**
**వలసవచ్చి నీదు - పంచజొచ్చి**
**కొల్లగొట్టిరాజ్య - మెల్ల దోచినరయ్య**
**ఆలకింపుమయ్య - హరిజనుండ.**

ఆర్యులు అనబడుతున్న బ్రాహ్మణులు ఇండియాకు వలస వచ్చినారని, బతుకుదెరువు కొరకు వచ్చి, ఇక్కడి స్వదేశీ రాజ్యాల్ని కూలగొట్టి, దోపిడీచేసి, ఆధిపత్యాన్ని చేజిక్కించుకున్నారని, ఓ హరిజనుడా! ఆలకించవయ్యా! (విను, ఆలోచించు) అని చెప్తున్నాడు డాక్టర్ కుసుమ ధర్మన్న కవి. కవి చెప్తున్నది, హరిజనులకు, అయినా, ఇండియాలోని జనాలందరూ వినాలని కవి భావన. అందరూ విన్నప్పుడే, ఆలోచించినప్పుడే, సమస్య

ఏమిటో తెలుస్తుంది. సమస్య చర్చకు వస్తుంది. పరిష్కార దిశగా పయనిస్తుంది. ఇండియా చరిత్రలో ఆర్య బ్రాహ్మణులు వలస వచ్చిన వాస్తవికతను కవి ఎంతో చక్కగా ఈ పద్యంలో చెప్పారు. ఆర్య బ్రాహ్మణులు వలస వాదులు కాదని, వారు ఎంత బుకాయించినా, ఒప్పుకోకపోయినా, ఎన్నో చారిత్రక ఆధారాలు ఉన్నాయి. వాటిని తప్పు పట్టడం అంటే చరిత్రను తప్పు పట్టడమే. నిజంగా చూస్తే చరిత్రలో ఎవరైతే తప్పులు చేశారో, వారు వారి తప్పులు ఒప్పుకుంటే, దేశం ఎప్పుడో బాగుపడేది. అబద్ధాలను బలవంతంగా రుద్దుతూ, నిజాలను అబద్ధాలుగా మార్చుతూ జనాల మెదళ్ళను గందరగోళంగా చేస్తున్న వ్యవస్థను మార్చాలనేదే ధర్మన్న కవి ఉద్దేశం.

**ఆర్యులణగద్రొక్కి – యడవుల పాల్జేయ**
**తిండి లేక యెండి – తిరిపెమెత్త**
**నీచకులజులనుచు – నిందింపబడలేదె?**

**ఆలకింపుమయ్య – హరిజనుండ.**

హాయిగా, ఎంతో చక్కగా జీవిస్తున్న ఈ దేశవాసులైన ఆది ఆంధ్రులను అనగా మూలవాసులను, వలస వచ్చిన ఆర్యులు అనగా బ్రాహ్మణులు అణగద్రొక్కి, అడవుల్లోకి వెళ్ళగొట్టగా, ఆకలికి అల్లాడుతూ, చివరికి ఆకలి తీర్చుకునే తందుకు 'భిక్ష'ం అడుక్కునే వారిగా మార్చి, నిందలపాలు చెయ్యడం జరిగిందని, చరిత్రలో జరిగిన ఘోరాల్ని కైగట్టారు కవి ధర్మన్న.

'హరిజన శతకం'లో కవి ధర్మన్న ఇంకా ఎన్నో సమస్యల్ని సమాజం ముందు పెట్టారు. ఎన్నో దశాబ్దాలు గడిచినా, ధర్మన్న కవి కవిత్వం లేవనెత్తిన ప్రశ్నలకు సమాజం సమాధానం చెప్పటం లేదు.

డాక్టర్ కుసుమ ధర్మన్న కవి మొదట గాంధీ ప్రభావానికి గురైనా, కాంగ్రెస్‌వాదిగా ఉన్నా, ఆ తర్వాత గాంధీ, కాంగ్రెస్‌లతోసామాజిక సమానత అసాధ్యమని తెలుసుకొని బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ మార్గమే శరణ్యమని, నమ్మి, జాతీయోద్యమం నుండి నిమ్నజాతీయుల మహోద్యమంతో మమేకమయ్యారు.

1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య పోరాటాన్ని ఏవిధంగానైతే మహాత్మా జ్యోతిబా పూలే భావించారో, అదేవిధంగా డాక్టర్ కుసుమ ధర్మన్న కవి కూడా అనుకున్నాడు. అందుకే నికార్సయిన బాబాసాహెబ్ అంబేద్కర్ బాటలో నడిచే తందుకు పూనుకున్నాడు.

రెండు తెలుగు రాష్ట్రాలలో ఆ రోజుల్లో హైద్రాబాద్ కేంద్రంగా మాదారి భాగ్యరెడ్డి

వర్మ నిమ్నజాతీయులకు ఎన్నో సేవలు చేస్తుంటే, రాజమండ్రి కేంద్రంగా డాక్టర్ కుసుమ ధర్మన్న కవి తన కార్యాచరణను నడపడం ఒకరికొకరు ప్రేరణగా, ఆదర్శంగా ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఎందుకంటే, అప్పటికి తెలుగు రాష్ట్రాలు రెండూ, వేర్వేరుగా ఉన్నాయి. రాష్ట్రాలువేరుగా ఉన్నప్పటికీ, ఒకేరకమైన ఉద్యమం, రెండుచోట్లా జరగటం గమనార్హం. హైద్రాబాద్‌లో జరిగే సభలకు డాక్టర్ కుసుమ ధర్మన్న అతిథిగా పిలువబడటం, రాజమండ్రి తదితర చోట్ల జరిగిన సభలకు మాదారి భాగ్యరెడ్డి వర్మ అతిథిగా హాజరవటం గొప్ప విషయాలు. తెలుగు సాహిత్యంలో సంచలనం సృష్టించి, నిషేధానికి గురైన గొప్ప నవల 'మాలపల్లి'కు కథా వస్తువునందించినది – హైద్రాబాద్‌కి చెందిన మాదారి భాగ్యరెడ్డి వర్మ ఆంధ్రలో జరిగిన ఆది ఆంధ్రుల సభలలో పాల్గొనటమే. ఈ చారిత్రక సత్యం ఇన్నాళ్ళదాకా వెలుగు చూడలేదు. ఇప్పుడిప్పుడే కొందరు పరిశోధకులు శోధిస్తున్నారు.

1913 నుండి 1937 వరకు హైద్రాబాద్‌లో, దాని చుట్టు ప్రక్కల గల ప్రదేశాల్లో మాదారి భాగ్యరెడ్డి వర్మ గారు 'బుద్ధ జయంతి' సభలు, సమావేశాలు జరిపేవారు. బౌద్ధ సిద్ధాంతాన్ని అర్థం చేసుకొని నిమ్నజాతీయులకు విముక్తి కలిగించేది బౌద్ధమే అని భాగ్యరెడ్డి భావించినట్లు, వారి ప్రభావం, వారి స్నేహితుడైన డాక్టర్ కుసుమ ధర్మన్నపై ఉందనేది, ధర్మన్న రచించిన సాహిత్య సారాంశం ద్వారా అర్థమవుతున్నది. రాజమండ్రి – సమీపంలో కోరుకొండ తదితర చోట్ల బౌద్ధారామాలు ఉన్నాయి. వీటి ప్రభావం కూడా ధర్మన్న కవిపై ఉండి ఉండాలి.

మౌర్యాశోక చక్రవర్తి కాలంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గొప్పగా విరాజిల్లిన బౌద్ధం, ఇండియాలో వెయ్యి ఏండ్లు వెలిగింది. బౌద్ధం మతం కాదు, జీవన విధానం. అందుకే అంతటి ప్రభావాన్ని చూపించింది.

మన దేశ చరిత్రలో మధ్య యుగాల కాలంలో బౌద్ధం, కొన్ని కుట్రలకు, కుతంత్రాలకు గురై, అణగదొక్కబడింది. అదే కాలం అశాస్త్రీయ అభూతకల్పనలతో హిందూ పురాణాలన్నీ నిమ్నజాతీయులకు వ్యతిరేకంగా రాయబడ్డాయని డాక్టర్ దేవరాజు మహారాజు లాంటి వారు బలంగా చెప్తున్నారు.

రాజమండ్రి నుండి వెయ్యేండ్ల క్రితం రాయబడిన తెలుగు భారతకథ మధ్య యుగాల్లో కల్పించబడిన సంస్కృత గ్రంథానికి అనువాదమే. ఇదే రాజమండ్రి నుండి డాక్టర్ కుసుమ ధర్మన్న కవి ఆది ఆంధ్రుల సాహిత్యాన్ని, వెలువరించటం, అందులో బౌద్ధ జీవన విధానం ప్రతిబింబించటం ఒక విశేషంగా చెప్పుకోవాలి. కవి పేరులో 'ధర్మన్న' పేరును బౌద్ధంలోని

 ISBN: 978-93-340-2436-4

'ధమ్మం'కు పర్యాయపదంగా గుర్తించవచ్చు. బౌద్ధం ప్రభావం 'ధర్మన్నకవి' సాహిత్యంపై ఏవిధంగా ఉన్నదో భవిష్యత్తులో పరిశోధకులు వెల్లడించే ప్రయత్నాలు జరగాలి.

డాక్టర్ కుసుమ ధర్మన్న కవి రచించిన గ్రంథాలు పది వరకు ఉన్నవి. కొన్ని మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగతావి కూడా అందుబాటులోకి రావాల్సి ఉంది.

**ఆధార గ్రంథాలు -**


1. మాకొద్దీ నల్లదొరతనం - కుసుమ ధర్మన్న
2. హరిజన శతకం - కుసుమ ధర్మన్న
3. దళిత ఉద్యమ వైతాళికుడు - కుసుమ ధర్మన్న కవీంద్రుడు (రచన : సి. వి.).
4. కుసుమ ధర్మన్న రచనలు - దళిత దృక్పథం - డా॥ మద్దుకూరి సత్యనారాయణ (ఎం. ఫిల్.)
5. కుసుమ ధర్మన్న - మా కొద్దీ నల్ల దొరతనం (వ్యాసం - డా॥ పుట్ల హేమలత, ప్రచురణ : సాహిత్య ప్రస్థానం పత్రిక ఆగస్టు సంచిక - 2016).
6. దళిత గీతాలు (సంపాదకులు : జయధీర్ తిరుమలరావు, కె.పి. ఆశోక్ కుమార్).
7. తొలి దళిత కవి కుసుమ ధర్మన్న (రచన : ద్వానాశాస్త్రి).
8. తెలుగునాట దళిత రాజకీయాలు  రచన : గుండిమెడ సాంబయ్య
9. మా విముక్తి పోరాటం - అనువాదం : డా॥ యెండ్లూరి చిన్నయ్య.

 ISBN: 978-93-340-2436-4

26

# "హరిజన శతకం - కుసుమ నిరసన గళం"

**డా॥ కె.నాగసత్యనారాయణ**
స్కూల్ అసిస్టెంట్
ఎస్ కె.పి.జి ఎన్ హైస్కూల్
రామచంద్రపురం.

**"ధర్మన్న చేశాడు**
**ధర్మ యుద్ధం**
**దళిత కుసుమమై చూపాడు**
**నీలి మార్గం" –** నేతల ప్రతాప్ కుమార్

ఆకాశమంత చీకటి అట్టడుగు బతుకులను ఆవహించి నపుడు దీపధారియై వెలుగు దారి చూపినవాడు కుసుమ ధర్మన్న. తెలుగు సాహిత్యానికి అంబేద్కర్ భావజాలాన్ని పరిచయం చేసిన మొట్టమొదటి దళిత కవి కుసుమ ధర్మన్న .ధర్మన్న గారు వ్రాసిన హరిజన శతకం మొట్టమొదటి దళిత శతకం." ఈ శతకం ఎందుకు వ్రాయవలసి వచ్చిందో ధర్మన్న గారే ఇలా అన్నారు స్వకులమున కాపాదించిన హైన్యత హృదయనకు నాటి వేధించుటచే దాని నివారించుటయే జీవితోద్దేశముగా నెంచి ఈ శతకమును నా శక్తి కొలది వ్రాసితినే గాని నాకు పాండిత్యం గలదనియు ,సంఘసంస్కరణము నందు జ్ఞానము కలదనియు గాదు "అని చెప్పుకుని యున్నారు .అంతే కాదు "హెచ్చరిక "అంటూ "ప్రియ హరిజన సోదరా! నీవు హీనజాతి వాడివా? బానిసవా? పరులకు దాస్యం చేయుటకు భగవంతుడే నిన్నిట్లు విధించినాడా? ఆహా ఏమి యీ నిరంకుశత్వము? దయామయుడగు సర్వేశ్వరుడెన్నడైన నాటి దుర్మార్గమునకు, పక్షపాతమునకు పాల్పడునా? జాతి, మత, దేశ, భేదములను తాను పాటించునా? స్వార్ధపరుడైన నరుడే నీకీ విషయము ఉగ్గుపాలతో బోసి, మోసపుచ్చి నిన్ను తన దాసాను దాసునిగా చేసుకొని, బంధించి యున్నాడని నేటికైననుగ్రహించితివా? అయినచో" మేలు కొనుమయ తరుణము మించకుండా, జన్మ హక్కులకై పోరు సలుపు మిపుడే, హక్కుకై ప్రాణ మిడుట ద్రోహంబు కాదు, స్వర్గపదమని నమ్ము స్వాంతమందు "అంటూ తమ జాతి ప్రజలను చైతన్యవంతులను చేయటమేకాక సాటి మనుషులను పశు వులకంటే హీనంగా చూస్తున్న ఆనాటి సమాజం మీద పోరు బావుటాను ఏగుర వేసి, తన నిరసన గళాన్ని, కలాన్ని వినిపించిన మొట్టమొదటి దళిత ఉద్యమ సారధి కుసుమ ధర్మన్న కవి.

ధర్మన్న గారి హరిజన శతకం 1933 సం.లో వచ్చింది.అప్పటికిభారతదేశంలో

 ISBN : 978-93-340-2436-4

మహాత్మ గాంధీ గారి నాయకత్వంలో జాతీయ కాంగ్రెసు పార్టీ స్వాతంత్ర సముపార్జనకు బ్రిటిష్ వారితో త్రీవరంగా పోరాటం చేస్తున్న రోజులు. గాంధీ గారి భావజాలంతో ఎంతోమంది ప్రభావితమై స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటున్నారు. ధర్మన్న గారు కూడ గాంధి ప్రభావంతో కాంగ్రెసు పార్టిలో చేరి స్వాతంత్ర ఉద్యమాలలో పాల్గొన్నారు .అయితే అప్పటికే స్వదేశంలోనే స్వదేశీయులచేత పీడింప బడుతున్న దళితులు తమ హక్కుల కోసం డా. బాబా సాహెబ్ అంబేద్కర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నారు. అటువంటి పరిస్థితులలో గాంధి మరియు కాంగ్రెసు మాటలలో తప్ప చేతలలో దళితులకు ఏమి చేయలేక పోవటం ధర్మన్న గారి హృదయమును కలసివేసింది. ఇక అక్కడ ఇమడ లేక తన స్వజాతీయులకు మేలు చేయటానికి గాంధీ భావజాలనికి స్వస్తిచెప్పి డా.అంబేద్కర్ ఉద్యమాలకు ఆకర్షితుడైదళిత జాతి సముద్ధరణకు నడుం బిగించారు. కాంగ్రెసులో ఉంటూనే "మాకొద్దీ నల్ల దొరతనం "అంటూ నిరసన గళం విప్పిన ధైర్యశీలి ధర్మన్న గారు." తెల్లదొరలపైని కళ్ళెర్రగా జేసి, హక్కులడగజూచు నాగ్రహమున, ప్రక్కనున్న నిన్ను –త్రొక్కిపెట్టరె? వీరు అంటూ ధర్మన్న గారు ధర్మాగ్రహన్ని వ్యక్తం చేస్తారు. గాంధీ గారి గురించి ,వారు చేస్తున్న ఉద్యమాలు గురించి కూడా చాలా స్పష్టంగా చెప్పారు – చూడండి

**"అర్థరహితమైన యస్పృశ్యతను బార,**
**దోలకున్న దేశ పాలనంబు**
**చిక్కదనుచు గాంధి నొక్కిబల్కుచునుండె**
**నాలకింపుమయ్య హరిజనుండ"** అంటూ గాంధీ గారు మొదట అస్పృశ్యతను కాంగ్రెసు సభ్యులు ఎవరు పాటించ కూడదని, మానవులు అందరూ సమానులేనని, అస్పృశ్యతను పాటించినట్లయితే కాంగ్రెసు సభ్యుత్వం ఉండదని ప్రకటించారు .కాని ఆ మాటలు చేతలలో కనిపించలేదు. దళితుల పట్ల గాంధీ మరియు కాంగ్రెసు పార్టీది మోసపూరిత వైఖరి అని భావించారు ధర్మన్న గారు." మానుషంబు గాదు మర్యాదయునుగాదు, – మతము గాదు అంటు మానుడనుచు, నన్ను దరికిదీయు నీతి దెల్పడే గాంధీ

**ఆలకింపుమయ్య హరిజ నుండ**
**అంటరానితనము మంట గలుపుకున్న**
**బానిసత్వమెపుడు బాయదనుచు**
**నిన్ను గావ నెంచి నిజమాడడే గాంధీ**
**ఆలకింపుమయ్య హరిజనుండ**

అంటూ గాంధీ నే కాదు ఆనాటి గాంధేయవాదులను సూటిగా ప్రశ్నించారు ధర్మన్నగారు.

 ISBN: 978-93-340-2436-4

**"ఆదికాలమందూ నవనిలో జనులెల్ల**
**అన్నదమ్ములగుచు నాశవీడి**
**చీక చింత లేక చిరంజీవులైరయా**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

**"హక్కు సత్వములును నధికారమును లేదు**
**నేను నీవను తెగ నీల్గు లేదు**
**మాయ బుద్ధి జూడ మచ్చు కైనలేదు**
**ఆలకింపుమయ్య హరిజనండ"**

అంటూ ఆదిమకాలంలోని మానవ సంబంధాలను దృశ్యమానం చేస్తున్నారు కవి. ఆనాటి సమాజంలో కులభేదములు లేక అందరూ కలసి మేలసి, చీకుచింత లేకుండా జీవించేవారని, కడుపునిండినవాళ్ళు కడుపు మండిన వాళ్ళు లేరని, భాగ్యవంతులు, పేదవారు లేరని, తరువాత మనుషులలో స్వార్ధచింతన పెరుగుపోయి, ధర్మచింతన విడిచి పెట్టి ధనకాంక్షతో మనుషులను మధ్య అగాధాలను సృష్టించిన క్రమాన్ని ధర్మన్నగారు నిరసిస్తున్నారు." అంటరాని యట్టి యధమాధముడవంచు, చెప్పరానియట్టి చెనటి వనుచు, చూడరాని యట్టి క్షుద్రుడ వనియూ

ఆలకింపుమయ్య హరిజనుండ

**"స్వార్ధపరులునిన్ను శాసింపనీరీతి**
**దిక్కుమ్రొక్కులేక దిరుగవలసె**
**కులము సమసెకూడు గుడ్డయు కొదవయ్యె**
**ఆలకింపుమయ్య హరిజనుండ**

**చాతుర్వర్ణ్యం మయాస్పష్టం గుణకర్మవిభాగశః** అంటూ కర్మసిద్ధాంతాన్ని రూపొందించి, మీరు దేవుని వలనే ఇలా ఈ భూమి మీద పుట్టారని, మీ పుట్టుకకు కారణం మీ పూర్వజన్మమేనని ఊరికి దూరంగా విసిరివేయబడిన మాల మాదిగల బతుకు వ్యతలను ప్రపంచానికి పరిచయం చేసిన మొట్టమొదటి కవి కుసుమ ధర్మన్న. అలా ఊరికి చివర విసిరివేయబడిన మాల మాదిగల శ్రమను ఎలాదోచుకుంటున్నారో కూడా ధర్మన్న గారు హరిజన శతకంలో చిత్రించారు .

**"కొల్చునీకుపిచ్చ కుంచంబుతో దాను**
**గొల్చుకొనడె? పిచ్చు కుంచమునను**
**దోచుకొనకనీకు దొర యెట్టులగు?రైతు**

**ఆలకింపుమయ్య హరిజనుండ"** అంటూ భార్య పిల్లతో సహ తాను కష్టపడి కూలిచేసినా కడుపునిండా కూడుండదు, కట్టుకోవటానికి బట్టుండదు. దీనికి కారణం రైతుల దోపిడి అంటారు ధర్మన్న గారు.

**"పాము విష్ణుపాన్పు పావనంబగు వేల్పు**
**సుబ్బరాయుడనుచు నుబ్బి మ్రొక్కి**
**సాటి నరుల ముట్ట శంకింతు రేలకో?**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

**"ఎలుకను గణనాథు డెక్కువాహనమంచు**
**గరుడవాహనంబు గ్రద్ధ యనుచు**
**పంది విష్ణువనుచు భక్తి పూజింపరో?**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

అంటూ పాముకు పాలు చీమకు పంచదార పెట్టి పూజిస్తారు కాని సాటి మనుషులను మనుషులుగా చూడని మత మౌఢ్యాన్ని కూడా ధర్మన్న గారు తమ హరిజన శతకం లో తీవ్రంగా నిరసిస్తారు." నిజమైన కవులెప్పుడూ ఆప్పుడు జన హృదయంలోనే జీవిస్తారు. తన చుట్టూ ఆవరించి వున్న సంఘజీవితంలో ఎక్కడ దుఃఖం వుందో, ఎక్కడ రాబోయే సమాజం పురిటి నొప్పులు పడుతుందో, ఎక్కడ భావిని నిర్మించటానికి నూరుతున్న కత్తుల సవ్వడి వినిపిస్తుందో అక్కడే ఎప్పుడూ అక్కడే వుంటాడు ప్రజాకవి. ప్రజల దగ్గరకు తన కవిత్వాన్ని ప్రవహింపజేస్తూ, ప్రజల్ని తన కవిత్వపు వంతెన మీదుగా అగ్ని సమాజంలోకి నడిపిస్తాడు. ఎప్పుడూ ముందుకు పోవటమే "అంటారు త్రిపురనేని మధుసుధనరావు గారు ఈ మాటలు ధర్మన్న కవి గారికి చక్కగా సరిపోతాయనుకుంటాను. వైద్యునిగా జబ్బుపడిన మనుషులకే కాదు రోగ గ్రస్తమయిన సమాజానికి తన రచనలద్వారా చికిత్స చేసిన సామాజిక చైతన్య మూర్తి ,దళిత కవితా వైతాళికుడు కుసుమ ధర్మన్న.

* * *

 ISBN: 978-93-340-2436-4

## 27 కుసుమ ధర్మన్న కుసుమాంజలి - సామాజిక చైతన్యం

**రాచర్ల గౌతమి**
ఆంధ్రోపన్యాసకులు
ఎబిఎన్ & పిఆర్ఆర్ కళాశాల, కొవ్వూరు.

తెలుగు సాహితీలోకంలో కుసుమంలా వికసించి ఎందరో కవులకు స్ఫూర్తిదాయకంగా అందరి అభిమానాలను చూరగొన్న తొలి దళిత కవి కుసుమ ధర్మన్న. కవి, వక్త, గేయరచయిత, ఉద్యమకారునిగా ఎంతగానో ప్రసిద్ధి పొందిన కవి. ఆదికవి జన్మించిన రాజమండ్రిలో మరో ఆధునిక కవిగా 17.03.1990 సంవత్సరంలో జన్మించి నిమ్నజాతి ప్రజల విముక్తి కొరకై పోరాడిన ఉద్యమకారుడు. 45 సంవత్సరాల తన జీవిత ప్రయాణంలో ఏన్నో రచనలు చేసియువతరానికి నవతరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. హిందీ, ఉర్ధూ, ఆంగ్ల, ఆంధ్రభాషల్లో ప్రావీణ్యులు. నిమ్మజాతి ముక్తితరంగిణి, హరిజనశతకం, మాకొద్దీనల్లదొరతనం వంటి రచనలు చేసారు. బ్రిటీష్ వారి పాలనలో అగ్రవర్ణాల వారు అణగద్రొక్కుతున్న పరిస్థితులలో దళిత వర్ణం నుండి అతికష్టంతో చదువుకొని ఆ చదువు తనలాంటివారందరి మేలుకోసం వెచ్చించిన అతికొద్ది మంది దళిత విద్యావంతుల్లో ఒకరు. ఉన్నత స్థాయి అందుకోవడానికి ఎన్నో అడ్డంకులను దాటారు. చదువుకున్న రోజుల్లోనే సంఘ సంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం చేత ప్రభావితం అయ్యారు. డా.బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను భావాలను ప్రచారం చేయటానికి పత్రికను స్థాపించారు.

**ఆర్యులణగద్రొక్కియడవులపాలయి**
**తిండిలేక యెండితిరి పెమెత్త**
**నీచకులజులనుచునిందింబలేదె**

ఆలకింపుమయ్య హరిజనుండ శ్రీ కుసుమధర్మన్న రచించిన హరిజనశతకం లోని 4వ పద్యం స్వాతంత్ర్యానికి ముందు దళితుల జీవన స్థితిగతుల్ని తన రచనశైలితో ధర్మన్న హరిజనశతకం ద్వారా ఆవిష్కరించారు.

**"నరకకూపమాయెనరలోకమెల్లను**
**సాగిపోయేసుఖముశాంతమెల్ల**
**బ్రతుకు భారమయ్యేభ్రమరదురామయ్యేరా**

**ఆలకింపుమయ్య హరిజనుండ**

స్వార్థం పెరిగిన మనుష్యుల జీవితాలు, ఒకరినొకరు పలకరించుకొనే తీరిక లేక సాగిపోతున్న ఈ లోకం నరకకూపం. బ్రతుకు భారంగా మారిపోతు, గుండెలు బరువెక్కుతున్నపుడు, సుఖము, శాంతము ఏవిధంగా వుంటాయని చక్కగా వివరించారు.

**రచనలు :-**

1. నిమ్నజాతిముక్తితరంగిణి
2. నల్లదొరతనం
3. నిమ్నజాతులఉత్పతివ్యాసం
4. మద్యపాన నిషేధం వ్యాసరచన
5. అసురపురాణంపద్యకావ్యం
6. అంటరానివాళ్ళం
7. హరిజనశతకం

1921లో గరిమెళ్ల సత్యనారాయణ "మాకొద్దీ తెల్ల దొరతనము" అనే గేయాన్ని వ్రాశారు. అదే సంవత్సరం కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము అనే గేయాన్ని రచించారు. ఆ కాలంలో స్వాతంత్ర్యోద్యమ, హరిజనోద్యమ ఉద్యమలలోభాగంగాఈ రెండు గీతాలు మారుమ్రోగేవి. స్వాతంత్ర్యం వస్తే తెల్లదొరల స్థానంలో నల్లదొరలు వస్తారు. అంటరాని తనం కొనసాగుతూనే ఉ ంటుంది. ఎప్పుడైతే అస్పృశ్య భావన తొలగిపోతుందో అప్పుడే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం అని భావించి ఈ గేయాన్ని రచించారు.

**స్వంత పరిపాలన జేసేద్దమంటారు**
**చెంతకు మము జేర నీరు....**
**స్వరాజ్య మనుచు సర్కారుతో పోరాడి**
**స్వాతంత్రము మదుగుతారు**
**మాకు స్వతంత్రమియ్యమంటారు**
**మాకు హక్కు లేదంటే స్వరాజ్య మెక్కడ దక్కు ....**
**మాకు హిందుసంగము నందు**
**స్వాతంత్ర్య మాగు వరకు**
**మాకొద్దీ నల్లదొరతనము**

అంటూ కుసుమ ధర్మన్న గారు నల్ల దొరలు చేసే అవినీతిని తన రచనల ద్వారా ప్రజలకు తెలియజేసారు. ఈవిధంగా కుసుమధర్మన్న రాసిన ప్రతి రచనలోనూ సామాజిక

హితవు చేకూర్చడానికి మాత్రమే తన గళాన్ని కలాన్ని ఉపయోగించారు. బలహీనవర్గాల ప్రజల చైతన్యానికి ఎంతగానో పాటుపడిన మహానుభావుడు. స్వార్థపూరితమైన లోకంలో తనకంటూ ప్రత్యేకతను చాటి చెప్పేలా అందరిలో ఒకరిగా జీవన పయనాన్ని సాగించిన వ్యక్తి కవి కుసుమ ధర్మన్న. ఆయన మరణించిన సమాజాన్ని చైతన్య పరిచే రచనలు చేసి కుసుమాలుగా వాటిని సమాజానికి అందించారు.కనుకనే ఆ వికసించిన కుసుమాలు పరిమళాలుగా వెదజల్లుతున్నాయి. కనుక కుసుమ ధర్మన్న నేటికి ఏనాటికి మన అందరి హృదయాల్లో చిరస్మరణీయుడు.

**ఆధార గ్రంధాలు:-**


1. కుసుమధర్మన్నకవిరచనలు - దళితదృక్పథం - డా.మద్దుకూరి సత్యనారాయణ ప్రజాశక్తి బుక్హౌస్
2. కుసుమధర్మన్నజీవితప్రస్థానం - డా॥ పుట్లహేమలత
3. తొలి దళిత ఆత్మ గౌరవ స్వరం - కొలకలూరి మధుజ్యోతి

 ISBN : 978-93-340-2436-4

# 28 కుసుమ ధర్మన్న మద్యపాన నిషేధం - సామాజిక చైతన్యం

**వై. బుజ్జి**
తెలుగు, సంస్కృత శాఖాధ్యక్షులు
పిఠాపూర్ రాజాస్ ప్రభుత్వ కళాశాల (స్వ),
కాకినాడ, సెల్ : 9550554154.

సృష్టి అందమైనది ఈ అందమైన విశాలమైన విశ్వంలో భగవంతుడు మానవుని చక్కని రూపముతో అద్భుతముగా సృష్టించి, సంతోషం గాజీవించుటకు వారికి మంచి వాతావరణంను, అందమైన ప్రకృతిని, పంచభూతాలను అనుగ్రహించెను. మానవుని దేహము అత్యద్భుతమైన నివాసస్థలము వంటిది. ఈ నివాసస్థలమువంటి దేహము నందు రక్తమాంసములు,ఎముకలు నరాలు మొదలగు అన్నీ అవయవములను సమకూర్చేను. ఈ అద్భుతమైన నివాసస్థలానికి స్తంభములు, దూలములు, వాసములు మొదలగు కలప కండరాలే ఈయింటిగోడలు. ఈ ఇంట నివసించు యజమాని మానవుడే. పంచేంద్రియాలు ఈ ఇంటిలోవాటి పని అవి చేసుకొనుచుండును. ఈ అన్నిఆవయవాలు సక్రమమైన రీతిలో పనిచేయుటకు మెదడు నుండి సంకేతములు ఇవ్వబడుచుండును.

నరములనుండి తంతివలే వర్తమానములను అందుకొనుట, తీసుకొనుట చేయుచుండును. మెదడుకు నరములలోబడి అవయవముల ద్వారా శరీరమునందు పూర్తికావలసిన పనులను పూర్తిచేయును. మానవుడు దైవప్రసాదితమైన ఆత్మతో ఇహపరలోకమునందు జాగ్రత్తగా దేహమును కాపాడుకొనవలెను. సాధారణంగా మనము మన రక్తములో ఒక చుక్కను గాని, మాంసములో ఒక ముక్కను గాని, లేక శరీరములో ఏ భాగమునందైనను సూక్ష్మదర్శిని యంత్రములతో పరీక్షించినట్లైతే ఆయాభాగములు పూర్తిగా జీవగణములతో ఆవరించబడి ఉండుట మనం చూడగలం. ఈ గణములన్నియు జీవనాధారమగు పదార్థముతో నిర్మించబడినవి. ఇవి మనిషి బ్రతకడానికి మూలాధారములు . మానవునికి మాత్రమేగాక సమస్త జీవరాసులకు ముఖ్యమైనవి. మానవుని ఆరోగ్యం నకు,జీవగణముల ఆరోగ్యమునను మద్యపానము పెట్టుమందు వంటిదగుచున్నదని అందరూ గ్రహించవలయును.

కల్లు గీసివెంటనే దానియందు మద్యపానముండదు. ఈకల్లుని కొద్దిసేపు పులవబెట్టిన తరువాత అది బాగా పులిసి పుల్లని వాసన గొట్టును. అపుడు నూటికి రెండు నుండి పది భాగముల వరకు మద్యసారముండును. ఆ మద్యపానమే తాగినవారికి నిషా కలిగించును. నూరింట పది భాగముల వరకుండునదే దానిని స్వీకరించినవారికి అనేక అనారోగ్యములను తెచ్చిపెట్టును. బ్రాందీ మొదలైన నిషా సారాలు అంతకంటే ఎక్కువ మద్యపానమును

కలిగియుండును. కనుక అవి మానవునికి మరింతహానికరం. బ్రాందీనందు యాభైమూడు భాగముల హానికరములు ఉండునని పరిశోధకులు చెప్పుచున్నారు. బ్రాంది కటువైన వాసనగొట్టును కనుక దీనిని వెంటనే గుర్తుపట్టవచ్చును.

మానవుని దేహమునకు నీటిశాతం 75% అవసరమగును. ఈనీరు శరీరభాగములన్నింటికి అవసరం. మద్యము సేవించినవారు వాయువును నీటిని హరింపజేయును. కనుక వారు నీటికోసం పరితపించును. మద్యము ప్రాణవాయువును కోరినదై మానవుని దేహమునఒదుగల వాయువునంతయును హరించును. ఇది శరీరములో ఏభాగములో చేరినను అచట నీరు,గాలి ఆవిరైపోయి ఆయా చోట్ల రక్తమును అధికముగా కూడునట్లు చేయును. ముఖ్యంగా మద్యపానము స్పర్శజ్ఞానమును చంపి అది మానవునకు తెలియకుండానే హాని తలపెట్టును. రక్తనాళాలలోని జీవకణాలను చంపును. అవి చచ్చుటచేత మానవుడు చనిపోవును. మద్యపానము సేవించినవారు స్పర్శను కోల్పోవుదురు, రక్తము గడ్డకట్టును. ఈరెండు మానవుడు అర్థాంతరంగా తన జీవితమును ముగించుకొనుటకు దారుతీయును. మద్యపానము ఆహారము కాదు. మానవుడు ఆహారమును తీసుకొనినప్పుడు అది శరీరములోనికి వెళ్లినప్పుడు శక్తిని, బలాన్ని ఇచ్చును. మద్యపానము అలాకాదు అది శరీరములోనికి వెళ్ళి ఆహారము జీర్ణముకాక రక్తములోనికి ప్రవేశించి అది మద్యముగానే ఉండును.

మద్యము శరీరానికి బలమునివ్వదు. అన్నకోశము మద్యమును వీలైనంత తొందరగా వదిలించుకొటకు ప్రయత్నించును. అది శరీరములో ఇమడక వాంతులు అగును. కనుక మద్యమును త్రాగుట ఆపవలెను. దానిని పిల్లలకిచ్చిన వారి ఎదుగుదల ఆగిపోవును. పురాతన కాలములో రోగమును తగ్గించుటకు సారాయిని రోగికి ఇచ్చేవారు. కానీ ప్రస్తుతము రోగికి సారాయిని ఇచ్చుట మానివేసిరి. మద్యపానము రోగమును కుదర్చదు.అంతేకాక రోగమును హెచ్చుచేయును. ప్రకటనలను చూసి మీరు నమ్మవద్దు. దానిని సేవించుటవలన మానవుడు క్షేమకరమైన జీవితమును అనుభవించలేడు. కనుక మద్యము ఔషదము కాదు అని అందరూ గ్రహించాలి. కొంతకాలము క్రిందట ఫ్రాన్స్ దేశములో జనాభా తగ్గుటను గుర్తించిరి. ప్రతిసంవత్సరము జన్మించినవారికంటే చనిపోవువారిసంఖ్య ఎక్కువగా ఉండుటను ప్రభుత్వము గుర్తించినది. కారణము వెతకగా ఎక్కువమంది మద్యానికి బానిసై చనిపోతున్నారని గుర్తించిరి.

భీమా కంపెనీలు మద్యము సేవించువారిలో అధికమైనరోగములు కలవని తెలుసుకొనిరీ. కనుక మద్యము మానవునికి ఆయుష్షను తగ్గించును. మనము గమనించాల్సిన విషయం మద్యము ప్రకృతినుండీ వచ్చినదికాదు. అది కుళ్లిన పదార్థము నుండి వచ్చినది అది విషపదార్థము. కనుక వెంటనే మానవుని చంపివేయును. ఉదాహరణకు చేపపిల్లనుకాని, ఎలుగుపామును కాని సారాయిలో వేసిన అవి వెంటనే చనిపోవును. కోడిగుడ్డులోని

 ISBN : 978-93-340-2436-4

తెల్లనిపదార్థము బలమైన సారాయిలో వేసినప్పుడు గాని. మరుగుతున్న వేడినీటిలో వేసినప్పుడుకాని, వేడిఇనుముమీద వేసినప్పుడుకాని అది పేరుకొని గడ్డకట్టును. మన శరీరములోని గుండె, అన్నకోశము, కార్జము కండరాలు కోడిగుడ్డులోని తెల్లనిపదార్థముతో చేయబడినవి. వాటన్నిటిని కోడిగుడ్డులోని తెల్లనిపదార్థమును మార్చినట్లు మార్చగలదు.

మద్యపానము అనేక వ్యాధులను తెచ్చిపెట్టును. ప్రాణాంతకమైనదిగా మానవునిపై తన ప్రభావమును చూపును. క్షయ, బొబ్బ,ఉబ్బసము, పిచ్చితనము, న్యుమోనియా వంటి రోగములు వచ్చును. ఇంకనూ ప్రాణాంతకమైన అనేక వ్యాధులు వచ్చుఆవకాశం కలదు. మద్యపానము సేవించువారికి పుట్టిన పిల్లలు రోగపీడితులుగా దుర్భలురుగా ఉండుట సమాజములో మనము అనేక మందిని చూచుచున్నాము.

**శుకుం, పీకం, బకంచైవా హనుమాన్ రావణయే తథా।**
**కర్ణంచ, కుంభకర్ణం చా సప్తైతే డోసులక్షణం॥**

మద్యము సేవించినవారు ఒక డోసుతో చిలకపలుకులు, రెండవడోసుతో గోరింకకేరింతలు, మూడవడోసుతో కొంగజపము, నాల్గవడోసుతో ఆంజనేయకుప్పిగంతులు, (కోటిచేష్టలు) ఆరవడోసుతో రావణబ్రహ్మ ప్రతాపములు,ఆరవడోసుతొ దానకర్ణుడు, ఏడవడోసుతో కుంభకర్ణుడు ఈ అవతారములన్నియు వారికి ఆవరించుటతప్పవు. మద్యము సేవించినవాడు చూచుచు పాడించి, ఆడించి పకపకా నవ్వించును. తూలించి, సోలించి దొర్లచేయును. తిట్టించి, కొట్టించి స్టిరము తప్పించును. వలవలా ఏడ్పించి వాగజేయును. కంపుగొట్టించి, మత్తుకల్పించి ధీరతపోగొట్టును. తెలివితేటలు చూపి తేగానీల్గు పుట్టించును. కైపెక్కించి కన్నులెర్రజేయును. తలదిమ్మపుట్టించి తైతక్కలాడించును. మాటతడబడజేసి తందనాలాడించును.మొలమీదగుడ్డను తొలగింపజేయును. మానాభిమానాలను మంటగలుపును. ఆయుర్ధాయము నంతమొందించును.

**"త్రాగుడు మానమున్ జెరాచును**
**త్రాగుడు దుర్మార్గుంజేయు ద్రవ్యము బాపున్**
**త్రాగుడు పాపము గూర్చును**
**త్రాగుడు సుగుణములనెల్ల దగ్ధము జెయున్."**

త్రాగుడు ఇల్లు, పళ్లను గుల్లజేయును కుటుంబాలను నాశనంచేయును, కూడుగుడ్డలను దూరంచేయును, భార్యాపిల్లలను గొల్లుమని ఏడిపించును అప్పులపాలు జేయును పరపతి పాడుచేయును పరువుప్రతిష్టలను భంగపరచును, ఆలిమేడలో పూస్తేలమ్మించును మద్యము సేవించినవాడు అనేక నష్టాలను కొనితెచ్చుకొనును. త్రాగుడు పార్టీలు పుట్టించును, స్నేహితులనెడబాపును. కోర్టుగుమ్మమెక్కించును, కారాగృహవాసమునకు నడిపించును. తత్ఫలితంగా ఉరి శిక్షను పొందవలెను. త్రాగుడు రంకు, బొంకులకు రాజబాట,

 ISBN: 978-93-340-2436-4

కన్నము, కలహంసలకు కన్నతల్లి కూనీలకు కులదేవత, పాపములకు పుచ్చపాదు, చేతబడులకు, భూతప్రేత పిశాచములకు హుషారు, అమ్మవారి కొలువులకు భలేజోరు.

**ముగింపు :** ఓ సోదరా! మృగరాజు సింహము, మృగములమేటియగు ఏనుగు మంచినీరు త్రాగి మహాబలముతో, శక్తితో ప్రకాశించుట చూచుచున్నాము. క్షుద్రజంతువులకంటే మనము అంత నీచులమా? త్రాగుడు ముందు – చల్ల, పెరుగు, పాలు నెయ్యి సాటిరావా? ఇవి నీయారోగ్యమును రక్షింపలేవా? నిన్ను సమాజంలో మంచివానిగా గుర్తించలేవా ఎన్నో పశుపక్ష్యాదులు, క్రిమికీటకాలు పడి చచ్చిపోయి కుళ్ళిన కల్లును త్రాగుటకు నీ వెట్లు సహించుచున్నావో ఆ కుళ్లినకంపు కొట్టే మద్యపానాన్ని నీవెట్లా తాగుచున్నావో అర్థం కావడంలేదు. మిత్రమా! పంచమహాపాతకములలో ఒకటైన దీనిని నీవు దగ్గరికి రానియ్యకుము.

**ఆరోగ్యభాగ్యము నందగోరేదవా?**
**చిరకాలము సుఖముగా జీవింప వాంఛించెదవా?**
**పదిమందిలో పరువుగలిగి బ్రతుకదలంచెదవా?**
**గుణవంతుడవని పిలిపించుకొనేదావా?**
అలా అయితే మద్యపానము మానుకొనుము

**వంశము ప్రఖ్యాతి బడయవలెనన్నా**
**పుణ్యమార్గమున బోవవలయునాన్నా**
**ధర్మపదమున వర్తింపవలయునాన్నా**
**మద్యపానము మానుము మానుము ముమ్మాటికి మానుము**

ఈ విధంగా కుసుమధర్మన్న మద్యపానము తీసుకొనువారి గురించి చక్కగా తన అభిప్రాయమును పుస్తకరూపంలో వ్రాసి లోకానికి అందించెను.

ఆధార గ్రంథం : మద్యపాన నిషేధం – కుసుమ ధర్మన్న.

* * *

 ISBN : 978-93-340-2436-4

29

# అసమానతలపై కుసుమ ధర్మన్న 'జయభేరి'

**యడవల్లి శ్రీనివాసరావు,**
సీనియర్ జర్నలిస్టు,
విజయవాడ.

కుసుమ ధర్మన్న తొలితరం దళిత కవి. స్వాతంత్ర్యానికి పూర్వం 1983లో హరిజన శతకాన్ని రచించారు. అప్పటికి జాషువా వంటి కావ్యాలు రాలేదు. ఓ వైపు జాతీయోద్యమం కొనసాగుతున్నా సంఘంలో కుల వివక్ష కొనసాగటాన్ని కళ్లారా చూశారు. పరిస్థితులు పంజా విసిరితే నిస్సారమైన మెదడులో కూడా వ్యూహం పుడుతుంది. బలహీనమైన పక్షి కూడా తన గూడు మీద జరిగితే తిరుగుబాటు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్, గాంధీజీల ప్రభావాలతో స్ఫూర్తి పొంది అంటరాని తనాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంతో ఈ శతకాన్ని రచించారు. వర్ణ ధర్మం పేరిట భారతీయ సమాజంలో సృష్టించిన హెచ్చుతగ్గులను నిరసించారు. బూటకపు ప్రజాస్వామ్యవాదులుకు తన వాదనలను బలంగా వినిపించారు. నోటితో పలకరింపు నుదిటితో వెక్కిరింపు ధోరణులను నిర్మొహమాటంగా ఖండించారు. లక్ష సబ్బులకు కూడా తొలగిపోని కులం పంకిలాన్ని తన జాతి జనులమీద పులిమి ఎప్పుడికి పూడ్చలేని అగాధాన్ని సృష్టించిన ఈ వర్ణ సమాజంపై ద్వేషాన్ని రగిలించక, తన జాతి జనులకు ప్రభోదం చేయటానికి ఎంచుకున్న విశాల హృదయాలు.

తెలుగు నాట 'మాకొద్దీ తెల్లదొరతనం' అంటూ నినదించిన తొలి అంబేద్కరిస్టు కవి. జయభేరి పక్షపత్రిక ద్వారా దళిత చైతన్య వ్యాప్తికి కృషిచేశారు. హరిజన శతకం, నిమ్నజాతి విముక్తి తరంగిణి, వాళ్లు అంటరానివాళ్ళా, హరిజన చరిత్ర తదితర పుస్తకాలు రాశారు. ఆది ఆంధ్ర మహాసభకు అధ్యక్షులుగా పనిచేశారు. మంచి వక్త కూడా. అణగారిన జాతులకు గొంతుకనిస్తూ, అంబేద్కర్ భావాలను ప్రచారం చేయటానికి జయభేరి అనే పక్ష పత్రికను స్థాపించారు. కుసుమ ధర్మన్న తొలి దళిత కవి, వ్యాసకర్త, వక్త. జయభేరి పత్రిక సంపాదకుడు. ఉద్యమకారుడు. వృత్తి రీత్యా ఆయుర్వేద వైద్యుడు. సాహితీ కోవిదుడు. ఆంగ్ల-ఆంధ్ర భాషల్లో పండితుడు. "మాకొద్దీ నల్లదొరతనం" గేయరచయితగా ప్రసిద్ధుడు.

"దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు" అనే పుస్తకంలో సి.వి. గారు కూడా ఈయన గురించిన సమాచారం తనవద్ద లేదని రాశారు. 1921లో కుసుమ ధర్మన్న 'మాకొద్దీ నల్ల దొరతనము' రాశారు. దళిత వర్గం నుంచి అతి కష్టంమీద చదువుకుని పైకొచ్చి, తిరిగి ఆ చదువును తన జాతి మేలు కోసం వెచ్చించిన అతికొద్ది మంది దళిత

 ISBN: 978-93-340-2436-4

విద్యావంతుల్లో 'కుసుమ ధర్మన్న కవి' ఒకరు. దళితులు, బ్రిటీషు పాలనలో కంటే, స్థానిక అగ్రవర్ణాల పాలనలో మరింత నలిగిపోతారని మొట్టమొదటగా చాటింది కుసుమ ధర్మన్నే. కాంగ్రెస్‌లో ఉంటూనే 'మాకొద్దీ నల్లదొరతనము' అంటూ గళం విప్పిన ధైర్యశాలి. రాజమండ్రి తాలూకా బోర్డుకు కాంగ్రెసు పార్టీ తరఫున సభ్యునిగా ఎన్నికై కూడా బోర్డు ప్రెసిడెంటు ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థికి ఓటు వేయని స్వతంత్రుడు ఆయన.

**అంబేద్కర్ ఆలోచనలకు ప్రతిరూపం :** ధర్మన్న అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితుడై అంబేద్కర్ గురించి ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఆంధ్రదేశానికి అంబేద్కరును తొలిగా పరిచయం చేసింది ఆయనే. అణగారిన జాతులకు గొంతుకనిస్తూ, అంబేద్కర్ భావాలను ప్రచారం చేయటానికి 'జయభేరి' అనే పక్ష పత్రికను స్థాపించిన విషయం తెలిసిందే. 1930వ దశకంలో కాంగ్రెస్ పార్టీ చొరవ తీసుకొని హరిజన సేవా సంఘం యొక్క ఆంధ్ర విభాగాన్ని ప్రారంభించింది. మహాత్మా గాంధీ అంటరాని కులాల ప్రజలకు హరిజనులు అని పేరుపెట్టడంతో అది ప్రాచుర్యం పొందింది. క్రమేణా ఆది ఆంధ్ర నాయకులంతా కాంగ్రెసు స్థాపించిన హరిజన సేవా సంఘంలో భాగమైనా కుసుమ ధర్మన్న వంటి కట్టుబడిన నాయకులు మాత్రం దాన్ని వ్యతిరేకించారు. నిమ్న జాతుల అభివృద్ధి విషయంలో మహాత్మా గాంధీ ఆశయాలను నమ్మి గౌరవించినా, ఆచరణలో లోపాలను ధర్మన్న సహించలేదు. గాంధీ యొక్క ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమండ్రి వచ్చి హరిజన నాయకులతో సమావేశం నిర్వహించిన సందర్భంలో, ధర్మన్న ఆ సమావేశాన్ని బహిష్కరించాడు. 'హరిజన నాయకులైతే మా పేటలకు వచ్చి ఇక్కడ మాట్లాడాలని' కబురుపెట్టి గాంధీని, ఇతర కాంగ్రెస్ నాయకులను తమ పేటకు రప్పించి, ఆతిథ్యమిచ్చి దళితుల గౌరవాన్ని చాటాడు.

దళిత చైతన్యం కోసం ధర్మన్న పడిన తపన ఈయన 1933లో రాసిన హరిజన శతకంలో చూడొచ్చు. 'ఆత్మ గౌరవంబు నలరంగ చాటరా" అని ఉద్బోధించిన ధర్మన్న కవిగారు వర్ణధర్మం పేరిట భారతీయ సమాజంలో నెలకొని ఉన్న హెచ్చు తగ్గులను నిరసించిన జాతీయ వాది. సమకాలికులు ఆయనను 'ఆది ఆంధ్ర కవి సార్వభౌమ'గా పేర్కొన్నారు.

1936లో విజయనగరంలో జరిగిన ఆది ఆంధ్ర మహాసభ సమావేశానికి కుసుమ ధర్మన్న అధ్యక్షత వహించాడు. ఈ సమావేశంలో అధ్యక్ష ప్రసంగం చేస్తూ సామ్యవాదాన్ని సహించని హిందూమతం అనే శీర్షికను వెలువరించాడు. ఆయన నిమ్నజాతి విముక్తి తరంగిణి, వాళ్ళు అంటరాని వాళ్లా, హరిజన చరిత్ర మొదలైన రచనలు విశేషంగా ప్రజలను ఆకట్టుకున్నాయి. జయభేరి పత్రిక ద్వారా అణగారిన వర్గాల ప్రజల గొంతుకగా మారి

 ISBN : 978-93-340-2436-4

వారి సమస్యలను పట్టి చూపించారు. అణచివేతకు గురౌతున్న ప్రజానీకం వ్యథలను ఆర్టికల్స్ రూపంలో ప్రచురించారు. ఆనాటి సమాజంలో ఇవి ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. కులవివక్షకు గురౌతున్న ప్రజానీకంలో ధైర్యం నింపి వారిని తట్టి లేపేందుకు దోహదపడ్డాయి.

ఆధార గ్రంథాలు :
1. కుసుమ ధర్మన్న కవి రచనలు–దళిత దృక్పథం–మద్దుకూరి సత్యనారాయణ
2. కుసుమ ధర్మన్న–ప్రజాశక్తి బుక్‌హౌస్ సంచికలు

–యడవల్లి శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టు, విజయవాడ.

* * *

 ISBN: 978-93-340-2436-4

30

# KUSUMA DHARMANNA VIEWS ON INDIAN SOCIETY

**Dr. N. RAJASEKHAR**
Assistant Professor
Department of Political Science
Adikavi Nannya University
Rajamahendravaram
Mobile: 9848119528

Dalit literature considers man as its nucleus. It becomes one with the joys and sorrows of human life and takes it forward to Samyak revolution. It preaches a group of human being that forms society, equality. It considers man noble. Dalit literature spreads love and not enmity among human beings. Lack of knowledge made the Dalits to believe the Brahmins and the Brahmins made them believe that the only God who will help them attain salvation is Brahmins so they have to obey them and follow their words and should consider them equal to God. Dalit are denied to enjoy the mankind's basic needs and rights such as food, shelter, clothing and they have to depend on the dominant class to do all the agricultural and other labour work in order to have their livelihood. Dalit literature as a literature of protest advocates human liberation, glorifies man, opposes staunchly the supremacy of lineage, race and caste. Dalits had only pen to fight back they used it as a weapon to express their feeling.

The main themes of Dalit writings are social disabilities, caste system, economic inequality, contemporary cruelties and cultural assertion that can be uniquely entitled as the struggle for identity. The writings replicate the resistance, issue of identity, experience of pain and moreover a communal distinctiveness.

Kusuma Dharmanna was the first famous Dalit writer. Dharmanna, born in 1900 in Rajamahendravaram which is also known as Cultural Capital of Andhra Pradesh, hailed from a Dalit family of agricultural labourers. His parents were Veeraswamy and Nagamma. After completing the third form, he pursued a degree in Ayurveda, namely Vaidya Vidwan. He was good at Telugu, Sanskrit, English, Hindi and Urdu languages.

During his school years, he was influenced by Kandukuri Veeresalingam, a social reformer with a desire to bring about change. Dharmanna actively

participated in the social reform movement, which aimed to abolish untouchability and played a crucial role in the Indian independence movement. He channelled his emotions through songwriting and singing, using his melodious voice to spread his message.

The turning point in his Ayurveda doctor life was interacting with Guduri Ramachandra Rao garu who is working Dalit upliftment from Gudiwada town. He already started his services through establishing 'Ashramas' and campaigning the ideas of Gandhi. Dharmanna used to national perspective after joined in Ramachandra Rao's Ashram in Gudiwada. Dharmanna attracted by his guru Ramachandra Rao's sacrificed life for the upliftment of the downtrodden sections.

With the companionship of Dalit reformatory activists like Vemuri Ramjee Rao, Vellanki Krishna Murthy he got clear picture about his ultimate life goal. Kusuma Dharmanna interacted with Bhagyareddy Varma in 'Andhra's Panchamas Mahasabha' which was held in Vijayawada in 1917. Kusuma Dharmanna participated along with Bhagyareddy Varma in Machilipatnam 1919, Gudiwada 1920 Eluru and Bhimavaram1921 meetings. Like this during between 1917 to 1938 he represented Adhi Andhra Mahasabhas and emerged as a one of the prominent leaders.

He wrote 'Harijana Sathakam' in 1933. In the bigging of this Satakam in he mentioned good qualities of primitive communist society like, absence of special privileges, powers and any individual priorities. But 'Kaliyugam' polluted with evils like, castisim, increased exploited capitalistic society and immoral debts. He opined that, Because of this, the 'Panchamas' conditions degraded very low.

Dharmanna criticised: "In the name of Swarajya they organise meetings! Always praise Gandhi, preach Hindu–Muslim unity and advocate wearing Khaddar. They claim peace as Swarajya and organise peace volunteers! But they bury our issues." He also criticised those caste Hindus who advocated independence from the British, but refused the same liberty to untouchables: "They fight with government asking for independence but they refuse to give independence to Malas. They do not allow us into temples and public places. Also, they do not allow us to take water from wells! They say Malas do not have rights. If we do not have rights, how can they have Swarajya?" Dharmanna asked his brethren to wake up and claim their birthright: "Born as humans,

why should we lead a life of slaves? There is no sin in losing life in defending our rights. Come forward and claim your birthright." He also wrote songs for Dalit women, urging them to end their slavery and claim social equality. Through his powerful songs, Dharmanna advocated equality and liberation for Dalits as a pre-condition for independence.

Kusuma Dharmanna had great admiration for Mahatma Gandhi for improving the lot of Harijans. However, during Gandhi's visit to Andhra State, when Gandhi held a meeting with Harijan leaders in Rajahmundry, Kusuma Dharmanna boycotted the meeting as he has some apprehension on the efficacy of the meeting. Instead, he extended an invitation to Gandhi and other Congress leaders to his home, where he demonstrated respect of the Dalits by offering them hospitality. He stated that "Harijan leaders should come to our homes and speak here." Kusuma Dharmanna was also the one who introduced B.R. Ambedkar to Andhra and established a party journal named *Jaya Bheri* to promote Ambedkar's views and give voice to the oppressed castes.

With a strong desire to reform the Dalit and other marginalized communities, who were victims of racial inferiority, untouchability, and social discrimination, he wrote *Harijan Setkam*. Through this work, he became an accomplished writer, inspired by Ambedkar's ideals, and dedicated himself to establishing an identity for untouchables. He sought to enhance his dedication to the cause by spending time with Guduri Ramachandra Rao, the founder of Gudivada Sevashram, Sitangaram Ashram and Chagallu Anandashram. He established Kusuma Kuteeram (an ashram) in Rajahmundry and served as the secretary of the East Godavari District Untouchability Prevention Society. On 27 December 1925, he presided over the West Godavari's first Adi Andhra Mahajana Sabha.

During the 1930s, the Congress Party established the Andhra branch of the Harijan Seva Sangham, which gained popularity after Gandhi referred to untouchables as Harijans. Gradually, all leaders of Aadi Andhra joined the Congress-established Harijana Seva Sangaham.

Dharmanna was unforgiving of any lapses in practice, and he continued to write to change the attitudes of the upper castes toward the Dalit community even after India gained independence. His writings, including *Nimna Jathi Tarangini*, *Nalla Dorathanam*, *Essay on Drinking Ban*, *Asura Puranam Padya Kavyam*, *Antaraani Vallamu* (We are Untouchables), and *Harijan Shatakamu*,

are noteworthy. Kusuma Dharmanna served the Harijan community while participating in India's path to independence.

Finally, though he trained in Guduru Ramachandrarao's Ashram in Guduwada, he attracted by Justice party, he was closed to National congress Party and done apprenticeship to Gandhi, very soon, he came in to Dr. Baba Saheb Ambedkar's path and promoted his ambitions and simultaneously he got good reputation in people's hearts by his medical services and with his famous slogan '*Makodhu Ee Nalla Dhorathanamu'* ('We do not want the rule of black landlords'). He was a first generation Dalit poet cum great human being.

References:

1) Maddukuri Satyanarayana 'Kusuma Dharmanna Kavi Rachanalu- Dalitha Drukpatham, 2016.
2) Dr. Putla Hemalatha 'Kusuma Dharmanna Jevvitha Prastanam' 2018.
3) Dr. Pilli. Samsan 'Dalitha Sahitya Charitra' 2000
4) K. Usha Rani 'Tholi Dalitha Spoorthy Kusuma Dharmanna' 2018

* * *

 ISBN : 978-93-340-2436-4

# 31 తొలి దళిత సాహిత్య పునాది-డాక్టర్ కుసుమ ధర్మన్న

దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు
సెల్ : 9493033534

సాహిత్యాన్ని సంఘ సంస్కరణను కలగలిపి సాగించిన పోరాటం చేసిన ధీరుడు, దళిత జాతికి అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితమిచ్చిన కవి. తొలి దళిత వైతాళికుడు కుసుమ ధర్మన్న. ధర్మన్న గారి నడకతో గోదావరి తీరం పునీతమైనది. సుదీర్ఘ కాలం అందుబాటులో లేని ఆయన సాహిత్యం ప్రజల ముందుకు తీసుకు వచ్చినప్పటికీ ఏ విశ్వవిద్యాలయాలలో కుసుమ ధర్మన్నపై పరిశోధనలు జరిగినట్లు ఎక్కడా కనిపించినట్లు లేవు. కుసుమ ధర్మన్న గారి గురించి చాలామంది చాలా రకాలుగా గొప్పగా చెప్పారు తన సాహిత్యం చాలా అద్భుతంగా ఉందని పుస్తకాలైతే అందుబాటులో లేనప్పటికీ కొన్ని పుస్తకాలు చాలా చోట్ల పుస్తకాల షాపుల్లో లభిస్తున్నాయి. కానీ ఆ పుస్తకాలు ప్రజల సమూహంలోకి వెళ్లలేదని తెలుస్తుంది. సాహితీవేత్తలు, కవులు, మొదలగు వారు కుసుమ ధర్మన్నగారిపై ప్రతి ఒక్కరుఅధ్యయనం చేయాలి, ఆయన పుస్తకాలు చదవాలి, పరిశోధనలు చేయాలి.

దేశమంతటా స్వరాజ్యం కావాలని సుస్వరాజ్యం కావాలని ప్రజలు కదం తొక్కుతున్న కాలం జాతీయోద్యమ సందేశం నలుమూలల దావానలంలా వ్యాపించిన కాలం అలాంటి సమయంలో అందరికీ స్వాతంత్ర్యం వస్తే మనకెప్పుడు వస్తుందని దళితుల పక్షాన నిలబడి వాదించిన కవి కుసుమ ధర్మన్న. వర్ణ సమాజం దళిత జాతి గుండెలపై దండయాత్ర చేస్తున్న సందర్భంలో అధికార స్వరం వినిపించిన ధైర్యవంతుడు ధర్మన్న.

“ధర్మన్న కుసుమ ధర్మన్న / దళాధనం ధ్వనించేది ఘనివన్న కుసుమ ధర్మన్న / గోదావరి తరంగాల ఘోషవు నీవు / గూడాడే బడుగు జనం గొంతుక నీవు / కష్టాలలో పుట్టినావు కడగండ్లలో పెరిగినావు / విపక్షతల విషరూపం అడుగడుగున చూపినావు/ ధర్మన్న కుసుమ ధర్మన్న”

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంపై కలంతో యుద్ధం ప్రకటించి దళిత జాతి విముక్తి కోసం నిరంతరం కృషిచేసిన క్రాంతదర్శి. తొలి తెలుగు దళిత కవి కుసుమ ధర్మన్న. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు సాహిత్య చరిత్రలో తొలి దళిత వైతాళికుడు మరియు దళిత సాహిత్య సృష్టికర్త కుసుమ ధర్మన్న. దళితుల కోసం ఓ పత్రికను స్థాపించిన అక్షర కిరణం ధర్మన్న కవి, పాత్రికేయుడు, సంఘసంస్కర్త, మహావక్త మరియు వైద్య నిపుణులు. అయితే ధర్మన్న గారి సాహితీ సృజన సుదీర్ఘ కాలం వెలుగు చూడకుండా పోయింది. దీనికి కారణాలు ఊహించలేనివి కావు.

 ISBN : 978-93-340-2436-4

ఎవడునీవు? యిట్టి తిరుమల గుబులుగా / నెవరుకారణంబు? యేలవచ్చే / నెంతకాలము వెలి చింతచే /గుందెదో / ఆలకింపుమయ్య హరిజనుండ...

కులముస్థలము లేదా? గుణగణంబులులేవో?/ ధనము బలము బ్రతుకు దారి లేదా?/ బానిసవయి పరువు బాసిపోయెదవేల?/ ఆలకింపుమయ్య హరిజనుండ...

తెలుగు సాహిత్యంలో అస్తిత్వం ఉద్యమాలు వచ్చాకనే ఆది దళితుల జీవితాలు కవుల, రచయితల, సాహిత్య సామాజిక సేవలు వెలుగు చూశాయి.

కుసుమ ధర్మన్న 1884లో పుట్టి 1948లో మరణించినట్లు తెలుస్తోంది. 1921లో మాకొద్దీ నల్ల దొరతనం గేయాన్ని రాశారు. ఈ గేయంలో నల్ల వాళ్ళు చేసే దురహంకారం వల్ల దళితులు ఎప్పుడు బానిసలుగానే బ్రతకాలా? అలా ఎందుకు బ్రతకాలి అన్నదే ఈ గేయాన్ని తనదైన శైలిలో రచించి మనువాదులకు ముచ్చెమటలు పట్టించారు. వైద్యం (ప్రస్తుతం ఎంబిబిఎస్) వరకు చదువుకున్న ధర్మన్న అటు తర్వాత వైద్య విద్వాన్ పరీక్ష పాస్ అయ్యారు. సీతానగరం గూడూరు రామచంద్ర రావు సేవా కేంద్రంలో శిక్షణ తీసుకున్నారు. రాజమండ్రి తాలూకా బోర్డు సభ్యునిగా ఎన్నికయ్యారు. రంగూన్ లోకొంత కాలం వరకు ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించుకొని తిరిగి వచ్చారు. 1937లో జయభేరి పత్రికను ప్రారంభించారు. దళితులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి ధర్మన్న కృషి చాలా ప్రయత్నం చేశారని జయభేరి పత్రిక ద్వారా తెలుస్తోంది.

పరువునురువు లేని పాలేరుతనమేల / కరవుగొట్టు బ్రతుకు గడపనేల? / కూలి విలువదెలసి గుట్టుగా మనవేల?/ ఆలకింపుమయ్య హరిజనుండ...

కడుపునిండ కూడు గట్ట గుడ్డయు నున్న / బాయు బీదతనము బాధలెల్ల / సర్వ సద్గుణములు సమకూడుదానితో / ఆలకింపుమయ్య హరిజనుండ....

ఆనాటి సమాజంలో అతి దీనంగా బ్రతుకులు వెళ్లదీస్తున్న దళితులను సంఘటితం చేసి దళితులపై జరిగే అరాచకాలను ఎండగట్టడానికి ధర్మన్న గారు పత్రికను ఉ పయోగించారు. అంతేగాక సమకాలిన రాజకీయ ఎత్తుగడలను కూహన ధోరణులను తప్పుబట్టారు. గాంధీజీకి హరిజనోద్ధరణ విషయంలో చిత్తశుద్ధి లేదని ఆనాడే ధైర్యంగా విమర్శించిన ధీశాలి కుసుమ ధర్మన్న. అధర్మ మనుధర్మం సృష్టించిన వర్ణ వ్యవస్థను అసమానతలను దురన్యాయాలను ఒక ప్రక్క ఎదిరిస్తూనే మరో ప్రక్క తన పత్రిక ద్వారా దళిత జాతిని మేల్కొల్పాలని ప్రయత్నించారు అందుకే మాలవాడా మేలుకో కూలివాడా మేలుకో అంటూ తన జయభేరి పత్రికలో ప్రకటించాడు.

 ISBN: 978-93-340-2436-4

పత్రికా రచనతో తొలితరం దళితులను చైతన్యవంతులుగా చేసిన పత్రికా సంపాదకులు కుసుమ ధర్మన్న అంటే అందులో సందేహం లేదు. అయితే దళితులను అన్ని రంగాలలో అణగద్రొక్కే ద్రోహబుద్ధి ఉన్న మనువాద వారసులు కుసుమ ధర్మన్న సాహిత్యాన్ని సాహిత్యంగా ఒప్పుకోలేదు. ధర్మన్న పత్రికను నడపడం దళితులకు చైతన్యం వచ్చినప్పటికీ వారిలో వచ్చిన మార్పును మనువాదులకు నచ్చలేదు. ఎన్నో కుట్రలుపన్నారు. ఎన్నో కుతంత్రాలు చేశారు. చివరకు ఆ పత్రికను మూసివేసే పరిస్థితులు కల్పించారు. జయభేరి పత్రిక కేవలం మూడేళ్ల పాటే నడిచింది. ఈ మూడేళ్లలో మనువాదులకు భయభ్రాంతులకు గురయ్యారు. జయభేరి పత్రికమరో మూడేళ్లు ఉన్నట్లయితే పూర్తిగా దళితులలో చైతన్యం వచ్చి ఉండేదని రాజమండ్రి పరిసర ప్రాంతాల ప్రజలు అంచనా వేశారు.

కుసుమ ధర్మన్న రచనలో భాషా సారళ్యం ఉంది. భావ తీవ్రత ఉంది. విషయ సంక్షిప్తీకరణ ఉందనే విమర్శకులు అభిప్రాయపడ్డారు. కానీ ధర్మన్నలో విపరీతమైన జ్ఞానం తెలివి తేటలు ఉన్నాయని తన ముందు మా ఆటలు సాగవని ముందుగానే బ్రాహ్మణులు అంచనా వేశారు. కుసుమ ధర్మన్న తెలుగునాట ప్రజలకు చాలా అభిమానం గౌరవం ఉ ండేది. ఆయన పత్రిక మూడేళ్లలో నడిచిన చాలా మార్పులు తీసుకు వచ్చాయని మనకు అర్థమవుతుంది.

వేషభాషలతో తిరుగుతారు తమకంటే ధన్యులు లేరంటారు
మతధర్మాలు మంట బెట్టారు పరమ బానిసలై బ్రతుకుచున్నారు

మా పంచములే బానిసలంటారు వారి వేషభాషలు నేడే మాసి మంటపడిపోను... అంటూ కుసుమ ధర్మన్న ఆనాడే బ్రాహ్మణ వ్యవస్థ మీద విమర్శించారు. కులం పేరిట అణగద్రొక్కబడే జాతి పక్షాన ఆయన నిలబడ్డారు. దళితులు ఎన్ని విధాలుగా వివక్షకు వేదనలకు బలవుతున్నారో వివరించారు.

తక్కువెక్కువనుచ్చునిక్కుచుండుటెగాని
తక్కువెవరుతరచనెక్కువెవరు? ... అంటూ నిర్మొహమాటంగా నిలదీశారు. మతం ముసుగులో అగ్రకులాలు సృష్టించిన సంస్కృతిపై కుసుమ ధర్మన్న కవి నిప్పులు చెరిగారు.

సంగీతములనుచు సానుల రప్పించి దేవాలయములో నిల్పుతారు
దేవునికేట్ల పెండ్లిజేసేరు వారితో గూడి సంభోగించేరు

తెల్ల దొరలనైన రానిస్తారు "మా మాలలొస్తానంటే" మండిపడిపోతారు. అంటూ దేవాలయములోనికి దళితులను రానీయకుండా చేసిన హైందవ దుర్మార్గాన్ని తీవ్రంగా ఖండించారు. దళితుల శారీరక ఆర్థిక దోపిడి తమ హక్కుగా సమాజం భావించింది. అది

 ISBN: 978-93-340-2436-4

తప్పు అని ఎన్నో తరాలుగా దళితులు గుర్తించలేదు. కానీ కుసుమ ధర్మన్న లాంటి దళిత కవులు గుర్తించారు. కవిత్వంలో గర్జించారు. ఆగ్రహంతో గద్దించారు.

మా కళ్ళ దుమ్మేసి మాకున్న మాన్యాలు / గదుముకోని కలుపుకుంటారు / అప్పులిచ్చి కొంప ముంచుతారు... అంటూ ధర్మన్న కవి నిరసన వ్యక్తం చేశారు. నిశిత పరిశీలన సునిశిత విమర్శ ధర్మన్న సాహిత్యానికి ప్రాణం పోసిందని చెప్పాలి.

కుసుమ ధర్మన్నకి దళితులు అంటే ఎనలేని ప్రేమ, గౌరవం ఎందుకంటే దళితులను మొదటి నుంచి జాలిగా చూసే వారు నా వాళ్లు ఎప్పటికైనా పాలించేవాళ్ళు గానే ఉండాలి. ఎవరి దగ్గర బానిస బ్రతుకు బ్రతక కూడదు అని దళితులకు పదే పదే చెబుతూ ఉండేవాడు. అందువలననే దళితులను ఒక ప్రక్క సంస్కరిస్తూనే మరో ప్రక్క డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలకు ప్రభావితులయ్యారు. కుసుమ ధర్మన్న దళితులను మేల్కొల్పడానికి తన పత్రిక ద్వారా తీవ్రంగా ప్రయత్నించారు. సంఘ సంస్కరణోద్యమంలో పాల్గొన్నారు. అంబేద్కర్ ఆలోచనా విధానాలను చాలా వరకు ప్రజలకు వివరించారు. రంగూన్‌లోనూ తమిళనాడులోనూ మరియు తెలుగు రాష్ట్రంలోనే విరివిగా ప్రచారం చేశారు. డా॥బి.ఆర్.అంబేద్కర్ గురించి ఇప్పటి ప్రజలకు తెలిసిందంటే ఆనాడు కుసుమ ధర్మన్న గారు సభలలో ప్రచారం చేయడమే అందుకు నిదర్శనం. కుసుమ ధర్మన్న రచనలు అనేక కుట్రలకు మూలంగా కనుమరుగయ్యాయి. ధర్మన్న గారి మరణాంతరం తన ఇంటిని తగలబెట్టడంతో అపురూపమైన సాహితీ సంపద ముందుతరాలకు అందకుండా పోయింది.

కుసుమ ధర్మన్న గారి రచనలలో మాకొద్దీ నల్ల దొరతనము గేయం, హరిజన శతకము మరియు దానిలోని అనుబంధంగా ఇచ్చిన నాలుగు గేయాలు, నిమ్న జాతుల ఉత్పత్తి, అసుర పురాణము అను హరిజన చరిత్రా సంగ్రహము, అంటరాని వాళ్ళా!, మాల కాకి, స్పష్ఠ వృత్తము.., సామ్యవాదాన్ని సహించని హిందూయిజం, మద్యపాన నిషేధం, తొలి దళిత స్ఫూర్తి కుసుమ ధర్మన్న, కుసుమ ధర్మన్న రచనలు- దళిత దృక్పథం, కుసుమ ధర్మన్న జీవిత ప్రస్థానం ఇలా చాలా ఉన్నాయి.

## కుసుమ ధర్మన్న గారి గురించిమరికొన్ని మాటలలో

ఆ రోజున కుసుమ ధర్మన్న గారు ఏదైతే ఊహించారో మనదేశం నుంచి బ్రిటిష్ వాళ్ళు తెల్లదొరలు వెళ్లిపోయిన తర్వాత కూడా ఈ దేశంలో దళితులకు రక్షణ లేదు ఈ దేశంలో నల్లదొరలు ఈ దళితులని ఇంకా వేధించుకు తింటారు ఏదైతే జరగకూడనిది జరుగుతుందో భవిష్యత్తులో దళితులను ఈ నల్లదొరలు హింసిస్తూ బానిసలుగానే చూస్తారని

 ISBN: 978-93-340-2436-4

ఆనాడే ధర్మన్న గారు చెప్పారని అవే సంఘటనలు ఇప్పుడు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఉభయ గోదావరి జిల్లాలోనే సుమారుగా వంద సాహిత్య సాంస్కృతిక కళలు మరియు దళిత అంబేద్కరిస్టుల సంఘాలు కలిసి రాజమండ్రిలో కుసుమ ధర్మన్న సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించారు. ఈ కుసుమ ధర్మన్న గారు దళిత సాహిత్యానికి సృష్టికర్త అయినప్పటికీ ఇతని చాలా రచనలు ఉద్యమ స్ఫూర్తినిచ్చాయని ఈయన సాహిత్యంలో అనేక రచనలు వెలుగులోకి రావాలని తెలియజేశారు.

రాజమండ్రి గోదావరి తీరంలో కుసుమ ధర్మన్న పుస్తకాల ఆవిష్కరణ సాహిత్య సమాలోచన సదస్సు ఇవన్నీ కూడా ఒక పెద్ద అక్షరం ధర్మ యజ్ఞం లాంటివి. అనేక కులమత భేదాలతో అంటరాని తనాన్ని శాపంలాగా అట్టడుగు వర్గాల మీద రుద్దినటువంటి ఈ హైందవ సమాజంలో అలనాడే వీటన్నిటిని కూడా ఆగ్రహంతో ఆక్షేపించినటువంటి, ప్రశ్నించినటువంటి మహా వ్యక్తి సాహసికుడు, సంఘసంస్కర్త, కుసుమ ధర్మన్న. ఇలాంటి గొప్ప రచయిత యొక్క రచనలు ఇంతకాలం అందుబాటులో లేకపోవడం ఇప్పటికీ కూడా అనేక పుస్తకాలు లేకపోవడం ఒక పెద్ద లోటు. ప్రజానాట్యమండలి, అనేక దళిత సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, శ్రేయోభిలాషులు, వీళ్ళందరూ కలగలిపి చేతులు కలిపి కుసుమాంజలి పేరుతో ఈ కుసుమ ధర్మన్న కార్యక్రమాన్ని రాజమండ్రిలో జరపడం జరిగింది. ధర్మన్న కవి రచనలు తెలుగు సాహిత్యానికి గొప్ప వరంగా తన సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలుగు సాహిత్యాభిమానులు దళితులు ముందుకు రావాలి..

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మరియు పెరియర్ ఆలోచనల ప్రభావం వామపక్షాల ప్రభావం కుసుమ ధర్మన్న కవి రచనల మీద ఆయన చేసిన ఉద్యమాల మీద కనబడుతుంది. నిజానికి 1920 నాటికి రైతు కూలీల ఉద్యమం గురించి రైతులకు రావలసిన వాటాలు గురించి వాళ్ల శ్రమకు దక్కవలసిన ఫలితాలు గురించి ఒక్క ఆలోచన దృక్పథంతో ఒక ఉ ద్యమ స్థాయిలో ఉన్నవాడు ధర్మన్న. అందుకే ఆనాటి అగ్రవర్ణ రైతులు ధర్మాన్నపై ఎంత కోపం ఉన్నా దళితుల కోసం రైతుల కోసం తన ప్రాణ త్యాగానికైనా వెనుకాడడని భావించారు. కుసుమ ధర్మన్న దళితుల కోసమే కాకుండా మిగతా వారి కోసం కూడా తన సభలలో ఎవరి హక్కుల కోసం వారు పాటుపడాలి. మరిముఖ్యంగా రైతు కూలీలు గురించి కూడా వారి కడుపు నింపడానికి కాసిన్ని మెతుకులు ఇవ్వండి అని చెప్పేవాడు. ధర్మన్న లేకపోతే రైతులకు వారి శ్రమ గురించి వారికే తెలియదని మరికొంతమంది రైతులు తమ బాధను వ్యక్తం చేశారు.

దళిత సాహిత్యం అంటే ఆ రోజుల్లో దళితులు అని పేరు లేదు. కానీ హరిజనులు

అని పిలిచేవారు. హరిజనోద్యమంలో ధర్మన్న కవి ఒక బలమైన ఒక గొంతుక వినిపించాడు. పాటల రూపంలో మాటల రూపంలో కూడా సభలలో ధర్మన్న కవి చెప్పే మాటలకు ప్రజలు ఉరకలెత్తే గోదావరి వరదలై ఉప్పొంగే వారు. అంతే కాకుండా అంటరానితనం పైన యుద్ధం ప్రకటించిన యోధుడు. ధర్మన్న కవి ఒక్కడే తన మాటలు ఈ హైందవ సమాజంలో మనువాదుల అందరికీ అతడే ఒక సైన్యంలా కనిపించాడు. అతని గేయాలు పద్యాలు పాటలు మనువాదులు యుద్ధాలు చేసేటట్టుగా ఉండేవి. ఈ అయినా సమాజంలో మనువాదులు కనిపించినప్పుడు ఇంకా ఎంతకాలం మమ్మల్ని దూరంగా ఉంచుతారని సూటి పోటి మాటలతో వారిని ప్రశ్నించేవారు.

ఆనాటికే విప్లవ ధోరణిలో ఉన్న కవిని గురించి ఒక మాట కూడా ఎక్కడా లేకుండా చేశారు. ఏమైనా సరే కుసుమ ధర్మన్న గురించి రాయాలి అనే పట్టుదల ఆ రోజున కలిగింది. అప్పట్నుంచి వెతుక్కుంటూ వెతుక్కుంటూ ఉంటే దాదాపు రెండు మూడు సంవత్సరాల పాటు ఎంతో శ్రమ పడితే నోటి మాట ద్వారానే విన్నావే గాని కనిపించిన పుస్తకాలు ఏమీ లేవు. కేవలం ఒక హరిజన శతకం మాత్రమే దొరికింది. కుసుమ ధర్మన్న గారి ఇంటి పరిసర ప్రాంతాలలో ఇద్దరు ముగ్గురు మాత్రం పెద్ద వాళ్ళు మాకు తెలిసి ధర్మన్న గారు మూడు వందల పుస్తకాలు పైగానే రాశారని మేము చెప్పుకుంటూ ఉండేవాళ్ళం అని భారతి గారి విచారణలో తేలిందని ఆమె తెలిపారు. కుసుమ ధర్మన్న గారు గొప్ప సాహితీవేత్తని అతని రచనలు బయటకు రానీయకుండా చేసినవారు కుట్రతో చేశారని అతని రచనల్లో విప్లవాత్మకమైన సందేశం ఉండి ఉంటుందని అభిప్రాయపడింది.

* * *

 ISBN: 978-93-340-2436-4

32

# కుసుమ ధర్మన్న - దార్శనిక దృక్పథం

**డా॥ బి.వి.వి. బాలకృష్ణ**
విశ్రాంత ఆచార్యులు
రాజనీతి శాస్త్ర విభాగం
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

గోదావరి తీరంలో కందుకూరి వీరేశలింగం శిష్యుడిగా మొదలైన కుసుమ ధర్మన్న సంస్కరణ, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం, సామ్యవాద భావనల అపురూప సమ్మేళనం అనడంలో సందేహంలేదు. గరిమెళ్ళ సత్యనారాయణ 1921 స్వాతంత్ర్య ఉద్యమంలో మాకొద్దీ తెల్ల దొరతనం అనే పాటను రాసి వాడవాడలా స్వయంగా పాడుతున్న రోజులలో పూరిగెడిసెలో బ్రతికే కుసుమ ధర్మన్న సాంఘిక న్యాయంకోసం 1921 లోనే "మాకొద్దీ నల్ల దొరతనం" అనే పేరిట పాట రాసి దళిత సింహంలా రంగంలోకి వచ్చారు ధర్మన్న.

దక్షిణ ఆఫ్రికాలో తెల్లదొరలు అక్కడ ఉన్న నల్లభారతీయులను పెట్టే కష్టాలుచూసి గొల్లున ఏడ్చి ఇండియాలోని అగ్రవర్ణాల వారు గగ్గోలు పెడతారు. కాని అంటరాని వారు ఊరిలో ప్రవేశించకూడదు. ఊర్లో నుండి వారు తక్షణం వెళ్ళిపోవాలి అని ఈ పెద్ద మనుషులే అంటారు. అత్యంత విచిత్రమైన అగ్రవర్ణ నక్కజిత్తుల చిత్త ప్రవృత్తి గూర్చి ధర్మన్న ఇలా అంటారు.

**"పంచనున్న నన్ను సాటింపగారాక**
**దక్షిణాఫ్రికాక నెదదలచి దలచి**
**గొల్లుమనగ నేడ్చి గోటిల్లగా రారె?**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

**తెల్ల దొరలపై కళ్ళెర్రగా జేసి**
**హక్కులడగ జూచు నాగ్రహమున**
**ప్రక్కనున్న నిన్నుత్రొక్కి పెట్టరెవారు**
**ఆలకింపుమయ్య హరిజనుండ"**

గరిమెళ్ళ సత్యనారాయణ దేశభక్తిని ఆయన చేసిన త్యాగాన్ని గురించి ఎవరికి ఎటువంటి సందేహం ఉండనక్కర్లేదు. అయితే ఆయన వాంఛించిన స్వరాజ్యం తెల్లదొరలు చేతుల్లోంచి నల్లదొరల చేతులలోకి మారుతుందే తప్ప అంతకుమించి జరిగేది. జరిగేది ఏమీ లేదని ధర్మన్న ఆనాడే గట్టిగా నమ్మాడు అంతేకాదు స్వరాజ్యం. అంతేకాదు స్వరాజ్యం

 ISBN : 978-93-340-2436-4

వచ్చిన తరువాత కూడా సాంఘిక సాంస్కృతిక రంగాలలో హరిజనుల గతి అధోగతిగా ఉంటుంది అని అభిప్రాయపడటమే హిందూమతంలో జీవించడం కష్టం అవుతుంది అనిభావించారు. హిందూమతంలో జరిగే అకృత్యాలను ముందుగానే పసిగట్టారు ధర్మన్న.

వాస్తవాన్ని దీర్ఘంగా ఆలోచించి చూస్తే సమకాలీన రాజకీయాలలో నేటి భారతదేశంలో ఏమిజరుగుతున్నది? సుమారు వంద సంవత్సరాల స్వాతంత్ర్యపోరాటంలో మనం అనేకచర్యలు జరిపి మనం దేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగ ఏర్పాటు తీసుకున్నాం. భిన్నత్వంలో ఏకత్వం అనే అంశానికి కట్టుబడ్డాం అభివృద్ధిని, ప్రగతిని మనలో ఆపాదించుకొని ముందుకెళ్ళవలసిన మనం గత చరిత్రలోనికి వెళ్ళాలనే ధోరణి చూస్తున్నాం. పౌరసమాజాల పాత్ర నామమాత్రం అయిపోయింది. భారతదేశం భిన్నమతాల, భిన్నకులాల సమ్మేళనం అనేది వాస్తవం.

నేడు పాలక పక్షం వింత వాదనలు వినిపిస్తుంది ఒక దేశం, ఒకమతం, ఒక భాష, ఒకదేవుడు, ఒకజాతి, ఒకపార్టీ, ఒకరేషన్ కార్డు అంటూ మతాల మధ్య వైవిధ్యాలను కాలరాస్తుంటే హిందువులు అందరూ కులాంతం కాకుండా మతంగా గుర్తింపబడాలనేది వారి ఆకాంక్ష. తెల్లదొరలు పోయినా నల్లదొరల ఆలోచనలను ముందుగానే పసిగట్టిన ధర్మన్న గారు మా కొద్ది నల్లదొరతనం అని మనదేశ భవిష్యత్తును దర్శించిన దార్శనికుడు ఆయన "ఈ దేశం అందరిది ఆ విలువలను కాపాడుకుందాం" అనే కుసుమ ధర్మన్న గారు సదా చిరస్మరణీయులు.

* * *

 ISBN: 978-93-340-2436-4

# 33 దళిత గుండెల్లో జయభేరి మ్రోగించిన ధర్మన్న

**పువ్వల ఆనంద్,**
పి.ఆర్.ఓ,
ఆదికవి నన్నయ యూనివర్సిటీ

ప్రజలకు సమాచారాన్ని అందించి వారిని చైతన్యవంతులు చేయడంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయి. స్వతంత్ర సంగ్రామాలు, సంఘ సంస్కరణలు, ఉద్యమాలు, వంటి పోరాటాల మధ్య నుండి చాలా పత్రికలు పురుడు పోసుకున్నాయి. ముఖ్యంగా ఆంధ్రదేశాన 'మాలవాడ మేలుకో... కూలివాడ మేలుకో' అంటూ కుసుమ ధర్మన్న 'జయభేరి' పత్రిక దళిత జాతిని జాగృతం చేసింది. తెలుగు సాంస్కృతిక రాజధానిగా కోటిలింగాలను కొలిచే బ్రాహ్మణోత్తముల కేంద్రంగా ఉన్న రాజమహేంద్రవరం నగరంలో నాడు దళితుల తొలి తెలుగు పత్రిక ఆవిర్భావం కావడం బిగ్ బ్రేకింగ్ న్యూస్ అని చెప్పాలి.

ఆంధ్రదేశంలో పత్రికల చరిత్ర క్రైస్తవాన్ని వ్యాప్తి చేయడానికి ఆరంభమైనప్పటికి తరువాత కాలంలో సాహిత్యం, స్వాతంత్ర్యం, సంస్కరణల నేపథ్యంలో అన్ని వర్గాలలోనికి, అన్ని రంగాల్లోకి వ్యాప్తి చెంది వికసించాయి. 1835లో తొలి తెలుగు పత్రికగా సత్యదూత క్రైస్తవ పత్రిక నుండి ప్రారంభిస్తే, 1838లో తొలి తెలుగు వార్తా పత్రికగా వృత్తాంతి, 1863లో తొలి తెలుగు సాహిత్య పత్రికగా సుజనరంజని, 1874లో తొలి తెలుగు సంఘ సంస్కరణ పత్రికగా వివేకవర్ధని, 1885 తొలి తెలంగాణ పత్రిక శేద్యచంద్రిక, 1886 తొలి తెలుగు దినపత్రికగా దేశాభిమాని పత్రికలు ప్రారంభమయ్యాయి. అలాగే 1902 కృష్ణాపత్రిక, 1908లో స్వరాజ్య పత్రిక, 1908లో ఆంధ్రపత్రిక, 1926లో గొల్కొండ పత్రిక, 1933లో ఆంధ్రభూమి వంటి పత్రికలు ఆయా ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందుతూ వస్తున్న కాలంలో 'మాకొద్దీ నల్లదొరతనమంటూ' గొంతెత్తిన కుసుమ ధర్మన్న, కలం పట్టి వివక్షతకు గురవుతున్న దళిత జాతి గుండెల్లో "జయభేరి"ని మ్రోగించారు. రణరంగంలో జయభేరి మోగించినట్లు రాజమహేంద్రవరం నగరంలో జయానికి విజయానికి శుభ సూచికంగా "జయభేరి" 1936 సంవత్సరంలో ధర్మన్న మ్రోగించారు.

విస్తృత సమాచారం విరివిగా విరజల్లుతున్న నేటి కాలంలో పత్రికలు నడిపినట్లు 1936 నాటి కాలంలో పత్రిక నడపడం పెద్ద సాహసమే. పత్రిక నడపడానికి ధనం ప్రధానం. ధనం లేని ధర్మన్న జయభేరి పత్రిక ప్రారంభానికి ముందే అంబేద్కర్ పిలుపు మేరకు భార్య నగలు తాకట్టు పెట్టి నాగపూర్ సమావేశానికి హాజరయ్యారు. ఆ సమావేశం

 ISBN: 978-93-340-2436-4

తరువాత కొన్ని కొత్త ఆలోచనలు ఆయనలో రూపుదిద్దుకున్నాయి. బహుశా అంబేద్కర్ ఉపన్యాసం ధర్మన్న జీవనశైలి పైన ప్రభావం చూపాయి. ఈ దశలో ఉద్యమాన్ని తీవ్రస్థాయిలో తీసుకెళ్ళాలని తీర్మానించుకున్నారు. ఆర్థిక భారంతో ఏమి చేయాలో తోచని స్థితిలో రాజోలు ఉండ్రు తాతయ్య గారి అబ్బాయి ఉండ్రు సుబ్బారావు గారు హరిజన పత్రిక వ్యవస్థాపకులు పరిచయంతో నూతన ఉత్తేజం సంతరించుకుంది. దళితులలో ధనవంతుడు ఆయన 1200 రూ.లు ఆర్థిక సహకారం చేశారు. జయభేరి పత్రిక తీయడానికి ప్రయత్నం చేశారు. ఆ పత్రికను మధ్యలో నిల్పివేయకూడదనుకున్నారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి గ్రామస్తులు ఇంటికి ఒకరు బర్మాలో ఓడలరేవులో పనిచేసి బ్రతికేవారు. ఇంటి దగ్గర పనులు లేక అలమటించిపోతున్న తరుణంలో భార్యాబిడ్డలను ఇంటి దగ్గర వదిలి బర్మాకు వెళ్ళేవారు. ఓగూరి నూకయ్య, రాజోలు తాలుకా, శంకరగుప్తం వంద ఎకరాల ఆసామీ దళితుడు. రంగూన్ లో ధనవంతుడు పిలుపు మేరకు బర్మా వెళ్తే ధర్మన్నకు ఘన స్వాగతం లభించింది. ధర్మన్న ఉపన్యాసంతో రంగూన్ ఆది ఆంధ్రులు చైతన్యవంతులు అయ్యారు. ఓగూరి నూకయ్య 2 వేలు రూ.లు విరాళం ప్రకటించి ఆది ఆంధ్ర కార్మికుల నుంచి విరాళాలు సేకరించి ధర్మన్నకు సన్మానం చేసి 5000 రూ.లు ఆర్థిక సహాయం చేసి పంపించారు. రాజమండ్రి వచ్చిన తరువాత జయభేరి పత్రిక ప్రారంభించారు.

1936లో జయభేరి పత్రిక వచ్చేనాటికి దళితులలో చదువుకున్న వారి సంఖ్య పెరిగింది. పాఠకుల సంఖ్య పాటు దళితులు చైతన్యవంతులయ్యారు. హరిజనోద్యమం కూడా విస్తృత స్థాయికి చేరుకుంది. కుసుమధర్మన్న జయభేరి పత్రిక ను ఒక లక్ష్యంతో ప్రారంభించారు. దళితులను విద్యావంతులుగా ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా, హరిజనులను తీర్చిదిద్దాలని ధర్మన్న ప్రధాన లక్ష్యం. ధర్మన్న జయభేరి వార పత్రికను దళితులకు ఒక ఆయుధంగా అందించాలని దృఢమైన సంకల్పం. దళిత జాతి సమస్యలను ప్రజలు ప్రభుత్వ దృష్టి తీసుకుపోవాలని ఈ పత్రిక ముఖ శీర్షికలో “మాలవాడ మేలుకో... కూలివాడ మేలుకో” అనే నినాదాన్ని ముద్రించడం విశేషం.

సుకుమ ధర్మన్న ఆరంభంలో గాంధీ ని ఎక్కువ ఇష్టం. గాంధీ రాజమహేంద్రవరం వచ్చినప్పుడు తన పిల్లలతో పూలమాల వేయించి, తన రెండవ కుమారునికి మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ అని పేరు పెట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. 1933 హరిజన యాత్రలో తూర్పుగోదావరి జిల్లా సీతానగరం గౌతమీ సత్యాగ్రహాశ్రమంలో బసచేసిన గాంధీ కుసుమ ధర్మన్నకు కబురుచేస్తే మీ అగ్రహారానికి నేను రాలేను మీ పట్ల గౌరవం ఉంది. అయినా మా అంటరానివాడలకు రావటం మీకు సాహసమే మన్నించమని దూతకు చెప్పిపంపించాడు. గాంధీ రాక తప్పలేదు. ఆదిహిందూధార్మిక ప్రచార కేంద్రంకు వచ్చిన

 ISBN: 978-93-340-2436-4

గాంధీను ధర్మన్న ఘనంగా అతిథ్యం యిచ్చి ఆహ్వానం పలికాడు. కుటీరంలోకి రాగానే గాంధీ దృష్టి ఔషధాలపై పడింది. గాంధీ ముగ్ధుడయ్యాడు. వైద్యనాథ్ ధర్మన్న అంటూ హరిజనులకు చేస్తున్న వైద్యసేవ గురించి తెలుసుకుని సంతోషించారు. తరువాత కాలంలో అణగారిన వర్గాల కొరకు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ చేస్తున్న కృషిని గుర్తించి అంబేద్కర్ ఆశయ సాధనలో భాగస్వామ్యం అయ్యారు. దళితులను సంఘటిత పర్చాలి. మన హక్కులను మనమే సాధించుకోవాలనేది ధర్మన్న విశ్వాసం. డా.బాబా సాహెబ్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ ఆలోచన విధానం మరియు ఉపన్యాసాల ప్రభావం ధర్మన్న మీద తీవ్ర ప్రభావం చూపాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. జాతీయ నాయకులు గాంధీ, అంబేద్కర్ లను దగ్గరగా చూసిన ధర్మన్న, వీరి మధ్య వ్యత్యాసాన్ని తన అభిప్రాయంగా జయభేరి పత్రికలో ప్రచురించారు. 1939 జనవరి జయభేరి సంచికలో ఎడమ వైపు గాంధీ చిత్రం ముద్రించి “మధ్యాహ్నపు మాల... సవతి తల్లి ప్రేమ.. స్వరాజ్యవాది.. కలవారి అండ,” అని గాంధీ గురించి వ్యాఖ్యానించారు. కుడి వైపు అంబేద్కర్ చిత్రం ముద్రించి “మహానాటిమాల కన్నతల్లి ప్రేమ... స్వతంత్రవాది... లేనివారి అండ..” అని అంబేద్కర్ గురించి వ్యాఖ్యానించారు. ధర్మన్న సామాజిక ఉద్యమాన్ని విశ్లేషించే క్రమంలో నిమ్నకులాల చైతన్య పోరాట స్ఫూర్తిని అద్దం పడుతుంది.

పత్రికలు లేని సమాజాన్ని మనం ఊహించలేం అన్నింటికంటే ప్రజలను వేగవంతంగా చైతన్య పర్చడానికి సమాచారం చేరవేసే సత్తా పత్రికలకు ఉందని ధర్మన్న పత్రిక అవసరతను గుర్తించాడు. 1920నాటికే వైద్యుడుగా స్థిరపడినా నిమ్నజాతి నాయకుడిగా మంచి గుర్తింపు కూడా ఉంది. ధర్మన్న 1920లో హరిజనులు భవిష్యత్తులో ఏం చేయాలి అనే విషయాలపట్ల కరపత్రాలు వేసి పంచినట్లు తెలుస్తోంది. హరిజనుల అభ్యున్నతి కోసం ఆది ఆంధ్ర మహాసభలలో తీర్మానాలు చేసి అమలులోకి తీసుకువచ్చారు. కల్లు సారాయి మానండి, శు భ్రతను పాటించండి, చచ్చిన గొడ్ల మాసం తినకండి, పన్నెండు రోజుల పెళ్లిళ్లు కాకుండా ఐదు రోజులు పెళ్లిళ్లు చేసుకోండి, ప్రతి పేటలోను మన మల్లయోధులు మాల మాషీడీలు దగ్గర యుద్ధ విద్యలు నేర్చుకోండి, మతం మారాలనుకున్న దళితులు ఇస్లాం, క్రైస్తవ మతాలలోకి స్వేచ్ఛగా వెళ్లండి అంటూ ఆరోగ్య జీవన ప్రమాణ సూచనలు ఈ తీర్మానాలు జయభేరిలో ప్రచురించి ప్రజలకు అందజేశారు. వన భోజనాలను ప్రోత్సహించి మాల మాదిగలు ఒకేచోట కలసికోవడం జాతి సమైక్యత చిహ్నంగా భావించారు. ధర్మన్న కంటే ముందు దళిత పత్రికలు నడిపినా అవి జాతీయవాదం వైపు హరిజన భావజాలం వైపు మొగ్గు చూపాయి. దళితులకు ఒక సైద్ధాంతిక భావజాలాన్ని అందించలేక పోయాయి. బ్రాహ్మణ భావజాలాన్ని బయటపెట్టి దళితులను సమైక్య పరిచి. ధర్మన్న జయభేరి పత్రిక

 ISBN: 978-93-340-2436-4

దళిత అభ్యున్నతికి కృషి చేసింది. ధర్మన్న మంచి వక్త మాత్రమే కాదు మంచి పాత్రికేయుడు కూడా. అనేక వ్యాసాలు జయభేరిలోనూ ఆంధ్ర పత్రికలోనూ 1925, సమదర్శినిలోనూ 1926 అక్టోబర్ 19 లోను ప్రచురించడ్డాయి.

హరిజనోద్యమంలోనూ నిమ్నకులాల ఆత్మగౌరవ పోరాటాలలో కుసుమ ధర్మన్న రచనలు, కవిత్వం జయభేరి పత్రిక ప్రధాన పాత్ర వహించాయి. జయభేరి వార పత్రికలో ప్రతిఫలించిన అంశాలు దీనికి నిదర్శనంగా ఉన్నాయి. ఆది ఆంధ్రోద్యమం నిర్మాణాత్మకంగా నడపడానికి దోహద పడింది. హరిజనులకు గయ్యాళి (బంజర భూములు)కు పట్టాలివ్వాలని డిమాండుచేసింది. హరిజనులకు కూలీ రేట్లు పెంచాలని పనిగంటలు తగ్గించాలని, మగవాళ్ళతో సహా ఆడవాళ్ళకు సమానంగా కూలీ యివ్వాలని డిమాండు చేసింది. చంటిబిడ్డ తల్లులకు రెండుగంటలకు ఒకపాలి (ఒకసారి)చంటిబిడ్డకు చనుబాలు(కుడిపె) యిచ్చే వెసులు బాటు కల్పించాలని భూసాములను పత్రికా ముఖంగా డిమాండు చేసింది. కల్లసారాయి మానేయాలని, చచ్చిన గొడ్లమాంసం తినడం మానేయండని పత్రికా ముఖంగా పిలుపునిచ్చారు. శుచిశుభ్రత పాటించండి,పెళ్ళిళ్ళలకు పంక్తిభోజనాలలో పందిమాంసం వడ్డన మానేయండని, దీనిద్వారా ఒకే సారి వందలు మంది జబ్బుల బారిన పడుతున్నారని ప్రకటించింది. మాల మాదిగలను బావి నీళ్ళుచేదనివ్వక పోయినా, చెరువులో నీళ్లు పట్టనివ్వక పోయినా సంఘటితంగా తిరుగుబాటు చేయండని ధర్మన్న పిలుపు నిచ్చారు. హరిజనులను సంఘటిత పర్చుడం, దళితులకు జరుగుతున్న అన్యాయాలను, సమస్యలను ప్రజలవద్దకు ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్ళడంలో ప్రధాన పాత్ర వహించింది. ప్రధాన స్రవంతిలో ఉన్న పత్రికలు హరిజన సమస్యల పట్ల చిన్న చూపుచూచేవే ఆ పత్రికల ఉద్దేశ్యాలు కూడా వేరు. ఈ నేపథ్యంలో దళితుల పక్షాన నిల్చి దళిత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవడంలో ప్రముఖ పాత్రపోషించింది. హరిజనుల ఉపకార వేతనాలు సక్రమంగా అందించడానికి ఈ పత్రిక కృషిచేసింది. హరిజనులు జబ్బుపడినప్పుడు పేటలలో ఉచిత వైద్యశిబిరాలు వద్దకు వెళ్ళి సలహాలు తీసుకోండి. లంకణాలతో ప్రాణాలకు ముప్పుతెచ్చుకోకండి. మీ గ్రామాలలో వైద్య కార్యకర్తలను కలవండి అని ప్రచారం చేసింది. తల్లులారా తండ్రులారా మీ పిల్లలను పాలేరు తనం మానిపించి బడికి పంపించండి. అని ప్రచారం చేసింది. హరిజన నాయకులను విద్యార్థుల సంఘటిత పర్చుడంలో ఉద్యమాల వైపు నడిపించడంలో ఈ పత్రిక కీలకపాత్ర పోషించింది. హరిజనులకు సమాచార కేంద్రం గా పనిచేసింది. ధర్మన్న సాహిత్యాన్ని ప్రచారంచేయడంలోనూ ఆయన భావజాలం అందించడం లోనూ ఈ జయభేరి పత్రిక విజయభేరి మ్రోగించింది. జయభేరి పత్రిక ప్రాంతీయంగా హరిజనులను వేల మందిని చైతన్యవంతులను చేసింది. ఆర్థిక భారంతో

 ISBN: 978-93-340-2436-4

ఈ పత్రిక ఎక్కువ కాలం కొనసాగలేక పోయింది. వర్షకాలంలో చచ్చిన గొడ్ల చర్మాలను తీయకండి. భూమిలో ఉప్పు వేసి పాతిపెట్టండని పిలుపునిచ్చాడు. దీని వల్ల అంటురోగాలు (జాడ్యం/కలరా) రావడం గమనించాడు ధర్మన్న. బానలో ఉప్పు, సున్నం, కరకాయం పొడి, బాగా నీటిలోకలిపి ఆ నీటిలో ఈ చర్మాలను ఉంచుతారు. కుళ్ళిన కంపురాకుండా బోడసారం ఆకు ఉంచుతారు. చర్మం శుభ్రపడిన అనంతరం చదును చేసి ఎండలో లాగికట్టుతారు. ఈ క్రమంలో జబ్బులబారిన పడిన హరిజనులు మరణించేవారు. హరిజన స్త్రీలు మగ వాళ్ళతో సమానం. మీరు పని పాటలకు వెళ్లి కష్టపడుతున్నారు. మీ భర్తల పట్ల భయపడకండి. సంసారం చక్కదిద్దండి. మీ పిల్లలను బడికి పంపించండి. మీ మీద భూస్వాములు అత్యాచారానికి దిగితే సమూహంగా తిరగబడండి. పాలేరు పెళ్ళాలని చులకన చేసి మీతో అసభ్యంగా ప్రవర్తిస్తే నిలదీయండి.. పని చేసే చేలో, చెలకలో ఓసే... ఓరే అంటే నిలదీయండి. మీ ఆత్మగౌరవాన్ని కాపాడుకోండి' అని ధర్మన్న ఉద్బోధించారు పత్రికల్లో ప్రకటించారు.

జయభేరి పత్రిక తొలితరం దళిత యువతను చైతన్య వంతులుగా తీర్చిదిద్దింది. తొలితరం దళిత రచయితలకు వేదికగా నిల్చింది. ఉదాహరణకు బోయి భీమన్న, నీలం వెంకన్న, పోలుకొండభద్రయ్య, తరపట్ల వెంకటరెడ్డి, జాలరంగ స్వామి, దిండ్లపుల్లయ్య మొదలైన వారిని అందించింది. కవులను కళాకారులను ప్రోత్సహించింది. హరిజన వార్తలను అందించి హరిజనుల అభ్యున్నతి కృషిచేసింది. ఈ క్రమంలోనే రాజమండ్రి లో బి.ఇడి చదువుతున్న బోయిభీమన్న 1938 లో జయభేరి పత్రిక నడిపించడంలో చొరవ తీసుకున్నారు. అందులో పిపాసి అనే కలం పేరుతో కథలు రాస్తే ఆ కథలకు తీవ్రంగా స్పందించిన రాజమండ్రిలో బ్రాహ్మణ పెద్దలు నిరసన తెలియజేసి జయభేరి పత్రికలను తగులబెట్టారు. అంతటితో ఆగక ఆ కథలు రాసేవాడ్ని కొట్టి గోదావరిలో పడవేయిండని శపథం చేశారు. నేను దొరకలేదు అనుకోండని (23-2-1995) నాటి ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రసంగంలో) భీమన్న అన్నారు. ఈ అంశాలు పరిణితివాణి వ్యాసంలో భీమన్న రాసుకున్నారు. 1937సం జయభేరి పత్రికకు దిండ్లు పుల్లయ్య ఒక సంవత్సర కాలం ఉపసంపాదకులు గా వ్యవహరించారు. తెలుగులో నిమ్నకులాల పత్రికా రచనలను పరిశీలిస్తే ఆనాటి స్థితిగతులను అవగాహన చేసుకోవచ్చును. జయభేరి పత్రికను పరిశీలిస్తే నిమ్నకులాల పునర్నిర్మాణ వాదం అవిష్కరించబడుతుంది. మాదిరి భాగ్యరెడ్డి వర్మ ప్రారంభించిన నిజాం రాష్ట్రంలో - పంచమం, భాగ్యనగర్, ఆది ఆంధ్ర, ఆదిహిందూ, పత్రికలు హరిజనోద్యమానికి ఊపిరి పోశాయి.

1921లో గరిమెళ్ల సత్యనారాయణ రాసిన "మాకొద్దీ తెల్లదొరతనం" గేయంలోని

 ISBN : 978-93-340-2436-4

డొల్లతనాన్ని ఎండగడుతూ తెల్ల దొరలు పోయి, నల్ల దొరలు పాలనకొచ్చినంత మాత్రాన హరిజనులకు వారిగేదేమీ ఉండదని నిర్మొహమాటంగా "మా కొద్దీ నల్ల దొరతనం ప్రతి గేయం రాసిన తొట్టతొలి దళిత విప్లవ కవి కుసుమ ధర్మన్న. "తెల్లవాడు నిన్ను నాడు భగత్సింగు అన్నాడు, నల్లవాడు నిన్ను నేడు నక్సలైటు అన్నాడు. ఎల్లవారు నిన్ను రేపు వేగుచుక్క అంటారు" అన్న శ్రీశ్రీ మాటలకు కుసుమ ధర్మన్న కవికి అన్వయిస్తే అతను దళితజాతి వేగుచుక్క. వైద్యునిగా, కవిగా, వక్తగా, ఉద్యమకారునిగా, నాయకుడుగా మాత్రమే కాకుండా సంపాదకునిగా నాటి దళిత గుండెల్లో "జయభేరి" మ్రోగించిన ధర్మన్న మీకు వందనం...

* * *

 ISBN : 978-93-340-2436-4

# 34 కుసుమధర్మన్న - సమకాలీన చారిత్రక సంఘటనలు వాటి ప్రభావం

**డా॥ అద్దంకి ప్రజాపతి**
అసిస్టెంట్ ప్రొఫెసర్
కె.యల్. విశ్వ విద్యాలయం
ఫోన్ నెం. 9177382668

క్రీ.శ1900 సంధర్భంలో రాజమహేంద్రవరంలో ఒక సాధారణ దళిత కుటుంబంలో జన్మించిన కుసుమ ధర్మన్న గొప్ప వక్తగా, రచయితగా, కవిగా, హరిజన నాయకుడిగా, స్వతంత్ర ఉద్యమకారుడిగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా వెలుగొందారు. ఈయన జన్మించిన 1900 సంవత్సరం నుండి 1946 వరకు భారత దేశంలో జరిగిన సంఘటనలు వాటి ప్రభావం ఏవిధంగా కుసుమ ధర్మన్న పై ఉందో చర్చించే ప్రయత్నం నా పరిశోధన వ్యాసం.

1900 సంవ్సతరానికన్నా 5 సంవత్సరాల ముందు భారత జాతీయ కాంగ్రెస్ 1885 డిశంబర్ 28 న ఏర్పాటు చేయబడింది. దీని సమావేశాలు ప్రతి సంవత్సరము డిశంబర్ మాసంలో జరిగేవి. 1900 సంవత్సరంలో డిశంబర్ 27-29 వరకు లాహోర్ నగరంలో యన్.జి. చాంద్వారర్ అధ్యక్షతన జరిగింది. ఇది ఒక చారిత్రక సంఘటన - అయితే ఈ ఐ.యన్.సి. సమావేశాలు 1948 వరకు జరిగాయి. ఇక్కడ మరొక విషయం 1948లో జరిగిన చివరి ఐ.యన్.సి. సమావేశానికి అధ్యక్షతవహించిన వారు మన తెలుగు వారు కావడం విశేషం. ఆయన పేరు భోగరాజు పట్టాభి సీతారామయ్య. వీరి అధ్యక్షతన చివరి సమావేశం రాజస్థాన్ రాష్ట్రంలో జైపూర్ నగరంలో జరిగింది.

1900 నుండి 1946 వరకు ఉన్న చారిత్రక సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ కాలాన్ని ఆర్.సి. దత్ అనే చరిత్రకారుడు మూడు భాగాలుగా విభజించాడు. అవి 1. మితవాదయుగం, 2. అతివాదయుగం, 3. గాంధీ యుగం.

మితవాదయుగం 1885 -1905, అతివాదయుగం 1905-1920, గాంధీయుగం 1920-1947 అని విభజన చేశారు.

వీటిలో కుసుమ ధర్మన్న పై ప్రభావం చూపించిన కాలంగా గాంధీయుగాన్ని పేర్కొనవచ్చు. అయితే కుసుమ ధర్మన్న పై భారతదేశంలోని సంఘటనలు కాకుండా వీరిపై చేసిన పరిశోధనలు, అలాగే వీరి రచనల్ని బట్టి అర్ధమయ్యే విషయం వీరి పై ప్రపంచ యుద్ధాల ప్రభావం కూడా ఉంది. 1914-1918 వరకు జరిగిన మొదటి ప్రపంచ యుద్ధం, 1939-1945 వరకు జరిగిన మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

 ISBN: 978-93-340-2436-4

కుసుమ ధర్మన్న ఆనాటి స్వాతంత్ర ఉద్యమకారులు అనుసరించిన కొన్ని సమకాలీన అంశాలనే అనుసరించబడ్డ గమనించాల్సిన విషయం. సాధారణంగా కుసుమ ధర్మన్న ను తొలి తరం దళిత కవులలో ఒకరుగా భావిస్తారు. అయితే ధర్మన్నలో మరో కోణం స్వాతంత్ర కాంక్ష కూడా కనిపిస్తుంది. దీనికి నిదర్శనం ఆకాలంలో జరిగిన కొన్ని సంఘటనలను బట్టి తెలుస్తుంది.

కుసుమ ధర్మన్న కాలంలో సమకాలీనంగా జరిగిన ఒక గొప్ప ఉద్యమం సహాయనిరాకరణ ఉద్యమం దీనిని గాంధీజీ 1920 ఆగష్టు 1న ప్రారంభించారు. అయితే దీనిని ప్రారంభించడానికి గల కారణం బ్రిటీష్ వారు భారతదేశంపై పెడుతున్న ఆంక్షలను వ్యతిరేకిస్తూ ప్రారంభించారు. 1919 సంవత్సరంలో బ్రిటీష్ కొలత చట్టాలను ప్రవేశపెట్టారు. వీటిని గాంధీ "నల్లచట్టాలు" అనే పేరుతో పిలిచాడు.

ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ చాలా ప్రాంతాలలో హర్తాళ్ సమ్మెలు నిర్వహించారు. అయితే వీటిలో భాగంగా 1919 ఏప్రియల్ 13న "జలియన్‌వాలా బాగ్" మారణకాండ జరిగింది. ఈ సంఘటనల ప్రభావం కుసుమ ధర్మన్న పై చూడవచ్చు వీరు రాసిన హరిజనల శతకంలో ఈ సంఘటన ప్రస్తావన కనిపిస్తుంది. ఈ సంఘటనలో సుమారు 1200 మంది చనిపోతే వీరిలో అత్యధికంగా మరణించినవారు అతి సామాన్య ప్రజలు. ఆ రోజు పంజాబ్ రాష్ట్రం అంతా 'బైశాఖీ' అనే సంవత్సరపు పండుగను జరుపుకుంటున్నారు.

కుసుమ ధర్మన్న పై ప్రభావం చూపిన మరొక సంఘటన గాంధీజీ స్వాతంత్రోద్యమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 1919 ఏప్రియల్‌లో మొట్టమొదటిసారిగా విజయవాడ నగరాన్ని సందర్శించారు. ఆ తర్వాత గాంధీజీ ఇదే నగరంలో జరిగిన సి.డబ్ల్యు.సి సమావేశం రాజారామోహన్ రాయ్ గ్రంథాలయంలో జరుగగా దానికి అధ్యక్షత వహించారు. ఈ సంఘటన ప్రభావం కుసుమ ధర్మన్నపై ఉందనే విషయం స్పష్టంగా అర్థం అవుతుంది. గాంధీజీ రాజమహేంద్రవరం సందర్శించిన సమయంలో తనకు గాంధీజిపై ఉన్న గౌరవాన్ని వ్యక్తపరుస్తూ గాంధీజీ ఎట్టి పరిస్థితుల్లో దళితవాడలను సందర్శించాలని కోరగా గాంధీజి వెంటనే కాంగ్రెస్ నాయకులను వెంటబెట్టుకొని కుసుమ ధర్మన్న నివశించే దళితవాడను సందర్శించారు.

కుసుమ ధర్మన్న పై ప్రభావం చూపిన ఆనాటి సమకాలీన మరొక సంఘటన దళితులకు దేవాలయ ప్రవేశం, అలాగే విద్యా అవకాశాలు లేక పోవడం.

దీనిని ప్రధానంగా ఈయన రచనలలో 'నిమ్నజాతి విముక్తి తరంగణి" లో పేర్కొనడం గమనించాలి. హరిజన అనే పదం అలాగే హరిజన ఉద్యమం ను తీసుకురావడానికి ప్రధానంగా కారణమైన వ్యక్తి గాంధీజి.

 ISBN: 978-93-340-2436-4

హరిజన ఉద్యమాన్ని హరిజన సేవా సంఘ్‌ను, హరిజన పత్రికను ప్రారంభించిన వారు గాంధీజీ. హరిజన అనే పదం బాగా ప్రచారం చేశారు గాంధీజీ. దీనికి కారణం బ్రిటీష్ వారు 1932 లో ప్రకటించిన " కమ్యూనల్ అవార్డు". ఇది అవార్డ్ కాని అవార్డ్. ఈ అవార్డ్ వల్ల భారతదేశం లో ఉన్న దళితులకు లేదా హరిజనులకు చట్ట సభలలో ప్రాతినిధ్యం కల్పించడం జరిగింది. దీనిని పూర్తిగా వ్యతిరేకించినవారు గాంధీజీ. దీనిని పూర్తిగా సమర్ధించినవారు డా॥ బి.ఆర్.అంబేద్కర్. గాంధీజీ దీనిని వ్యతిరేకిస్తూ ఎరవ్రాడ జైలులో సత్యాగ్రహం ప్రారంభించగా పూనా ఒప్పందముతో గాంధీజీ సత్యగ్రహంను ముగించారు. ఆ తర్వాత 1933 లో "హరిజన యాత్ర"ను గాంధీజీ నిర్వహించారు. కమ్యునల్ అవార్డును గాంధీజీ వ్యతిరేకించడంలో ప్రధాన ఉద్దేశ్యం దేశ ప్రజలు కుల ప్రతిపదికన విడిపోతే దేశ సమైక్యత దెబ్బతింటుందని భావించినట్లుగా తెలుస్తుంది.

గాంధీజీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కుసుమ ధర్మన్న తన పక్ష పత్రిక అయిన "జయభేరి" లో బాహాటంగా వ్యతిరేకించాడు. కుసుమ ధర్మన్న పై అత్యధికంగా ప్రభావం చూపిన వ్యక్తి డా॥ బి.ఆర్.అంబేద్కర్. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ప్రాంతంలో స్వాతంత్ర ఉద్యమం అప్పుడప్పుడే ఆవిర్భవిస్తున్న సమయంలో జన్మించిన కుసుమ ధర్మన్న 1921 నాటికి ఆ ఉద్యమ ప్రభావంలో వచ్చిన ఒక గేయాన్ని ఖండిస్తూ మరో గేయరచన చేయడం ఆనాటి కాలంలోఒక సాహసంఅని చెప్పాలి. 1921 సంవత్సరములో భారతదేశంలోఉధృతంగా జరుగుతున్న ఉద్యమం సహాయనిరాకరణ ఉద్యమం.ఇది ఒక ఉచ్చదశలో ఉన్నపుడు గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన "మా కొద్దీ తెల్లదొరతనము తెల్లవారి గడుసరి..." అని గేయంలో బ్రిటీష్ వారు భారత దేశాన్ని ఏవిధంగా పట్టి పీడిస్తున్నారు. అనే విషయాన్ని స్పష్టంగా తెలియచేశారు. దీనిని మార్చి 1921 లోనే మా కొద్దీ నల్లదొరతనము ... అనే గేయాన్ని రాయడం ఒక విప్లవంగా చెప్పాలి. కుసుమ ధర్మన్న భారతదేశాన్ని బ్రిటీష్ వారు వదిలి వెళ్ళటం కన్నా ముందు భారత దేశంలో అస్పృశ్యత నివారణ జరగాలని నల్ల దొరతనం నశించాలని అగ్రవర్ణాల వారు పాదాల క్రింద పంచములు నలిగి పోకూడదని అన్ని విధాల ప్రయత్నం చేశారు. 1936 సంవత్సరములో విజయనగరంలో జరిగిన ఆది ఆంధ్ర మహా సభలో సామ్యవాదాన్ని వ్యక్తపరచిన మొట్టమొదటి దళితుడు కుసుమ ధర్మన్న. ఆది ఆంధ్ర ఉద్యమస్థాపకుడైన మాదిరి భాగ్యరెడ్డి వర్మ ప్రభావం కూడా కుసుమ ధర్మన్న పై కనిపిస్తుంది.

సమకాలీన సంఘటనలే కాదు సమకాలీన వ్యక్తులు ప్రభావం కూడా కుసుమ ధర్మన్న పై కనిపిస్తుంది.

 ISBN : 978-93-340-2436-4

రాజమహేంద్రవరం నగరానికే చెందిన సంఘ సంస్కరణ కర్త అయిన కందుకూరి వీరేశలింగం ప్రభావం కూడా కుసుమ ధర్మన్నపై కనిపిస్తుంది. కందుకూరి సంస్కరణాభిలాషను కుసుమ ధర్మన్న పుణికి పుచ్చుకున్నారు. కందుకూరి నిర్వహించిన వితంతు పునర్వివాహాల ప్రభావం కుసుమ ధర్మన్నపై అత్యధికంగా కనిపిస్తుంది. ఆ నాటి సమాజంలో ఆంధ్ర ప్రాంతంలో రాజమహేంద్రవరం నగరంలో 1881 డిశంబర్ 11న గోగులపాటి శ్రీరాములు, సీతమ్మ కు మధ్య మొట్టమొదటిసారిగా వితంతు వివాహం జరిగింది.

డా॥బి.ఆర్.అంబేద్కర్ ను వారి ఆశయాలను ఆంధ్ర ప్రాంతంలో ప్రచారం చేయడం ప్రారంభించింది.కుసుమ ధర్మన్నఅని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. డా॥బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా తన జీవితాన్ని మలచున్నారు. కుసుమ ధర్మన్న 1945 సంవత్సరంలో హరిజనులకు ఒక ప్రత్యేక బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచవచ్చు అని భావించి "హరిజన బ్యాంక్" ను రాజమహేంద్రవరంలో ప్రారంభించారు.

సమాజంలో ఉన్న కుల, మత వివక్షతలను కుసుమ ధర్మన్న పూర్తిగా వ్యతిరేకించారు, వీరు జయభేరి పత్రికలో "సామ్యవాదాన్ని సహించని హిందూయిజం" అనే వ్యాసంలో సామ్యవాద భావాన్ని దాని ప్రాధాన్యతను తెలియ జేశారు. అలాగే హరిజన ఉద్దరణ కోసం "నిమ్నజాతి విముక్తి తరంగిణి" అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంధంలో పంచములు అనే పదాన్ని నిమ్నజాతివారు, అస్పృస్యులు చండాలురు, దళితులు, హరిజనులు అనే పదాలను వివిధ సంధర్భాలలో ఉపయోగించారు. కుసుమ ధర్మన్న కాలంలోనే తమిళనాడు ప్రాంతంలో ఆత్మగౌరవ ఉద్యమానికి నాంది ఏర్పడింది. దీనిని స్థాపించిన వారు పెరియార్ రామస్వామి నాయకర్. వీరు కూడా దళితులకు దేవాలయ ప్రవేశం అనే అంశాన్ని స్వీకరించారు. అలాగే కేరళ ప్రాంతంలో శ్రీ నారాయణ గురు దళితులకు దేవాయల ప్రవేశం కోసం ఉద్యమాన్ని ప్రారంభించారు.

బ్రాహ్మణ వాదాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రాంతంలో "జిస్టిస్" పార్టీ ఆవిర్భవించింది. ఇవి అన్ని కూడా కుసుమ ధర్మన్న కాలంలో సమకాలీనంగా జరిగిన సంఘటనలు. కుసుమ ధర్మన్న కాలంలో సమకాలీనంగా జరిగిన సంఘటనలు. కుసుమ ధర్మన్న 'హరిజన ఉద్దరణ' కు సముపార్జన అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.

డా॥బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా హరిజనుల చరిత్ర అంతరించిపోకూడదని 1945 లోనే "హరిజన చరిత్ర" అనే గ్రంధాన్ని కుసుమ ధర్మన్న రచించారు.అంటరానితనాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ ఒక గ్రంధాన్ని రాయడం జరిగింది.

ఆగ్రంథం పేరు "వాళ్ళు అంటరాని వాళ్ళా" ఈ గ్రంథంలో కుసుమ ధర్మన్న తనకు హరిజనుల పట్ల ఉన్న ఒక దృక్పథాన్ని వ్యక్తపరిచారు.

ఆంధ్ర ప్రాంతంలో ఎక్కువగా కుల వివక్షత ఉండటానికి కారణం ఈ ప్రాంతాన్ని పాలించిన నాయకరాజులు, రెడ్డి రాజులు అని చెప్పాలి. దళితులకు ఆంధ్ర ప్రాంతంలో చిన్నచూప చూడటం ఈనాటిది కాదు. ఆనాటి కాలంలో దళితులు గ్రామంలో ప్రధాన మార్గం గుండా నడవకూడదు. దళితులకు తాటి ఆకులు కట్టి ఆ ముద్రపడిన ప్రదేశంలో ఆవు పంచితం చల్లి మైలను తుడుపుకునేవారు అగ్రవర్ణాలవారు. ఇది చారిత్రక సత్యం. దీనిని తన రచనల్లో కళ్ళకు కట్టినట్లు తెలియ చేసిన వారు కుసుమ ధర్మన్న.

కొన్ని వందల సంవ్సరాల నుండి వస్తున్న దురాచారాలను దళితుల పట్ల వివక్షతలను అడ్డుకొని ఎదురొడ్డి నిలిచి రచనల్లో నిలదీసిన రచయిత, కవి,ఆయుర్వేద వైద్యుడు, పత్రికా స్థాపకుడు మంచి వక్త మన కుసుమ ధర్మన్న.

కుసుమ ధర్మన్న కాలంలో జరిగిన మరికొన్ని చారిత్రక సంఘటనలు గమనిస్తే స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా అనేక సంఘటనలు జరిగాయి. 1927 సంవత్సరములో వచ్చిన సైమన్ గోబ్యాక్ ఉద్యమం. దీనిని బ్రిటీష్ వారు 1927 నవంబరు 17 న ప్రకటించారు. దీని ప్రధాన ఉద్ధేశ్యం బ్రిటీష్ వారు భారత దేశంలో 1919లో ప్రవేశపెట్టిన సంస్కరణ లు అమలు ఏవిధంగా ఉందో తెలుసుకోవడం. కానీ దీని గాంధీజీ వ్యతిరేకించారు. అలాగే ఈ కమీషన్ ను వైట్ కమీషన్ అని పిలిచారు. ఇలా పిలవడానికి గల కారణం ఈ కమీషన్‌లో ఒక్క సభ్యుడు కూడా భారతీయుడై లేకపోవడం. గాంధీజీ అభ్యర్ధించినా బ్రిటీష్ వారు ఏమాత్రం పట్టించుకుండా కమీషన్‌లో భారతీయ సభ్యుడు లేకుండా నియమించారు. ఈ కమీషన్ ను స్వాగతించినవారు డా॥బి. ఆర్. అంబేద్కర్. ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో అనేకమంది దీనిని వ్యతిరేకించారు. అయ్యదేవర కాళేశ్వర రావు ఏకంగా ఒక కవరులో " సైమన్ గో బ్యాక్ " అని రాశి తన గమస్తా చేత ఆ కవరును 'సైమన్'కు అందించడం జరిగినది. ఇలాంటి పరిస్థితులు నడుస్తున్న సమయంలో కుసుమ ధర్మన్న ఆంధ్ర ప్రాంతంలో అంబేద్కర్ భావజాలాన్ని వ్యాప్తి చేసే క్రమంలో నిమగ్నమైనారు. డా॥బి.ఆర్.అంబేద్కర్ ఇచ్చిన నినాదం అయిన బోధించు, సమీకరించు, పోరాడు నినాదాన్ని తన సభలలో తెలియచేశారు.

డా॥.బి.ఆర్.అంబేద్కర్ తీసుకునే ప్రతి నిర్ణయం హరిజన ఉద్దరణ కోసమే అనే భావన కుసుమ ధర్మన్న లో ఎప్పుడు నిబిడికృతం అయిఉంటుంది.

అలాగే 1942 లో వచ్చిన "క్విట్ ఇండియా" ఉద్యమం, 1930 లో ప్రారంభం అయిన శాసన ఉల్లంఘన ఉద్యమం, ఈ రెండు ఉద్యమాలకు కుసుమ ధర్మన్న తన మద్దతు తెలియచేసినట్లు "జయభేరి" పత్రికలోని వ్యాసాలను బట్టి తెలుస్తుంది.

కుసుమ ధర్మన్న "ఉప్పు సత్యాగ్రహం" 1930లో గాంధీ నిర్వహించిన దానికి కూడా మద్దతు పలికారు. ఆంధ్ర ప్రాంతం నుండి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఏకైక తెలుగు వ్యక్తి ఎర్నేని సుబ్రహ్మణ్యం. కుసుమ ధర్మన్న కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే అవసరం అయిన సంధర్భాల్లో దానిని వ్యతిరేకించడం కూడా జరిగింది.

కుసుమ ధర్మన్న ను దళిత వైతాళికుడుగా పేర్కొన్నవారు మద్దూరి సత్యనారాయణ వీరు తన పరిశోదన గ్రంధంలో కుసుమ ధర్మన్న కు సాహిత్యాభిలాషను, దళితుల పట్ల ఆయనకు ఉన్న బాధ్యతాయుతమైన అంశాలు తెలియజేశారు.

'హరిజన' అనే పదాన్ని ఆంధ్రలో బాగా ప్రచారం చేసిన వారు కుసుమ ధర్మన్న. ఆంధ్ర ఆ ప్రాంతంలో దళితుల చైతన్యానికి, దళిత జన ఉద్దరణకు తన సాహిత్య రచన ద్వారా వ్యాప్తి చేసిన కుసుమ ధర్మన్న జన్మధన్యం.

**ఉపయుక్త గ్రంధాలు :**


1. భారతి తుమ్మపూడి A History of Telugu Dalit Ciferatcre, Gyan Publishing House, Hyderabad, 2008.
2. హేమలత పుట్ల – 'కుసుమ ధర్మన్న' మాకొద్దీ నల్లదొరతనం, సామితీ ప్రస్తానం, హైదరాబాద్, 2016
3. సత్యనారాయణ మద్దుకూరి – కుసుమ ధర్మన్న కవి రచనలు – దళిత దృక్పధం, ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ 2003.
4. Bipin Chandra -Modern Indian History Orient Black swan Pvt. Ltd., Delhi, 2021.

 ISBN: 978-93-340-2436-4

# 35 ధర్మన్న సాహిత్యంలో కుసుమించిన గతి తార్కిక భౌతికవాద తత్త్వం

**డా॥ మోగంటి సుధామయి**
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
సీతానగరం. 9492149532

ఆధునిక సమాజంలో ఔన్నత్య సాధన కోసం. ప్రాచీన చరిత్రలో మూలాలను వెతుక్కునే ప్రయత్నం ఆధునిక సాహిత్యంలోని కాల్పనిక యుగ సాహిత్యంలో సామాజిక స్పృహతో మొదలైంది. ఏ కాలంలోని కవులకైనా పీడిత మానవుల పట్ల అపారమైన సానుభూతి లేకపోలేదు కానీ, ఆ పీడనకు కారణమైన వర్గ వైరుధ్యాల అవగాహన వీరికి స్పష్టం కాదు. ఈ విధంగా పీడన అంతరించదనీ, సమ సమాజం ఆవిర్భవించదనీ విశ్వసించిన వారు అభ్యుదయ కవులు. మార్క్సిజం ప్రాతిపదికగా కార్మిక వర్గ పోరాటాలు స్ఫూర్తితో, ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. భారతదేశంలోనే కాదు, ఆంధ్ర దేశంలో కూడ అభ్యదయ సాహిత్యానికిగాని, విప్లవ సాహిత్యానికి గానీ ప్రధానమైన లక్షణం పీడిత వర్గం తరపున పీడక వర్గంపై పోరాటం. అభ్యుదయ రచయిత పేదల పక్షాన నిలుస్తాడు. అలాంటి నిబద్ధత గలిగిన అభ్యుదయ రచయిత కుసుమ ధర్మన్న.

గతి తర్కం అంటే ప్రతి వస్తువుని అర్థం చేసుకోవడం. గ్రీకు భాషలో దయలెగో అంటే వాదన – ప్రతివాదన అని అర్థం. అంటే ఏదైనా విషయ నిర్మాణ ప్రక్రియను గాని, పరిణామ ప్రక్రియను గాని, విచ్ఛిన్న ప్రక్రియను గాని అర్థం చేసుకోవడం. దాన్నే ఆంగ్లంలో dialectic అని, తెలుగులో గతి తర్కం అని అంటారు. భౌతికవాదం అంటే చెట్లు, నదులు, కొండలు, మనిషి, సమాజం ఇవన్నీ భౌతికంగా ఉనికిలో ఉన్నవి. గతి తార్కిక భౌతిక వాదమంటే భౌతికవాదాన్ని గతి తార్కిక పద్ధతిలో అర్థం చేసుకోవడం.

ఈ విషయాన్ని గమనించినట్లైతే "ప్రగాఢమైన సంవేదన, తిరుగుబాటు తత్త్వం, మార్పు, పోరాటం కోసం తీవ్రమైన కోరికతో కలం పట్టిన దళిత రచయిత కుసుమ ధర్మన్న. సాంబశివరావుగారి అభిప్రాయంలో హిందూ ఫాసిస్టు వ్యతిరేక, బ్రాహ్మణీయ అగ్రవర్ణ వ్యతిరేక, భూస్వామ్య పెట్టుబడి దారీ వ్యతిరేక, వర్గ కుల మత సామాజిక విప్లవ అవగాహన ఈ దళితోద్యమానికి దేశీయ సైద్ధాంతిక భూమికగా ముందు కొచ్చింది. దళితుల ఆత్మగౌరవం కోసం, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విముక్తి కోసం పోరాడే శాస్త్రీయమైన దళిత చైతన్యాన్ని రగిల్చి దళిత సాహిత్యానికి ఒక సమగ్ర తాత్త్విక ధృక్పథాన్నిచ్చింది బాబాసాహెబ్ అంబేద్కర్.

 ISBN : 978-93-340-2436-4

70-80 లలో దళితులు చైతన్యవంతులు కావడానికి, దళిత రచయితలు నిర్భయంగా రాయడానికి ఆంధ్ర దేశంలో వామపక్షాలు, ప్రజా పోరాటాలు స్ఫూర్తినిచ్చాయి. అంతకుముందే 1900లో పుట్టి 1945 లో కన్నుమూసిన ధర్మన్న జాతీయోద్యమకాలంలోనే దళితుల కోసం సింహగర్జన చేసినవాడు. వైద్యం, సాహిత్యం, కళలు, పత్రికల నిర్వహణ, మాట్లాడే చాతుర్యం గల ధర్మన్న పద్యం, గేయం, కథ, నవల, వ్యాసం వంటి సాహితీ ప్రక్రియల్లో అందెవేసిన చేయి హరిజనుల స్థితిగతులకు చలించి వారి బాధలను హరికథలుగా మలచి హరిజనవాడల్లో గొంతెత్తి గానం చేసిన ఆధునిక ప్రజా వాగ్గేయకారుడు ధర్మన్న.

ధర్మన్న రచనలు పరిశీలిస్తే గతి తార్కిక చారిత్రక భౌతిక వాదానికి అసలైన అర్థం గోచరిస్తుంది. నిమ్న జాతి విముక్తి, తరంగిణి, మాకొద్దీ నల్లదొర తనము, నిమ్న జాతుల ఉ త్పత్తి, మద్యపాన నిషేధం, అసురపురాణం, అంటరాని వాళ్ళు (కథలు), మాలకాకి (నవల), స్వస్థవృత్తము (వైద్య గ్రంథం), హరిజన శతకం వంటి ఉద్గ్రంథాలు రాశాడు. సమాచార ప్రసార సాధనాలు అంతంత మాత్రంగా ఉన్న ఆరోజుల్లోనే దళిత జాతి విముక్తికి అంబేద్కరిజమే సరైనదని, అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి జయభేరి పత్రికను స్థాపించిన తొలి దళిత పత్రికా సంపాదకుడు ధర్మన్న.

వైద్య విద్వాన్ పరీక్ష పాసై, తన సేవలను పేదలకు, దళితులకు విస్తరించాడు. 1935 నుండి అఖిలాంధ్ర మహాసభల్లో పాల్గొని దళిత విముక్తికై కారణభూతమైన పునాది ఉపరితల సమస్యలను కూలంకషంగా, ఉద్వేగంగా సమాజానికి తెలియపరిచాడు. పేదరికం, నిరక్షరాస్యత, అజ్ఞానం పునాదులుగా ఉన్న దళిత నేపథ్యానికి స్వయంఉపాధి, అక్షరాస్యత, విచక్షణా శక్తిని అందించడానికి తెలంగాణలో "ఆది హిందూ సంస్థ"ను స్థాపించి దళితుల అభ్యున్నతికి పాటుపడుతున్న భాగ్యరెడ్డి వర్మను తూ.గో. జిల్లా, తాళ్ళరేవు సభకు పిలిచి ఉపన్యాసాలిప్పించడమే గాక తాను సైతం తెలంగాణకు వెళ్ళి అనేక ఆలోచనాత్మక ఉపన్యాసాలతో దళితుల ఆలోచన స్థాయిలను మార్చడానికి కంకణం కట్టుకున్న ధర్మన్న అసలు సిసలైన మార్క్సిస్టు వాది.

ఇంత గొప్ప దార్శనికుడిని సాహితీ సమాజానికి అందించిన గ్రంథం "దళిత ఉ ద్యమ వైతాళికుడు - కుసుమ ధర్మన్న కవీంద్రుడు" దీని రచయిత చిత్తజల్లు వరహాలరావు. CV గా సాహితీలోకంలో సుప్రసిద్ధులైన వీరు 1970ల్లోనే ప్రగతిశీల శక్తులకు, హేతువాదులకు అక్షరాయుధాలను అందించడమే గాక, కుసుమ ధర్మన్న లాంటి అభ్యుదయ భావాలు గల దార్శనికునిపై గ్రంథం రచించడం దళిత సాహిత్య చరిత్రలోనే మరో మేలిమలుపు. ఆధునిక దళిత సాహిత్యం పురాణాల నుండి బయట పడలేదన్న విమర్శను ఎదుర్కొంటే ధర్మన్న ఆ రోజుల్లోనే మనువాదాన్ని దాటి, దళితుల శ్రమదోపిడి, ఆర్థిక స్థితిగతుల గురించి ఆలోచించి,

 ISBN: 978-93-340-2436-4

బ్రాహ్మణేతర వర్ణాల దోపిడిని తొలిసారి గుర్తించి, దళిత కూలీల ఆర్థిక స్వావలంబన కోసం 1945 లోనే హరిజన బ్యాంకును స్థాపించిన తొలి దళిత ఆర్థిక వేత్త కుసుమ ధర్మన్న. "నిత్య జీవితంలో తాను, తనలాంటి వారు వందలయేళ్ళ తరబడి అనుభవించిన జుగుప్సాకరమైన, అసహ్యమైన, నీతిమాలిన, అమానుషమైన అవమానాల రక్తకన్నీటిలోంచి జాలువారిన కవితా బిందువే హరిజన శతకం" అని చిత్తజల్లు వరహాలరావు గారు పలవరించారంటేనే ధర్మన్న హరిజన శతకంలోని వస్తు వైలక్షణ్యం అర్థమవుతుంది.

హరిజనులకు ఇలాంటి దుస్థితి కలగడానికి ఎవరు కారణం? ఈ కష్టాలెలా వచ్చాయి? ఎంతకాలం వెలి అనే చింతలో కుంగిపోవడం? అసలు ఎవరు నువ్వు? అని కార్యకారణ సంబంధాలను ప్రశ్నిస్తున్నాడు ధర్మన్న, కులం, స్థలం, గుణగణాలు, ధనం, బలం, బ్రతుకు దారి అన్నీ ఉండి బానిసలా ఎందుకు పరువు పోగొట్టుకుంటున్నావు? అని తీవ్ర స్వరంతో అడుగుతున్నాడు.

ఆసియా నుండి వలస వచ్చిన బ్రాహ్మణులు నీ స్థానానికి వచ్చి నిన్నే అడవుల పాలు చేసి, తిండి లేకుండా బిచ్చమెత్తేలా చేసి నీచకులస్థులు, మాలవారు, పంచములు, ఆది మాంధ్రులు అని, చెప్పరాని మాటలతో ఊరికి దూరం పెట్టారా? బాధలు పెట్టి బానిసత్వంలో ముంచి మతం మంటగలిసేలా చేశారా? ఎద్దులాగా, ఎనుములాగా రైతుకు సాయపడితే ధాన్యం కొలిచేటపుడు కూడా అన్యాయం చేశారా? నీ కషార్జితం తాను తింటూ, గింజలివ్వడానికి గింజుకుంటూ, గంజి కూడా పోయకుండా మలమలా మాడుస్తూ తన భోగపత్నులకు మాత్రం ధాన్యాన్ని ధార పోసే రైతునా నువ్వు కొలిచేది?

అప్పులిచ్చి రచ్చల్లో నిలబెట్టి పదికి పాతిక పద్దు రాసి, అవసరమైనప్పుడల్లా పనులు చేయించుకునే రైతునా నువ్వు నమ్మేది ? అంటరానివాడు, అధమాధముడు, చెనటి, క్షుద్రుడు అని నిన్నన్నది ఎవరయ్యా! సుఖంగా బతకడానికి లేదు, ఊరువాడల్లో ఉండడానికి లేదు. తనకు పెద్ద కుంచంతో నీకు చిన్న కుంచంతో కొలుచుకునే రైతు నీకు దొర ఎలా అయ్యాడయ్యా! నీ కష్టార్జితమంతా తాను అనుభవిస్తూ, నీ గుణం, నీధనం నాశనం చేసి కూడు తినే రైతు గొప్పవాడెలా అవుతాడు? కండకావరంతో నిన్ను చెప్పు తీసుకొని కొట్టేవాడా రైతు? తోటలు, దొడ్లు, పొలాలు అన్నీ కంటికి రెప్పలా కాపాడే నిన్ను బాగు ఓగు లేకుండా ప్రేమతో ఏనాడు పిలవలేదే? పడుపు వృత్తి చేసుకొనే గడనకత్తెనైనా గౌరవిస్తారు గాని రక్తమాంసాలను రైతుల కమ్ముకుంటూ శక్తి, భుక్తి, ముక్తి లేక చచ్చే నీవు లేకుండా ఒక నిముషమైనా గడపలేని భూస్వామి దగ్గర పడి ఉండడమెందుకు?

అంటూ ఈ సందర్భంలో "మానవులు తక్కువ ఎక్కువ అని తమలో తాము

 ISBN : 978-93-340-2436-4

అనుకుంటారు గాని ఆలోచిస్తే తక్కువెవరు? ఎక్కువెవరు? మూలతత్వం తెలుసుకోకుండా తర్కాలాడతారు" అని విశ్వవ్యాపకమైన అద్వితీయశక్తి మార్మికతను స్పష్టం చేసిన శాస్త్రజ్ఞాని ధర్మన్న.

కుష్ఠురోగుల్ని, సానుల్ని, జారులను గౌరవించే సమాజం పంచముడని దళితులను అవమానించడం పట్ల కవి తన ఆగ్రహాన్ని వెళ్ళగక్కుతాడు. దళితులు పండించిన పంటలు, పాలు, కాయగూరలు, పళ్ళు పనికివస్తాయి. కుక్కని, కోతిని, పిల్లిని ప్రేమతో చేరదీస్తారు. దయలేకుండా అంటుదోషమని నిన్ను చీదరించుకుంటారు. పాముని విష్ణువు పాన్పుగా, సుబ్బారాయునిగా కుక్కను భైరవునిగా, కోతిని హనుమంతునిగా, ఎలుకను వినాయక వాహనంగా, పందిని విష్ణువుగా భక్తితో పూజించే జనులు మాత్రం సాటి నరులను తాకి మైలపడతామని గగ్గోలు పెడతారు. ఊరబావిలో నీరు తోడరాదు. గుడికి పోయి దైవాన్ని దర్శించకూడదు. ఎక్కడో దక్షిణాఫ్రికాలో నీగ్రోల బాధను చూసి ఏడుస్తారు గాని

పక్కనున్న నిన్ను తొక్కి పెడతారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలి కదా! అని చురకలు వేశాడు.

తెల్లదొరలో నల్లదొరలో ఎవరూ ఆదరించరు. స్వయంగా ఎవరు కష్టపడతారో వారే సుఖంగా ఉంటారు అని సమాజ నిజస్వరూపాన్ని, శ్రామిక శక్తి సౌభాగ్యాన్ని, "పోరాడితే పోయేదేమీలేదు బానిస సంకెళ్ళు తప్ప" అన్న సూక్తిని అంతర్లీనంగా ఆకాంక్షిస్తాడు.

కల్లు తాగి పిల్లా జల్లల్ని ఏడ్పించి, ఇల్లు, ఒళ్ళు గుల్ల చేసుకోవడమెందుకు? చెదిరిపోయిన కులాన్ని కుదురు చేసి ఆత్మగౌరవాన్ని చాటమని, జాతిలో ప్రేమను పెంచి కష్టసుఖాల్లో కలిసి మెలిసి ఉండి సాంఘిక సమరం చేద్దామని

గుండెల నిండా, కళ్ళ నిండా ఉషోదయపు ఆశలతో గేయ శంఖారావం పూరిస్తాడు.

"సమాజాభివృద్ధి అనేది ఒక సైన్స్. గతి తార్కిక చారిత్రక భౌతిక వాదం ఆ సైన్స్ యొక్క మూల స్వరూపం" అన్న ప్రఖ్యాత మార్క్సిస్టు మేధావి మారిస్ అభిప్రాయం నూరుపాళ్ళు నిజమైతే, సమాజంలో ఒక భాగమైన దళితుల శ్రమదోపిడిని నిర్లజ్జగా దోచుకుంటూ, వారిని మాత్రం చీదరించుకుంటూ, జాతి అభివృద్ధి నిరోధకులైన అగ్రవర్ణాల దురహంకారాన్ని హేతుబద్ధంగా తార్కికంగా, భౌతికవాద దృష్టిలో పునాది సిద్ధాంతాలైన కులం, మతం, ధనం, రాజకీయాల ప్రాతిపదికగా మొలిచిన ఉపరితల శాఖలు కళలు, కవిత్వం, సాంస్కృతికాంశాలను సూటిగా ప్రశ్నించిన వందేళ్ళ క్రిందటి దళిత ఆర్థిక కళా తత్త్వవేత్త కుసుమ ధర్మన్న కాక మరెవరు?

 ISBN: 978-93-340-2436-4

తరతరాలుగా చరిత్రగతిలో అవిద్యతో, అజ్ఞానంతో, పేదరికంతో, నిరక్షరాస్యతతో, మూఢనమ్మకంతో వెనుకబడి ఉన్నటువంటి దళిత జాతిని భౌతికమైనటువంటి దృష్టితో చూసి అంటే ఆ దళితజాతి కష్టాలకు, ఆ దళితజాతి దుస్థితికి కారణభూతమైనటువంటి రాజకీయ, సామాజిక, మత, సాంఘిక వనరులను భౌతిక దృష్టితో చూసి దానికి తర్కబద్ధంగా మేలుకొనమని, విద్యను, జ్ఞానాన్ని, ఉద్యోగాలను, ఆరోగ్యాన్ని, సంపదలను, సౌఖ్యాన్ని అందిపుచ్చుకోమని అందరికంటే ముందుగా ముందంజ వేయమని తన సాహిత్యం ద్వారా ప్రభోదించినటువంటి కుసుమ ధర్మన్న అసలు సిసలైన మార్క్సిస్టువాది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**ఆధార గ్రంథాలు :**


1. దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు - సి.వి. రచనలు.
2. దళితుల ఆత్మగౌరవ జయభేరి - కుసుమ ధర్మన్న కవి (వ్యాసం) డా॥ శిఖామణి, ఆచార్యులు, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. తెలుగు సాహిత్యం - చారిత్రక నేపథ్యం. దళిత సాహిత్యం - సామాజిక - తాత్విక భూమిక (వ్యాసం) ఆచార్య ఎండ్లూరి సుధాకర్.
4. గతి తార్కిక భౌతిక వాదం - ప్రజాశక్తి బుక్ హౌస్ - ప్రొ॥ మారిస్
5. గతి తార్కిక చారిత్రక భౌతికవాదం - జె.వి. స్టాలిన్
6. చారిత్రక భౌతికవాదం - జక్కా వెంకయ్య.

 ISBN : 978-93-340-2436-4

# 36 బహుముఖ ప్రతిభా శాలి - కుసుమ ధర్మన్న

**డా. ఆర్. జానకిరావు**
అసిస్టెంట్ ప్రొఫెసర్,
సోషల్ వర్క్ విభాగము,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.

**ప్రవేశిక :**

ఆధునిక తెలుగు సాహిత్యంలో ధ్రువ తారగావెలిగిన శ్రీ కుసుమ ధర్మన్న సంఘ సంస్కర్తగా, గొప్ప ఉద్యమ నాయకునిగా పరిచయమైన సాహితీవేత్త. శ్రీ కుసుమ ధర్మన్న పేరు వినగానే మాకొద్దీ నల్లదొర తనము, అనే గేయం స్ఫురిస్తుంది అంతే గాకుండా దళితోద్యమ నాయకుడిగా నిలబడి హరిజనోద్ధరణకి కలం పట్టి హరిజన శతకాన్ని వ్రాసి, దళితుల ఆవేదనను వ్యక్తం చేసిన సమతావాది మరియు పేదరికంతో అనేక సమస్యలతో, వేదనపడే బాధపడే ఇతర కులాల అభ్యున్నతికి కృషి చేసిన బహుజన వాది.

**కవి పరిచయం :**

కుసుమ ధర్మన్నగారు క్రీ.శ. 1884లో రాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపు పేటలో వ్యవసాయ కూలీలైన కుసుమ వీరాస్వామి, నాగమ్మ దంపతులకు జన్మించారు. వీరు ఆది ఆంధ్ర జూనియర్ ఎలిమెంట్ స్కూలులో 5వ తరగతి వరకు చదివి తరువాత థర్డ్ ఫారం చదివి ఆయుర్వేదంలో వైద్య విద్వాన్ పట్టా పొందాడు. వీరికి తెలుగు, సంస్కృతము, ఆంగ్లము, హిందీ, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం ఉంది.

**సాహితీవేత్తగ ధర్మన్న:**

తొలి తెలుగు దళిత కవి, వ్యాసకర్త, వక్త, ఉద్యమకారుడు, సాహితీ కోవిదుడు, ఆంగ్ల–ఆంధ్ర భాషల్లో పండితుడు. వీరు "మాకొద్దీ నల్లదొరతనం" గేయరచయితగా ప్రసిద్ధులు. ఇతర అణగారిన వర్గాలను, సంఘాన్ని సంస్కరించాలనే దృక్పథంతో చాలా రచనలు చేసారు.

1. నిమ్నజాతి తరంగిణి
2. మధ్య పాన నిషేధం
3. అసుర పురాణం పద్య కావ్యం
4. అంటరాని వాళ్ళం
5. హరిజన శతకం
6. అంటరాని వాళ్ళం

7. హరిజన శతకం
8. మాలకాకి

మొదలగునవి ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో కవిగా, రచయితగా కుసుమ ధర్మన్న స్థానం అద్వితీయమైనది. శ్రీ ధర్మన్న గారు 1936లో విజయనగరంలో జరిగిన ఆది ఆంధ్ర మహాసభ సమావేశానికి కుసుమ ధర్మన్న అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అధ్యక్ష ప్రసంగం చేస్తూ "సామ్యవాదాన్ని సహించని హిందూమతం" అనే శీర్షికతో ప్రసంగం వెలువరించారు. ఈయన నిమ్నజాతి విముక్తి తరంగిణి, వాళ్ళు అంటరాని వాళ్లా, హరిజన చరిత్ర మొదలైన రచనలు చేశారు.

**సంఘసంస్కరణ:**

కుసుమ ధర్మన్న అంబేద్కర్ స్ఫూర్తి పొంది అంటరాని తనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో తపించిన తొలి తెలుగు దళిత కవి. దళితుల జీవితాన్ని కవిత్వంగా రచించిన కుసుమ ధర్మాన్నే తొలి దళిత కవి అని కొన్ని రచనలు ద్వారా నిరూపితమైనది. "దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు" అనే పుస్తకంలో సి.వి. గారు కూడా ఈయన గురించిన సమాచారం అంతగా లభించడంలేదని అన్నారు. 1921లో కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము రాశారు. దళిత వర్గం నుంచి అతి కష్టంమీద చదువుకుని పైకొచ్చి, తిరిగి ఆ చదువును తన జాతి మేలు కోసం వెచ్చించిన అతికొద్ది మంది దళిత విద్యావంతుల్లో 'కుసుమ ధర్మన్న కవి' ఒకరు. దళితులు, బ్రిటిషు పాలనలో కంటే, స్థానిక అగ్రవర్ణాల పాలనలో మరింత నలిగిపోతారని మొదటసారిగా లోకానికి చాటింది కుసుమ ధర్మన్నే, కాంగ్రెస్‌లో ఉంటూనే 'మాకొద్దీ నల్లదొరతనము' అంటూ గళం విప్పిన ధైర్యశాలి. దళితులు అనుభవిస్తున్న హృదయ విదారక మయిన దుస్థితిని తన రచనల ద్వారా తెలియజేసారు.

**మాకొద్దీ నల్లదొరతనము దేవా!**
**మాకొద్దీ నల్లదొరతనము...**
**మాకు పదిమందితో పాటు పరువు**
**గలుగకయున్న మాకొద్దీ నల్లదొరతనము...** అంటూ కుసుమ ధర్మన్న గారు నల్ల దొరలు చేసే అవినీతిని, దోపిడీని తన రచనల ద్వారా ప్రజలకు తెలియజేసారు. తెలుగు దళిత సమాజంలో వైతాళికుడయిన ధర్మన్న నిమ్న జాతిని జాగృతం చేసిన వైనాన్ని వివరించారు. కుసుమ ధర్మన్న రచనలోని దళిత దృక్పథాన్ని వెలికి తెచ్చేందుకు చేసిన గొప్ప ప్రయత్నం ఈ రచన. మాకొద్దీ నల్ల దొరతనమంటూ, మాకొద్దీ తెల్లదొరతనమని తెల్లదొరలను పారద్రోలేందుకు పోరాడే వారినే ఎదిరించి నిలిచి, నల్లదొరల దాష్టీకాన్ని

 ISBN : 978-93-340-2436-4

ఎండగట్టి. కల్లు సారాయి మానమంటూ దళితులకు మద్యపాన నిషేధాన్ని బోధించారు. హరిజనులను ఉత్తేజపరిచేందుకు హరిజన శతకాన్ని రచించారు.

కుసుమ ధర్మన్న గారి కృషిని మరింత శ్రద్ధగా వెలికి తీయవలసిన బాధ్యత మన అందరిమీదా ఉంది. "మాలకాకి" అనే రచన ద్వారా దళిత మాల కుల వేదనను తెలియజెప్పారు. ధర్మన్న జాషువ గబ్బిలాన్ని ప్రతీకగా తీసుకున్నట్లే వీరు మాలకాకి ప్రతీకగా తీసుకున్నారు. మాలకాకి అంటే కాకుల్లో ఒకజాతి, లావుగా నల్లగా ఉండి అడవుల్లో, కొండల్లో ఉండేది. నెల్లూరు జిల్లాలో విన్నమాల, అందలమాల ఊళ్ళ పేర్లలో అడవి, కొండ ప్రస్తావనేఇందుకు కారణం. తన కలంతో, గళంతో ఏకకాలంలో అంటరానితనంపై పోరు సలిపిన తొలి తరం దళిత కవి కుసుమ ధర్మన్న. సంఘసంస్కరణ అభిలాష కలిగిన ఆయన అంబేద్కర్ నుంచి స్ఫూర్తి పొందారు. మరియు సమాజ మూఢ విశ్వాసాలు, అర్ధం లేని ఆచార సాంప్రదాయాలు మొదలగు వాటి గురుంచి తనదైన శైలిలో సంస్కరణ గళం వినిపించారు.

**ఉద్యమస్ఫూర్తి:** ధర్మన్న గారు గుడివాడ సేవాశ్రమం వ్యవస్థాపకుడు గూడూరి రామచంద్రరావు వద్ద, సీతానగరం ఆశ్రమం, చాగల్లు ఆనందాశ్రమాలలో కొంతకాలం వుండి తన ఉద్యమస్ఫూర్తిని మెరుగుపరచుకున్నారు. ఆలోచనా విధానం కాలంతో పాటు పరిపక్వత చెందింది. చదువుకునే రోజుల్లోనే సంఘసంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం చేత ప్రభావితుడై. తన జాతి హీనత్వంతో అవమానంతో అమానుషంగా, అంటరాని తనం, సామాజిక వివక్షలతో, బాధపడుతున్న దళితులను చైతన్య పరచి దళిత జీవనోద్ధరకుడుగా చరిత్రలో శాశ్వతముగా నిలిచిపోయిన మహానుభావుడు శ్రీ కుసుమ ధర్మన్న గారు.

**గాంధేయవాదం:** శ్రీ ధర్మన్న తొలి రోజుల్లో గాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. మహాత్మా గాంధీ తన జీవితాన్ని సత్యశోధనకి అంకితం చేసిన విధానం తో ధర్మన్న గారు ఆకర్షించబడ్డారు. తను చేసిన తప్పుల నుంచి దిద్దుకోవటం, అయన సత్యంతో చేసిన ప్రయోగాలు సత్యశోధనకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. గాంధీజీ సత్యాగ్రహానికి మూలాలు వైదిక ఆదర్శాలైన ఆత్మ సాక్ష్యాత్కారం, బౌద్ధ, జైన విలువలైన అహింస, శాఖాహారం, విశ్వవ్యాప్తమైన ప్రేమ. అలాగే క్రిస్టియన్-ముస్లిం విలువలైన సమానత్వం, విశ్వసోదరభావం, ఒక చెంపపై కొడితే మరొక చెంప చూపెట్టడం కూడా సత్యాగ్రహానికి మూలాలు. వ్యక్తి అతి ముఖ్యమైన పోరాటం తన సొంత భయాలు, అభద్రతాభావాలను అధిగమించడంగా మహాత్మా గాంధీ పేర్కొన్నాడు. సామాన్యునికి సత్యాగ్రహం భుజబలం కన్నా గొప్ప నైతిక శక్తిని ఇస్తుంది. సత్యాగ్రహాన్ని "సార్వత్రిక శక్తి"గా కూడా వర్ణించవచ్చు. సత్యాగ్రహానికి

 ISBN: 978-93-340-2436-4

అందరూ సమానమే. బంధువులు , అపరిచితులు, యువకులు, వయసులో పెద్దవారు, స్త్రీ పురుషులు, స్నేహితులు, శత్రువులు అందరూ సత్యాగ్రహానికి సమానమే. గాంధీజీ సూచించిన "అసహనం, ఆటవికత, ఒత్తిడి ఉండకుడదు. నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తి తీసుకురావటానికి అసహనం పనికిరాదు. అసహనం కార్యాచరణలో వ్యక్తి నమ్మకాన్ని ఒమ్ముచేస్తుంది. 'దురావస్త చట్టం' అనే సిద్ధాంతం ప్రకారం ఓర్పుతోకూడిన బాధ, బాధకు అంతం. అంతంలో వ్యక్తి లేదా సమాజం పురోగతిని సాధిస్తుంది. సత్యాగ్రహం ఆయుధంగా పోరాడిన శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ ఉద్యమాలతో స్ఫూర్తి పొంది శ్రీ ధర్మన్న గారు ప్రేరిపితులై దళిత బహుజన పీడిత ప్రజల అభ్యున్నతికి తనదైన శైలిలో ఉద్యమ రూపకల్పనచేసి సమాజములో అగ్ర వర్ణ అహంకారాన్ని దుయ్యబట్టారు. 1930వ దశకంలో కాంగ్రేసు పార్టీ చొరవతీసుకొని హరిజన సేవా సంఘం యొక్క ఆంధ్ర విభాగాన్ని ప్రారంభించింది. మహాత్మా గాంధీ అంటరాని కులాల ప్రజలకు హరిజనులు అని పేరుపెట్టడంతో అది ప్రాచుర్యం పొందింది. క్రమేణా ఆది ఆంధ్ర నాయకులంతా కాంగ్రేసు స్థాపించిన హరిజన సేవా సంఘంలో భాగమైనా కుసుమ ధర్మన్న వంటి కట్టుబడిన నాయకులు మాత్రం దాన్ని వ్యతిరేకించారు. నిమ్న జాతుల అభివృద్ధి విషయంలో మహాత్మా గాంధీ ఆశయాలను నమ్మి గౌరవించినా, ఆచరణలో లోపాలను ధర్మన్న సహించలేదు. గాంధీ యొక్క ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం వచ్చి హరిజన నాయకులతో సమావేశం నిర్వహించిన సందర్భంలో, ధర్మన్న ఆ సమావేశాన్ని బహిష్కరించాడు. 'హరిజన నాయకులైతే మా పేటలకు వచ్చి యిక్కడ మాట్లాడాలని' కబురుపెట్టి గాంధీని, ఇతర కాంగ్రెస్ నాయకులను తమ పేటకు రప్పించి, ఆతిథ్యమిచ్చి దళితుల గౌరవాన్ని చాటి దళిత ఆత్మ గౌరవం ప్రపంచానికి వినిపించాడు.

**అంబేద్కర్ భావజాలం:**

శ్రీ ధర్మన్న గారు దళిత జాతి విముక్తి కోసం అంబేద్కర్ బాటలో నడిచారు ఆయన ఆంధ్ర రాష్ట్రంలో గౌరవ అంబేద్కర్ గారి ఆలోచనలు సిద్ధాంతాలను ప్రచారం చేయటమే కాకుండా అంబేద్కర్ భావజాలం అందరకు తీసుకువచ్చింది మొదటగా శ్రీ కుసుమ ధర్మన్న గారే ప్రథములు. ఈ క్రమంలోనే జయభేరి పత్రికను స్థాపించి తొలి దళిత సంపాదకుడిగా గుర్తింపు పొందారు. అనేక అఖిలాంధ్ర మహాసభల్లో పాల్గొన్న ధర్మన్న ఆలోచనాత్మక, ఉద్వేగ పూరిత ప్రసంగాలతో ఎందరినో ఉద్యమం వైపు నడిపించారు. అంబేద్కర్ చిన్నతనంలోనే అంటరానితనాన్ని ఎదుర్కొన్నాడు. దేవాలయలలో హరిజనులకు ప్రవేశం వుండాలన్నా తదనుగుణంగా చర్యలు చేపట్టాలని అంబేద్కర్ విమర్శించారు. అంటరాని కులాలు ఆర్థికముగా బలపడనిదే, రాజకీయాధికారము పొందనిదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారము దొరకదని అంబేద్కర్ భావించారు. ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం

వల్ల ఎటువంటి పోటీలేని ఆర్థిక వ్యవస్థ భారతసమాజములో ఉన్నదని ఆయన సమర్థించాడు. అయితే అంటరానివారుగా భావిస్తున్న కులాల వారు తమ ఆత్మగౌరవమును త్యాగము చేస్తూ సమాజ బాగు కోసం తాము చేసే వృత్తులను చేస్తున్నారని, అటువంటి వారిని ఇతర వర్ణముల వారందరూ గౌరవించాలని పేర్కొన్నాడు. ఇలా కుల, అంటరానితన సమస్యకు ఆర్థికముగా బలపడనిదే, రాజకీయాధికారము పొందనిదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారము దొరకదని అంబేద్కర్ భావించారు. ధర్మన్న అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితుడై అంబేద్కర్ గురించి ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారం చేశాడు. ఆంధ్రదేశానికి అంబేద్కరును తొలిగా పరిచయం చేసింది ఈయనే. అణగారిన జాతులకు గొంతుకనిస్తూ, అంబేద్కర్ భావాలను ప్రచారం చేయటానికి జయభేరి అనే పక్ష పత్రికను స్థాపించారు.

**దళితోద్యమము:**

నాటి సమాజం లో నెలకొన్న అంటరాని తనము ముఖ్యంగా దిగువ కులాల అణచివేత ను చూసి జాతీయోద్యమ కాలంలో దళితుల కోసం ప్రపంచానికి పొలికేక వేసిన ధీశాలి శ్రీ కుసుమ ధర్మన్నతన జీవితాన్ని ఇటు దేశానికి, అటు దళిత జాతికి అంకితం చేసిన ధర్మన్న 45 ఏండ్లకే దివికెగిశారు. సాంఘిక, సాంస్కృతిక, సాహితీ రంగాలపై కుసుమ ధర్మన్న వేసిన ముద్ర సామాన్యమైనది కాదు. బహుముఖీనమైన ధర్మన్న ప్రతిభ ప్రధానంగా అనేక మార్గాల్లో విస్తరించింది దళిత పోరాట చరిత్రలోనూ ఆయనకు ఆయనే సాటి. తన రచనల రూపంలో దళిత జాతి సంర క్షకుడిగా ధర్మన్న ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారనడంలో ఎటువంటి సందేహం లేదు. వైద్యరంగం, సాహిత్య సృజన, కళా రంగం, పత్రిక నిర్వహణ, వక్తృత్వం. వీటితో ధర్మన్న ఆనాటి ఆంధ్రా సమాజాన్ని, ముఖ్యంగా దళిత జాతిని ఉ త్తేజపరిచారు జాతీయోద్యమ అనుభవాలను దళితోద్యమంగా మార్చి దళితులకు సామాజిక న్యాయం జరిగేలా కృషి చేయడమే కాకుండా దళితాభివృద్ధికి మరియు ఇతర వెనుకబడిన కులాల అభివృద్ధికి ప్రయత్నం చేసారు. తను చేసిన ఉద్యమము ఆంధ్ర దేశములో ఏంతో ప్రాచుర్యం పొంది నాటి నేటి సమాజములో అనేకమంది అభివృద్ధి పదంలో పయనించ డా నికి ఈనాడు మెరుగైన ఫలితాలు సాధించి అనుభవించడానికి ధర్మన్న గారు సేవా నిరతి వలెనే.

**రాజకీయ ప్రవేశం:**

తను నమ్ముకున్న సిద్ధాంతాలకు అనుగుణంగా అణగారిన వారికి న్యాయం జరగాలని ధర్మన్న గారు రాజకీయ రంగ ప్రవేశం చేసి కాంగ్రేసు సభ్యుడిగా కొనసాగినటువంటి వారు.రాజమహేంద్రవరం తాలూకా బోర్డుకు కాంగ్రేసు పార్టీ తరఫున సభ్యునిగా ఎన్నికై కూడా బోర్డు ప్రెసిడెంటు ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థికి వోటు వేయని స్వతంత్రుడు.శ్రీ

కుసుమ ధర్మన్న గారు దళితుల అభ్యున్నతికి రాజకీయాలలో జోక్యం చేసుకున్న వైనాన్నినిరసించి తనదైన శైలిలో ధైర్యంగా ఎదుర్కొన్న ధీరోదాత్తుడు.

**పత్రికా సంపాదకులు:**

తాను అనుకున్న ఆశయాలు ప్రజలకు చేరవేయుటకు వార్తాపత్రికను స్థాపించారు అదే జయభేరి పత్రిక సంపాదకుడు గా రచనా కృషిని, గేయ రచనలు చేసి ఆలపించిన తీరును, ఉపన్యాసాలతో ఉద్రూతలూగించిన విధానాన్ని మనకు దళిత చైతన్యం కోసం ధర్మన్న పడిన తపన ఈయన 1933లో వ్రాసిన హరిజన శతకంలో చూడవచ్చు. "ఆత్మ గౌరవంబు నలరంగ చాటరా" అని ఉద్బోధించిన ధర్మన్న కవిగారు వర్ణధర్మం పేరిట భారతీయ సమాజంలో నెలకొని ఉన్న హెచ్చు తగ్గులను నిరసించిన జాతీయ వాది. సమకాలికులు ఆయనను 'ఆది ఆంధ్ర కవి సార్వభౌమ'గా పేర్కొన్నారు. 921లో గరిమెళ్ల సత్యనారాయణ "మాకొద్దీ తెల్ల దొరతనము" అనే గేయాన్ని వ్రాశాడు. అదే సంవత్సరం కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము అనే గేయాన్ని రచించాడు. ఆ కాలంలో స్వాతంత్ర్యోద్యమ, హరిజనోద్యమ వేదికలపై ఈ రెండు గీతాలు మారుమ్రోగేవి. స్వాతంత్ర్యం వస్తే తెల్లదొరల స్థానంలో నల్లదొరలు వస్తారు. అంటరాని తనం కొనసాగుతూనే ఉంటుంది. ఎప్పుడైతే అస్పృశ్య భావన తొలగిపోతుందో అప్పుడే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం అని ఇతడు భావించి ఈ గేయాన్ని రచించాడు. నాటి సమాజంలో నెలకొని వున్నా వున్నత కులాల దోపిడీ మరియు అంటరాని తనము పెత్తందారి వ్యవస్థ దోపిడిని సామాజిక మూడ నమ్మకాలు విగ్రహారాధన, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి సామాజిక రుగ్మతలను పారద్రోలడం కొరకు శ్రమించిన కృషీవలుడు శ్రీ ధర్మన్న గారు.

**వైద్యసేవ :** వృత్తి రీత్యా ఆయుర్వేద వైద్యుడు అయిన ధర్మన్న గారు పేదలకు ఉచిత వైద్యం చేసి ప్రజారోగ్యంకి ఏంతో కృషి సల్పిన మహానుభావుడు. ఆరోజుల్లో అంటూ వ్యాధులు ప్రబలి పేదరికంతో వున్న ముఖ్యంగా దళిత బహుజన జనాంగము అనారోగ్యం పాలవ్వడం చూసి చలించిన వీరు తన సొంత ఖర్చులతో ఉచిత వైద్య సహాయం చేసి, పేద దళితులకు సేవ చేసిన ఆయన ప్రజా వైద్యుడి గానూ పేరొందారు.

**ఆదర్శం :** శ్రీ కుసుమ ధర్మన్న గారు శ్రీ కందుకూరి వీరేశలింగం గారు చేసే స్థానిక సంస్కరణ కార్యక్రమాలు మరియు గాంధీజీ జాతీయోద్యమము మరియు గౌరవ డా॥ బి.ఆర్. అంబేద్కర్ గారి భావాలకు ఏంతో ఆకర్షితులయ్యారు. శ్రీ ధర్మన్న గారు సాంఘిక దురాచార, దళిత ఉద్ధరణ బాంధవుడుగా ఖ్యాతి గడించిన వ్యక్తి. ఇతను హైదరాబాద్‌లో ఉన్న దళిత ఉద్యమ కారులైన భాగ్య రెడ్డి వర్మ, బిఎస్. వెంకట్ రావు,

 ISBN : 978-93-340-2436-4

అరిగే రామస్వామి లాంటి నాయకులతో అనునిత్యం సంబంధాలు ఏర్పర్చుకొంటు ఒక బలమైన రచయితగా ఎదగడం గమనించవచ్చు.

**ముగింపు:** దళితుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేందుకు ధర్మన్న వృత్తిరీత్యా వైద్యుడయిన, గాయకుడయ్యాడు. రాజకీయ నాయకుడయ్యాడు. పాత్రికేయుడయ్యాడు. అందుకే ధర్మన్న ఆశయాలను, ఆలోచనలను, ఉద్యమ స్ఫూర్తిని, సామాజిక సేవను, సమతావాదాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. ధర్మన్న గారు ఒక మతానికి ఒక కులానికి సంబంధించిన వ్యక్తీ ఎన్నటికి కాదు ఆయన గొప్ప వున్నత విలువలు కలిగిన మానవతావాది, నేటి తరానికి రాబోవు తరాలకు కుసుమ ధర్మన్న గారి జీవన ఆదర్శ విధానాన్ని వారి యొక్క భావాలు అందజేయాలని నా అభిమతం.

ఆధార గ్రంథాలు:

1. హేమలత, తెలక పల్లి రవి (2016) “కుసుమ ధర్మన్న – మాకొద్దీ నల్లదొరతనము”
2. వి.క్రిష్ణయ్య(2016) సాహిత్య ప్రస్తానం
3. కుసుమ ధర్మన్న “హరిజన శతకము”

 ISBN: 978-93-340-2436-4

# 37 బహుముఖ ప్రజ్ఞాశాలి - కుసుమ ధర్మన్న కవి

డాక్టర్. కొంకె గౌరీశ్వరరావు
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం
నెల్లూరు.

**పరిచయం :**

భారత దేశంలో అంటరాని జాతులు బానిసత్వంలో మగ్గిపోతున్న రోజులలో ఆంగ్లేయుల రాకతో నూతన విద్యావిధానం అమలలోకి రావడంతోనే సాంఘిక వ్యవస్థలలో మార్పులు సంతరించుకున్నాయి. క్రైస్తవ మిషనరీలు అంటరాని జాతులను అక్కున చేర్చుకుని వారు స్థాపించిన పాఠశాలలో విద్యనుభోదించి సాంఘిక జ్ఞానం అందించారు. ఈ నేపధ్యంలో వంగదేశంలో మొదలైన బ్రహ్మసమాజ ప్రభావంతో దేశంలో సాంస్కృతిక పునఃర్జీవనోద్యమం ప్రారంభమైంది. తొలితరం విద్యావేత్తలు సంఘసంస్కరణ ఉద్యమాన్ని చేపట్టి సాంఘిక రుగ్మతలను,మూఢ నమ్మకాలను రూపమాపడానికి కందుకూరి ,చిలకమర్తి, రఘుపతి వెంకటరత్నం, మేమూరి రాంజీ పంతులు, గూడూరి రామచంద్ర రావు పంతులు, పిఠాపురం రాజావారు మొలైన వారు ముందుకువచ్చారు. అయినా సంఘంలో అంటరానితనం సాంఘిక అసమానతలు పోలేదు. తొలితరం హరిజన యువకులు స్వయంగా తమను తాము సంస్కారించుకోవాలని నడుం కట్టారు.

కుసుమ ధర్మన్నకవి (క్రీ,శ1998-1948) తొలి దళిత కవి, వ్యాసరచయిత, వక్త,గాయకుడు, జయభేరి వారపత్రిక సంపాదకుడు హరిజన ఉద్యమకారుడు. ఆది ఆంధ్ర ఉద్యమానికి రధసారధి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అనుచరుడు. వృత్తి రీత్యా ఆయుర్వేద వైద్యుడు. సాహితీ కోవిదుడు వైద్య విధ్వాన్ కుసుమ ధర్మన్న కవి రాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపు పేటలో వ్యవసాయ కూలీలైన కుసుమ వీరాస్వామి, నాగమ్మ దంపతులకు జన్మించాడు. ఆదిఆంధ్ర లేబర్ ఎలిమెంటరీ పాఠశాలో 5వ తరగతి వరకు చదువుకున్నాడు అనంతరం థర్డ్‌ఫారం పూర్తిచేసి ఆయుర్వేద వైద్య విద్వాన్ పట్టా పొంది సాధన చేశాడు. తెలుగు, సంస్కృతంతో పాటు ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం ఉంది.

బ్రహ్మసమాజం వ్యవస్థాపకులు సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం ప్రభావం విద్యార్థి దశలోనే కుసుమ ధర్మన్న మీద ప్రభావం చూపింది. సమాజంలో అంటరానితనం, కులవివక్షత, అణచివేతను స్వయంగా అనుభవించిన ధర్మన్న సహించలేకపోయాడు. సంఘంలో స్వేచ్ఛగా తిరిగే హక్కులేదు. అంటరానిజాతులు ఊరికి దూరంగా బ్రతకాలి.

త్రాగడానికి నీళ్ళు చేదుకోవడానికి లేదు. వీధిలో తిరేగే అవకాశంలేదు. అందరిలా పడవ ప్రయాణం చేయడానికి లేదు.కనీసం శ్మశానం లేదు.గుడి దగ్గర బడిదగ్గర నిలడానికి అవకాశం లేదు. పాలేరుగానే జీవితం ముగించాలి. ఈ వ్యవస్థను చూసి చలించిపోయిన ధర్మన్న కులాన్ని నిర్మూలించాలని కుల వ్యవస్థకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించాడు.

**తొలిత కమ్యూనిస్టు ప్రభావం :** ధర్మన్న చదువుకునే దశలో కమ్యూనిస్టు భావజాలంతో ఉండేవాడు.దీనికి ప్రదాన కారణం ఆనాటి సోషలిస్టుల ప్రభావం. ఆనాడు కమ్యూనిస్టులకు అడ్డా కోనసీమ రాజోలు తాలూకా బ్రిటిష్ మిషన్ టైలర్ హైస్కూల్ నరసాపురంలో చదువుకున్న విద్యార్థుల సమైక్య ప్రభావం ఉండేది. అధిపత్య కులాల జమీందారి వ్యవస్థ మీద తిరుగుబాటు ప్రకటించారు కూలీ రెట్లుకోసం పోరాటం చేశారు. 1920– 1933 వరుకు రాడికల్ విద్యార్థి పోరాటం చేశారు. కోనసీమ వేధికగా జరిగింది. గెడ్డాడ బ్రహ్మయ్య, ఉండ్రు తాతాయ్య, గొల్లచంద్రయ్య, కానేటి మోహానరావు, కందికట్ల నాగభూషణం, మహీధరజగన్మోన్, నంబూరి శ్రీనువాసరావు, మొదలైన వారుతో కలసి పని చేశారు.తదనంతరం అంబేద్కర్ భావజాలం వైపు ముగ్గు చూపాడు.

**సంఘసంస్కరణ–ఆది ఆంధ్రాశ్రమం :** కుసుమ ధర్మన్న కవి సాంఘికోద్ధరణకు సామాజిక అవగాహన అవసరమని భావించాడు. గుడివాడ సేవాశ్రమం ప్రబోధకులు గూడూరి రామచంద్రరావు గారి వద్ద కొన్నాళ్లు సంఘసంస్కరణకు చేపట్టవలసిన మార్గాలను సాధన చేశాడు. సీతానగరం ఆశ్రమం, చాగల్లు ఆనందాశ్రమాలలో కొంతకాలం గడిపి ఒక ప్రణాళిక బద్ధంగా తన ఉద్యమస్ఫూర్తిని మెరుగు పరచుకున్నాడు. రాజమండ్రి వచ్చి ఆది ఆంధ్రాశ్రమని నెలకొల్పాడు.ఆది ఆంధ్రులను చైతన్య పర్చడానికి ఈ ఆశ్రమం ఒక వేధికగా నిల్చింది. ఆరోజులలో హరిజనులకు ఇతర కులాల వారు వైద్య చేసేవారు కాదు. ధర్మన్న ఆశ్రమంలో వైద్యసేవలు అందిచేవాడు.ఆరోగ్య ధర్మాలను ప్రచారంచేశాడు. మీరు కల్లు మరియు కల్తీ సారా త్రాగడం మానండి, చచ్చిన గోడ్డుల మాంసంతినకండి, పుగాకు నములుట మానండి. కలుషితనీరు త్రాగకండని ప్రచారం చేసేవాడు. మన ఆశ్రయకుల బంధువులు మాలమాష్టీడీలు దగ్గర వ్యాయామ విద్యలు నేర్చుకొండని ప్రచారం చేశాడు. ప్రాంతీయ హరిజన నాయుకులకు ఈ ఆశ్రమం కుటీరంగా ఉండేది. ఆంధ్రదేశ మంతా ధర్మన్న ఆదిఆంధ్ర ఉద్యమాన్ని ప్రచారం చేశాడు. స్వయంగా ప్రతి గ్రామం పర్యటించారు. హరిజనుల పై దాడులను వ్యతిరేకించాడు. ఆదిపత్యకులాలు జాతిని హీనంగానూ చూడడం అవమానంతో అమానుషంగా అంటరాని జాతులు పట్ల ప్రవర్తించడం ధర్మన్న సహించలేక పోయేవాడు. సామాజిక వివక్షలతో, బాధపడుతున్న అణగారిన వర్గాలను సంస్కరించాలనే అంతిమ లక్ష్యంతో పోరాటం సాగించాడు. ఆయన రచనలను ప్రజలలోకి తీసుకుపోయారు.

 ISBN: 978-93-340-2436-4

హరిజన కీర్తన కారుడుగా ప్రసిద్ధిపొందిన నీలం వెంకన్న (ఏలూరు వంగాయ గూడెం) తో కలసి ఆంధ్ర హరిజనులను చైతన్య పరిచారు.

**ఆది ఆంధ్రోద్యమంలో కుసుమ ధర్మన్న :** నిజాం రాష్ట్ర నాయకులతో సత్సంబంధాలు ఉండేవి. హైదరాబాదు ఆది ఆంధ్ర ఉద్యమ నాయుకులు మాదరి భాగ్య రెడ్డి వర్మ, బి ఎస్. వెంకట్ రావు, అరిగే రామస్వామి వంటివారుతో సంబంధాలు ఏర్పర్చుకున్నారు. మాదరిభాగ్యరెడ్డి వర్మ తో మంచి స్నేహసంబంధాలు ఉండేవి. చాదర్ ఘాట్ లో ఆదిఆంధ్ర భవన నిర్మాణానికి పిఠాపురం రాజావారి చేత ధర్మన్న భాగ్యరెడ్డికి విరాళం యిప్పించాడు. ఆంధ్రలో ఆది ఆంధ్ర సభలకు ఇద్దరు కలసి అనేక సభలకు అధ్యక్షత వహించారు. ఆది ఆంధ్రోద్యమాన్ని నిర్మాణాత్మకంగా నడిపించడంలో కృతకృత్యుడైయ్యాడు ధర్మన్న. నిజాం రాష్ట్ర ఆత్మీయుడు సన్నిహితుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ (1888–1939) ఆలోచనలు ధర్మన్నపై ప్రభావం చూపాయి.

**కవి గా ధర్మన్న :** కుసుమ ధర్మన్నను 1910 లో మాలవాండ్రు పాట 1915లో వచ్చిన నిరుద్ధ భారతం ఆకట్టుకుంది. ధర్మన్న ఈ సూర్పితో నిమ్నకులాల ఉద్దారణ కోసం కలం పట్టాడు. సామాన్యజనులకు అర్ధమైయే విధంగా సరళంగా వాడుక భాషలో మాకొద్దీ నల్లదొరతనం 1921, నిమ్న జాతి ముక్తి తరంగిణి 1921, నిమ్నజాతుల – ఉత్పత్తి 1924, మద్యపాన నిషేధం 1930, హరిజన శతకం 1933, రచనలుచేసి దళితి జాతిని చైతన్యవంతులను చేశారు. ఆయన కవిత్వంలో సాంఘివ్యవస్థలో హరిజను జీవన చిత్రీకరణ కనిపిస్తోంది. దయతో సమాజాన్ని ప్రశ్నించినా ధర్మన్నకవిత్వంలో తిరుగబాటుతత్త్వం కన్పిస్తోంది. 1) అసుర పురాణం పద్య కావ్యం, 2) అంటరాని వాళ్ళం, 3) హరిజన చరిత్ర అలభ్యం. ధర్మన్నతొలిదళిత కవిగా పరిపూర్ణ అర్హత కలిగినవాడు నిమ్నకులాల ఉద్దరణకు కలం పట్టినవాడు. తొట్టతొలి దళితకవి ప్రత్యక్షంగా ఉద్యమాలు నడిపినవాడు – అంటుదోషము మాన రెలా... దాని విడుదలకై యింతపంతాము మీ కేల."... 1921లోనే.. ప్రశ్నించారు. గాంధీ ముందే కుల నిర్మూల పోరాటం చేశాడు ధర్మన్న. సమాజంలో అంటరాని జాతులకు స్వేఛ్ఛ స్వాతంత్ర్యం లేదు. బానిసత్వంలో మగ్గిపోతున్న హరిజనులకు స్వాతంత్ర్యం సిద్దించినా (మనవు) కులవ్యస్థ వేసిన బానిస సంకెళ్ళు పోవువని1921 సం, మాకొద్దీనల్ల దొరతనం రాశాడు. తెల్లవారికి ఉన్న ప్రేమ దయా కరుణ లేదు. మేము మనుషులము కదా... మా శ్రమతో సేధ్యం చేస్తున్నాం, ఈ దేశ నిర్మాణంలో త్యాగం లేదా... మేం దేశ మూల వాసులం ఈ దేశనాగరికత నిర్మాతలం... మమ్మల్ని అంత నీచంగా చూడవలసిన అవసరం ఏమీటీ... ధైర్యంతో సమాజాన్ని ప్రశ్నించిన ధీశాలి. మాకొద్దీ నల్ల దొరతనము. 1921లో గరిమెళ్ల సత్యనారాయణ "మాకొద్దీ తెల్ల దొరతనము"

అనే గేయాన్ని వ్రాస్తే కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము అనే గేయాన్ని రాశాడు. ఆ కాలంలో స్వాతంత్ర్యోద్యమ, హరిజనోద్యమ వేదికలపై ఈ రెండు గీతాలు మారుమ్రోగేవి. స్వాతంత్ర్యం వస్తే తెల్లదొరల స్థానంలో నల్లదొరలు వస్తారని. అంటరాని తనం ఈ వ్యవస్థనుండి పోదు. అస్పృశ్యత అనే భావన ఎప్పుడు తొలగిపోతుందో అప్పుడే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం మని ధర్మన్న భావించి ఈ గేయ రచనకు పూనుకున్నాడు. మాకొద్దీ నల్లదొరతనము దేవా!

**మాకొద్దీ నల్లదొరతనము...**
**మాకు పదిమందితో పాటు పరువు**
**గలుగకయున్న మాకొద్దీ నల్లదొరతనము**
**పన్నెండుమాసాలు పాలేరుతనమున్న**
**పస్తులు పడుతూ బతకాలండీ**
**ఆలికూలీ జేసి తీరాలండీ**
**పిల్లగాడు పశువుల గాయాలండీ**
**పగలూరేయీ పాటుపడ్డానండీ**
**కట్టగుడ్డ కూడు గిట్టదండీ**
**రోగమొస్తే నాగ దప్పదండీ**
**అప్పుతీరదీ చిత్రమేనండీ**

ఈ పాటలు ఆంధ్రదేశాన్ని ఊరుతలూగించాయి.

ధర్మన్న 'మాకొద్దీ నల్లదొరతనము' అంటూ గళం విప్పిన ధైర్యశాలి. రాజమహేంద్రవరం తాలూకా బోర్డుకు కాంగ్రెసు పార్టీ సభ్యునిగా ఎన్నికై ఆ బోర్డు ప్రెసిడెంటు ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థికి ఓటింగ్ చేయలేదు. ఆయన స్వతంత్రుడు తన ధర్మన్నే విశ్వాసించాడు. డాక్టర్ అంబేద్కర్ ఈ దేశంలో జరుగుతున్న అంటరాని జాతుల ప్రతినిధిగా లండన్ రౌండు టెబుల్ సమావేశానికి హజరవ్వక ముందు దళిత నాయుకుల మనోభావాలను తెలుసుకోవడానికి ఆయన పూణేలో భారతదేశ దళిత నాయకుల సమావేశం ఏర్పాటుచేశారు. వివిధ ప్రాంతాల దళితమేధావులు తెలంగాణా నుంచి మాదరి భాగ్య రెడ్డి వర్మకు ఆంధ్ర నుంచి కుసుమధర్మన్నలు హాజరైయారు.ఆ సమావేశంలో దళితుల సమస్యలను అభిప్రాయాలను తెలుసుకున్నారు..ఆనంతరం 1931 మొదటి రౌండు టెబుల్ సమావేశానికి డా.బిఆర్ అంబేద్కర్ దళిత జాతుల ప్రతినిధి పాల్గొని ఆసభకు నివేధించాడు. బ్రిటిష ప్రదాని రామ్ సే మెక్ డొనాల్డ్ అణగారిన వర్గాల ప్రత్యేక ఓటర్లుల పద్ధతిని డా. బి.ఆర్.

 ISBN: 978-93-340-2436-4

అంబేద్కర్ ప్రతిపాదనలను అంగీకరించారు. గాంధీ దీనిని వ్యతిరేకించాడు హిందూవులను వేరుచేయడం మంచిదికాదని విభేధించాడు దీనినే పూణా ఒడబడి. అంతా హిందూవులే అయితే అంటరానిజాతులపట్ల అంత వివక్షత ఎందుకని గాంధీని ప్రశ్నించినప్పుడు, 1933 తరువాత హరిజనోద్యమం గాంధీ చేపట్టడంతో దళిత నాయకులు కాంగ్రెసులోకి తరలిపోయారు.

ఈ నేపథ్యంలో కుసుమ ధర్మన్న హరిజన శతకం రాశాడు. దళిత చైతన్యం కోసం ధర్మన్న పడిన తపన హరిజన శతకంలో ప్రతిఫలిస్తాయి.. "ఆత్మ గౌరవంబు నలరంగ చాటరా" అని ఉద్బోధించిన ధర్మన్న కవిగా వర్ణధర్మం పేరుతో భారతీయ సమాజంలో నెలకొని ఉన్న హెచ్చు తగ్గులను నిరసించిన జాతీయ వాది. సమకాలీకులు ఆయనను 'ఆది ఆంధ్ర కవి సార్వభౌమ'గా పేర్కొన్నారు. డా.బి.ఆర్ అంబేద్కర్ సైద్ధాంతిక భావజాలానికి ప్రభావితుడై డాక్టర్ అంబేద్కర్ భావజాలన్ని ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారం చేశాడు ధర్మన్న. ఆంధ్రదేశానికి అంబేద్కర్ ను మొట్టమొదట పరిచయంచేశాడు. అణగారిన జాతులకు బానిస బ్రతుకుల సమస్యలను జయభేరి పక్ష (1937)పత్రిక ద్వారా ప్రజల ముందుకు తీసుకుపోయాడు

1921 ఆంధ్ర సంఘ గౌరవ అధ్యక్షుడుగా ఉన్నారు.

1925 డిశంబర్ ప్రథమ ఆంధ్రప్రదేశ్ ఆది ఆంధ్రుల ఏలూరు మహాసభకు కుసుమ ధర్మన్నఅధ్యక్షత వహించారు

1932 డిశంబరు 25వ తేదిన పదోవ హరిజన విశాఖపట్నం మహాసభకు కుసుమధర్మన్న అధ్యక్షత వహించారు.

1935 సం రాజమండ్రిలో జరిగిన ఎనిమిదవ ఆంధ్రరాష్ట్ర నిమ్న జాతీయ మహాసభకు అధ్యక్షత వహించారు.

1935 సం రంగూన్ ఆది ఆంధ్ర సంఘం అధ్యక్షులు ఓగూరి నూకయ్య ఆహ్వాన మేరకు ధర్మన్న పాల్గొన్నారు.

1935 ఆంధ్రరాష్ట్ర నిమ్నజాతులు సభకు ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా ఉన్నారు. ముఖ్య అతిథి యం.సి.రాజా

1936-37 కాంగ్రెసువారు శాసన సభ రిజ్వడ్ స్థానం కేటాయించక పోలేదు.

1936 అక్టోబరు21 తేదిన ఆంధ్ర ప్రథమ ఆదిజన సంపూర్ణ స్వాతంత్ర మహాసభ

 ISBN: 978-93-340-2436-4

విజయనగరం సభలకుకుసుమధర్మన్న అధ్యక్షత వహించారు. ఈ ఉద్యమాలకు శాస్త్రీయ దృక్పథం అందించడంలోనూ ధర్మన్న కీలక పాత్రపోషించారు.

1936లో కుసుమ ధర్మన్న నరాలశెట్టి దేవీంద్రుడు, ఉంద్రుసుబ్బారావుతో కలసి కారెంపూడి వీరుల గుడి సందర్శన వీరవిద్యావంతులు, పిడుగు పితాధిపతుల ఘన స్వాగతం.

1937 జయభేరి పత్రిక తగ్గుల బెట్టినందుకు నిరసనగ విద్యార్థులతో నిరసన యోధులు మాలమాష్టీడీలు చేత బలప్రదర్శన చేశారు.

1938 వేమూరి రాంజీపంతులు హరిజన హస్టల్ సందర్శన విద్యార్థులను ఉద్దేశించి కీలకోపన్యాసం చేశారు. విద్యార్థులు మరియు రాంజీపంతులు ఘనసన్మానంచేశారు.

1938 రామచంద్రపురంలో జరిగిన జిల్లా ఆది ఆంధ్ర సభకు అధ్యక్షత వహించారు

1939 హరిజనుల కోలాటాలలోను భజన బృందాలలోను హరిజన కీర్తనలు పాడాలని పిలుపునిచ్చారు. దీనికి పర్యవేక్షకుడుగా హరిదాస్ నిలం వెంకన్నను నియమించాడు.

1940లో గొంత్తెమ్మ,అంకమ్మజాతరలలో కల్లుసారాయిని నిషేదించండని పిలుపునిచ్చారు.

1941లో గిడ్ల వెంకన్నతో కలసి ఊడుమూడి,నరేంధ్రపురం, నేదునూరు పెద్దపేట, మాలల సంప్రదాయ వీరశైవ దేవాలయాల సందర్శన గ్రామస్థుల ఘనస్వాగతం

1942 జాలరంగస్వామి, కుసుమవీరస్వామితో రాజమండ్రిలో హరిజన యువకులకు తాలింఖాణా ఏర్పాటుచేశారు.

రెండవ తరగతి మేజిస్ట్రీటు నియమించబడ్డారు

1942 రెండోవ ప్రపంచ సమయంలో మద్రాసు రీజనల్ డైరెక్టరు యం.సిరాజా ధర్మన్నను యుద్ధ ప్రచారకునిగా నియమించారు.

నీలం చినవెంకన్న, పోలుకొండ భద్రయ్య మాస్టర్ తో హరిజన కళామండలి స్థాపించాడు.

1944లోఉభయగోదావరి వ్యవసాయ కూలీ సంఘం దీని కేంద్రాలను రాజోలు మరియు రాజమండ్రిలో ఏర్పాటుచేశారు.

గాంధీ ధర్మన్న ఆది ఆంధ్ర ఆశ్రమం సందర్శనం

 ISBN: 978-93-340-2436-4

1933లో కాంగ్రెసు పార్టీ హరిజనుల రాజకీయ అండకోసం హరిజన సేవా సంఘాలను ఆంధ్రలో ప్రారంభించింది. హరిజన సేవ సంఘాలలో హరిజనులకు భాగస్వామ్యం లేదని. ఈ సంఘాలను కుసుమ ధర్మన్న వ్యతిరేకించారు. నిమ్న జాతుల అభివృద్ధికి పాటు పడిన మహాత్మా గాంధీ ఆశయాలను నమ్మి గౌరవించినా, ఆచరణలో లోపాలను ధర్మన్న సహించలేదు.

ఆంధ్ర రాష్ట్ర పర్యటనతో రాజమహేంద్రవరం వచ్చిన గాంధీ కుసుమ ధర్మన్నకు కబురు పంపించారు. మా మీద ప్రేమాభిమానం ఉంటే హరిజన పేటకు వస్తారని ఉత్తరం యిచ్చారు దానితో గాంధీ స్వయంగా ఆది ఆంధ్ర ఆశ్రమానికి వచ్చారు. ధర్మన్న గాంధీకి ఆతిథ్యమిచ్చి గౌరవించారు. ధర్మన్న సేవలను కొనియాడి పేదలకు చేస్తున్న ఆయుర్వేధ వైద్యంను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ధర్మన్నతో మంతనాలు జరిపి కాంగ్రెసు పార్టీలలో కీలకపాత్ర పోషించాలని ఆహ్వానించారు. నన్ను మనించండి నాకు పార్టీ కంటే నా జాతిని చైతన్య పరచడం ముఖ్యంమని అన్యద భావించకండని ఉత్తరమిచ్చారు.అయినా గాంధీ తంతి ద్వారా మీ అభిప్రాయం తెలియజేయమని బయలుదేరారు. ధర్మన్నకు రాజకీయ అవకాశాలు వచ్చినా దళిత హక్కులుకోసం తుదివరకు పోరాటం చేశాడు. ధర్మన్న ముక్కుసూటి మనిషి సమస్యలను పరిష్కరించే పట్టుదల కలవాడు. జాతి సమైక్యం ఉండాలని యిష్టపడేవాడు. స్వజాతిలో ఏర్పాటువాదం అసలు యిష్టపడేవాడుకాదు. స్వజాతిని ఇతర కులాల దగ్గర చులకనచేసి మాట్లాడేతే దానిని పూర్తి వ్యతిరేకించేవాడు. స్వజాతిని తన స్వార్ధంకోసం తాకట్టు పెట్టే స్వభావం ఆయనలో లేదని ఆయన సన్నిహితుడు పామురామమూర్తి హరిజననాయకుడులో రాశారు. ఆయన దళిత జాతికి చేసిన సేవలు చిరస్మరణీయం.

**ఆధారగ్రంథాలు :**


1. కుసుమధర్మన్న జయభేరి పత్రిక -1936-1940 (రాజమండ్రి గౌతమి గ్రంథాలయం నేడు అలభ్యం)
2. మాకొద్దినల్ల దొరతనం-1921(హైదరాబాదు బుక్ ట్రస్ట్ ముద్రణ-జూన్2003)
3. హరిజన శతకం-1933 (హైదరాబాదు బుక్ ట్రస్ట్ ముద్రణ-జూన్2003)
4. డాక్టర్ కొంకె గౌరీశ్వరరావు (తెలుగులో దళిత పత్రికలు-పరిశీలన -2006-ఎం ఫిల్ సిద్ధాంత వ్యాసం, అముద్రితం హైదరాబాదు విశ్వవిద్యాలయం)
5. భాగ్యోదయం - పద్మశ్రీ ఎం.బి. గౌతమ్ -2009(సమాంతర ప్రచురణ)
6. సమదర్శని పత్రిక -1925 వతేది( రాజమండ్రి గౌతమి గ్రంథాలయం)
7. కానేటి మోహనరావు1952 పార్లమెంటు సభ్యుడు ధర్మన్నకు సన్నిహితుడుతో ముఖాముఖి

9.11.2009.కాకినాడ- మట్లపాలెం

8. నంబూరి పరిపూర్ణ – నంబూరిశ్రీనివాసు సోదరి ధర్మన్నయింట్లో రాజమండ్రి, లక్ష్మీవారం పేటలో చదువుకున్న ధర్మన్నగారిలో బాల్య జ్ఞాపకాలు – రచయిత్రి, బాలసినీనటి, గాయని, కమ్యూనిస్టు ఉద్యమకారిణి – ముఖాముఖి 24.11.2009 (కూకట్ పల్లి హైదరాబాద్) జీవించేయున్నారు.

9. క్రీ.శ .కొంకే. సూర్యనారాయణమూర్తి1903–1998) రంగూన్‌లో సిపాయి, వ్యాసకర్త. తాతాగారు – తూ.గో.వక్కలంక.

10. హరిజనోద్యమ చరిత్ర – పాముురామమూర్తి.( తొలిదళిత పట్టభద్రుడు కాకినాడ)

11. తెలుగులోదళితోద్యమ వైతాళికులు – ఆచార్య శిఖామణి – వజ్రాభారతి (1947–2007) కృష్ణాజిల్లా రచయితల ప్రచురణ

12. The First All India Dalit writers Conference (Held On 8,9,10, October 1987 At Exhibition Grounds, Hyderad, AP) A COMMEMORATIVE VOLUME & WHO'S WHO……EDITOR - BOJJA THARKAM, ASSOCIATE EDITOR- GANUMALA GNANESWAR -UNDER THE AUSPICES OF DR.B.R. AMBEDKAR MEMORIAL TRUST --HYDERABAD, AP.

13. వకుళాభరణం రామకృష్ణ–ఆంధ్రదేశంలో సంఘసంస్కరణోద్యం–

14. ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర – యాగంటి చిన్నారావు–2007, హై.బిటి. హైదరాబాదు.

15. రాష్ట్ర హరిజన నాయకుల చరిత్ర – పాముురామమూర్తి బి.ఏ. కాకినాడ – మే 1975 6వ కాంగ్రెసు మహాసభలు.

* * *

 ISBN: 978-93-340-2436-4

38

# కుసుమ ధర్మన్న - సంఘ సంస్కరణ - రచనలు

**డా॥ కట్టెపోగు సురేష్ కుమార్**
తెలుగు శాఖాధిపతి
డా॥ ఎ.బి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేపల్లె

కులం పేరుతో మనుషలని విడదీసి, పెద్ద కులాలకి పెద్ద గౌరవం ఇచ్చే దేశం ఈ భారతదేశం. మహాకవి జాషువా అన్నట్లు

**"ఏడిచి చెప్పితిన్ విషయమెల్లనునయిత్రి గ్రుచ్చిము**
**ద్దాడుచు నాయనా! యింది భయంకర దేశము, వర్ణ భేదముల్**
**గూడులు గట్టుకొన్న వనగూడదు, పంచమ జాతివారికిన్**
**కూడు హుళక్కి, మానవతగూడ హుళక్కి హుళక్కి జన్మమున్"**

(గుఱ్ఱం జాషువా - నా కథ - 1)

ఇటువంటి దేశంలో బ్రిటీష్ వారి కాలంలో ఉదారవాదులైన కొందరు భారతీయుల చొరవతో సంఘ సంస్కరణ ఉద్యమం మొదలైంది. ఫలితంగా బ్రిటీష్ ప్రభుత్వం కొన్ని చట్టాలు తీసుకురావడానికి కారణమైంది. దేశమంతా సంఘ సంస్కర్తలు సమాజంలోని అసమానతలు రూపుమాపటానికి ప్రయత్నిస్తున్న కాలం. వీరిలో పెద్ద కులాలకు చెందిన వారే ఎక్కువ. కొద్దో గొప్పో చదువుకున్నవారు తక్కువ కులాలుగా చెప్పే కులాల నుంచి వచ్చినవారు, భారతీయ కుల సమాజాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్న వారు తమ జాతి విముక్తికై సామాజిక, రాజకీయ రంగాలతో పాటు సాహిత్య రంగంలో కృషి చేశారు. అటువంటి వారిలోకుసుమ ధర్మన్న ఒకరు.

ఆంధ్రదేశంపై దేశ రాజకీయాలు, ప్రభావం ఉంది. ఒకరకంగా దేశంలో చాలా ఉద్యమాలు మొదలుకాక ముందే ఆంధ్రదేశంలో మొదలయ్యాయి.

ఆంధ్రదేశంలో దళితులని, రకరకాల పేర్లతో వ్యవహరించారు. మొదట పంచమ వర్గం, 1917లో ఆది ఆంధ్రులు, 1931లో హరిజన, 1936లో షెడ్యూల్డ్ కులాలు, 1976 తర్వాత దళితులు ఆ మధ్య కాలంలో సుప్రీం కోర్టు తీర్పుననుసరించి దళిత పదం కూడా నిషేధించారు. ఎన్ని పేర్లతో పిలిచినా వీరిలో కొద్దో గొప్పో చైతన్యం రావడానికి ముందుగా సహకరించినవి బ్రిటీష్ వారి చట్టాలు. మిషనరీల సేవ. ఆ చట్టాలు, మిషనరీల కృషి వలన వీరిలో కొన్ని వర్గాల ప్రజలు అవకాశాలు అందిపుచ్చుకుని వృద్ధిలోకి వచ్చారు. అలాగే బ్రహ్మ సమాజ భావజాలం కందుకూరి, మామిడిపూడి వెంకటరంగయ్య, రఘుపతి

 ISBN : 978-93-340-2436-4

వెంకట రత్నం నాయుడు, గోరా మొ॥ పెద్దల ఆధ్వర్యంలో మొదలైన సంఘ సంస్కరణ, మెల్లగా క్రింది తరగతి కులాల వారికి ముఖ్యంగా చదువుకున్న యువతరానికి చేరింది. అటువంటి యువతరంలో ఒకడే కుసుమ ధర్మన్న..

నిమ్నజాతి ముక్తి తరంగిణి 19-03-1921న ఏలూరులో చేసిన ప్రసంగం
నల్లదొరతనం (1921) గీతాలు
నిమ్న జాతుల ఉత్పత్తి (1924) గుడివాడ ఉపన్యాసం
మధ్యపాన నిషేధం (1930) వ్యాసం
అసుర పురాణం (పద్యకావ్యం)
అంటరాని వాళ్ళా (కథా సంపుటి)
హరిజన శతకం (1933) శతకం

వీటిలో మనకి హరిజన శతకం అందుబాటులో ఉంది. మిగిలిన రచనలు లేవు. మాకొద్ది నల్ల దొరతనం గేయం. పూర్తిగానూ, అంటరాని వాళ్ళా కథల పేర్లు లభిస్తున్నాయి. జయభేరి, అనే పత్రికను నడిపారు. దీని సంచికలు నేడు మనకు అందుబాటులో లేవు. వీరి రచనలను పూర్తిగా సేకరించవలసిన అవసరం ఉంది.

**"మేలు కొనుమీవు తరుణము మించకుండా**
**జన్మ హక్కులకై పోరు సలుపుమిపుడె**
**హక్కుకై ప్రాణమిడుట ద్రోహంబుకాదు**
**స్వర్గ పథమని నమ్ములు స్వాతం మందు"** మని తరుణంమించకుండా మేలుకొని జన్మహక్కులకై పోరాడమని, ప్రాణత్యాగమైనా స్వర్గపథమని ప్రబోధించి, ఆత్మాభిమానాన్ని, ఆత్మ గౌరవాన్ని చాటి చెపుతాడు. వర్ణధర్మం పేరిట భారతీయ సమాజంలో నెలకొని ఉన్న హెచ్చుతగ్గులను నిరసించిన జాతీయవాది తన జాతీయుల్లో ఆత్మగౌరవ స్ఫూర్తిని, దీప్తిని రగిలించిన కవి తెలుగు కవి సంఘాలకు సలహాలిచ్చి సమైక్యతతో మెలిగేందుకు కృషి చేసిన ఉదారవాది.

కాంగ్రెస్ పార్టీ తరపున రాజమహేంద్రవరం తాలూకా బోర్డుకు సభ్యుడిగా పనిచేశాడు మొదటిలో గాంధీజీ భావజాలంతో నడిచినా, దళితుల ఉద్ధరణకు గాంధీ మార్గం కంటే అంబేద్కర్ చూపిన దారి సరైనదని గుర్తించి ఆ మార్గాన నడిచినవాడు.

ధర్మన్న స్వతాహాగా ఆయుర్వేద వైద్యుడు, ఉపాధ్యాయుడు, కవి, రచయిత పత్రిక నిర్వహించాడు.

 ISBN: 978-93-340-2436-4

కందుకూరి వీరేశలింగం గారి శిష్యుడు, సామాజిక సమానత్వం కోసం హరిజనోద్యమంలో భాగంగా బెజవాడ నుంచి విశాఖపట్టణం వరకు అంటరానితనం పోవాలని, హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించాలని, మద్యపానం మానాలనే సాంఘిక దురాచారాలని రూపుమాపటానికి తీవ్రంగా కృషి చేసి చిన్న వయసులోనే అసువుల బాసిన వ్యక్తి.

1908 ఏప్రిల్ 20న బందరులో ఆంధ్ర సంస్కరణ వాదుల మహాసభ జరిగింది. భోగరాజు పట్టాభిరామయ్య అధ్యక్షుడు. ఇందులో హరిజనులకు పాఠశాల ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

1917 సెప్టెంబరులో బెజవాడలో ఆది ఆంధ్రుల ప్రథమ మహాసభ జరిగింది. అప్పటివరకూ పంచములుగా పరిగణింపబడిన వారిని ఈ సభ నుంచే ఆది ఆంధ్రులు, అని పిలవడం మొదలైంది. అలాగే శాసన మండలిలో ఆది ఆంధ్రులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ తీర్మానాలు చేశారు.

"ఏదేమైనా కులసంఘాలు ఏర్పాటు చేసుకోవడం సభలు, సమావేశాలు జరుపుకోవడం, పత్రికలు నడపటం, చట్టసభల్లో ప్రాతినిధ్యం కోరడం, కుల అభివృద్ధికి, సంక్షేమానికి పలు చర్యలు తీసుకోవడం అన్ని కులాలలో మొదలైంది. బ్రాహ్మణ, బ్రాహ్మణేతర కుల సంఘాలు ఏర్పడి ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నం చేస్తున్న కాలం అది. ఆక్రమంలో చైతన్యవంతులైన దళితులు తమ జాతిని చైతన్యవంతం చేయడానికి పూనుకున్నారు. అటువంటి వారిలో పైన పేర్కొన్నట్లు, కుసుమ ధర్మన్న ఒకరు.

కుసుమ ధర్మన్న సంఘసంస్కరణ, రచనారంగం, రాజకీయ రంగం సాంస్కృతిక రంగాలలో తాను సంపాదించిన జ్ఞానంతో, అనుభవంతో, సమాజ స్వరూపాన్ని అర్థం చేసుకున్నాడు. ఈ సమాజంలోని అసమానతలను రూపుమాపాలనుకున్నాడు. తన జాతిని చైతన్యవంతం చేసే పనిలో, ఆనాటి ఎందరో ప్రముఖుల సహకారం సంపాదించాడు. అలుపెరుగని పోరాటంతో అవిశ్రాంత శ్రమతో పనిచేయడం వలన చిన్న వయస్సులోనే అసువులు బాసిన అమరుడు కుసుమ ధర్మన్న వారి కృషికి, సేవలకు సరైన గుర్తింపుకు నోచుకోకపోవడం దురదృష్టం.

ఆధార గ్రంథాలు :
దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్నకవీంద్రుడు – సి.వి.
తొలి దళిత స్ఫూర్తి కుసుమధర్మన్న
భాగ్య రెడ్డి వర్మ జీవితచరిత్ర.

* * *

 ISBN : 978-93-340-2436-4

39

# కుసుమ ధర్మన్న జీవితం-సాహిత్యం-సేవా రంగం

**డాక్టర్ బేతాశారదా దేవి**
తెలుగు ఉపాధ్యాయిని
జిల్లా ప్రజా పరిషత్ ఉన్నతపాఠశాల
నరేంద్రపురం, రాజానగరం మండలం

ఈయన కాలం 1900–1946 రాజమహేంద్రవరం లోని లక్ష్మీవారపు పేటలో వ్యవసాయ కూలీ అయిన కుసుమ వీరాస్వామి, నాగమ్మ దంపతులకు జన్మించారు. భార్య లక్ష్మీనారాయణమ్మ, పిల్లలు పతిత పావన మూర్తి, మోహన్ దాస్ కరంచంద్ గాంధీ, భాగ్యలక్ష్మి, కాశీ విశాలాక్షి, చిత్తరంజన్, భగవాన్ దాస్. వృత్తి :–రచయిత, కవి, సాహితీకారుడు.

ఆది ఆంధ్ర జూనియర్ ఎలిమెంట్ స్కూల్లో ఐదవ తరగతి వరకు చదివారు థర్డ్ ఫార్మ్ చదివి ఆయుర్వేదంలో వైద్య విద్వాన్ పట్టా పొందారు ఇతడికి తెలుగు సంస్కృతము ఆంగ్లము హిందీ ఉర్దూ భాషలలో ప్రావీణ్యం ఉంది చదువుకునే రోజుల్లోనే సంఘసంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం గారి చేత ప్రభావితుడైనాడు ఇతడు తన జాతి హీనత్వంతో అవమానంతో అమానుషంగా, అంటరానితనం, సామాజిక వివక్షలతో, బాధపడుతున్న దళితులను (మాల, మాదిగ ఇతర అణచబడ్డ కులాలను) అంబేద్కర్ స్ఫూర్తి పొంది అంటరానితనాన్ని నిర్మించాలనే లక్ష్యంతో తపించిన తొలి తరం కవి ఇతడు గుడివాడ సేవాశ్రమం వ్యవస్థాపకులు గూడూరి రామచంద్రరావు వద్ద సీతానగరం ఆశ్రమం, చాగల్లు అనాధాశ్రమాలలో కొంతకాలం ఉండి తన ఉద్యమ స్ఫూర్తిని మెరుగుపరచుకున్నారు దళిత ఉద్యమ వైతాళికులు కుసుమ ధర్మన్న.

ఇంద్రుడు అనే పుస్తకంలో సివి గారు కూడా ఈయన గురించిన సమాచారం తన వద్ద లేదని రాశారు 1921లోకుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము రాశారు. కుసుమ ధర్మన్న అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితుడై అంబేద్కర్ గురించి ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారం చేశారు ఆంధ్రదేశానికి అంబేద్కర్ ను తొలిగా పరిచయం చేసింది ఈయనే. అణగారిన జాతులకు గొంతుకనిస్తూ అంబేద్కర్ భావాలను ప్రచారం చేయడానికి జయభేరి అనే పక్ష పత్రికను స్థాపించారు.

1930వ దశకంలో కాంగ్రెస్ పార్టీ చొరవ తీసుకుని హరిజన సేవ సంఘం యొక్క ఆంధ్ర విభాగాన్ని ప్రారంభించింది మహాత్మా గాంధీ అంటరాని కులాల ప్రజలకు హరిజనులు అని పేరు పెట్టడంతో అది ప్రాచుర్యం పొందింది. క్రమేణా ఆది ఆంధ్రా నాయకులంతా కాంగ్రెస్ స్థాపించిన హరిజన సేవా సంఘం లో భాగమైన కుసుమ ధర్మన్న వంటి కట్టుబడిన నాయకులు మాత్రం దాన్ని వ్యతిరేకించారు నిమ్న జాతుల అభివృద్ధి విషయంలో మహాత్మా

గాంధీ ఆశయాలను నమ్మి గౌరవించిన ఆచరణలో లోపాలను ధర్మన్న సహించలేదు గాంధీ గారి యొక్క ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం వచ్చి హరిజన నాయకులతో సమావేశం నిర్వహించిన సందర్భంలో ధర్మన్న ఆ సమావేశాన్ని బహిష్కరించారు.

దళిత చైతన్యం కోసం ధర్మన్న పడిన తపన ఈయన 1933లో రాసిన హరిజన శతకంలో చూడవచ్చును "ఆత్మగౌరవంబునలరంగ చాటరా" అని ఉద్బోధించిన ధర్మన్న కవి గారు వర్ణధర్మం పేరిట భారతీయ సమాజంలో నెలకొని ఉన్న హెచ్చుతగ్గులను నిరసించిన జాతీయవాది సమకాలీకులు ఆయనను ఆది ఆంధ్ర కవి సార్వభౌమునిగా పేర్కొన్నారు.

1936లో విజయనగరంలో జరిగిన ఆది ఆంధ్ర మహాసభ సమావేశానికి కుసుమ ధర్మన్న అధ్యక్షత వహించారు ఈ సమావేశంలో అధ్యక్ష ప్రసంగం చేస్తూ సామ్యవాదాన్ని సహించని హిందూ మతం అనే శీర్షికన ప్రసంగం వెలువరించారు.

ఈయన నిమ్నజాతివిముక్తి తరంగిణి, వాళ్లు అంటరాని వాళ్ళా, హరిజన చరిత్ర మొదలైన రచనలు చేశారు. మాకొద్దీ నల్లదొరతనము 1921లో గరిమెళ్ళ సత్యనారాయణ మాకొద్దీ తెల్ల దొరతనం అనే గేయాన్ని రాశారు అదే సంవత్సరం కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము అనే గేయాన్ని రచించారు ఆ కాలంలో స్వాతంత్రోద్యమ హరిజనోద్యమ వేదికలపై ఈ రెండు గీతాలు మారు మ్రోగేవి స్వాతంత్ర్యం వస్తే తెల్లదొరల స్థానంలో నల్లదొరలు వస్తారు అంటరానితనం కొనసాగుతూనే ఉంటుంది ఎప్పుడైతే అస్పృశ్యతా భావన తొలగిపోతుందో అప్పుడే దళితులకు నిజమైన స్వాతంత్ర్యమని ధర్మన్న భావించి ఈ గేయాన్ని రచించారు ఈ పాటలో కొంత భాగం

**"మాకొద్దీ నల్లదొర తనము దేవా**
**మాకొద్దీ నల్ల దొరతనము**
**పదిమందితో పాటు పరువు**
**గలుగకయున్న మాకొద్దీ నల్ల దొరతనము**
**పన్నెండు మాసాలు పాలేరు తనమున్న**
**పస్తులు పడుతూ బతకాలండీ**
**ఆలి కూలీ జేసి తీరాలండీ**
**పిల్లగాడు పశువుల గాయాలండీ**
**పగలూ రేయీ పాటు పడ్డానండీ**
**కట్ట గుడ్డ కూడు గిట్ట దండీ**
**రోగమొస్తే నాగ దప్పదండి**
**అప్పు తీరదీ చిత్రమేనండీ**

**ఈ నిప్పు పై నిక మేము**
**నిలవలేమో తండ్రీ**
**మాకొద్దీ నల్ల దొరతనము దేవా**
**మాకొద్దీ నల్ల దొరతనము**
**పాడిపంటలు మేము కూడా పెడితే వారు**
**కూర్చోని తింటా మంటారు**
**నాములిచ్చి నట్టేట ముంచేరు**
**ఎంచి అప్పు అప్పు పెంచుతారు**
**చెంప కొట్టి కొంప లాగుతారు**
**మాకొద్దీ నల్ల దొరతనము దేవా మాకొద్దీ నల్ల దొరతనము**

స్ఫూర్తి:– కుసుమ ధర్మన్న ఈ గేయం నుంచి స్ఫూర్తి పొంది మాకొద్దీ నల్ల దొరతనం అనే పద్యాన్ని రాశారు.

**సొంత పరిపాలన చేసేద్దామంటారు**
**ఎంతకు మము జారనీరు...**
**స్వరాజ్యమనుచు సర్కారుతో పోరాడి**
**స్వాతంత్రమడుగుతారు**
**మాకు స్వాతంత్రం ఇయ్యమంటారు స్వాతంత్రమీయమంటారా**
**మాకు హక్కు లేదంటే స్వరాజ్య మెక్కడ దక్కు**
**నాకు హిందూ సంఘము నందు**
**స్వాతంత్ర్య మాగు వరకు**
**మాకొద్దీ నల్ల దొరతనము**

కుసుమ ధర్మన్న గారు నల్లదొరలు చేసే అవినీతిని చర్ల ద్వారా ప్రజలకు తెలియజేశారు

మూలాలు:–

1. పుట్ల హేమలత (1st August 2016) తెలకపల్లి రవి
“కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనం”

* * *

 ISBN: 978-93-340-2436-4

# 40 వర్ణ వ్యవస్థపై ధ్వజమెత్తిన ధర్మన్న

**జి.ఎన్.ఎల్.జి. కాత్యాయని**
ఆంధ్రోపన్యాసకులు
శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల,
విజయవాడ

**ప్రవేశిక :**

సనాతన సంప్రదాయ వీధుల్లో స్వేచ్ఛగా సాగిపోతున్న చాతుర్వర్ణ రథచక్రపుటిరుసులలో పడి నలిగిపోతున్న ఆనాటి దళితులకు కొండంత అండగా నిలబడి, మూఢాచారాల వటవృక్షానికి అవమానాలతో వేలాడుతున్న దళిత జీవచ్ఛవాల అస్థిపంజరాలను చూసి చలించిన కుసుమధర్మన్న వర్ణవ్యవస్థపై ధర్మయుద్ధాన్ని ప్రకటించి జయభేరి మ్రోగించి తొలితెలుగు దళిత కవితా వైతాళికుడయ్యాడు. పశువుకన్నా హీనంగా, దారుణాతిదారుణంగా అంటరానివారని ముద్రవేసి అస్పృశ్యునిగా చిత్రించిన మనుధర్మశాస్త్రానికి పాడెకట్టి, మాకొద్దీ నల్లదొరతనమంటూ పాడుతూ, వీధి వీధిల్లో హరిజన గీతమై గుండెదరువేసిన మెండైన ఆదిఆంధ్రుడు కుసుమ ధర్మన్న. అప్పటి వరకు కనీసం మనిషిగా చూడకుండా అడుగడుగునా నాల్గుపడగల హైందవ నాగరాజు విషపుకోరలకు బలౌతూ, వెలివాడల్లో బ్రతుకుతున్న దళితుల పక్షాన ఎగరేసిన ఉద్యమ జెండై రెపరెపలాడుతూ, దశదిశలా జనచైతన్యాన్ని రగిలించి విప్లవనినాదమై నిలిచాడు. ధర్మన్న ఈ అసమానతల వర్ణ వ్యవస్థపై ధ్వజమెత్తిన కలమే మహావిస్ఫోటనాన్ని సృష్టించింది. అందుకే అంటరానితనంపై అలుపెరుగని పోరుచేసి అటు ప్రజాపోరులోనూ, ఇటు సాహిత్య వీధిలోను ఎలుగెత్తిన కొత్త గొంతై నిలిచారు ధర్మన్న.

**ముఖ్యోద్దేశ్యం :**

కుసుమ ధర్మన్న అంటేనే ఒక హరిజన శతకం గుర్తొస్తుంది. దానివెంటే పదునెక్కినపాటగా మాకొద్దీనల్లదొరతనం గుర్తుకువస్తుంది. ఆనాటి సమాజంలో ఎగుడుదిగుడులుగా, అడ్డదిడ్డంగా ఉన్న అసమానతల వర్ణ వ్యవస్థపై ధిక్కార స్వరాన్ని వినిపించి సమానతా వాదాన్ని, మానవతావాదాన్ని సమాజానికి అందించారు. అందులో భాగంగానే హీనాతి హీనంగా ఉన్న బడుగు జీవుల దుర్భర జీవితాలను వస్తువుగా స్వీకరించి సమరానికి సిద్ధమయ్యారు. అలాగే మనిషిని మనిషిగా చూడని కుల వ్యవస్థపై వెంటరాకుండా, కలిసిరాకుండా నిషేధాన్ని విధించిన మనుధర్మశాస్త్రంపై ధర్మపోరును ప్రకటించారు. దేవుని దృష్టిలో అందరూ సమానమే. కాని అంటరాని దళితులను మాత్రం అన్నిటికీ దూరంచేసారని

ఆవేదన వ్యక్తంచేస్తూ ఈ వర్ణవ్యవస్థపై కుసుమ ధర్మన్న ఏవిధంగా తిరుగుబాటుచేసి సమానతకోసం, ఐక్యతకోసం ఎలా శ్రమించారో వివరించే ప్రయత్నమే ఈ వ్యాసంయొక్క ముఖ్యోద్దేశ్యం.

**కీలక పదాలు :**

వర్ణ వ్యవస్థ, కులమత బేధాలు, అసమానత, మూఢాచారాలు, వివక్ష, అంటరానితనం, హరిజనుల దుస్థితి, దేవాలయ ప్రవేశ పోరాటం, ఉద్యమతీరు, ఆదికాలమందున్న స్థితి, ఆధునిక కాలమందున్న స్థితి మొదలైనవి.

**విషయ వివరణ :**

ఈ ఆధునిక సమాజం వివక్షల శిక్షలతో అంటరానితనం అనే జాడ్యంతో రోగగ్రస్థమై, దళితులను ఊరికి దూరంగా నెట్టేసి, పశువుకన్నా హీనంగా చూస్తూ రోగగ్రస్థంగా మారిన ఈ వర్ణ సమాజానికి అసలైన విరుగుడుగా సరికొత్తమందును కనిపెట్టి, సరైన సమయంలో అసలైన టీకాను వేసి వైద్యవిద్వాన్ కుసుమ ధర్మన్న ఉత్తమ వైద్యుడయ్యాడు. మర్రి ఊడలకంటే బలంగా నాటకుపోయిన, కులవ్యవస్థ, నిచ్చెనమెట్ల వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా ఎన్నో గ్రంథాలను అధ్యయనంచేసి, కల్పనాకథలకు కాలంచెల్లిందని శాసించి, మూఢాచారాలకు మృత్యువు ముంచుకొచ్చిందని ఎలుగెత్తి చాటిన ఆధునిక కవనయోధుడు కుసుమ ధర్మన్న. తనుచేసిన పోరాటాలన్నీ ఊరికి దూరంగా గెంటివేయబడిన వెలివాడల బ్రతుకులకోసమే. మమ్మల్ని మనుషులుగా చూడండనే ఆవేదన, మేమూ మనుషులమే అనే ఆక్రందన వారి రచనల్లో కనిపిస్తోంది. అందుకే ధర్మన్న దళితకవితా వైతాళికుడయ్యాడు.

ఈ నల్లదొరల పాలనలో మా బ్రతుకులు ఎలా తగులబడ్డాయో తెలుసా అని ప్రశ్నిస్తూ దళితుల్లో మాల, మాదిగల దుస్థితిని వివరిస్తూ స్వేచ్ఛా స్వతంత్రతలేని మా బ్రతుకులకు స్వాతంత్రమొచ్చినా, రాకపోయినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తూ, కనీసం ఈ దేశంలో మమ్ములను మనుషులుగానే చూడటంలేదనే ఆవేదన వ్యక్తంచేస్తూ

**మేము మనుషులనుమాట**
**మరిచిపోయారండి**

**మాలమాదిగలంటే మండిపడిపోతారు...** అంటూ ఆనాటి వర్ణ వ్యవస్థలో ఉండే కులవివక్షతను కళ్ళకు కట్టినట్టు ప్రపంచానికి చూపిస్తూ ఈ సమాజంలో దేశస్వాతంత్ర్యం కోసం ఉద్యమాలు ఉదృతంగా చేస్తున్నవారొకరు. ప్రతివారు కలిసి ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చేవారు కొందరు, స్వాతంత్ర్యం మన జన్మహక్కని ఎలుగెత్తి చాటేవారు కొందరు, మాకొద్దీ తెల్లదొరతనమంటూ గీతాలు పాడేవారు మరికొందరు, ఇదంతా చూస్తుంటే మమ్మల్ని

అసలు మనుషులుగా చూడని హరిజనుల దుస్థితిపై ఎవరైనా స్పందించారా అని ఎలుగెత్తి ప్రశ్నించారు కుసమ ధర్మన్న. నా భారతదేశం పరమపవిత్రమైనదని, నా భూమి భరతభూమని, వేదభూమని, ఖర్మభూమని చెబుతున్నారే కేవలం ఈ దేశంలో హరిజనులను మనుషులుగా గుర్తించారా అని ప్రశ్నస్తూ వివక్షతలతో ఊరికి దూరంగా నెట్టబడిన ఈ నల్లదొరల పాలన వద్దని నినదిస్తూ మాకొద్దీ నల్లదొరతనమంటూ వర్ణవ్యవస్థపై అగ్నికణమై మండారు కుసుమధర్మన్న.

ఆనాటి వర్ణ వ్యవస్థలో హరిజనులను నీచులుగా, అస్పృశ్యులుగా, అవర్ణులుగా యెంచి కల్పనాకథలను అల్లి శూద్రులని, అతిశూద్రులని, అంత్యజులని, అవర్ణులని, పంచములని, ప్రత్యేక నీచ నిందార్థాల్లో ముద్రవేసి, అశాస్త్రీయమైన పద్ధతిలో కులవ్యవస్థను సృష్టించి, ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు నలుగురు కుమారులని అదే చాతుర్వర్ణ వ్యవస్థని చెప్పిన పుక్కిటి పురాణ కథలను నిరసించి ఈ వర్ణ వ్యవస్థపై ధిక్కార ఖడ్గమై ధ్వజమెత్తాడు ధర్మన్న. అందుకే వ్యవస్థను ఎత్తుచూపుతూ

**మాలమాలని చాల తూలనాడు మమ్ము**
**అంటరాదని గెంటుతారు**
**కుక్క నక్కలకంటె తక్కువగాజూసి**
**నిక్కినిక్కి నిగుడుతారు**
**సానిపక్కనచేరి సాకుతారు...** అంటూ ఎన్నో వాస్తవాలను వివరిస్తూ అక్షరాలను అస్త్రాలుగా సంధించాడు ధర్మన్న. మాల మాలనే కులముతో దూషిస్తారు. మనిషిని మనిషిగా చూడరు, కానిపనులు చేసినా వారి ఘనతగానే భావిస్తారు. న్యాయమనేది వర్ణాన్నిబట్టి ఉంటుందని తెలుసుకొని వాస్తవాన్ని వివరిస్తారు. అంటరానివారని వెంట రాకుండా అన్నిటికి దూరంచేసారని ఆవేదన వ్యక్తంచేస్తూ మా శ్రమను గుర్తించకపోవటం, మా శ్రమను దోచుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దూళ్ళకు గడ్డికోసేది మేమే, మేపేది మేమే, పేడ తీసేది మేమే, కాని పాలు తాగేది మీరా అని ప్రశ్నిస్తూ అంటురోగాన్ని ఎండగట్టారు. ఏదైనా వర్ణం యొక్క గొప్పతనమే ప్రధానమైందని, చెప్పేవి శ్రీరంగనీతులు దూరేవి దొమ్మరి గుడిసెలనే సామెతతో వ్యంగ్యాస్త్రాన్ని సంధించారు. ఈ సామెతకు తగినవారెవరో తెలుసుకోమని ఆ వ్యవస్థను దుయ్యబట్టారు.

కుసుమ ధర్మన్న గారు హరిజనుల దుస్థితిని తెరమీదికి తెస్తూ మా బ్రతుకులను ఇంత దారుణంగా చేసింది ఎవరు అంటూ ప్రశ్నిస్తూ ఈ అన్నింటికి సమాధానాలు కవాలని అధికారికంగా అడుగుతాడు. అంతేకాకుండా పాడిపంటలు మేము పండించి పెడితే కూర్చొని తినేరకం ఎవరని, శ్రమపడేది ఎవరని, శ్రమను దోచుకొనేది ఎవరని మీరే ఆలోచించండి

 ISBN: 978-93-340-2436-4

అంటూ వర్ణవ్యవస్థమీద ప్రశ్నల వర్షం కురిపించారు. అందుకే దళితులు, పేదలుగా మిగిలిపోతున్నారని, వర్ణ వ్యవస్థలో మోసపోతున్నారని ఇప్పటికీ ఊరు వెలుపల పూరిగుడిసెలు సంఖ్య పెరుగుతుందని ఆవేదన వ్యక్తంచేస్తూ

**ఊరివెలుపలున్న పూరిగుడిసెలె గాని**
**భారికొంపలు మాకులేవు**
**గాలి వెలుగు సుంత తొలగిరాదు**
**సారమైన కూర కూడు లేదు...** అంటూ దళితుల దీనవ్యవస్థను, దుర్భరమైన పేదరికాన్ని, కడుపునిండా కూడుదొరకని పస్తుల బ్రతుకులను, నిరంతరం శ్రమదోపిడీకి గురౌతూ అవమానాలతో కృంగి కృషించిపోతున్న అభాగ్యులకోసం గొంతెత్తి నినదించాడు ధర్మన్న. అందుకే హరిజనుల ఆవేదనను ఈ లోకానికి తెలియజేస్తూ హరిజనుల పక్షంగా నిలబడి కాలం మారింది మనమూ మారాలని, పోరాడాలి, తిరగబడాలి అంటూ మేలుకో హరిజనా అనే పిలుపుతో ఆలకించుమయ్య హరిజనుండని 'హరిజన గీతాన్ని' జగమంతా వినబడేటట్టు పంచమ స్వరంతో గొంతెత్తి పాడాడు ధర్మన్న. ఆపాటే పోరాట దివిటీలుగా వెలుగుబాటై నిలిచింది. ఆనాడు ఎంతోమంది హరిజనులకు వెలుగురేఖై కులవ్యవస్థను చేధించింది. హరిజనుల దుస్థితిని కన్నీటి కథగా వివరిస్తూ

**సత్రములందు మమ్ముండనీరు**
**నూతినీళ్ళను తోడుకోనీరు**
**మాలలంటే హక్కు లేదంటారు...** అంటూ వివక్షను గుర్తుచేస్తూ ఈ మనుధర్మశాస్త్రం మా పాలిట శాపమైందని, మా తలపై అణచివేత సమ్మెటైందని, మమ్మల్ని ఊరికి దూరంగా తరిమేసిందని ఆవేదన వ్యక్తంచేస్తూ ఈ తరానికి పౌరుషాగ్నిని రగిలిస్తూ ఇప్పటికైనా మేల్కొనంటూ

**మేలుకొనుమయ్య తరుణము మించకుండ**
**జన్మహక్కుకై పోరుసలుపుమిపుడె**
**హక్కులకై ప్రాణమిడుట ద్రోహంబుకాదు...** అంటూ మనుధర్మశాస్త్రంలో ఉన్న అధర్మాన్ని ఎండగట్టాడు ధర్మన్న. అంతేకాదు హరిజనులలో ఒక నూతన ఉత్సాహాన్ని తీసుకొచ్చి ముందు తరానికి వెలుతురు బాటలు వేసాడు.

ఆనాది కాలంలో అందరూ కలిసిమెలిసి ఉండేవారని, ఈ వర్ణ వ్యవస్థవల్ల ఈ ఆధునిక కాలంలో అంటరానితనమనే అంటురోగం ఎక్కువగా పెరిగిందని ఈ వర్ణ వ్యవస్థ మనుషుల మధ్య పెద్ద చిచ్చురేపిందని, అదే చాతుర్వర్ణ వ్యవస్థగా వటవృక్షమై

పాతుకుపోయిందని ధిక్కారాన్ని వినిపిస్తూ దళితులకు బడివేరు, గుడివేరు, చస్తే సమాధివేరుగా చేసి అస్పృశ్యతను పెంచి పోషించారని, ఆదికాలం నుంచి నేటి కాలం వరకు కొనసాగుతున్న వ్యత్యాసాన్ని, వ్యవస్థను గుర్తుచేస్తూ

**ఆదికాలమందు నవనిలో జనులెల్ల**
**అన్నదమ్ములగుచు నాశవీడి**
**చీకుచింతలేక చిరంజీవులైరయా...** అంటూ ఆనాటికీ, ఈనాటికీ మనుషుల్లో ఎంత వ్యత్యాసం కనిపిస్తుందో కదా! ఆనాటి జీవన విధానం, జీవన శైలి, ఐకమత్యం, ఆనందమయ జీవితం, స్నేహబంధాలు ఎలా ఉండేవో గుర్తించవచ్చు. కాని ఈ కులవ్యవస్థ వల్ల వ్యవస్థ అంతా ఛిన్నాభిన్నమై లోపభూయిష్టంగా మారిందని ఆవేదన వ్యక్తంచేసారు.

ఈ విధంగా కుసుమ ధర్మన్న తన జీవితకాలంలో ప్రజలమధ్యనే ఉండి, ప్రజల సమస్యలపైనే అలుపెరుగని పోరు చేసారు. హరిజనోద్ధరణ కోసం ఎంతో శ్రమించారు. నిషిద్ధమానవులను శుద్ధజీవులుగా మార్చే ప్రయత్నంచేసారు. దేవాలయ ప్రవేశాలకోసం న్యాయబద్దమైన పోరాటంచేసి విజయాలను సాధించారు. హరిజనుల ఆర్థికాభివృద్ధికి హరిజన బ్యాంకును కూడా స్థాపించారు. తన ఆశయాలను ప్రపంచానికి తెలిసేలా జయభేరి పత్రికను స్థాపించారు. మధ్యపాన నిషేధంపై అలుపెరుగని పోరుచేసారు. హరిజన శతకం వ్రాసి హరిజనుల దుస్థితిని, పోరాట ఉద్యమంలో భాగంగా హక్కుల సాధనకై మేల్కొల్పిన వైతాళికుడు. ఈ వర్ణ వ్యవస్థపై ధ్వజమెత్తి విజయం సాధించిన కలంయోధుడు కుసుమ ధర్మన్న. అందుకే తెలుగు సాహిత్య చరిత్రలోను, దళితోద్యమ చరిత్రలోను సంఘసంస్కరణ ఉద్యమ పుటల్లోనూ కుసుమధర్మన్న చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించబడి స్వర్ణమయమైంది.

ఆధార గ్రంథాలు :
1) కుసుమ ధర్మన్న - మాకొద్దీ నల్లదొరతనం
2) కుసుమ ధర్మన్న - హరిజన శతకం
3) గుఱ్ఱం జాషువా - గబ్బిలం
4) డా॥ తరపట్ల సత్యనారాయణ - సాహితీ వ్యాసాలు

 ISBN: 978-93-340-2436-4

# 41 కుసుమ ధర్మన్న కవిత్వం - సంస్కరణోద్యమ దృక్పథం

**డా॥ జి. ఎలీషాబాబు**
సహాయాచార్యులు, విద్యావిభాగం
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

**ప్రవేశిక :**

ఆధునిక తెలుగు సాహితీ జగతిలో తొలితెలుగు దళిత కవితా భాస్కరుడు కుసుమ ధర్మన్న. 1900లో జన్మించి 1946లో అతిచిన్న వయస్సులోనే మరణించినా తెలుగు సాహితీ ప్రపంచంలో ఆయన ఒక సంఘసంస్కరణోద్యమ విజయ పతాక. అంటరానితనం నిర్మూలనకై అవిశ్రాంతంగా పోరాటం చేసిన కలంయోధుడు కుసుమ ధర్మన్న. మద్యపాన నిషేధంపై నడుం బిగించి తన కలాన్ని, తన గళాన్ని ఆయుధంగా చేసుకొని ఆరోగ్యకరమైన సమాజంకోసం అహర్నిశలు శ్రమించి ప్రచార భేరి కుసుమ ధర్మన్న. కందుకూరి పుట్టిన గడ్డపైనే పుట్టి ఆనాటి సమాజంలో కరుడుకట్టిన కులవ్యవస్థపై అలుపెరుగని పోరుచేసి, అందరూ సమానమనే నినాదంతో విప్లవోద్యమ సమరభేరి మ్రోగించిన కవనధీరుడు ధర్మన్న. కేవలం కల్పిత కథలతో మనుషుల్లో విభేధాలను సృష్టించి, మూఢాచారాలను పెంచి మనుషుల మధ్య ఐక్యతకు సమానతకు అడ్డుగోడలు నిర్మించి, హీనంగా, అతిహీనంగా చిత్రించిన మనుధర్మశాస్త్రంపై కలంతో యుద్ధం చేసిన గొప్ప సాంఘికోద్యమ నాయకుడై నవ్యసాహితీ పథంలో నడిచిన నవయుగ వైతాళికుడు కుసుమ ధర్మన్న. వారి కవిత్వంలో అడుగడుగునా సాంఘిక దురాచార నిరసన కనిపిస్తుంది. అందుకే కుసుమ ధర్మన్న సంఘసంస్కరణోద్యమ తేజంగా సమసమాజ నిర్మాణ దీక్షాదక్షునిగా దర్శనమిస్తారు.

**ముఖ్యోద్దేశ్యం :**

ఆధునిక తెలుగు కవులలో చాలామంది సంఘసంస్కరణ కాంక్ష కలిగిన వారే కనిపిస్తారు. అందులో కొంతమంది ప్రత్యక్షంగానూ, మరికొంతమంది పరోక్షంగానూ ఆయా ఉద్యమాల్లో పాల్గొన్నవారే. అటువంటి వారిలో కుసుమ ధర్మన్న కవి ప్రతినిత్యం సమాజంలో ఉన్న అనేక రుగ్మతలపై, మూఢాచారాలపై తిరుగుబాటు చేసిన సమసమాజ కాంక్షాతత్పరుడు. ఆరోజుల్లో ఉన్న సమాజాన్ని చూసి చలించినవ్యక్తి. ముఖ్యంగా ఊరికి దూరంగా, నిషిద్ధ మనిషిగా ముద్రవేసిన చాతుర్వర్ణ వ్యవస్థను తూర్పారబట్టిన మహాకవి. తాను బ్రతికిఉ న్నంతవరకు చివరి క్షణం వరకు ఉద్యమాల్లోనే గడిపిన మహాయోధుడు, దళిత బ్రతుకుల జీవితాలకోసం పోరాడిన పోరాట ధీరుడు. అందుకే వారు రాసిన హరిజన శతకం, మాకొద్దీనల్లదొరతనం వంటి రచనల్లో వారి సంఘ సంస్కరణ దృక్ఫథాన్ని, ఉద్యమస్ఫూర్తిని వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశ్యం.

 ISBN: 978-93-340-2436-4

**కీలక పదాలు :**

హరిజన శతకం, మాకొద్దీ నల్లదొరతనం, దళితోద్యమ స్ఫూర్తి, అగ్రకుల అహంకారం, వర్ణవ్యవస్థపై ధిక్కారస్వరం, సమసమాజ స్థాపనకాంక్ష, అవిశ్రాంత పోరాటం, సాంఘికోద్యమ ప్రచారభేరి మొదలైనవి.

**విషయ వివరణ :**

కుసుమ ధర్మన్న వ్రాసిన హరిజన శతకాన్ని అధ్యయనం చేస్తే ఆనాటి స్థితి నుండి నేటి స్థితి వరకు దళితుల జీవితాల్లో మార్పుఏమీ కనపడదు. ఒకవేళ కనిపించినా అది ఆధునిక భావనేతప్ప స్వతంత్ర భావన కాదనిపిస్తుంది. నాగరికత పెరిగినా అనాగరిక వ్యవస్థ తాలూకు ఆనవాళ్ళు అడుగడుగునా కనిపిస్తూనే ఉన్నాయి. ఆనాటి వర్ణ అహంకార ఘీంకారాలు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి. అవమానాలు, ఆధునిక కోణాల్లో కొత్త కొత్తగా ఆవిష్కరింపబడుతూనే ఉన్నాయి. కులవ్యత్యాసాల సమాజం ఇంకా 21వ శతాబ్దంలో కూడా నిరంతర ప్రవాహంలా కొనసాగుతూనే ఉంది. అవి దళితుల హృదయాల్లో ఆవేదనను రగిలిస్తూనే ఉన్నాయి. ఆదిమ సమాజాల్లో అంతాకలిసి బ్రతికే స్థితి కనిపిస్తే నేటి ఈ ఆధునిక సమాజంలో మొత్తం ఆనాటి వ్యవస్థ తాలూకు ఆనవాళ్ళు మొత్తం తుడుచుపెట్టుకుపోయాయి. మనిషికి మనిషికి మధ్య కులవ్యవస్థ పెద్ద అగాధాన్ని సృష్టించింది. ఆనాడు ధర్మన్న చేసిన పోరాటం తర్వాత తరానికి ఆదర్శమైంది. కాని నేడు ఆనాటి చైతన్యంగాని స్పృహగాని అంతగా కనిపించకపోవడం చాలా బాధాకరం. హరిజన పేరుతో మాలమాదిగలను పిలిచినా ఒక రకమైన హేళనాభావం మాత్రం తగ్గలేదు. అందుకే ఆనాటి వ్యవస్థపై కలమెత్తి చైతన్యాన్ని రగిలించే ప్రయత్నంలో భాగంగా హరిజన శతకం కనిపిస్తుంది. ఆనాటి కులవ్యవస్థను వివరిస్తూ హరిజనుల స్థితిగతులను, ఆవేదనలను, ఆక్రందనలను వివరించే క్రమంలో ఆనాడు ఒకే జాతిగా ఉన్నా విచిత్రమైన విభిన్నపదాలను ప్రయోగించి న్యూనతా భావంతో చూసిన విషయాన్ని గుర్తుచేస్తూ

**ఆలకించుమయ్య హరిజనుండ**
**ఆలకించుమయ్య ఆది హిందు**
**ఆలకించుమయ్య ఆది ఆంధ్ర**

**ఆలకింపుమయ్య మాల వర్య....** అనే మకుటాలతో హరిజన శతకాన్ని రాయడంలో ఆనాటి కాలంలో ఎన్నిరకాలుగా పిలిచేవారో అర్థంచేసుకోవచ్చు. హరిజనుడని, ఆది ఆంధ్రుడని, ఆది హిందు అని, మాల అని ఉపయోగించే పదాలు ఒక కులానికి సంబంధించి నీచవాచకంగా పిలిచే పిలుపు ఎంత బాధ కలిగించిందో అర్థంచేసుకోవచ్చు. అందుకే కుసుమ ధర్మన్న ఆ విభేధాలను దుయ్యబడుతూ హరిజన శతాకన్ని 1933లో రాసారు.

ఆనాటి కుల వ్యవస్థలో ఉన్న కుటిల నీతికి, సవర్ణుల విభజన తీరునకు ఇది అద్దంపడుతుందని గుర్తించవచ్చు.

ఆనాటి హరిజనుల్లో విప్లవ భావాలను రగిలించి ఇంకా ఎంతకాలం ఈ నికృష్ట జీవితాన్ని గడుపుతారని ప్రశ్నిస్తూ సమరానికి సిద్ధపడవలసిన అవసరం ఎంతైనా ఉందని, ఇప్పటికైనా మేల్కోవాలని ఒక మేల్కొలుపు గీతంగా ఆనాడు హరిజన శతకం కొత్త ఉత్తేజాన్ని రేకెత్తించింది. సాంఘిక దురాచారాల్లో అత్యంత నీచమైన ఈ కులవివక్షతను నిరసిస్తూ జయభేరి మ్రోగించి

**జాతిలోన మేటి ప్రేమను పెంచి**
**కష్టసుఖములందు కలయజేసి**
**సాంఘిక సమరంబు సలపంగ నేర్వరా**
**ఆలకించుమయ్య హరిజనుండ...** అంటూ మనిషికి స్వేచ్ఛా స్వతంత్ర్యాలు అవసరమని, సుఖము శాంతి లేని శాపగ్రస్థ జీవితాలు గడుపుతున్న దళితుల విషాధ గాధలను గుర్తుచేస్తారు. అందుకే సాంఘిక సమరం చేయవలసిన అవసరం ఏర్పడిందని, ఇదే అసలైన సమయమని ప్రతి దళితుడు ముందుకు రావాలని, నడుంబిగించి నవ్యపథంలో కొనసాగాలని హరిజనులను మేల్కొల్పిన వైతాళికుడు కుసుమ ధర్మన్న.

19వ శతాబ్ధంలో ఆంధ్రదేశంలో ఆకాశమంత ఎత్తు ఎగసిన ఒక ఉప్పెన కుసుమ ధర్మన్న దళితోద్యమం అందుకే తొలిదళిత కవితా సూర్యుడై స్ఫూర్తి వెలుగులు విరజిమ్మాడు. మలిన కులమని మాటిమాటికి నిందిస్తూ, మా వెంట రావలదని నిందిస్తూ, అంటరానివానిగా అడుగడుగునా అవసమానపరుస్తూ అసమానతలకు ఆలంబనంగా నిలిచిన మనువాదుల గుండెల్లో ఒక సంచలనాన్ని రేపి సలసలామరిగిపోతున్న ఉడుకు రక్తంతో ఉద్యమ బావుతా ఎగరవేస్తూ ఇకనైనా మేల్కొనండి అని నినదిస్తూ

**మేలుకొనుమయ్య తరుణము మించకుండ**
**జన్మహక్కులకై పోరు సలుపుమిపుడే**
**హక్కుకై ప్రాణము విడుచుట ద్రోహంబుకాదు**
**స్వర్గపథమని నమ్ముము స్వాంతమందు...** అంటూ అందరిలో సమానంగా మంచిగా బ్రతకవలసిన దళితులు ఈ కులవ్యవస్థవల్ల ఊరికి దూరమై అస్పృశ్యులుగా జీవిస్తున్న వైనాన్ని గుర్తుచేస్తూ నాటి కులవ్యవస్థ కుటిలతను ఎత్తుచూపుతూ మేల్కోవలసిన ఆవశ్యకతను గుర్తుచేసారు. అంతేకాదు మన హక్కులసాధనకై మనం పోరాడవలసిన అవసరం ఉందని, మనషిని మనిషిగా చూడని ఈ సనాతన ధర్మంపై పిడికెలు బిగించవలసిన అవసరం ఉందని ఈ వ్యవస్థపై

అక్షరాలను నిప్పుకణికల్లా రగిలించి దళితోద్యమ సారధిగా నిలిచాడు. అందుకే నీ హక్కులకోసం నీవు పోరాటం చేయాలని, అవసరమైతే హక్కుల సాధనలో ప్రాణం విడవడానికి వెనుకాడరాదని, ఒక వేళ ప్రాణం పోయినా వీరమరణం పొంది స్వర్గం చేరవచ్చని పిలుపునిచ్చారు. ఈ జాతికి నీవు వెలుగు దివిటీ కావాలని, దళిత జాతికి ఒక చైతన్య పూరిత సందేశాన్ని అందించి జనజాగృతం చేసారు.

కుసుమ ధర్మన్న గొప్ప కవి, దార్శనికుడు, విమర్శకుడు, తాత్వికుడు, అన్నిటికి మించి గొప్ప ఉద్యమకారుడు. అందుకే ఈ కులవ్యవస్థపై, మనుధర్మశాస్త్రంపై సవర్ణ నీతిపై సంధించే ప్రశ్నలకు సమాధానాలు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రశ్నల పరంపరలో దళితులపై చూపుతున్న వివక్ష ఎంత దారుణమైనదో అర్థమౌతున్నది. అందుకే ఆయనలో ఉన్న ఆవేదన వారి రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. దళితులపట్ల నీచమైన భావన మరొకటి ఉండదని తెలుస్తుంది.

కుసుమ ధర్మన్న సూటి ప్రశ్నల్లో స్వాతంత్ర్యఉద్యమం కోసం పోరాడుతున్న పోరాట యోధులను తికమకపెట్టింది. వారి ప్రశ్నల్లో ఒక ధర్మముంది, న్యాయముంది అందుకే తెల్లవారికి ఒక న్యాయం, నల్లవారికి ఒక న్యాయమా అని ప్రశ్నించారు. అందుకే ఒకానొక సందర్భంలో హరిజన శతకంలో

**తెల్లదొరలపై కళ్ళెఱ్ఱగజేసి**
**హక్కులడగజూసె నాగ్రహమున**
**పక్కనున్న నిన్ను త్రొక్కి పెట్టరే వీరు**
**ఆలకింపుమయ్య హరిజనుండ ...** అంటూ ఇదెక్కడ ద్వంధ్వ నీతి అని ప్రశ్నించిన తీరులో ఒక సముచితమైన న్యాయం కనిపిస్తుంది. అందరికి ఒకే చట్టం ఒకే న్యాయం అనే సూత్రం ఇక్కడ లోపించిందని, ఆనాటి నాయకులకు ఒక ప్రశ్న వేసారు. ఎందుకంటే తెల్లదొరలు మనల్ని దోచుకున్నారని అడుగుతున్నప్పుడు, ఈదేశంలో స్వాతంత్ర్య కావాలని ఉద్యమాలు జరుపుతున్నప్పుడు దేశభక్తి చూపిస్తున్నారు. గాని స్వాతంత్ర్యం స్వేచ్ఛ లేకుండా జీవచ్ఛవాలుగా బ్రతుకుతున్న అంటరానివారి సంగతేమిటని ప్రశ్నించడమే కాకుండా మింగుడు పడని ప్రశ్నగా నాయకుల మెదడుల్లో రైళ్ళను పరిగెట్టించారు. ఈ సవర్ణ వ్యవస్థ దళితులను దూరం చేయడం, వారికి మనుషులతో కలిసి జీవించే సమానత్వం లేకపోవడం చాలా బాధాకరమని, స్వాతంత్ర్య వచ్చినా దళితుల జీవితాలకు ఒరిగేదేమటని కేవలం స్వాతంత్ర్యం సవర్ణులకే గాని, అసవర్ణులకు కాదని, ఇప్పటికీ లేదని ఒక గొప్ప వాదనను వినిపించి దళితుల ఐక్యతకు గుండెను దండోరాగా చేసి నినదించిన కార్యదీక్షాదక్షుడు కుసుమ ధర్మన్న.

కుసుమ ధర్మన్న వ్రాసిన మాకొద్దీ నల్లదొరతనమన్న గేయం ఆనాడు పెద్ద సంచలనాన్ని సృష్టించింది. ఆ గీతం వీధి వీధిల్లో రణనినాదాన్ని రేపింది. బ్రిటీష్ రాణి చెవులు గింగురుమనేటట్టు నినదించింది. భారతీయ నాయకుల గుండెల్లో నల్లదొరతనం గీతం పెనుఉపద్రవాన్ని రేపింది. ఈ గేయంలో స్వాతంత్ర్యం ఎవరికి, ఎవరికోసం అనే ప్రశ్నల పరంపరలకు సమాధానంగా, సూటిగా చాలా అంశాలను ప్రస్తావించారు. ఈ భారతదేశంలో ఎంతోమంది దళితుల దయనీయ జీవితాలను, హీనమైన గాథలను, వారి చెమటను, వారి శ్రమను, శ్రమ దోపిడీని గుర్తుచేస్తూ కనిపిస్తుంది. అందుకే

**పన్నెండు మాసాలు పాలేరు తనమున్న**
**పస్తులు పడుతూ బతకాలండి**
**ఆలి కూలీజేసి తీరాలండి**

**పిల్లగాడు పశువులు కాయాలండి....** అంటూ ఆనాటి సమాజంలో తరతరాలుగా వస్తున్న పాలేరుతనమనే సాంఘిక దురాచారాన్ని ప్రస్తావిస్తూ సంవత్సరమంతా కష్టపడినా దళితులకు పస్తులే తప్ప ఆకలితీరేది లేదని, అప్పులే తప్ప పొట్టనిండే పరిస్థితి లేదని, అందరూ కూలీచేసినా కడుపునిండా ఆకలేతప్ప కడుపునిండిన దాఖలాలు లేవని, వంశపారంపర్యంగా పాలేరుతనం దళితులకు శాపంగా మారిందని పెదపాలేరు, చినపాలేరు లాగా వంశపారంపర్యంగా కొనసాగడం దారుణమని వాపోయారు. ఒక వేళ నల్లదొరతనం వచ్చినా ఈ వ్యవస్థ మారుతుందా అని ఆవేదన వ్యక్తంచేసి విషాధకర జీవితాలను యదార్థంగా ఆవిష్కరించారు. అంతేకాకుండా కష్టపడి పనిచేసే మాకు కడుపునిండా కూడా కరువైందని వాపోతూ

**పాడిపంటలు మేము కూడబెడితే వారు**
**కూర్చుని తింటామంటారు**
**నాములిచ్చి నట్టేట ముంచుతారు**
**ఎంచి అప్పు అప్పు పెంచుతారు**

**చెంపకొట్టి కొంపలాగుతారు....** అంటూ ఆనాటి అధర్మాన్ని, శ్రమదోపిడీని వడ్డీకి వడ్డీకి వేసి డబ్బు గుంజే దుర్మార్గాన్ని, పాలేరుగా ఉంచి బానిసలుగా చూసే దుర్మార్గపు వ్యవస్థను దుయ్యబట్టారు. అంతే కాకుండా కష్టపడి పంటలు పండించేది మేమైతే దాన్ని అనుభవిస్తూ కూర్చుని తినేది మీరా అని ఆనాడే ధర్మన్న ప్రశ్నించిన తీరులో ఎంత తీవ్రమైన ఆవేదన ఉందో అర్థం చేసుకోవచ్చు. కష్టపడేది మేము, కూర్చుని తినేది మీరా అనే నినాదాన్ని ధర్మన్న ఆనాడే తెరమీదికి తీసుకొచ్చారు. ఇటువంటి నినాదాన్ని ఇవ్వడం, ఉద్యమం చేయడం ఆ కాలంలో ఎంత గొప్ప తిరుగుబాటో అర్థం చేసుకుంటే నిజంగా ధర్మన్న పోరాటం ధర్మ

పోరాటమే అనిపిస్తుంది. అందుకే గాంధీ అంతటి వాణ్ణి తన ఇంటికి రప్పించుకున్న ఘనత ధర్మన్నకే దక్కింది. అందుకే తెలుగు నేల దళిత ఉద్యమానికి ఆద్యుడయ్యాడు.

కుసుమ ధర్మన్న ఆవేదనంతా అక్షరరూపంలో మళ్ళించి కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని సమరానికి సిద్ధమయ్యాడు. అందుకే ఆయన రచనల్లో ఒక తీవ్రత కనిపిస్తుంది. దానికి మించి అశ్పృశ్యుల అవమానాలు, అవహేళనలు కనిపిస్తాయి. ఆనాటి సమాజం కుల వివక్షత పాటించిన తీరు ఇప్పటికీ మరువలేనిదిగా కనిపిస్తుంది. మనుషులుగా చూడని సమాజం మాలలని నిందించే మాటలను ధర్మన్న గుర్తుచేస్తూ

**మాయజేసేవాడు – మతమేల గితమేల**
**నీతేల నియతేల – నిజము నాకివియన్నీ**
**నినుదోచుకొనుటకే – మాలోడ**
**నిజముగా పుట్టినాయి – కూలోడ...** అంటూ నాటి వ్యవస్థపై ధిక్కార స్వరాన్ని వినిపిస్తూ అగ్నికణమై మండాడు. కూలోడు, మాలోడంటూ పిలచే అమర్యాద పిలుపులను అమర్యాదగా భావించి నాటి సమాజాన్ని దుయ్యబట్టాడు. కష్టపడి ప్రపంచానికి బువ్వపెట్టే వాణ్ణి కూలోడని, మాలోడని నిందించడం ఎంతవరకూ సమంజమని వారి విజ్ఞతకే వదిలేస్తూ ఇంకెప్పుడు ఇటువంటి పిలుపు వినపడకూడదని దళిత జాతులను మేల్కొల్పాడు. ఉద్యమ బాటలో నడిపి బహుజనులపాలిట సారధి అయ్యాడు. ధర్మన్న చేసిన పోరాటం అధర్మం మీద తిరుగుబాటే పోరుబాటకు వేదికయ్యింది.

ఈ విధంగా కుసుమ ధర్మన్న వ్రాసిన హరిజన శతకం, మాకొద్దీ నల్లదొరతనంలో సామాజిక చైతన్యం, సామాజిక స్పృహ, దళితోద్యమ స్ఫూర్తి కనిపిస్తుంది. ఆనాటి సమాజంలో ఉన్న అసమానతలపై అవిశ్రాంత పోరాటం చేసి తన రచనల ద్వారా దళితులకు ఒక ఉద్యమదీప్తిగా నిలిచాడు. అందుకే ఆధునిక తెలుగు సాహిత్యంలో కుసుమ ధర్మన్న తొలితెలుగు దళిత కవిగా ఒక ప్రత్యేక ముద్రను పొందడమే కాకుండా సమాజంలో ఉన్న అనేక లోపాలను ఎత్తిచూపి కులవివక్షతను ఎండగట్టి అంటరానితనం నిర్మూలనకై ప్రాణం ఉన్నంతవరకు పోరాడిన యోధుడుగా నిలిచి దళితోద్యమ స్ఫూర్తిగా దశదిశలా తన కీర్తిని చాటుకున్నారు.

ఆధార గ్రంథాలు :

1. హరిజన శతకం – కుసుమ ధర్మన్న
2. నాకొద్దీ తెల్లదొరతనం – కుసుమ ధర్మన్న
3. సాహితీ వ్యాసాలు – డా॥ తరపట్ల సత్యనారాయణ

 ISBN: 978-93-340-2436-4

# 42 నిమ్నజాతి తరంగిణిలో కుసుమ ధర్మన్న భావనలు

**ఆగంటి దేవి శైలజ**
తెలుగు అధ్యాపకురాలు
గైట్ డిగ్రీ కాలేజ్, రాజమండ్రి.

"నిమ్నజాతి తరంగిణి" అనేది ఒక ప్రసిద్ధ కవిత, ఇది వేదాంతమును మరియు ఆధ్యాత్మికతను ప్రదర్శిస్తుంది. ఈ కవితలోని భావాలను పరిశీలిస్తే చాలా ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి.

నిమ్నజాతి తరంగిణి" కవిత, కవీంద్ర కుసుమ ధర్మన్న రాసిన ఒక పునాది కవిత. ఈ కవితలో దయ, ప్రేమ మరియు సహనాన్ని గురించి అద్భుతమైన భావనలను ప్రతిబింబిస్తుంది. కవితలో వ్యక్తీకరించిన భావాలు జీవితం యొక్క సత్యాలు, మనుషుల మధ్య సంబంధాలు మరియు ఆధ్యాత్మికమైన దృక్పథాలను తెలియజేస్తాయి.

ఈ కవితను కుసుమ ధర్మన్న రాసినప్పుడు, ఆయన దీని ద్వారా మానవ సమాజంలో అణగారిన, నిరాశ్రయులపై దృష్టి పెట్టారు. ఈ కవితలో సమాజంలో అణగారిన వర్గాలకు సంబంధించిన కష్టాలను, వారి మనోభావాలను బాగా ప్రతిబింబింపచేస్తాయి. అంతేకాకుండా ధ్యానం, ఆత్మసాక్షాత్కారం మరియు మనసుకు శాంతి ఇవ్వడం వంటి అంశాలు దృష్టి లోకి వస్తాయి.

కవితలో కొన్ని ప్రతీకలు, అనురూపాలు ఉన్నాయి, ఇవి పాఠకులను ఆలోచనలో ముంచేస్తాయి. "నిమ్నజాతి" అనే పదం ద్వారా, అణగారిన వర్గాలపై చర్చ చేయడం ద్వారా, కవిత ఒక సమాజంలో సానుకూల మార్పులను సూచిస్తుంది. అలాగే ఈ కవితలోకుసుమ ధర్మన్న ఉపయోగించిన భాష శ్రావ్యంగా, మరియు చాలా భావోద్వేగాలను సమర్థంగా వ్యక్తం చేసేలా ఉంటుంది. ఆయన కవితలో పదబంధాలు, కవిత్వంలోని సౌందర్యం మరియు సంగీతం కలిపి, పాఠకుల హృదయాలను తాకుతాయి.

ఈ కవిత సమాజంలో ప్రతి ఒక్కరి జీవితానికి సంబంధించినదిగా ఉంటుంది, అందువల్ల ఇది ప్రతి పాఠకుడికి వ్యక్తిగత అనుభవాలను ప్రతిబింబిస్తుంది. ఈ కవితలో ఉన్న సమాజానికి, ఆధ్యాత్మికతకు సంబంధించిన గాఢమైన సందేశాలను అవగాహన చేసుకోవడంవల్ల, మనం ఈ ప్రపంచంలో ఎలా జీవించాలో, ఇతరుల పట్ల ఎలా ఉండాలో నూతన దృక్పథం పొందవచ్చు.

ఈ కవితలో సమాజంలోని అసమానతలు, పేదరికం, మరియు ఆర్థిక కష్టాలపై విమర్శ ఉంటుంది. కవిత ద్వారా, ఆయన అణగారిన వర్గాలకు ఒక గొంతుగా నిలుస్తారు, వారి కష్టాలను వినిపించడం ద్వారా సమాజాన్ని అవగాహన చేసేందుకు ప్రేరణ ఇస్తారు. వివరించిన శైలిలో ప్రకృతి వర్ణన చాలా కావ్యాత్మకంగా ఉంటుంది. ప్రకృతి దృశ్యాలను అందంగా చిత్రీకరించడం ద్వారా, కవీంద్ర కుసుమ ధర్మన్న పాఠకులను అనుభూతి చెందిస్తారు. ఇది కవితకు ఒక ప్రత్యేకమైన ఆకర్షణను ఇస్తుంది. అణగారిన వర్గాల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఆయన ఒక సమాజం ఎలా ఉండాలి అనేది ప్రశ్నిస్తారు. ఈ విమర్శ సామాజిక చైతన్యాన్ని పెంపొందించడానికి ఉపయుక్తంగా ఉంటుంది. సామాన్యుల జీవితం, వారి కష్టాలు, శ్రమలపై కేంద్రీకృతమైంది. కవీంద్ర, వారి జీవితాలకు , సామాజిక మార్పులకు పునాది వేస్తారు.

**గోదావరి వాసి ధర్మన్న :**

గలగలా పారే గోదావరి తీరాన ఉన్న రాజమహేంద్రవరం అంటేనే సాహిత్యాభిలాషులకు పుట్టినిల్లు. అటువంటి సాహిత్య కేంద్రమే మన ధర్మన్న జన్మస్థలం కావడం విశేషం.

కుసుమ ధర్మన్న (క్రీ.శ. 1884–1946) తొలి దళిత కవి, వ్యాసకర్త, వక్త. జయభేరి పత్రిక సంపాదకుడు. ఉద్యమకారుడు. వృత్తి రీత్యా ఆయుర్వేద వైద్యుడు. సాహితీ కోవిదుడు. ఆంగ్ల–ఆంధ్ర భాషల్లో పండితుడు. “మాకొద్దీ నల్లదొరతనం” గేయ రచయితగా ప్రసిద్ధిచెందాడు.

కుసుమ ధర్మన్న 1884లో రాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపు పేటలో వ్యవసాయ కూలీలైన కుసుమ వీరాస్వామి, నాగమ్మ దంపతులకు జన్మించాడు. ఇతడు ఆదిఆంధ్ర జూనియర్ ఎలిమెంట్ స్కూలులో 5వ తరగతి వరకు చదివాడు. తరువాత థర్డ్ ఫారం చదివి ఆయుర్వేదంలో వైద్య విద్వాన్ పట్టా పొందాడు. ఇతడికి తెలుగు, సంస్కృతము, ఆంగ్లము, హిందీ, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం ఉంది. చదువుకునే రోజుల్లోనే సంఘసంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం చేత ప్రభావితుడైనాడు. ఇతడు తన జాతి హీనత్వంతో అవమానంతో అమానుషంగా, అంటరాని తనం, సామాజిక వివక్షలతో, బాధపడుతున్న దళితులను( ప్రధానంగా మాలలు), ఇతర అణగారిన వర్గాలను సంఘ– సంస్కరించాలనే దృక్పథంతో “హరిజన శతకాన్ని” రచించాడు. ఇతను హైదరాబాద్లో ఉన్న దళిత ఉద్యమ కారులైన భాగ్య రెడ్డి వర్మ, బి.ఎస్. వెంకట్ రావు, అరిగే రామస్వామి లాంటి నాయకులతో అనునిత్యం సంబంధాలు ఏర్పర్చుకొంటు ఒక బలమైన రచయితగా ఎదగడం జరిగింది.

ఈయన అంబేద్కర్ స్ఫూర్తి పొంది అంటరాని తనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో తపించిన తొలి దళిత కవి. ఇతడు గుడివాడ సేవాశ్రమం వ్యవస్థాపకుడు గూడూరి రామచంద్రరావు వద్ద, సీతానగరం ఆశ్రమం, చాగల్లు ఆనందాశ్రమాలలో కొంతకాలం వుండి తన ఉద్యమస్ఫూర్తిని మెరుగుపరచుకున్నాడు.

**కుసుమ ధర్మన్న పై వచ్చిన రచనలు – వారి ప్రత్యేకత :**

తెలుగు సాహిత్యంలో తనదంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న ప్రసిద్ధ సాహిత్యకారుడు ద్వా.నా. శాస్త్రి కుసుమ ధర్మన్న జీవితంపై ఒక పరిశోధన గ్రంథాన్ని రచించారు. 1884లో జన్మిచటంతో పాటు, దళితుల జీవితాన్ని కవిత్వంగా చించిన కుసుమ ధర్మన్నే తొలి దళిత కవి అని అయన నిరూపించారు. "దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు" అనే పుస్తకంలో సి.వి. గారు కూడా ఈయన గురించిన సమాచారం తనవద్ద లేదని రాశాడు. 1921లో కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము రాశారు. దళిత వర్గం నుంచి అతి కష్టంమీద చదువుకుని పైకొచ్చి, తిరిగి ఆ చదువును తన జాతి మేలు కోసం వెచ్చించిన అతికొద్ది మంది దళిత విద్యావంతుల్లో 'కుసుమ ధర్మన్న కవి' ఒకరు. దళితులు, బ్రిటిషు పాలనలో కంటే, స్థానిక అగ్రవర్ణాల పాలనలో మరింత నలిగిపోతారని మొట్టమొదటగా చాటింది కుసుమ ధర్మన్నే. కాంగ్రెస్‌లో ఉంటూనే 'మాకొద్దీ నల్లదొరతనము' అంటూ గళం విప్పిన ధైర్యశాలి. రాజమహేంద్రవరం తాలూకా బోర్డుకు కాంగ్రెసు పార్టీ తరఫున సభ్యునిగా ఎన్నికై కూడా బోర్డు ప్రెసిడెంటు ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థికి ఓటు వేయని స్వతంత్రుడు ఆయన.

ధర్మన్న అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితుడై అంబేద్కర్ గురించి ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారం చేశాడు. ఆంధ్రదేశానికి అంబేద్కరును తొలిగా పరిచయం చేసింది ఈయనే. అణగారిన జాతులకు గొంతుకనిస్తూ, అంబేద్కర్ భావాలను ప్రచారం చేయటానికి జయభేరి అనే పక్ష పత్రికను స్థాపించాడు.

**ధర్మన్న – నిబద్ధత :**

1930వ దశకంలో కాంగ్రెసు పార్టీ చొరవతీసుకొని హరిజన సేవా సంఘం యొక్క ఆంధ్ర విభాగాన్ని ప్రారంభించింది. మహాత్మా గాంధీ అంటరాని కులాల ప్రజలకు హరిజనులు అని పేరుపెట్టడంతో అది ప్రాచుర్యం పొందింది. క్రమేణా ఆది ఆంధ్ర నాయకులంతా కాంగ్రేసు స్థాపించిన హరిజన సేవా సంఘంలో భాగమైనా కుసుమ ధర్మన్న వంటి కట్టుబడిన నాయకులు మాత్రం దాన్ని వ్యతిరేకించారు. నిమ్న జాతుల అభివృద్ధి విషయంలో మహాత్మా

 ISBN: 978-93-340-2436-4

గాంధీ ఆశయాలను నమ్మి గౌరవించినా, ఆచరణలో లోపాలను ధర్మన్న సహించలేదు. గాంధీ యొక్క ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం వచ్చి హరిజన నాయకులతో సమావేశం నిర్వహించిన సందర్భంలో, ధర్మన్న ఆ సమావేశాన్ని బహిష్కరించాడు. 'హరిజన నాయకులైతే మా పేటలకు వచ్చి యిక్కడ మాట్లాడాలని' కబురుపెట్టి గాంధీని, ఇతర కాంగ్రెస్ నాయకులను తమ పేటకు రప్పించి, ఆతిథ్యమిచ్చి దళితుల గౌరవాన్ని చాటాడు.

దళిత చైతన్యం కోసం ధర్మన్న పడిన తపన ఈయన 1933లో వ్రాసిన హరిజన శతకంలో చూడవచ్చు. "ఆత్మ గౌరవంబు నలరంగ చాటరా" అని ఉద్బోధించిన ధర్మన్న కవిగారు వర్ణధర్మం పేరిట భారతీయ సమాజంలో నెలకొని ఉన్న హెచ్చు తగ్గులను నిరసించిన జాతీయ వాది. సమకాలికులు ఆయనను 'ఆది ఆంధ్ర కవి సార్వభౌమ'గా పేర్కొన్నారు.

**ధర్మన్న రచనలు – విశిష్టత :**

1936లో విజయనగరంలో జరిగిన ఆది ఆంధ్ర మహాసభ సమావేశానికి కుసుమ ధర్మన్న అధ్యక్షత వహించాడు. ఈ సమావేశంలో అధ్యక్ష ప్రసంగం చేస్తూ సామ్యవాదాన్ని సహించని హిందూమతం అనే శీర్షికను ప్రసంగం వెలువరించాడు. ఈయన నిమ్నజాతి విముక్తి తరంగిణి, వాళ్ళు అంటరాని వాళ్లా, హరిజన చరిత్ర మొదలైన రచనలు చేశాడు.

1. నిమ్న జాతి తరంగిణి, 2. నల్ల దొరతనం, 3. నిమ్న జాతుల ఉత్పతి వ్యాసం, 4. మధ్య పాన నిషేధం వ్యాసరచన, 5. అసుర పురాణం పద్య కావ్యం, 6. అంటరాని వాళ్ళం, 7. హరిజన శతకం,

**మాకొద్దీ నల్ల దొరతనము :**

1921లో గరిమెళ్ల సత్యనారాయణ "మాకొద్దీ తెల్ల దొరతనము" అనే గేయాన్ని వ్రాశాడు. అదే సంవత్సరం కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనము అనే గేయాన్ని రచించాడు. ఆ కాలంలో స్వాతంత్ర్యోద్యమ, హరిజనోద్యమ వేదికలపై ఈ రెండు గీతాలు మారుమ్రోగేవి. స్వాతంత్ర్యం వస్తే తెల్లదొరల స్థానంలో నల్లదొరలు వస్తారు. అంటరాని తనం కొనసాగుతూనే ఉంటుంది. ఎప్పుడైతే అస్పృశ్యతా భావన తొలగిపోతుందో అప్పుడే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం అని ఇతడు భావించి ఈ గేయాన్ని రచించాడు.

 ISBN : 978-93-340-2436-4

ఈ పాటలో కొంత భాగం:

మాకొద్దీ నల్లదొరతనము దేవా!
మాకొద్దీ నల్లదొరతనము...
మాకు పదిమందితో పాటు పరువు
గలుగకయున్న మాకొద్దీ నల్లదొరతనము

పన్నెండుమాసాలు పాలేరుతనమున్న
పస్తులు పడుతూ బతకాలండీ
ఆలికూలీ జేసి తీరాలండీ
పిల్లగాడు పశువుల గాయాలండీ
పగలూరేయీ పాటుపడ్డానండీ
కట్టగుడ్డ కూడు గిట్టదండీ
రోగమొస్తే నాగ దప్పదండీ
అప్పుతీరదీ చిత్రమేనండీ
ఈ నిప్పుపైనిక మేము నిలువలేమో తండ్రీ! ॥మాకొద్దీ॥

... అంటూ నినదించాడు. దళితుల బ్రతుకులను, పాలేరు వ్యవస్థను, కూలీల కడండ్లను వ్యక్తం చేసాడు.

కుసుమ ధర్మన్న కవి తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉన్నారు. ఆయన రచనలు సాధారణ ప్రజల జీవితానికి సన్నిహితంగా ఉంటాయి, మరియు అనేక సామాజిక, మానవ సంబంధాలు, ప్రకృతి చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఆయన కవితలలో వ్యక్తిత్వం, క ప్రగతి, ప్రేమ, మరియు బాధ అనే అంశాలను చక్కగా అర్థం చేసుకునే విధంగా ఆవిష్కరిస్తారు. అందుకే ధర్మన్న రచనల్లో అనేక సమస్యలను వ్యక్తం చేసి సమతా భావాన్ని కలిగి ఉండాలని, కులమతాలు, కుతంత్రాలు నశించాలని, మనిషిని మనిషిగా చూడాలని పిలుపునిచ్చారు.

ఆధార గ్రంథాలు :

1) డా॥ సి.వి. – దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు
2) కుసుమ ధర్మన్న – మాకొద్దీ నల్లదొరతనము
3) ద్వానాశాస్త్రి – తొలిదళితకవి కుసుమ ధర్మన్న

 ISBN: 978-93-340-2436-4

43

# కుసుమ ధర్మన్న సంఘసంస్కరణ కవితోద్యమం

**పి. సుధ**
తెలుగు అధ్యాపకురాలు
ఎస్.కె.వి.టి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
రాజమహేంద్రవరం.

ఆధునిక తెలుగు సాహిత్యం విభిన్న వాదాలు, విభిన్న దృక్పథాలతో విస్తరించి, సమ సమాజ నిర్మాణానికి సామాజిక చైతన్యానికి పునాదులు వేసాయి. ఎంతో మంది కృషి ఫలితంగా మనిషికీ మనిషికీ మధ్య అడ్డు గోడలుగా నిలిచిన మూఢాచారాలు, సాంఘిక దురాచారాలు, ఛాంధస భావాలు, అందులో కుల వ్యవస్థ, మత వ్యవస్థ. అంటరానితనం వంటి అమానుషమైన వెలివేతలు తొలగించే ప్రయత్నంలో భాగంగా వారి రచనల సంఘ సంస్కర్ణకు పునాదులు వేసాయి. ఈ క్రమంలో అలలుగా కదిలిన దళిత ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి ఆకాశాన్ని తాకే దిశగా ప్రభంజనమై ప్రజా ఉద్యమ పోరాటంగా నలుమూలలా విస్తరించి విజయ దుందుభి మ్రోగించింది. దళితోద్యమంలో సంఘసంస్కరణ కోసం ఎలుగెత్తి నినదించిన తొలితెలుగు దళితమహా కవి కుసుమ ధర్మన్న.

దళిత పదానికి చీల్చబడిన ఖండించబడిన, వేరుచేయబడిన, ఛేధింబడిన వంటి అర్థాలు చాలా కనిపిస్తాయి. వెట్టి చాకిరికి, వెలివేతలకు, అంటరాని తనానికి, అస్పృశ్యతకు మారుపేరుగా ఈ పదాలన్నీ కనిపిస్తాయి. కరుడుకట్టిన కులవ్యవస్థలో చాతుర్వర్ణవ్యవస్థ మనిషిని మనిషిగా చూడకుండా నిషిద్ధజీవిగా, అశుద్ధ జీవిగా దళితునికి కనీసం ఆత్మగౌరవం లేకుండా పశువుకన్నా హీనంగా చూసిన సనాతన ధర్మంపై ఎంతోమంది కవులు ధిక్కార స్వరాన్ని వినిపించారు. క్రూర మృగాలను, విష సర్పాలను, రాళ్ళను, రప్పలను దైవంగా భావించే భారతీయ సంస్కృతులలో దళితుడిని మాత్రం నిషిద్ధ జీవిగానే చిత్రించి ఊరికి దూరంగా పెట్టి, బడివేరు, గుడివేరు, చస్తే సమాధి వేరని శాశించింది మనుధర్మశాస్త్రం. అందుకే ఇటువంటి దురాచారాలపై చాలా మంది కవులు వివిధ ప్రక్రియల ద్వారా నిరసన గళాన్ని వినిపించి ఉద్యమ నినాదాన్ని అందించారు. తమ కలాలను అస్త్రాలుగా మార్చి అక్షరాలను ఆయుధాలుగా పదునుపెట్టి పదునైన పదాలతో సవర్ణ వ్యవస్థపై శంఖారావాన్ని పూరించారు. అటువంటి వారిలో కుసుమ ధర్మన్న అద్వితీయునిగా నిలిచారు.

కుసుమ ధర్మన్న జననం తూర్పు గోదావరి తీరం నుండి ఉదయించిన ఒక అరుణోదయ ప్రభంజనం. అందుకే తెలుగు దళిత సాహిత్యోద్యమ చరిత్రలో కుసుమ

 ISBN : 978-93-340-2436-4

ధర్మన్న ప్రథమునిగానే కాకుండా ప్రథమ పోరాట యోధునిగా నిలిచారు. వీరు 17 మార్చి 1900 సంవత్సరంలో వ్యవసాయ కూలీలైన కుసుమ వీరాస్వామి శ్రీమతి నాగమ్మ దంపతులకు జన్మించారు. ఆయుర్వేద విద్యలో వైద్య విద్వాన్ పట్టాను పొంది ప్రజల కోసం ప్రజా వైద్యాన్ని ప్రారంభించిన అత్యుత్తమ వైద్యులు కుసుమ ధర్మన్న గారు. తమకు ఎదురైన అనేక అవమానాలకు కృంగిపోకుండా తన జాతికోసం విప్లవపతాకమై నిలిచారు. తాను చనిపోయే వరకు ఉద్యమ బాటలోనే కొనసాగారు. ఆ తరుణంలో మాకొద్దీ తెల్లదొరతనం అంటూ గరిమెళ్ళ గీతం వీధి వీధుల్లో మారుమ్రోగుతుంటే దానికి ధీటుగా పంచమ స్వరంలో మాకొద్దీ నల్లదొరతనమంటూ విప్లవ పోరాట గీతాన్ని పాడి దళితులకు కొండండత అండగా నిలబడడమే కాకుండా గాంధేయవాదుల గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన ఉద్యమ వీరుడు, కుసుమ ధర్మన్న ప్రజా పోరాటానికి బాటలు వేసి సమానత్వానికి నాందీ గీతమై, మనిషిని మనిషిగా చూడని, ఈ అసమానతల సమాజంలో అస్పృశ్యుల సంగతేంటని ప్రశ్నించిన దళిత విప్లవ కెరటం కుసుమ ధర్మన్న. ఆనాటి ఉద్యమ గీతాల్లో మాకొద్దీ నల్లదొరతనం అందరిని ఆలోచింపచేసినదిగా నిలిచింది.

కుసుమ ధర్మన్న రాసిన కవిత్వంలో హరిజన శతకం ప్రధానంగా చెప్పుకోదగ్గది, ఈ శతకంలో హరిజనుల కన్నీళ్ళు, జరిగిన మోసాలు, అనుభవిస్తున్న మోసాలు, మనిషిని మనిషిగా చూడని, గౌరవించని సవర్ణ సమాజం, దగాపడిన దయనీయమైన బ్రతుకులు, ఒకవైపు ఆకలితో అలమటించే దీనమైన గాధలు, పట్టి పీడిస్తున్న కులమత వ్యవస్థ. ఊరికి దూరంగా నెట్టిన వెలివాడ వ్యధలు, అమానుషంగా ఉక్కుపాదంతో అణచివేస్తున్న మనువాదం ఇవన్నీ ధర్మన్నను కలచివేసాయి. పూర్వ కాలంలో సమిష్టిగా ఉండే సమాజం ఈ మనుధర్మ శాస్త్రం వల్ల చాతుర్వర్ణాలుగా విభజించి మరలా మరొక వర్ణంగా పంచమ వర్ణాన్ని చేర్చి హీనాతిహీనంగా చూస్తున్న ఈ సమాజంపై తిరుగుబాటు చేస్తూ గత కాలాన్ని గుర్తుచేస్తూ...

**ఆదికాలమందు నవనిలో జగమెల్ల**
**అన్నదమ్ములగుచు నాశవీడి**
**చీకు చింతలేక చిరంజీవులైరయా**
**ఆలకించుమయ్య హరిజనుండ...** అంటూ ఆనాటి సమిష్టి సమాజాన్ని గుర్తుచేస్తూ నేడు పేరుకుపోయిన ఛాంధస భావాలతో కూడిన మూఢచారాలను అందులో మత దురహంకారాన్ని, వర్ణ దురంహంకారాన్ని వీసడిస్తూ కలాన్ని ఆయుధంగా రగిలించి సరికొత్త ఆలోచనలను రేకెత్తించిన ఉద్యమ కెరటం కుసుమ ధర్మన్న.

ఈశతకంలో ధర్మన్న గారు అసమానలతకోసం చెప్పడమే కాదు సమయం

 ISBN: 978-93-340-2436-4

మించిపోలేదని, ఎదురుతిరిగి ఉద్యమించే సమయం ఆసన్నమైనదని, సమైఖ్యత అవసరమని నాటి దళితులకు పోరాట తత్వాన్ని ప్రాథమిక అవసరంగా ప్రభోధించిన మహోన్నత మూర్తి కుసుమ ధర్మన్న. ఆనాటి ప్రజలకు గొప్ప వెలుతురు బాటను వేస్తూ చైతన్యాన్ని ప్రకటిస్తూ

**మేలుకొనుమయ్య తరుణము మించకుండ**
**జన్మహక్కులకై పోరు సల్పుమిపుడే**
**హక్కుకై ప్రాణంబులిడుట ద్రోహంబుగాదు**
**స్వర్గపథమని నమ్ముము స్వాంతమందు...** అంటూ అణగారిన అస్పృశ్యజాతికి ఒక మేలుకొలుపు గీతమై కవితా వైతాళికుడయ్యాడు. ఒక చైతన్య గీతంగా ఒక మహోన్నత గీతంగా ధర్మన్న రచనలు నాటికీ నేటికీ చిరస్మరణీయాలే. ధర్మన్న పూరించిన విప్లవ శంఖారావం అప్పుడు ఉప్పెనలా చైతన్యాన్ని మేల్కొల్పింది.

తెల్లదొరతనం కన్నా అతి ప్రమాదమైనది నల్లదొరతనమేనని 1933లోనే ధర్మన్న నిర్మొహమాటంగా మాకొద్దీ నల్లదొరతనం అంటూ ప్రతిఘటిస్తూ నాటి స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల మెదళ్ళలో గొప్ప అలజడిని రేకెత్తించాడు. గాంధీ మార్గంలో నడిచి చివరకు ఆమార్గంలో కూడా స్పష్టత లేకపోవడం వల్ల నష్టం ఉన్నదని గ్రహించడం వల్ల ఆ మార్గాన్ని వదిలిన అభ్యుదయ వాది ధర్మన్న. అందుకే గాంధీ రాజమహేంద్రవరం వచ్చినప్పుడు మీకే దేశభక్తి ఉంటే మా అంటరానివారి మీద ప్రేమ ఉంటే మా వాడలకు వచ్చి, మా ఆతిథ్యాన్ని స్వీకరించాలని సవాలు విసిరి గాంధీ అంతటి వాణ్ణి తన ఇంటికి రప్పించుకున్న క్రియాశీలక ఆదర్శవాది కుసుమ ధర్మన్న. నల్లదొరల పాలనను ఎండగడుతూ...

**దారిలో మముజూసి దూరదూరముగాను**
**తొలగిపోయెదరయ్య రామ**
**మేము మీతోటి నరులము గామా**
**తరిమి కరిచె తాచుబాములమా**
**పట్టిలాగె రేగు కంపలమా**
**భయము పుట్టించె దెయ్యాలమా...** అంటూ ప్రజా భాషలో ఉద్యమ గీతాలాపన చేసి ఆనాటి జాతీయ వాదుల గుండెల్లో సింహస్వప్నమై నిలిచాడు. కుల వివక్షతను నిర్మూలించాలని కుసుమ ధర్మన్న ఈ కులమత వర్గ అంటరాని వ్యవస్థపై ధ్వజమెత్తాడు. ఆరోజుల్లో కుల వివక్షత జాడ్యం ఎంత ప్రభలంగా వ్యాపించి ఉందో ఊహించవచ్చు. అగ్రవర్ణ అహంకారం ఒకపక్క, మనుధర్మ ధిక్కారం మరొకపక్క, మాటి మాటికి అంటరాని వారనే అస్పృశ్య నినాదం

 ISBN: 978-93-340-2436-4

ఎంత దారుణంగా అర్థంచేసుకోవచ్చు. నరకకూపంలా మారిన నిమ్నజాతుల కోసం విముక్త తరంగిణిగా గళమెత్తి నినదించిన కవి కుసుమ ధర్మన్న అందుకే ..

**నరకకూపములాయె నరలోకమెల్ల**
**సాగిపోయె సుఖము శాంతమెల్ల**

**బ్రతుకు భారమయ్యె శ్రమదూరమాయెరా...** అంటూ హరిజనులపై జరిగిన దారుణాలను ఏకరువు పెడుతూ దళితులయొక్క బ్రతుకులు నరకకూపంగా మారడానికి కారకులెవరని ప్రశ్నిస్తూ, ఏ వ్యవస్థ దళితులను ఊరు చివరకు నెట్టిందో ఆలోచించమంటారు. పూర్వ జన్మలో చేసుకున్న పాపమేదో వెంటాడుతుందనే వెర్రికూతలను నమ్మవద్దంటాడు. ఆ దుఃఖాన్నుంచి విముక్తి వైపునకు పయనించాలంటాడు. తన ప్రతిఘటనకు పదును పెడుతూ దండాలండోయ్ బాబు దండాలని మరొక గేయాన్ని ఆలాపించి దళితుల్లో కొత్త రక్తాన్ని ఎక్కించారు. అందులో భాగంగా..

**దండాలండోయ్ బాబు దండాలండి**
**మేము ఉండలేమండోయ్ బాబు దండాలండి**
**ఈ సైతాను మతముతో సాగలేమండోయ్ బాబు**

**మేమేగలేమెండోయ్ బాబు దండాలండి...** అంటూ నిషిద్ధ జీవుల్లా చూసిన హిందూ మతాన్ని అందులోల ఉన్న లోపాలను ఆధారాలతో ఎండగట్టాడు ధర్మన్న. ధర్మన్న యుద్ధం ధర్మమైంది. ధర్మన్న పోరాటం ధర్మబద్ధమైంది. ఆనాటి సమాజంలో కుల నిరసన, మత నిరసనను రేకెత్తించి అందరూ కలసి మెలసి జీవిస్తేనే అసలమైన సమాజమని, అదే అసలైన స్వాతంత్ర్య అని భావించాడు కుసుమధర్మన్న. అందుకే కుసుమ ధర్మన్న కవిత్వం సమ సమాజ నిర్మాణ్మానికి పునాది వేసింది. సమ సమాజ చైతన్యానికి వెలుగు రేఖై నిలిచింది. అప్పటి నుండి ఇప్పటి వరకు సమాజంలో మార్పు ఏమైనా వచ్చిందని ప్రశ్నిస్తే తిరిగి నేటికీ అదే ప్రశ్నఎదురయ్యే పరిస్థితి. ఈ సమాజం ఎప్పుడు మారుతుందో ప్రశ్నార్థకమే. మళ్ళీ కుసుమ ధర్మన్న లాంటి సమతావాదులు, ఉద్యమ కవులు, రావలసిన అవసరం ఉందేమో అనిపిస్తుంది. కుసుమ ధర్మన్న ఆశయాలు నెరవేర్చే దిశగా అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు పయనించాలని ఆశిద్దాం.

ఆధార గ్రంథాలు :

1) కుసుమ ధర్మన్న - మాకొద్దీ నల్లదొరతనం
2) కుసుమ ధర్మన్న - హరిజన శతకం
3) డా॥ తరపట్ల - దళిత కవితకు పెద్దన్న కుసుమ ధర్మన్న

 ISBN: 978-93-340-2436-4

44

# దళిత మహర్షి ధర్మన్న

**డా॥ పివిబి సంజీవరావు**
తెలుగు శాఖాధిపతి
ఎస్.కె.వి.టి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
రాజమహేంద్రవరం.

**"మాల వాడని యవ మానంబు గావించి**
**పంచముడని పరువు పారదోలి**
**ఆదియాంధ్రుడవని సోది జెప్పిరి కాదే?**

**అంటరాని యట్టి యధమాధముడవంచు**
**చెప్పరాని యట్టి చెనటివనుచు**
**చూడరాని యట్టి క్షుద్రడ వనిరయా"**

తన జాతి ఆశలకి, ఆకాంక్షలకి, ఆవేదనకి, అక్రోశానికి, ఆగ్రహానికి, ఆత్మ గౌరవానికి ప్రతిరూపంగా నిలిచిన తొలితరం దళితకవి కుసుమ ధర్మన్న.

ఏ జాతికైనా గర్వించదగిన చరిత్ర ఉంటుంది. ఆ చరిత్రను విడిచిపెట్టి జాతి అవమానాలకు గురవతున్నప్పుడు, అధీనత పెరుగు తున్నప్పుడు, వాళ్ళలో బాధల్ని విముక్తి చేయడానికి, ఒక తాటిపైకి తీసుకువచ్చి, ధైర్యం, ఉత్సాహం, నింపడానికి ఒక టార్చ్‌బేరర్ అవసరం. దళిత జాతి అభ్యున్నతికి జీవితాన్ని అంకితమిచ్చిన కవి కుసుమ ధర్మన్న.

నన్నయ భారతాంధ్రీకరణకు శ్రీకారం చుట్టిన చోటనే ఆదిఆంధ్రకవి ధర్మన్న జన్మించింది రాజమహేంద్రవరం లోనే. వ్యాసకర్తగా, మంచి వక్తగా, వాగ్గేయకారుడిగా, పత్రిగా సంపాదకునిగా, ఉద్యమ కారుడిగా, ఆయుర్వేద వైద్యునిగా, సంఘ సంస్కర్తగా, బహుముఖమైన రూపాలలో దర్శనమిస్తారు కుసుమ ధర్మన్న.

నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో సమాజంలో మార్పుని ఆశించి, సామాజిక సంస్కరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన భావోద్వేగాలను పాటలుగా రాయటం, పాడటం ద్వారా, తన సందేశాన్ని వ్యాప్తి చేయడానికి మధురమైన స్వరాన్ని వాగ్గేయ కారుడిలా ఉపయోగించారు.

 ISBN: 978-93-340-2436-4

తన జాతి హీనత్వంతో, అవమానంతో, అమానుషంగా అంటరానితనం, సామాజిక వివక్షలతో బాధపడుతున్న తన జాతి వారికోసం, సంఘ సంస్కరించాలనే దృక్పథంతో హరిజన శతకం రాసి కవిగా మార్గనిర్దేశం చేసాడు.

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేడ్కర్ భావజాలంతో ప్రభావితుడై తెలుగు గడ్డమీద ఆయనను పరిచయం చేసి, స్వాతంత్ర్యోద్యమంలో జెండా ఎత్తి, విద్యార్థి దశనుండే ఖద్దరు ధరించి, గాంధీ శిష్యుడయ్యాడు. తన జాతి సామాజిక సమస్యలపై కాంగ్రెసు నాయకులతోనే ఘర్షణ పడ్డనైజం. తెల్లదొరలు వల్ల దళితుల పట్ల వివక్షత లేకపోయినా, నల్లదొరల వల్ల నిత్యం అణగద్రొక్కపడుతున్న తన జాతి స్వేచ్ఛ కోసం “మాకొద్దీ నల్ల దొరతనం” అంటూ ఎలుగెత్తి  పాడారు. అందుకే అలాంటి పెత్తందారుల పెత్తనం మాకొద్దు. సమసమాజ భావనతో మనిషిని మనిషిగా గౌరవించే సమాజం మాకు కావాలి అంటూ ఉద్యమకారుడుగా పోరాట  స్ఫూర్తిని నిలిపిన ధీరుడు. పేద సమాజం కన్నెత్తి చూడ నిరాకరించిన గ్రామీణులకు అందునా పేద దళితులకు ఉచిత వైద్యం అందించిన ప్రజా వైద్యుడు.

ఆంధ్రరాష్ట్రం నలుమూలల అఖిలాంధ్ర మహాసభల్లో దళిత జాతికోసం పొలికేక వేసి, ఆలోచనాత్మకమైన, ఉద్వేగమైన ప్రసంగాలు చేసి, జయభేరి అనే పత్రికను స్థాపించి, గాంధీ ఆంధ్రరాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం మా పేటలకు వచ్చి ఇక్కడ మాట్లాడాలని గాంధీతోపాటు యితర నాయకుల్ని తమ పేటకు రప్పించి, దళితుల “ఆత్మగౌరవంబు నలరంగ చాటరా” అని చాటిన తొలితరం సంపాదకుడు, సంఘ సంస్కర్త కుసుమ ధర్మన్న.

నిమ్నజాతి ముక్తి తరంగిణి, నల్ల దొరతనం, అసురపురాణం, వంటి రచనలతో తన కలంతో, గళంతో, ఏక కాలంలో జాతి విముక్తికోసం, అంటరాని తనంపై పోరుసలిపి, తన జీవితాన్ని ఇటు దేశానికి, అటు దళిత జాతికి అంకితం చేసిన అసలుసిసలైన దళిత వాది కుసుమ ధర్మన్న, దళిత (తెలుగు) సాహిత్య చరిత్రలో ఆయనకు సరియైన స్థానం కల్పించక పోయిన ప్రజల గుండెల్లో నిత్యం మహనీయుడే, మహితాత్ముడే, మహర్షియే కుసుమ ధర్మన్న అందుకె మన తొలి తెలుగు దళిత కవిగా కుసుమ ధర్మన్న నిలిచారు, సంఘ సంస్కరణకు ప్రతిబింబంగా తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నారు.

ISBN: 978-93-340-2436-4

# 45 కుసుమ ధర్మన్న కవి - దళిత సామాజిక స్పృహ

**మరపట్ల రాజు**
పరిశోధక విద్యార్థి,
మద్రాసు క్రైస్తవ కళాశాల,
తాంబరం, చెన్నై
చరవాణి : 9676693877

**పరిచయం :**

దళితకవి సార్వభౌమునిగా, ప్రజాకవిగా, వాగ్గేయకారునిగా ప్రసిద్ధి చెందిన కవి వైద్య విద్వాన్ కుసుమ ధర్మన్నకవి. ఈయన తూర్పుగోదావరి జిల్లా చారిత్రక నిలయమైన రాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపు పేటలో వ్యవసాయ కూలీలైన నాగయ్య-నాగమ్మ దంపతులకు 1900 సం॥రంలో జన్మించారు. ధర్మన్న గారి బాల్యం తన తల్లిదండ్రులతోనూ, మేనత్తల వద్ద రాజమహేంద్రవరంలో సాగింది. కోర్లమ్మపేటలోని కోర్లమ్మ ఆది ఆంధ్ర జూనియర్ బేసిక్ ఎలిమెంటరీ పాఠశాలలో 5వ తరగతి వరకు విద్యానభ్యసించారు. కందుకూరి వారి సంఘ సంస్కరణోద్యామానికి ప్రభావితులయ్యారు. వారికి కవితా రచన పట్ల ఆశక్తి పెరిగింది. దానికి తోడుగా సంస్కృతం, తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషలను స్వయంగా నేర్చుకున్నాడు.

ఏలూరు పట్టణానికి చెందిన తన మేనకోడలైన లక్ష్మీనారాయణమ్మను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఐదుగురు మగ పిల్లలు సంతానం ఈయన గాంధీజీచే ప్రభావితుడై తన పిల్లలకు గాంధీ పేరు కలిసేటట్లు పతితపావన మూర్తి, మోహనదాసు, భగవాన్‌దాసు, చిత్తరంజన్‌దాసు, జగన్మోహనదాసు అనే పేర్లు కుమారులకు పెట్టారు. ఆ కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిని లెక్క చేయక సంఘసేవ చేయడానికి నిర్ణయించుకున్నారు. ధర్మన్న గారి సేవాగుణాన్ని తెలుసుకున్న గుడివాడ సేవాశ్రమ స్థాపకులు గుడూరి రామచంద్రరావు పంతులు గారు ధర్మన్న గారిని రప్పించి వారికి శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత ధర్మన్నగారు సీతానగరంలో, చాగల్లు ఆనందాశ్రమాలను నిర్వహించారు. తరువాత ధర్మన్నగారు జస్టిస్ పార్టీ వైపు ఆకర్షితులై రాజకీయాల వైపు మొగ్గు చూపారు. కొన్నాళ్ళకు రాజమండ్రి తాలుకా బోర్డుకు కాంగ్రెస్ పార్టీ తరుపున సభ్యునిగా ఎన్నుకోబడ్డారు. తరువాత కాంగ్రెస్ పార్టీ నుండి బయటకు వచ్చి డా.బి.ఆర్.అంబేద్కర్ అనుచరులుగా ఆయన ఆశయానలు తెలుగు ప్రాంతాలలో

 ISBN: 978-93-340-2436-4

అనేక చోట్ల ప్రచారం చేసిన ప్రముఖులు కుసుమ ధర్మన్న కవి గారు. 1935 సంııరంలో రంగూన్ వెళ్ళి ఆది ఆంధ్రులను ఉద్దేశించి ఉత్తేజపూరితమైన గొప్ప ప్రసంగాలను అందించారు. ఆ సభలో ధర్మన్న గారిని ఘనంగా సన్మానించారు. ఆ సందర్భంలో ధర్మన్న గారు మాట్లాడుతూ నేను త్వరలో దళితుల కోసం ఒక పత్రిక ప్రారంభిస్తున్నానని అభిప్రాయాన్ని తెలియజేయగా దానికి అందరూ మద్దతూ తెలుపడమే కాకుండా కొంత ధన సహాయాన్ని కూడా చేశారు. ఈ పత్రిక ప్రధాన ఉద్దేశ్యం అంబేద్కర్ ఆశయాలను, తన ఆలోచనలను ప్రచారం చేయడం "జయభేరి" అనే పేరుతో 1937 సంııరంలో పత్రికను స్థాపించారు. ఈ పత్రికలో దళిత జనోద్ధరణకే కాక జాతి ప్రజల సమస్యలను ప్రజలముందుకు తీసుకెళ్ళేవారు. దీనితో దళిత ప్రముఖులు దళితేతర నాయకుల ప్రజాదరణ పొందిన పత్రిక "జయభేరి" ఇది కొద్ది కాలానికి ఆర్థిక ఇబ్బందుల వల్ల అర్థవంతంగా ఆగిపోయింది. ఈ పత్రికకు బోయిభీమన్న కవిగారు, దిడ్ల పుల్లయ్యగార్లు ఉప సంపాదకులుగా పనిచేశారు. ఈ పత్రికలో గుర్రం జాషువా గారి రచనలు అచ్చయ్యేవి. జాషువా గారికి, ధర్మన్న గారికి మంచి స్నేహ సంబంధాలుండేవి.

అంతేకాక దళితుల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచే నిమిత్తం కుసుమ వెంకట్రామయ్య, కుసుమ వీరాస్వామి, కరుపోతు సోమన్న, పుల్లయ్య జాలా రంగస్వామి వంటి దళిత ప్రముఖులతో కలిసి ధర్మన్న గారు 1945 సంııరంలో హరిజన బ్యాంకును స్థాపించారు. ఈ బ్యాంకుకు అప్పటి కలెక్టర్ కొంత నిధి సమకూర్చాడు. పనులు లేని సమయంలో దళితులు ఈ బ్యాంకు నుండి ధనాన్ని అప్పుగా తీసుకొని పనులు ఉన్న సమయంలో చెల్లించే విధంగా ఏర్పాటులు చేశారు. ఈ బ్యాంకు తరువాతి కాలంలో సహకార బ్యాంకులో విలీనం అయ్యింది.

దళితుల హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప సంఘసేవకుడు ధర్మన్న కవి దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా సహించేవాడు కాదు. ధర్మన్న గారు 1944 సెప్టెంబర్‌లో అంబేద్కర్ ఆంధ్రరాష్ట్ర పర్యాటన కోసం రాజమహేంద్రవరానికి వచ్చి కోటిపల్లి బస్‌స్టేషన్ వద్ద పార్కులో దళితులను ఉద్దేశించి డా.బి.ఆర్ అంబేద్కర్ ప్రసంగించారు. ఈ సందర్భంలో కుసుమ ధర్మన్న కవి గారికి దళిత జనోద్ధారణకు చేస్తున్న కృషికి గాను భారతరత్న డా.బి.ఆర్ అంబేద్కర్ చేతుల మీదుగా ఘన సన్మానం లభించింది. ఈయనకు గొప్ప వ్యక్తులతో పరిచయాలు ఉండేవి. గాంధీజీ, బాబు జగజ్జీవన్‌రామ్, పిఠాపురం మహారాజా, సూర్యరాయ మహీపతి, కళా వెంకట్రావు, గుర్రం జాషువా, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కందుకూరి, ప్రకాశం పంతులు, నిజాం నవాబు, గరిమెళ్ళ మొదలైన వాళ్ళతో స్నేహ సంబంధాలుండేవి.

 ISBN: 978-93-340-2436-4

ధర్మన్న గారి సంఘ సేవను గుర్తించిన మద్రాసు రీజనల్ డైరెక్టర్ ఎం.సి.రాజా గారు ధర్మన్న గారిని రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ఉభయగోదావరి జిల్లాలకు యుద్ధ ప్రచారకునిగా నియమించారు. తరువాత అంబేద్కర్ ఆహ్వానంతో పూనా ఒడంబడిక 1946 సదస్సుకు హజరైయ్యారు. అక్కడి నుండి వచ్చిన కొద్ది కాలానికి దళితులకు దేవాలయాలలో ప్రవేశం గురించి పోరాటం చేస్తూ 1946 డెసెంబరులో కోటిలింగాల పేటలో తన అనుచరులతో దేవాలయంలోకి ప్రవేశించారు. ఆరోజు మధ్యాహ్నం 3 గం.ల సమయంలో ధర్మన్న గారు స్పృహ కోల్పోయారు. ఈ విషయాన్ని తన స్నేహితుడైన డా.ఎ.బి.నాగేశ్వరరావు గారికి తెలియజేయగా ఆయన వచ్చి పరీక్షించి చనిపోయారని నిర్ధారించారు. 1947లో ధర్మన్న గారి ఇంటిని గుర్తు తెలియని కొందరు వ్యక్తులు తగలబెట్టారు. ఈ ప్రమాదంలో ధర్మన్న గారు సేకరించుకున్న గ్రంధాలు, ధర్మన్న గారి రచనలు పూర్తిగా కాలి బూడిద అయ్యాయి. ఈ కారణం చేత ధర్మన్న గారి రచనలు దొరకని పరిస్థితి ఏర్పడిందని కుసుమ నాగన్న, ధర్మన్న గారి రెండవ కోడలు మేరి రాణి గారు, జి.రంగస్వామి గారు, తిమోతి జ్ఞాన నందకవి, డా. ఆవంత్స సోమసుందర్, ప్రొ॥ పావనమూర్తి (ఆంధ్ర విశ్వవిద్యాలయం) మొదలైనవారు తెలియజేసారు.

**సాహిత్య ప్రస్థానం :**

ఇక ధర్మన్న గారు రచనలను పరిశీలిస్తే దళితుల అభ్యున్నత కోసం తన కలానికి పొదును పెడుతూ నిరంతరం పోరాడిన గొప్ప కవి కుసుమ ధర్మన్న కవి. ఈయన పద్యాకావ్యాలు, శతకాలు, గేయాలు, కథలు, నవలలు, వ్యాసాలు, ఉపన్యాసాలు మొదలైన ప్రక్రియల్లో రచనలు చేశారు. నిమ్నజాతి విముక్తి తరంగిణి, నల్ల దొరతనము, నిమ్నజాతుల ఉత్పత్తి, మధ్యపాన నిషేధము, అసుర పురాణము అను హరిజన చరిత్రా సంగ్రహము, అంటరాని వాళ్ళు, మాల కాకి, స్వస్థ వృత్తము, హరిజన శతకము వంటి మొదలైన రచనలు రచించారు. ఆంధ్ర పత్రికలో ఈయన ఉపన్యాసాలు ముద్రించబడ్డాయి. ధర్మన్న గారు దళితుల సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజలకు గేయం సులువుగా అర్థం అవుతుందని గేయ రచనకు పూనుకున్నాడు.

ధర్మన్న కవి వ్రాసిన గేయం రచనల్లో నల్లదొరతనము విశేష ప్రజాదరణ పొందింది. ఆ రోజుల్లో దళితులను గొప్పగా ప్రభావితం చేసిన గేయంగా చెప్పవచ్చును.

ఈ రచనకు ప్రేరణ 1921లో గరిమెళ్ళ వారు వ్రాసిన మాకొద్దీ తెల్ల దొరతనం అనే 162 చరణాల సుదీర్ఘ గేయం. జాతియోద్యమ కాలంలో తెల్లదొరలను భయభ్రాంతులకు గురిచేసిన గేయం. స్వతంత్ర్యం వచ్చిన దళితుల స్థితిగతుల్లో మార్పులు రాకపోవటాన్ని చూసిన ధర్మన్న గారు తెల్ల దొరలు పోయి నల్ల దొరలు వచ్చారంటాడు. అస్పృశ్యాత

వంటి అసమానతలు పోయిననాడే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని ధర్మన్న కవి గారు భావించారు. నల్ల దొరల ఆగడాలను ఆట కట్టించటానికి "మా కొద్ది నల్ల దొరతనము" అనే గేయాన్ని వ్రాసి ఉద్యామాన్ని లేననెత్తాడు 1933 సం॥రంలో ముద్రించబడిన నాల్గవ ముద్రణలో ధర్మన్న గారు పల్లవి మార్పు చేస్తూ అంటు దోషము బాపుమయ్య అనే పల్లవి ప్రయోగించారు. నల్ల దొరతనము దళితుల ఆర్థిక స్థితిని రైతులు, భూస్వాములు చేస్తున్న దోపిడిని ప్రశ్నించాడు. అప్పులు పెంచి కొండ గోడూ లేకుండా రోడ్డు మీదకు తెస్తారు. ఇంకా చాలనట్టుగా కోర్టు మెట్టులెస్తారని ధర్మన్న గారు తెలియజేసారు.

**"కాపులెల్ల పాలి! కాపులైన ముమ్మ**
**పట్టి, కొట్టి బాధించెరు**
**రట్టు జేసి! రసము పిండుతారు**
**రేపు మాపు! లేపించి తింటారు**
**యెండవాన! లెంచ నివ్వనీరు**
**మండిపడి! బండభూతులజేరు** ... అని రైతులు హరిజనులపై చేస్తున్న దాడులను, దోపిడిలను నిరసించాడు.

**పన్నెండు మాసాలు పాలేరు తనమున్న**
**పస్తూలబడి బ్రతుకలండి**
**ఆలుమగలు! కూలిజేయలండి,**
**పిల్లగాడు! పెయ్యల గాయలండి**
**కూడవ,కట! కూడు, గుడ్డే దండి**
**రోగమొస్తే! నాగతప్పదండి**
**అప్పుతీర! దయ్యో చిత్రమండి**
**యీ! నిప్పుపైనిక మేము నిలువాలేమో తండ్రి** ... అంటారు ధర్మన్న గారు.

జీవత కాలం పాలేరుతనం చేసిన, మొత్తం కుటుంబం కష్టపడిన తినడానికి తిండిలేక, కట్టుకోవడానికి బట్టలులేక, రోగం వచ్చిన కూలికి వెళ్ళడం మానరు. అయినా అదేమి చిత్రమో అప్పుదీరదు ఈ నిప్పుల కొలిమిలో నిలబడలేమని దీని నుండి తప్పించమని భగవంతుని వేడుకుంటాడు.

కుసుమ ధర్మన్న గారు వ్రాసిన మరొక రచన మధ్యపాన నిషేధం. ఈ రచనకు గానూ ధర్మన్న గారికి తూర్పుగోదావరి జిల్లా మధ్యపాన నిషేధ సంఘము వారి పోటి పరీక్షలో ప్రధమ బహుమతిగా బంగారు పతాకం లభించింది. మధ్యపానము వలశ్రీన

 ISBN: 978-93-340-2436-4

దేశంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో, కుటుంబాలను ఎలా కోల్పోతారో తెలియజేసారు ధర్మన్న గారు. మద్యము ఆహారము కాదు, మద్యము ఔషదము కాదు, ఇది ఆముర్ధాయమును తగ్గించును, అనేక రోగాలు కలిగిస్తుందని తెలియజేసారు. ఈ క్రింది పద్యంలో అక్షర సత్యాలను తెలియజేసారు.

కం. **"త్రాగుడు మానము జెరచును**
**త్రాగుడు దుర్మార్గజేయు ద్రవ్యము బాపున్**
**త్రాగుడు పానము గూర్చును**
**త్రాగుడు సుగుణములనెల్ల దగ్ధము జేయున్"** ... అని అంటాడు.

త్రాగుడు వల్ల పరువు పోతుందని, దుర్మార్గునిగా నిలబెడుతుందని, ఉన్న ధనమంతా ఊడ్చుకు పోతుందని, మంచి గుణాలు మంటగలసిపోతాయని ధర్మన్న గారు ఈ పత్రములో వివరించారు.

ధర్మన్న గారిచే రచించబడిన మరో రచన హరిజన శతకం. ఇది 1933లో ముద్రించబడింది. ఈ రచనలో శతన నియమం పాటించి 108 పద్యాలు ఆటవెలది చందస్సులో వ్రాశారు. దీనిని కలి శ్రీకారంతో ప్రారంభించారు. ఈ శతకానికి "ఆలకింపుమయ్యా హరిజనుండ" అనే మకుటంతో వ్రాశారు. అయితే ఆంధ్రప్రాంతంలో దళితులు ఆది హిందువులు, ఆది ఆంధ్రులు, మాలలు మొదలైన పేర్లతో పిలువడం వల్ల ఎవరికి తగిన విధంగా వారు మార్చి చదువుకునే విధంగా "ఆలకింపుమయ్యా హరిజనుండ" మకుటంతో మరో మూడు మకుటములను కుసుమ ధర్మన్న గారు సూన శీర్షికలో సూచించారు.

**"ఆలకింపుమయ్యా ఆదిహిందు"**
**ఆలకింపుమయ్యా ఆదిమాంధ్ర"**
**ఆలకింపుమయ్యా మాలవర్యా"** ఇవి తెలియజేసారు ధర్మన్న గారు ఈ శతకానికి ప్రారంభంలో మాతృవాణి అనే శీర్షికతో ఒక పద్యాన్ని వ్రాశారు.

**"అంటరాని తనము అమానుషత్వం**
**ఆత్మవత్ సర్వభూతాని**
**సమానత్వమే స్వరాజ్యము"** ... అని సందేశాన్ని ఇచ్చారు.

**"కడుపు నిండి యొకడు కడుపు మండి యొకడు**
**తొత్తు యొకడు లేదు దొరయులేదు**
**భాగ్యవంతుడొకడు బడుగు వేదయు లేడు"** ... అంటూ ఆ కాలంలో ప్రజలందరూ

కలిసి జీవించేవారని హెచ్చుతగ్గులు లేవని, కల్లాకపటం ఎరుగని వారని తెలియజేసారు దళితులు దీనాస్థితిని చూసి కవి ఆవేదనతో ఈ విధంగా ప్రశ్నించారు.

**"ఎవడునీవు? యిట్టి యిడుమలగుడు వంగ**
**నెవరు కారణంబు? యేల వచ్చె?**
**నెంత కాలము వెలిచింతచే గుండెదో?** అని అసలు ఎవరు నీవు? నీ కష్టాలకు కారణం ఎవరు? అవి ఎందుకువచ్చాయి వీటిచే ఎంతకాలం బాధపడతావని ప్రశించారు ధర్మన్న గారు.

**ముగింపు :**

ఈయన అంటరాని తనం పై గొప్ప పోరాటం చేసిన కవి. దళితుల అభ్యుదయానికి పాటుపడిన కవులలో ఈయన ముఖ్యుడు. ఈయన వ్రాసిన గ్రంధాలు రచనలు దళితుల అభ్యున్నతికి మార్గాలు వేశామని చెప్పవచ్చు. హరిజన శతకం దళితుల కోసం వ్రాసిన దళిత ఉద్యమ కరదీపికగా చెప్పవచ్చు. చివరిగా బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలతోనే దళిత జాతుల విముక్తికి సరూన దిక్సూచీ అని కుసుమ ధర్మన్న గారు వెలుగెత్తి చాటారు.

**ఉపయుక్త గ్రంధసూచిక :**

1. దళిత సాహిత్యోద్యమం – డా॥ శిఖామణి, ప్రపంచ మహసభలు, తిరుపతి – 2012.
2. దళిత గీతాలు – జయధీర్ తిరుమల రావు, సాహితీ సర్కిల్, హైదరాబాదు – 1993.
3. హరిజన శతకం – కుసుమ ధర్మన్న కవి, ప్రజాశక్తి బుక్‌హౌస్, విజయవాడ – 2016.
4. కుసుమ ధర్మన్న కవి రచనలు – దళిత దృక్పథం – డా॥ మద్దుకూరి సత్యనారాయణ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం – లఘు సిద్ధాంత వ్యాసం – 2001